Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

శేషాద్రిశర్మ, జనమంచి

ఉదయగిరిముట్టడి

చెన్నపురి, 1928

Record no. 722

Śēṣādriśarma, Janamañci

Udayagirimuṭṭaḍi

Cennapuri, 1928

Record no. 722

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

శేషాద్రిశర్మ, జనమంచి, 1882-1950.
ఉదయగిరిముట్టడి / ఇయ్యది జనమంచి శేషాద్రిశర్మచే రచింపఁబడినది.- చెన్నపురి : వావిళ్ల ముద్రాక్షరశాల, 1928.
8, 191 p. :port. ;18 cm.
Record no. 722

Śēṣādriśarma, Janamañci, 1882-1950.
Udayagirimuṭṭaḍi / iyyadi Janamañci Śēṣādriśarmacē racimpaṁbaḍinadi.- Cennapuri : Vāviḷla Mudrākṣaraśāla, 1928.
8, 191 p. :port. ;18 cm.
Record no. 722

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB   Date filming began:

ఉదయగిరిముట్టడి.

గ్రంథకర్త:
జనమంచి శేషాద్రిశర్మ

మ॥ రా॥ శ్రీ [illegible]
[illegible]
శ్రీః [illegible]
7.12.28

ఉదయగిరిముట్టడి.

ఇయ్యది

కడప మ్యునిసిపల్ హైస్కూలునం దాంధ్రప్రధానపండితుండగు

కావ్యస్మృతితీర్థ:

జనమంచి శేషాద్రిశర్మచే రచింపంబడినది.

చెన్నపురి.

వావిళ్ల ముద్రాక్షరశాలయందు

ముద్రింపంబడినది.

1928

సర్వస్వామ్యములు గ్రంథకర్తయధీనములు.

Printed at
the "VAVILLA" PRESS
MADRAS.—1928.



జనమంచి శేషాద్రిశర్మ.

This work stands dedicated to the Goddess of the British Empire, who is daily growing in prosperity, resplendent in glory, unequalled in splendour, lauded by the good and gentle, shining like the sun in all directions, and soothing like the moon-light; and who is the abode of all pleasures and happiness, bound down by law and justice, and destined to reign supreme in the meredian of power for ever and ever, by the kind dispensation of Providence.

కృతిసమర్పణము.

సీ. శ్రీసమృద్ధిని గాంచి భాసురంబయి యొందు
సమతయే లేక సజ్జననుతమయి
సర్వదా భాస్కరుసన్నిధిఁ బెంపొంది
చంద్రికాభఖ్యాతిఁ సర్వదిశల
వెలుఁగొంది భూపాలవిమలరత్నకిరీట
రంజితపాదసరసిజపీఠ
మలరార సుఖముల కాకరంబయి ధర్మ
బద్ధమై పరమేశు భవ్యకరుణ

తే. నిత్యవృద్ధి నెసంగుచు నిర్మలయయి
తనరు కమలాసనంబునఁ దమివసించి
నిందు వేడుకఁ గాంచుచు నుండు దేవి
కాంగ్లసామ్రాజ్యలక్ష్మికి నంకితంబు.

శ్రీః. శ్రీః. శ్రీః.

నవీనసమాలోచన.

ప్రపంచము ప్రకృతిపరతంత్రము. అందలిపదార్థములన్నియు సమయానుసారముగ మార్పునొందుచుండును. శిశిరఋతువునం దవశ్యాయావకుంఠనమున వన్నెదఱిగినమావిగున్న వసంతోదయమ్మునఁ గ్రొన్ననలఁ జెన్నుమీఱును. వేసవి నల్పజీవనలై పలుతిప్పలఁబడినయేఱులు వర్షాగమమున వెల్లువల పెల్లున విలసిల్లును. తదంతర్గతమగుట వాఙ్మయమును సమయవశంవదమే. అలనాఁడు తిక్కనచేఁ బ్రోదిచెంది, శ్రీనాథునిచేఁ జెలువంబు గాంచి, పోతనచే నేపు మీఱి, పెద్దనాదులప్రాపున రాజాధిరాజుల నలరించి మించినది. పదపడి యనాదరగ్రీష్మాతపంబున వాడి నత్తయయి యిపుడిపుడు ప్రజానురాగనవాంబుధారలఁ దెప్పఱిలి క్రొత్తననలెత్తఁ దొడఁగినది. అచ్చటచ్చట మరలఁ బురాణములు పొడచూపుచున్నవి. ప్రబంధములు ప్రబలుచున్నవి. ఖండకావ్యములు మెండగుచున్నవి. విమర్శనములు విజృంభించుచున్నవి. అన్నిటికన్న మిన్నలైనవలలును నాటకములును విచ్చలవిడి పెచ్చు పెరుగుచున్నవి. కాని యీనవలలలో ననేకములు "కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము"లట్లు సహృదయహృదయాహ్లాదకము లగుటలేదు. పెక్కింటిలో రసము సున్న; భావ మభావము; కల్పన లల్పములు; భాషాశుద్ధి పూజ్యము. ఈ యనర్థమునకు మూలము చక్కనికవితాశక్తి

కలవారాఖ్యాయికారచనము గావింపకుండుటయు, ఆఖ్యాయికారచయితలలోఁ బలువురు గాసటబీసటేచదివి గాథలు త్రవ్వువారగుటయు నై యున్నది. ఇట్టికొఱంతను గవితల్లజులును, బండిత ప్రకాండులునునైన శ్రీ శేషాద్రిశర్మగారి. "ఉదయగిరి ముట్టడిని" రచించితీర్చిరని చెప్పనొప్పును.

ఇతివృత్తము కేవలము కల్పితముకాక 'సత్కవికల్పనా విభూషావహపూర్వవృత్త' మగుట నియ్యది 'సానందీరినజాతి రత్నము.' ఇందు శ్రీకృష్ణరాయల రాజ్యవైభవము, తిమ్మరుసు నైపుణ్యము, కాంతరాయనిప్రభుభక్తి, వేంకటరాయనిసాహసము, చక్కఁగ వర్ణింపఁబడినవి. ఇందలి యుదయగిరివర్ణన మతిహృద్యము. బ్రహ్మాండపురాణాదిమహాగ్రంథములను రచించినవిద్వత్కవులకృతి యగుట నిందలి పదలాలిత్యము, అర్థగౌరవము, రసపోషణము మున్నగువాని నెక్కువ ప్రశంసింపనక్కఱయుండదు.

ఇట్టిగ్రంథములను బఠించుటవలన విద్యార్థులకు మంచి భాషాజ్ఞానమును రచనాశక్తియు నలవడఁగలవు.

అనంతపురము. }
విభవ విజయదశమి. }

ఇట్లు విన్నవించు సజ్జనవిధేయుఁడు,
ప్రయాగ వేంకటరామశాస్త్రి.

శ్రీః

విజ్ఞప్తి.

మహాశయులారా! పురాణములఁ దెనిఁగించు నలవాటు గల నే నీచరిత్రాత్మకయగు నాఖ్యాయిక వ్రాయఁబూనుట యించుక సాహసమే యనుకొను నవకాశముగలదు. ఇందు నాచేసినగొప్పకార్య మేమియు లేదు. అనంతపురకళాశాల యందుఁ జరిత్రమును బోధించువారగు మ॥రా॥శ్రీ, దేశిభట్ల లక్ష్మీనృసింహముపంతులు, ఎమ్. ఏ., ఎల్. టి., గారి సహవాసము కొలఁదివారములు నాకుం గలిగెను. అత్తఱి వారీపాత్తమునఁ గలచరిత్రమును దెలిపిరి. విషయమును సంగ్రహముగా వ్రాసియు నిచ్చిరి. వారియాశయము నూఁతగాఁ గొని యీచిట్టిపొత్తమును వ్రాసితిని. అనంతపురకళాశాలాంధ్రపండితులును, వైయాకరణులును బహుగ్రంథపరిశీలకులు నుదారస్వభావులు నగు బ్రహ్మశ్రీ, ప్రయాగ వేంకటరామశాస్త్రులుగారిద్దానిం జదివి తగినయుపోద్ఘాతమును వ్రాసియిచ్చిరి. దానిం జదువ నిందలివిషయము తేటపడును. ఇట్టిగ్రంథమునకు సాయపడిన పంతులుగారికిని, బండితవర్యులకును గృతజ్ఞతాపూర్వకనమస్కృతుల నాచరించుటయే నాపని. ముద్రణకార్యమున నాకు ననవరతము తోడ్పడ బద్ధకంకణులయి యాంధ్ర

భాషాగ్రంథముల నుద్ధరించుటయే పురుషార్థమని తలంచు మ. రా. శ్రీ, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారికి నానమస్కృతుల నర్పించువాఁడ. ఇందు నాచేసినమార్పు లందఱు చేయు నవియేగాన మిక్కిలి విన్నవింపఁజాలను. ఇంతకంటె విశేషించి వ్రాయఁదగినవిషయములు లేవు. పురాణముల వ్రాయువాఁడను గానఁ జమత్కృతు లిందేవియు నుండవనుట స్పష్టమే. ఏయాశయముతో నిది నాచే వ్రాయఁబడినదో యది పాఠకులకే విశదమగు. "కథాచ్ఛలేన బాలానాం నీతి స్తదిహ కథ్యతే" యన్న సూక్తియే నాకు శరణము. దాని నీగ్రంథము పోషించునని పాఠకు లెంచిన నాశ్రమము సఫలము. లోపములను నాచేతనే సవరింపఁజేయుట పెద్దలకార్యము.

ఇట్లువిన్నవించు సాధుభక్తుఁడు,
జనమంచి శేషాద్రిశర్మ.

విభవ విజయదశమి.

శ్రీ శ్రీ. శ్రీ.

శ్రీః

శ్రీరస్తు - శుభమస్తు.

ఉదయగిరిముట్టడి.

మొదటిప్రకరణము.

శ్రీకరుండయ్యుఁ బరాత్పరుండు కాలరూపుఁ డగుట నొక్కొక్కపరి లోకమునకో యందుఁ గొంతభాగమునకో శ్రీకరుఁడు కానట్లు కనుపట్టు. కాని వాస్తవస్థితి యెట్టిదని యూహింపఁగా భగవంతుఁడుసర్వసాక్షియే కాని సుఖదుఃఖములఁగల్పించువాఁడు కాఁడని తోఁపక మానదు. నిరంజనుఁడు, నిర్లిప్తుఁడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుఁడు, సర్వసాక్షి యను నీమొదలగు విశేషణము లాపరతత్త్వమునకుఁ జెల్లునని యుపనిషత్తులు చెవి నిల్లుకట్టుకొని పామరులారా! వినుఁడు వినుఁ డని పలుకుచున్నవి. మఱిమఱి హెచ్చరించుచున్నవి. కాలమున కెట్టి నామరూపవిభాగములు కల్పింపఁబడినవో భగవంతునకు నట్లే లోకవ్యవహారార్థము రూపము, నామము, కృత్యము లొసగునవి పెద్దలచేఁ గల్పింపఁబడినవి. కాని సృష్టికార్యమంతయు నడపునది ప్రకృతి. ఆప్రకృతికే భగవన్మాయ యని పేరు. మహామాయ యని కొందఱందురు. ఆలోకమాత నెన్ని పేరులం బిలిచినఁ

బిలువందగు. ఒక్కనిముసమున మహానందమును గల్పించును. మఱొక్కనిముసమునకే మహావిపత్తు నాపాదించును. ఉన్నట్టు లుండి గాఢాంధకారము వాయ తేజస్సొక్కటి పిక్కటిల్లం జేయు. హఠాత్తుగాఁ బెనుచీకటులు గ్రమ్ముకొని జనులు చీకాకుపడం జేసి యారయుచుండు. ఇంకొక్కక్షణమున నెల్ల రానందాంబుధి నోలలాడ భాస్కరుని విలసిల్లం జేయుచుండు. ఇట్లెవ్వరికే క్షణమున నెట్టిమార్పుగల్గునో తెలియకయుండ స్వీయాద్భుతానంతశక్తిని విశ్వదర్పణమునఁ బ్రతిఫలింపఁ జేయుచుండును. ఆమహామాయావిలాసముల కాలీలాకల్పితశరీరుం డాపరాత్పరుండే యానందింపఁజాలునుగాని యింకెవ్వరుగాని తల్లీలల నెఱుంగఁజాలరు. కొందఱు తత్సృష్టియం దేపరమాణు తుల్యభాగమునో కనుంగొని స్వభావచిత్ర మిదియని యానందింతురు. కాని వారికి సృష్టి యెట్టిదో తెలియుశక్తి లేదనుట వేఱొండి వాదము కాదు. అరణ్యానీ మధ్యభాగమున మనోహరాలాపముల వాయుదేవునకు, నందంతర్హితులై యుండు వనదేవతలకు, నందెందో దాఁగి నియతవ్రతులై నిరాహారులై యాపరాత్పరుని హృత్పద్మపీఠముల నిలిపి ధ్యానించి మహానందసాగరరంగ దుత్తుంగతరంగబృందంబులవరుసలను డోలికల నూఁగుచుండు మహామునులకును, బ్రతివృక్షశాఖాగ్రముల నివసించియుండు తమబంధువులకు నానందమును గల్పించు మృదుమధురరుతము లొనరించుపత్త్రరథంబుల కెవ్వ రానినాదమును నేర్పిరి? అంబరమున ఘనబృందములు వ్యాపింపఁగనే బర్హములువిప్పి నృత్యము చేయ మయూరముల కెవ్వరు బోధించిరి. ఇట్టివానిం జూపఁ బూనిన మహాభారతమును మించినగ్రంథ మగును. అసంఖ్యా

కములగు నిట్టిచిత్రముల నామూలప్రకృతి క్షణకాలమునఁ గల్పింపఁ గలదనుట నిర్వివాదాంశము. ఏకాలమున నెట్టి విచిత్రపరిణామముల నేభూమండలమునఁ బ్రకృతి కల్పించునో దానినిమాత్ర మతీంద్రియజ్ఞులుతప్ప నెవ్వ రెఱుంగరు.

ప్రపంచము లనేకములు. ఒక్కొక్కప్రపంచమున ద్వీపము లసంఖ్యాకములు. ఒక్కద్వీప మతిలోకముగ వెలయుచుండ మఱొక్కద్వీపము తనతోఁటిగొప్పఁదనమును గోల్పోయి మినుకుచుండును. కొంతకాలమున కాద్వీప మనంతవైభవమునఁ దులతూఁగుచుండ ముందటిగౌరవమును బోఁగొట్టుకొని యన్నింటిని బరిహసించిన ద్వీపము వెతలఁ గుడుచుచుండు. చంచలాలతలకంటె లక్ష్మి చంచలయనునది యందఱెఱుంగుదురు. కాని నిందువైభవమున నీమాటనుమఱచి తమయైశ్వర్యము సుస్థిరతఁ గాంచఁజేయ నుంకింతురు. తెలివితక్కువపనులలో నిదియే ప్రథమగణ్య మనవలయుఁగదా. భాగ్యమనునది సకలద్వీపము లందును సంచరింపఁగోరుచుండును. ఎంతకాల మేచోట సంచరణముచేసి ద్వీపాంతరమున కరుగునో యెవ్వరు నిర్ణయింపఁ జాలరు. తుదకు దానికే తెలియదేమో యనవలసిన యవసర మొకప్పుడు కలుగును. అట్టి నిత్యసంచరణశీల మగుభాగ్యమును నమ్మి దానఁ దమ్ము గొప్పవారినిగా లోకు లెన్నవలయునని యువ్విళ్లూరుధీరులు లోకమునఁ గొంద ఱుందురన్న నా నా ననవలయునేకాని యద్దముగాఁ దలఁద్రిప్ప వలనుపడదు. దీనికిం బ్రధానకారణ మేమన భవిష్యత్కాలజ్ఞానము సుంతయైన లేకుండుటే యనక తప్పదు. దూర మాలోచించినచో నీభాగమున వ్రాసిన విషయములు మహానుభవముగలవారిచే సంగీక

రింబడినదే కాని కల్పించి బహిర్గతములుగా నొనర్పఁబడినవి కావు.

ప్రతిద్వీపమునందును బెక్కు రాజ్యములుండును. అందలి రాజులు స్వతంత్రులుగా నుండఁజాలరు. కావున వారు తమకన్న మిన్నయని తమకుఁ దోఁచిన రాజునకు, లోఁబడి సామంతరాజులనిపించుకొందురు. ఒక్క భూపాలుఁడే యొక్కద్వీపమును బాలించుటయుఁ గలదు. పెక్కుద్వీపముల నొక్కఁడే పాలించె నన్నవార్తయుఁ బురాణములవలనఁ దెలియంబడును. కాని సామంతరాజు లనేకులుండినఁగాని పరిపాలనము చక్కఁగా సాగి ప్రజలు తమరు రాజన్వంతం బగువిషయంబున నున్నవారమన్న సంతృప్తిం గాంచనేరరు. తమపై నొక్కపాలకుఁ డున్నఁగాని సామంతరాజులు వినీతులై ప్రజాసేవఁ జేయఁబూనరు. చక్రవర్తి తనపై నధికారి భగవంతుఁడు కలఁడనువిశ్వాసము కలవాఁడు కాకయున్నఁ జిరకాలము సింహాసనాసీనుఁడై రాజ్యలక్ష్మి నుపాసింపఁజాలఁడు. ఇన్నియున్న గాని యేకొలఁది ముహూర్తములో మర్యాదను సంపాదించి మనఁజాలఁడు. ఈక్షణమునకే యింతడంబము కొనసాగింపఁబడుచుండును. ఇఁక నొక్కభూపాలుఁడే కొన్నియుగము లుండునట్టివిధి యున్నచో నింకఁ జెప్పవలసినదేమి? అట్లు సాగదనియే భగవంతుఁ డెల్లరకుఁ గుణపాఠము చెప్పుచుండును. దానిం బఠించియుఁ గొంద గజ్ఞానాంధకారమునఁ దిరుగుచుందురు. కనఁబడనివన్నియుఁ అనఁబడినట్లే చూచుచుందురు. తెలియనివిషయములఁ దెలిసినట్లే నటింతురు. సర్వజ్ఞత్వము నారోపించుకొనుచుఁ బ్రవర్తించుచు నుండుట సహజమైనది. ఇదియే ప్రకృతివిలాసము.

భరతఖండము కొంతకాలమునకుఁ బూర్వ మత్యుచ్చదశలో నుండెను. ప్రపంచావతంసమను ప్రఖ్యాతిం గాంచిన వానిలోఁ బ్రథమతాంబూలము తనదే యని బాహాటముగాఁ బలుకఁజాలియుండెను. నాగరకత యనునది యిందే పుట్టిపెరిగి సర్వోన్నతత్వము నందియుండెనని యంద అంగీకరింపఁదగినవిషయము. నాగరకతయనఁగా నీలోకమున సర్వవిధజ్ఞానసంపన్నమై యైహికమునందువలె నాముష్మికమునందును విజ్ఞాన సంపన్నమైనదని యర్థము గ్రహింపఁదగు. అదియే నిజమగునాగరకత. వస్త్రభూషణాదులనలంకరించుకొనుటయందే యది విలీనమగుచో నది నాగరీకత యనంజెల్లు. నాగరకతకుఁ బ్రధానాలంకారము వివేకము. అది యైహికాముష్మికములం దొక్క రీతిగా నుండవలయును. అట్లుగానిచో నొక్కచేయిగలవాని యందము వంటిదగు. అట్టి దేపనియుఁ జేయఁజాలదు. ఒరులద్దానిం జూచి నేర్చుకొనఁదగినట్లుండదు. కొలఁది కాలమునకే యది పడిపోవును. కావున సత్యమూలమై సత్ప్రవృత్తి మహాశాఖాసమలంకృతమై యామహావృక్షము సర్వప్రాణి సమాదృతిం గాంచి సర్వాశ్రయభూతమై యలరారినఁగాని చిరస్థితిం గాంచనేరదు. అట్టిది పూర్వకాలమున భరతఖండమున నుండెను. ఈసిద్ధాంతము నిప్పటినాగరకత యంగీకరింపదు. వేఱువిధముగా నొకసిద్ధాంతము తానే యొనరించుకొనినది. దీని కాముష్మికచింత లేకుండుటయే ముఖ్యభేదము. ఆముష్మికచింత యనునది దేహమునకుఁ బ్రాణమువంటిదని పూర్వుల విశ్వాసము. అప్రత్యక్షవిషయమున విచారమేలయని ప్రకృతకాల నాగరకత వాదించును. బదులుచెప్పువా రెవ్వరు?

చెప్పినచో నిం దేమేని సత్యముగలదా యని పరిశీలించువా రెవ్వరు? కాఁబట్టియే ప్రాచీనసిద్ధాంతము లక్కఱకురానితఱిఁ దప్ప నిపుడంగీకరింపఁబడవు ఏమియుఁ బనిలేనితఱి వానిని గొందఱు చర్చింతురు. శిరఃకంపము చేయుదురు. ఉపన్యాసవేదికలపై దమ రింటిలోఁ గూరుచుండి వ్రాసికొనివచ్చిన యానాలుగు మాటలు చదివి "ఇతి భాషామంజరీ సమాప్తా" యన్న న్యాయమునకు లక్ష్యభూతులగుదురు. చెప్పినట్లు చేయఁబూనరు. ఏల? అది యాచరింపఁబూనినఁ గష్టములు మెండు. కష్టముల కలవాటుపడినఁగాని మనస్సునకు సుఖము చేకూర నవకాశము లేదన్నసిద్ధాంత మిప్పటివా రంగీకరింపనిది. ఒకప్పు డంగీకరింపఁబడినను ఆచారమునందు వదలఁబడును. కావున నంగీకరింపఁబడదన్న మర్యాద.

ఈరీతిగా నీభరతఖండము నాగరకతఁ మించి సత్యామూలమై పరోపకారకరణభూషణమై సాటిలేక యలరారుచుండెను. ఈఖండము ద్వీపమనఁ జెల్లదనికొందఱనిరి. ద్వీపకల్పమని మఱికొందఱు పల్కిరి. ఇందుఁ బ్రాచీనసిద్ధాంతమే పరిగ్రహింపఁబడినది. నలుప్రక్కల జలావృతమగు దీవికి ద్వీపమని ప్రాచీనుల మతము. దానినే యిప్పటివార లంగీకరించుచున్నారు. వీరు క్రొత్తగా జలావృతముగాకున్నను ద్వీపమేయని సిద్ధాంతము చేసికొనఁ జాలుదురు. కాని యేలొకో యట్లు చేయక యిట్టివిషయములందుఁ బ్రాచీనసిద్ధాంతములనే వైకొనుచుఁ బ్రవృత్తి విషయమున నధునాతన సిద్ధాంతముల నంగీకరించుచున్నారు. దీనింబట్టిచూడ నిప్పటి సిద్ధాంతములలోఁ బెక్కులు నిరాధారములై పట్టుగొమ్మలేని లతలవలె నల్లల

నాడుచున్నవి. ఎప్పటికప్పుడే మాఱుచున్నవి. సమయానుకూలముగా దొరకినవానినెల్లఁ జేపట్టుచున్నవి. జలలిపులంబోలి యుత్తరక్షణమునఁ గనఁబడకయున్నవి. ఎప్పటి కేమార్పునొందునో యూహింప నలవిగాకున్నది. ప్రాతఃకాలమునఁ జేయఁబడు సిద్ధాంతము సాయంసమయమునఁ ద్రోసివేయఁబడునేమో యని భీతి కవకాశము గలుగుచున్నది. వీనికన్న వాయువు స్థిరమనుటకంటె మనస్సు నిశ్చలమనుట సమంచిత మనవచ్చును.

ఈఖండము రెండుభాగములుగ విభజింపఁబడినది. దక్షిణోత్తరవిభాగమునకు సీమాస్థానము వింధ్యపర్వతము. ఈవింధ్యభూధరమునకు దక్షిణభాగమునకు దక్షిణాపథమను వ్యవహారముగలదు. హిమాలయ వింధ్యమహీధరములకు నడుమనుండు భాగమున కార్యావర్తమని ప్రఖ్యాతిగలదు. దక్షిణాపథమునకుఁ గర్మభూమి యనుపేరుగలదని కొందఱందురు దీని నందఱంగీకరింతురని నే నూహింపఁజాలకున్నాఁడను. ఈదక్షిణాపథమువారియలవాటు లార్యావర్తనివాసుల కనభిమతములు. వారియలవాటులు వీరికి నశ్లే యగు. "యథా రాజా తథా ప్రజాః" అన్న నానుడియించుక యీవిషయమున సరిపడవచ్చును. ఆర్యావర్తవాసులు పౌరుషప్రధానులు, జ్ఞానప్రధానులునగుదురు. దక్షిణాపథవాసులు కర్మరూపజ్ఞానప్రధానులు. పౌరుషప్రధానులుకారు. ఈవిషయము నియతముగాక మార్పులనొందవచ్చును. సామాన్యముగానాలోచించినఁ బైమాట సరిపడును.

దక్షిణాపథమందుఁ జిన్నచిన్న రాజ్యములు పెక్కులుండెడివి. ముం దట్లులేకున్నను అంతఃకలహములు పొసఁగి యవి

యి స్థైర్యముండవచ్చు నన్నయూహా యంద అంగీకరింపఁదగినది. ప్రతిభూపతియుఁ దనయుత్కృష్టతను వెల్లడించుకొనఁ బూనుట నైజముకదా. దాన నెవరికేని లాభముకలదా యన్న లేదనవలయు. ఏలన? అట్టి యూహలు గలవారందఱు పరరాష్ట్రము నాక్రమింపఁ దలంపుగొందురు. దానికిఁ జతురంగబలములఁ గూర్చుకొందురు. అవికూడిన మీఁదిపని యుద్ధమేకదా. అది పొసఁగుటకై యేదో యొకనెపము కల్పింపఁబడి పోరుసాగింపఁబడును. ఈనడుమ యుద్ధసాధనములు సమకూర్పఁబడుట అందుఁ బ్రధానముగా నాహారవస్తువులు సేకరింపఁబడుట, యనునిట్టివి ప్రజలకు శ్రమము కల్పించునవియే గాని మనశ్శాంతిని గల్గించునవి కావు. మఱియుఁ గృషిచేయువారు కొలఁదిమందియు, దాని ఫలము ననుభవించువారు పెక్కుమందియు నగుదురు. అంతియగాక ధాన్యము మొదలగు వస్తువులు కొలఁది వత్సరములకుఁ జాలునన్ని దాఁచియుంచుట రాజాజ్ఞగా సాగును. దానిచేతను సామాన్య మానవులకందఱకుఁ జెప్ప సాధ్యముగాని యిక్కట్టులు కలుగుననుట సంశయాస్పదవిషయము కాదు. గొప్పరాజ్యము లున్నచో నిట్టిప్రయత్నమును చేయఁబడకుండునా యన్న నింతకంటెఁ దక్కువ యనకతప్పదు. వింధ్యభూధర దక్షిణభాగమున నిట్టియిక్కట్టులుగల్గించు చిన్నరాజ్యములు పెక్కులుండెను. ఆవియన్నియు నొక్కపెద్ద రాజ్యమునకు లోఁబడినచో నొకరీతిగా బాగుండును. కాని అట్లుగాక యవియన్నియు సర్వాతిశయకీర్తిని బొందఁగోరునవి యయియుండెను. అయినను బ్రజలు స్వదేశమన్న యభిమానముచే భూపాలుని మర్యాదగాఁ జూచుచుండుటంబట్టి యెంతయు సౌఖ్యము చేకూ

రకయున్నను నున్నంతలోఁ దృప్తిపడియుండిరి. ప్రభువులును బరరాజ్యాక్రమణ వాంఛయున్నను, యుద్ధప్రయత్నములు సాగుచున్నను, కత్తుల నొరలనుండి లాగక పరాక్రమమును వాగ్రూపమునఁ జూపుచుఁ, దమమర్యాదను గాపాడుకొనుచుఁ బరరాజభయంకర పద్ధతులఁ గాలమును ద్రోయుచుండిరి. కాలరూపుఁడగు పరాత్పరుఁడు పరస్పర మారాజుల కీర్ష్యఁగలిగింపక ప్రపంచపరిణామదర్శనోత్సుకుఁడై యుండెను.

రెండవ ప్రకరణము.

ఆకసము నిరభ్రమై ధూమావృతముగాక తనసర్వవ్యాపకత్వమును దెలుపుచుండునది యొకానొక కాలమందుఁ దటాలున మార్పునొందెను. ఒక్కనిమేష కాలమునఁ గాఱుమబ్బులు నలువైపులఁ గ్రమ్మెను ఎక్కడనుండి యిట్లువచ్చి యావరించెనో యెవ రెఱుఁగుదురు? పొగగప్పుట దుర్లక్షణములలో నొకటి యని ప్రాచీనులమతము. ఇప్పటికి నాయలవాటు గలదు. ఆకస్మికముగా దిక్కులన్నియుఁ బొగచే నావృతములగుట మంచిది కాదనువారు పెక్కుమందిగల రనుమాట యటుండ; నిర్నిమిత్తముగా నట్లగుట యేలొకో యనుశంక కలుగక మానదు. ప్రజలయుత్సాహ మంతకంతకుఁ దగ్గఁజొచ్చెను. ప్రతిమానవుని మనస్సున నొకవిధముగ భీతి యంకురించెను. ఏల యిట్లయ్యెనని యూహించువారు మాత్రము లేరనవచ్చును. ఎవరికి వారే ధైర్యము చెప్పుకొనవలసివచ్చెనుగాని మఱొక రుపదేశరూపమునఁ బ్రజలయార్తిని బాపలేకుండిరి. ఆబాలగోపాలము మహోత్సాహము లేకున్న మానెఁగాని యించుక యుత్సాహాంకురముకూడ లేక వెలవెలఁబోవు మోములతో నుండెను. పదివేల మందిలో నొక్కఁడు ముక్కుపై వ్రేలిడుకొని కాల మింతమోసము చేయునని యెఱుఁగకపోతిని గదా యని యూహించును గాని యాతఁడైనను ధీరుఁడై యందఱ నొకచోటఁ జేర్చి కాలగతులఁ దెల్పుసాహసము గలవాఁడు గాకుండెను. స్త్రీలకుంగూడ సంసారముపైఁ గలయుత్సాహము తగ్గెను. విసుగు ప్రతికార్యమునందును జనించుచుండెను. ఆకాలపుఁబరిస్థితుల నాలోచింపఁగా మున్ను భండాసురునికాలమున విశుక్రవిషంగులను నాతనిసోదరుల దృశ్యరూపములందాల్చి వరగర్వమున విఱ్ఱవీఁగి రక్తశుక్లములఁ బీల్వఁగా నంద ఱెట్లుండిరో ఆకాలపుఁబరిస్థితులు స్మృతిగోచరము లగుచుండెను. మనుజుల కుత్సాహమే బలము. ఉత్సాహమే సంపద. అదిలేనిచో మృతుని కళేబరమునకు సజీవకళేబరమునకు భేద మించుకంతయేగాని విశేషము గానరాదు. అట్టి యుత్సాహశక్తి యాకాలమున నంతర్హితయై యెందో దాఁగియుండెను. దాని నుపాసించి ప్రత్యక్షముగఁ జూచువారు లేకుండిరి. ఉత్సాహము లేకున్న మానెఁగాని దానికిబదులు భయము పాదుకొని క్రమక్రమముగా హృదయములయం దొకయాతురతఁ బుట్టింపఁజొచ్చెను. కావున నత్తఱి నిందలి ప్రజలెల్ల భయాకులమానసులై యే పురుషకారము లేకయుండిరి. వారిపాలకులో వీరిమతమునే యాశ్రయించి యేక్షణమున నేయపాయము సంభవించునో యెఱుఁగఁజాలక మర్యాదను గనఁబఱచుచు నెట్లో నలువురిలో సంచరించుచుండిరి. తుద కాయుధములుకూడ వెలవెలఁబోవసాగెను. సానఁబెట్టినను గరవాలములు తళతళలాడకయుండెను. ఆజానేయములు నాలుగుకాళ్లుచాఁపి నిద్రింపఁజొచ్చెను. ఆశ్వికశ్రేష్ఠులలో నొక్కరిద్ద ఱాసైంధవములను గాంచి యచ్చెరువొంది కాలగతి యిట్లయ్యెనే యని వగచుచుండిరికాని వారి వెత విచారించువా రెవ్వరు? గజములకు మదమనునది నిఘంటువులం దుండెను. పదాతు లాయుధముల వేడుకతో ధరింపఁ

బూనకుండిరి. విధిలేక యపుడపుడు పట్టుకొనుచుండిరి. ఈగు
ఱుతులన్నియు దేశమున కేదియో గొప్పయుపద్రవము గలుగ
నున్నదని సూచించుచుండె ననుట నిర్వివాదాంశము.

వింధ్యపర్వతమునకు దక్షిణభాగముననున్న యప్పటి
రాజ్యము లన్నింటిలో మహమ్మదీయపాలనమున నున్న భూభా
గమే మిక్కిలి యనవచ్చును. కాని రాజ్యకాంక్ష యందఱకు
సమానమే. కావున మహమ్మదీయులలోఁగూడ నొకరిపై నొకరికి
స్పర్థ లుదయించుననుట విరుద్ధముగాదు. లోభము సర్వాపద
లకు మూలమని యంద ఱంగీకరించిరి. ఈనీతి యెవరినోటనుండి
వెడలెనో యామహాత్మునకు నమస్కారమని యందఱందురు.
సత్యము నెదుట నునుచుకొని యాలోచింపఁగా లోభమున
కన్నఁ జెడుగుణము వేఱొండు లేదనక తప్పదు. దాని కెవఁడు
లోఁబడునో వానికిఁ బుణ్యపాపములు సమముగాఁ దోఁచును
గాని మొదటి దాశ్రయింపఁదగుననియు, రెండవది త్రోసివే
యఁదగినదనియుఁ దోఁపదు. కాఁబట్టియే యెట్టిదుష్కార్యము
లను జేయుటకైనఁ బాల్పడుట. తండ్రిని జంపి యొక్కఁడును,
సోదరు మడియించి యింకొకఁడు రాజ్యము నాక్రమించెననుట
పైవానికిఁ జక్కని యుదాహరణములు కావా. ఇట్టివిషయ
ములు పైనీతిని సిద్ధాంతముచేయఁజాలవా. ఇక్కారణముననే
యొక్కని గొప్పఁదనము నింకొక్కఁ డోర్వఁజాలఁడు. వానిని
దానెట్లు మోసముచేయఁబూనెనో యట్లె తన్నింకొక్కఁడు
మోసముచేయఁ బూనకుండునా యని యోజింపఁడు. తాఁదప్ప
నింతటి గొప్పగుణముగలవాఁడు పృథ్విని లేఁడని భావించుకొను
చుఁ దాఁబట్టినదుష్ప్రయత్నమును సాగించును. వివేకము

గలవాఁ డాతనింగాంచి యింతటియవివేకిగలఁడా యని తలం
చును. ఎవ్వరేమనుకొన్ననుఁ దన మొండిపట్టు మానక వాఁడు
లోకమును గప్పిపుచ్చితినని భావించుకొనుచుండును. ఇదియే
విచిత్రవృత్తాంతము.

పదునాల్గవశతాబ్ది మించఁగాఁ బూర్వోదాహృతదుశ్చి
హ్నములు వ్యాపించినపుడు వింధ్యపర్వతదక్షిణభాగమున
నొకమహమ్మదీయరాజ్య ముండెను. అదియే యపుడున్న రాజ్య
ములలో గొప్పదనవచ్చును. వింధ్య ముత్తరపుటెల్లగాఁ గృష్ణా
నది దక్షిణపుటెల్లగాఁ దూర్పుపడమరసముద్రములను దాఁకుచు
నా రాజ్య ముండెను. వారు ముందెందున్నవారో, యీరా
జ్యము నాక్రమించుకొన్న దెపుడో, ఎపుడు దండయాత్ర చేసి
యీ భూభాగము నాక్రమించుకొనిరో యంతకుముం దీ
రాజ్యము నేలువారెవ్వరో యప్పటిరాజ్యపరిపాలన మెట్లుం
డెనో ప్రజలయాచారవ్యవహారములెట్టివో యనునీమొదలగు
విషయములఁ జర్చించుట యీప్రయత్నమున నవసరము. వ్రా
యఁబూనిన విషయమున దీనిఁ బేర్కొనక తప్పక పోవుట దాని
పేరు చెప్పవలసివచ్చినది. దానినామము భామినీరాజ్యమని.
ఈపేరువిన్నంతనే పూర్వ మీరాజ్యము భరతఖండవాసులదే
యనియు, నవాంతరకాలమున మహమ్మదీయు లాయోధన మొన
రించియో మఱెట్టులో దానినితమవశమున నుంచుకొనిరనియుఁ
దెల్లమగు. ఈచెప్పిన సరిహద్దులంబట్టి మహత్తరరాజ్యమనుట
పరిహాసాస్పదమే కాని, గ్రుడ్డిలో మెల్ల మేలనునట్లు మఱింత
చిన్నరాజ్యములలో నిది మహత్తరమని చెప్పవలయుఁగదా.
మహమ్మదీయు లీభామినీరాజ్యమును గైవసముచేసికొన్నది

మొదలీరాజ్యమునకుఁ జెంతనున్న రాజ్యములకు వదలనియిడుములు వాటిల్లుచుండెను. ప్రక్కబల్లెముగా గొప్పరాజుండఁ జిన్నరాజు లేమిచేయుదురు. తమయోపినంత వారికింజోటీయక యెట్లో తమమర్యాదలను గాపాడుకొనుచుండిరి. ఎంతకాలమట్లుండఁగలరు? తమవంటివారిని గలుపుకొని మించి వారు పైనెత్తివచ్చినఁ బోరాడి చచ్చుటయో, గెలిచి గౌరవముగ నుండుటయో, సాగవలయునని యూహించుచు నెప్పటికప్పుడే యుద్ధపరికరములను గూర్చుకొనుచుండిరి. కావునఁ బ్రజలకు మనస్సులశాంతము నిలుచు నవకాశమే లేకుండెను. ఈచిన్నరాజులందఱు నొక్కటిగా నుండఁగల్గిరని యూహింపవచ్చునా? లేదు. వీరిలోఁ గొందఱు మహమ్మదీయప్రభువులకు లోఁబడి వారాదరించువారనియుఁ, దమకు లాభము కలదనియు, వారి నాశ్రయించినచో నితరులవలనిబాధలుతప్పుననియు నల్పబుద్ధులై యూహించిరి కాని తమ్ము లోఁబఱచుకొని తమవంటివారి నోడించి యారాజ్యములఁ గైకొని యేసహాయములేని తమ్ము నట్లే జయింపఁబూనకుందురా యన్నంతబుద్ధివైభవము వారికి లేకుండెను. అంతియకాక తమవంటిరాజులమర్మముల నామహమ్మదీయులకుం దెల్పుచుండిరి. అవన్నియుఁ దెలిసికొనుటకై మహమ్మదీయులు వీరిని మఱింతమర్యాదగాఁ జూచుచు నాల్గు రంగుగుడ్డలచే గంగిరెద్దులంబోలె వీరి నలంకరించుచుఁ దాంబూలము లొసంగుచు సభాముఖమున "భాయి భాయి" యనుచు లోలోన నింతటి యవివేకులుగలరా యనుకొనుచు వారు తమకార్యములు గొనసాగించుకొనుచుండిరి. తమసోదరరాజు లిట్లు మహమ్మదీయప్రభుమాయావాగురలం జిక్కుటకుఁ

బరితపించుచు, వారిని మంచిమార్గమునకుఁ ద్రిప్పఁ బ్రయత్నించుచు, నదినిష్ఫలమగుటకు దుఃఖించుచు, భగవంతునే నమ్మి కొందఱు వెతలఁ గుడుచుచుండిరి. ఈనడుమఁ బ్రజల యలజడి వ్రాయఁ జెప్ప శక్యముగాకుండెను. అఱచేతఁ బ్రాణములుంచుకొని వారు దినములు వెడలించుచుండిరి. ఆకాలమును స్మరించి మన యిప్పటియాంగ్లేయరాజ్యకాలమును దలంచిన నిది రామరాజ్యకాల మనక తప్పదుగదా. గుండెలపైఁ జేయివైచుకొని మనమిపుడు నిద్రించుచున్నవారము. ఆకాలమున నిద్ర యెప్పుడో యొకప్పుడే కాని వెలుగనుండునా. అట్టి యిక్కట్టు లిఁక నెప్పటికిఁ గలుగవని నమ్మవచ్చును.

విజయనగరరాజ్యస్థాపనము.

అనపరాధులకష్టములు చిరకాలము నిలువవు. పరమేశ్వరుఁడు సర్వజ్ఞుఁడు కావున నించుక యోజించి కారణాంతరములు గల్పించి వాని నెట్లో మాయించును. అయూహ యిట్టిదనిమాత్రము మన మూహింపఁజాలమని నాకు దృఢతమ విశ్వాసము కలదు. నాయనుభవములమూలమున నది పూటపూటకు మఱింత గట్టిపడుచున్నదే గాని కొఱంతను గాంచలేదు. తుంగభద్రానదికి దక్షిణభాగమున విజయనగరరాజ్యము స్థాపింపఁబడెను. ఒక్కచో నొకరాజ్య మభివృద్ధిఁగాంచుచుండ వేఱొక్కచో నొకరాజ్యము నికృష్టతంగాంచుననుట నిస్సంశయసిద్ధాంతము. సముద్ర మొక్కచో వెనుకకుంబోవఁగా నందు నివసింప గృహములు కట్టఁబడుచుండును. వేఱొక్కచో దీనికి మూఁడింతలో పదింతలో భూమిని సాగర మాక్రమించుకొనును. అందలివారు గృహారామములను నొకపుడు ప్రాణముల

ను గోల్పోవుదురు. వీరియానందమును వారిశోకమును సరిపోల్చిన నేది యెక్కుడుగనుండునో యించుక యోజించిన స్పష్టమగును. విజయనగరసామ్రాజ్యము సుస్థితిఁగాంచుసూచనలు కనఁబడఁగనే భామినీరాజ్యము విచ్ఛిన్నమగుగుఱుతులుపొడసూపెను. ఈ రెండురాజ్యములకు నడుమనున్న భాగమనఁగాఁ గృష్ణాతుంగభద్రానదులమధ్యభాగము సంఘర్షణమునకుఁ బ్రధానపాత్రమగుచుండెను. ఆభాగ మిక్కాలమున రాయచూరు, ఆదవాని, ప్రధానపురములుగాఁగల భూభాగమైయున్నది. ఈ భాగము నాక్రమింప నుత్తరమునుండి భామినీరాజ్యపాలకు లగు మహమ్మదీయులు, దక్షిణమునుండి విజయనగరపాలకులును బ్రయత్నించుటచే నాభాగము రణరంగమనఁబడఁదగియుండెను. అందున్న వారిదుర్దశలు వర్ణింపఁదరముగానివే. ఏనాఁడు విజయనగరసామ్రాజ్యమున శంఖుస్థాపనముహూర్తము శుభలక్షణయుక్తమై వెలసెనో యానాఁడే చిన్నచిన్నరాజ్యములు కొన్నివిచ్ఛిన్నములై దీనిలోఁ గలిసిపోయెను. ఈనడుమనున్న భాగము నాక్రమించుకొన్నఁ దమకు ముప్పని యీరెండు పెద్దరాజ్యములపాలకులు తలంచుచుండిరి. కావునఁ దమతమ రాజ్యము చివరభాగమున సేనలఁ గాపుంచిరి. ఏనిమేషమున యుద్ధముసాగునో యెవ్వరునూహింపఁజాలక తమప్రయత్నముల నప్రమత్తులై తమరుండిరి.

ఏకారణముననో యామహమ్మదీయపాలనమునకు లోఁబడియున్న భామినీరాజ్యము పదునేనవశతాబ్దిలో రెండవభాగమున నించుమించుగా విచ్ఛిన్నమయ్యెను. ఆవిచ్ఛిన్నభాగములైదురాజ్యములుగా వెలసెను. ఎపుడిట్లయ్యెనో యాకాలనిర్ణయము

మన కవసరము. విజయనగరమునఁ దుళువవంశమువారు పాలకులుగా నుత్నతతి నట్లయ్యెననిమాత్రము చెప్పక విడువఁగాదు. తుళువవంశము వృద్ధికిరాఁగా భామినీరాజ్యముపంచధావిభక్తమై యందు రెండురాజ్యములు ప్రధానములుగా మూఁడురాజ్యములు నామమాత్రములుగా నుండునట్టిదయ్యెను. అందొక్కటి బీజపురము. వేఱొకటి గోలకొండ. ఇదియే యాయైదింటిలోఁ బేరుగాంచినది. ఇవి ప్రఖ్యాతిఁగాంచినంతనే యాభామినీరాజ్యనామము మానెను. భామినీరాజ్యమునే బహమనీరాజ్యమని కొందఱు వాడుదురు. "బహమన్, బహ్మన్" అనునవి బ్రాహ్మణశబ్దమునుండి వికారములుగ మాఱినవని కొందఱు కల్పించిరి. ఈకల్పనల కంతముగాని ఆదిగాని లేదు. ఏల కల్పించితివయ్యా యని యడుగువారు లేరు. కొంద ఱంగీకరింతురు. కొందఱాక్షేపింతురు. భామినీరాజ్యమే బహమనీ రాజ్యమని మార్పునొందినదన్నను గాదనియేవ్యాకరణవేత్తయు ననఁజాలఁడు. ఒకప్పుడు తెంపఱితనమున నాక్షేపించినను వారికి బహుమాన మిచ్చువారు లేరు. కావునభామిని యనునది బహమని యని పిలువఁబడునన్నను దప్పులేదని నాభావము. విచ్ఛిన్నమై నామమాత్రమున నాకాశమునగట్టిగా నిలిచియున్న యారాజ్యనామమునఁ జేయఁబడుచర్చ "పనిలేనిమంగలి పిల్లితల గొఱిగె" నన్నసామెతకుదాహరణభూతమన్నచో సత్యమే యనవలయును.

బీజపురము రాజధానిగా రాజ్యమును బాలించుమహమ్మదీయులు "అడిలుషా" కుటుంబమునకుఁ జేరినవారు. గోలకొండ రాజధానిగాఁ బరిపాలించుమహమ్మదీయులు "కుతుబుషా" కుటుంబమునకు సంబంధించినవారు. వీరిరువురును

రాయచూరుప్రాంతమును స్వాధీనముచేసికొనుటకు విశేష ప్రయత్నము చేయువా రనవచ్చును. విశేషించి విజయనగర సామ్రాజ్యము నొక్కేత్తుగా మ్రింగఁగోరువారే. వీరుమాత్రముగాక మహమ్మదీయవీరులు దక్షిణదేశమంతయు గుటుక్కున మ్రింగఁగోరి యనేకదండయాత్రలుచేసిరి. వారిదాడి కోర్వఁజాలక మానసంరక్షణముచేసికొనక వారికి లోఁబడఁజాలక పెక్కుమంది రణరంగమున యమున కాహారమైరి. ఆదండయాత్ర మహాఘోరముగా సాగుచుండ దాని నాపి తమ రాజ్యమును వ్యవస్థగలదిగా నిలుపుకొనఁ దొలుతొలుతఁ గాకతీయులు ప్రయత్నించి సహజధైర్యమునఁ బోరాడిరిగాని యనేకయుద్ధములయం దించుక గెలుపుగొన్నను దమకు బలము తక్కువయైనందునను సాయపడువారు లేమిని గాకతీయులు పరాజయమునకుఁ బాలుపడిరి. మహమ్మదీయమహత్తరప్రవిదారణమహాయాత్ర కాకతీయరాజ్యమును బూర్ణముగాఁ జూఱఁగొనియెను. అంతట నాకాకతీయవంశముపేర రాజ్యమే లేకపోయెను. హోయిసాల మహారాజ్యము విచ్ఛిన్నమయ్యెను. ఆసమయముననే విజయనగర రాజ్య మేర్పఱుపఁబడియె. దక్షిణదేశాక్రమణ ప్రయత్నమున వచ్చుమహమ్మదీయసేనామహానది విజయనగరరాజ్య మహాసేతువును మీఱఁజాలక క్రమక్రమముగా నడుగంటెను. తరువాత ఢిల్లీనగరపాలకులగు మహమ్మదీయులు దక్షిణదండయాత్రల మాని రనవచ్చును. కాని బీజపురము గోలుకొండ యనురాజ్యములవారికి లోలోనఁ దమతోడ్పా టొసంగుచుండిరనుప్రవాదము గలదు. నిశ్చయముగా నుండవచ్చును.

తమతెగవారికి సాయముచేయునూహ యందఱకు నుండుట స్వభావవిరుద్ధము గాదు.

విజయనగర రాజ్యము స్థాపింపఁబడఁగా మహమ్మదీయులు దీర్ఘాలోచన మొనరించిగాని దండయాత్ర నడపఁబూనఁజాలకుండిరి. బీజపురముననున్న మహమ్మదీయులు గోలకొండవారికంటె నెక్కుడుగ విజయనగరరాజ్యమును విచ్ఛిన్నముచేయఁదలఁచుచుండిరి. వారియాతురత నెఱింగి వీరును దగుసన్నాహముచేయుచునే యుండిరి. వీరిప్రయత్నము సాహసములోనగువాని నెఱింగియే వారును దండయాత్ర సలుపక కాలమును గనిపెట్టియుండిరి. ఇంతదనుక వ్రాసినవిషయము శ్రీకృష్ణదేవరాయలప్రభుత్వమునకుఁ బూర్వచరిత్రమని తెలియందగు.

విజయనగరసామ్రాజ్యమును స్మరించినపు డానగర మేకాలమునఁ నిర్మింపఁబడినదో వ్రాయకతప్పదు. దానిని స్మరించుటయుఁ బుణ్యమే యని నాయూహ. విజయనగరమను పుణ్యస్థలము బళ్లారిమండలములోని హాస్పేటయను నుపమండలము (తాలూకా) సమీపమున నుండెను. ఈనగరము నిర్మించుటకుఁ బూర్వమానగొందియనుపురమున నీదేశపురాజులు రాజ్యమేలుచుండిరి. క్రీస్తుశకము ౧౧౫౬ సం॥ చేరువకాలమున విజయధ్వజుఁడనురాజు తుంగభద్రాతీరమున స్వనామచిహ్నముగా విజయనగరమును గట్టించెనని కొందఱిమతము. కాదన నెవ్వరికిని వలనుపడదు. కాని యది చిన్నపట్టణముగ నుండవచ్చునని మఱికొందఱియూహ. పెక్కుమంది క్రీ. శ. ౧౩౩౬—౪౦ సం॥లలో మాధవవిద్యారణ్యులప్రోత్సాహమున హరిహరరాయలు నిర్మించెననియు, నది యతివిశాలనగరమనియు, నగరా

వతంసమను పేరుగాంచెననియు సిద్ధాంతముచేసిరి. "జనవాక్యం తు కర్తవ్య" మ్మనుసూక్తి ననుసరించి మనము దానినే యంగీకరింతము. తన్నగరవర్ణ్ణనము ముందుగావింతును. దానికిం గలయవసరము ముందున్నది.

తొలుతఁ దుళువవంశమునుగూర్చి నాలుగుమాటలు వ్రాయుట యావశ్యకము. సాళువవంశము ప్రసిద్ధిగాంచియుంట యందఱెఱుంగుదురు. తుళువవంశము సాళువవంశాంతర్భూతమే. సాళువనరసింహరాజు రెండవకుమారునిం జంపి విజయనగరరాజ్యమేలిన నరసరాజు తుళువవంశమునకుఁ జేరినవాఁడు. రెండవరాజవంశమున కితఁడే మూలపురుషుఁ డనవొప్పును. సాళువనరసింగరాజు తండ్రి గుండరాజు. ఆతని కిర్వురు పుత్రులు గలిగిరి. తిమ్మరాజు మొదటికొడుకు. సాళువనరసరాజు రెండవకుమారుఁడు. తిమ్మరాజునకు నీశ్వరరాజు పుట్టెను. ఆయీశ్వరరాజునకు నీతుళువనరసరాజు కొడు కయ్యెను. కాఁబట్టి సాళువనరసరాజునకుఁ దుళువనరసరాజు అన్నమనుమఁడు కదా. ఈతుళువవంశమువారు చంద్రవంశక్షత్రియులమని చెప్పుకొనసాగిరి. వీరందఱు పరాక్రమమునఁ బేరుగాంచినవారే కాని యభినవవిరాటతనయులు గారు. ఈశ్వరరాజు నతనికుమారుఁడగు నరసరాజు నీయిద్దఱు విజయనగరప్రభువులకడ సేనాధిపతులుగానుండి విఖ్యాతింగాంచిరి. అనేక యుద్ధములు చేసి పెక్కుదేశముల గెల్చిరి. ఇందు నరసరాజు తండ్రికంటెఁ బౌరుషమున మిన్నయన్న యెన్నికఁ గాంచెను. సాళ్వనరసమహీపాలునికడ సేనాధిపతిగనుండి పదంపడి మంత్రియు నయ్యెను. సాళ్వనరసింహరాజు చిరకాలము రాజ్యమేలి వృద్ధువై యవ

సానసమయము సమీపించు టెఱింగి తనయు లిద్దఱు తనకున్నను వారసమర్థులని తలంచి మంత్రియగు నరసరాజును బిల్చి నా కాయుష్యము పూర్ణ్ణమయ్యెను. ఇఁక దివి కేగక తప్పదు. నాయిరువురు తనయులను రాజ్యము నీకప్పగించుచున్నాఁడను. న్యాయముతప్పక వర్తింపుమని ప్రాణములు వదలెను.

నరసరాజు న్యాయమెఱింగిన ప్రాజ్ఞుఁడు. స్వామిభక్తిపరాయణుఁడగు కృతజ్ఞుఁడు. కావున యజమానుని యభిప్రాయమును శిరసావహించి తొలితనయుని రాజ్యపదమున నధిరూఢునిగ నొనరించి యాతఁడు వయసుకానివాఁ డగుటఁ దానే రాజ్యమును బాలింపసాగెను. కాలగతి యెవ్వరికిని దెలియరానిది. రాజుబాలుఁడగుట నెపుడో యెవఁడో దుర్బుద్ధి యాతనిం జంపి రాజ్యకాంక్షచే నరసరాజే యీయకార్యమును జేయించెనని ప్రవాదమును గల్పించెను. దానిని గొందఱు నమ్మిరి. గొంద ఱాతనిమనస్థ్సితి నెఱింగినవారుగాన నమ్మకుండిరి. నరసరాజాదూఱు తొలఁగించుకొనఁబూని యాతనితమ్ముని రాజుగాఁ జేసెను. ఆతఁడు మఱింతచిన్నవాఁడు కావున యోగ్యతనెఱుంగుశక్తిలేక తనయన్నను జంపిన మహాద్రోహిని బ్రేమింపసాగెను. ఆవిధమెఱింగి తుళువనరసరాజాతనిని బెనుగొండదుర్గమునఁ జెఱనుంచెను. ఆతనికి వలయు వ్యయమునకుఁ దగునట్లు ద్రవ్యమిచ్చుచుండెను. ఏకారణముననో చెఱలోనున్న యాబాలుఁడు కూడఁ గనఁబడకపోయెను. కుయుక్తిచే నరసరాజే తనకుముందు విరోధియగు నేమోయన్న దురూహచే బాలరాజును హింసించెనన్న ప్రవాదము బ్రబలెను. తర్వాత నరసరాజే రాజ్యాధిరూఢుఁడై యేలుచుండెను.

నరసరాజు మహాశూరుఁడుగ నుండియు జనప్రియుఁడై యుండెను గావున నాతని యేలుబడిలోని చిన్నరాజులందఱు నాతని నెదుర్కొనఁ జాలక సామంతరాజులై కప్పము గట్టుచుండిరి. ఈనరసరాజు పరదేశములఁ బెక్కింటిని బరాక్రమాతిశయమున జయించి విజయనగరము నాక్రమించెను. ఈతఁడొనరించిన యత్యద్భుత విశేషకార్యములను మహాకవి ముక్కుతిమ్మన తనపారిజాతాపహరణమున నిట్లు వర్ణించినాఁడు:—

సీ. "కుంతలేశ్వరుఁడు చి। క్కుపడంగ విద్యాపు
రంబుకైగొని నిజ। ప్రౌఢి నెఱపెఁ
బారసీకునకు దు। ర్భరమానవత్వంబుఁ
దొలఁగించె మానవ। దుర్గసీమఁ
జోళవల్లభునకు। సురవధూమధురాధ
రము లిచ్చి మధురాపు। రంబుఁ గొనియె
శ్రీరంగపట్టణ। సీమఖడ్గనటీవి
నోదంబు హావనేం। ద్రునకుఁ జూపె
తే. నతఁడు నుతికెక్కె రామసే। త్వంతరాళ
కలితషోడశదానవి। ఖ్యాతయశుఁడు
మండలీకరమేఘమా। ర్తాండబిరుదుఁ
డీశ్వరాధిప నరసపృ। థ్వీశ్వరుండు."

ఈనరసరాజు యుద్ధముచేసి పరరాజుల నోడించుటయే గాక తెలుఁగుకవివర్యుల నాదరించి భాషను వృద్ధిఁ జేయుచుఁ దనయశఃకాయము లోకమున శాశ్వతముగ నుండుటకై కృతుల నందుకొన్న విచక్షణుఁడు. నందిమల్లయ్యకవి ఘంటసింగయ్యకవియనువారీనరసరాజునాస్థానకవులుగ నుండిరి.

మల్లయ్యకు సింగయ్య భాగినేయుఁడు. వీరిర్వు రాఱువేల నియోగి బ్రాహ్మణులు. వరాహపురాణము నిరువురును గలిసి తెలిఁగించిరి. ఆపురాణ మీనరసరాజున కంకితము చేయఁబడినది. ఘంటసింగయ్య యనఁగాఁ బారిజాతాపహరణకావ్యము నొనరించిన ముక్కుతిమ్మనకు మేనమామ. ఈసింగయ్యయే మలమారుతకవి యను బిరుదముగలవాఁడు.

నరసరాజునకు భార్యాప్రీతి యత్యధికము. కావున ముగ్గురను బెండ్లియాడెను. తిప్పమ్మ, నాగలాంబ, ఓబమ్మ యని వారిపేరులు. తిప్పాంబికకు వీరనృసింహరాయఁడు కుమారుఁడు. నాగలాంబికకుఁ గృష్ణరాయఁడు తనయుఁడు. ఓబమ్మకు నచ్యుతరాయఁడు సుతుఁడు. ఇట్లు మూవురకుఁ దనయులు గలరు. రంగరాజను నొకకుమారుఁడు నరసరాజునకుం గలఁడని కొందఱందురు. ఆతఁడేభార్యవలనఁగలిగెనో తెలియఁదగినయాధారములు కానరావని చరిత్రకారులు చేతులు వెల్లకిలఁ జేసిరి. నరసరాజు చాలకాలము రాజ్యము చేసెను.

నరసరాజు తనప్రతాపపాండిత్యముల నాచంద్రతారకముగా నిలిపి లోకాంతరజిగమిషం బోయినపిదప జ్యేష్ఠకుమారుఁడగు వీరనరసింహరాయలు పట్టాభిషిక్తుఁడై చిరకాలము రాజ్యసుఖముల ననుభవింపక యచిరకాలముననే తండ్రిం గన బోయెను. క్రీ. శ. ౧౫౦౯ సం॥ ఈకార్యముసాఁగెనని చరిత్రకారులనిరి. వీరనృసింహరాయనికిఁ గుమారుఁ డుండెననియు నాతని జెఱసాలనుంచి కృష్ణదేవరాయలు రాజయ్యె నందురు. ఈవిషయమున నొక్కచిన్నికథ వ్రాయక తప్పినదికాదు.

"నరసరాజు చనిపోవుకాలమునఁ దన తనయులమువ్వురను బిలిచి యొంటరిపాటునఁ దనయనామికాంగుళికున్నయుంగరమును ద్వరగాఁ దీయుఁడని యొక్కొక్కని కాజ్ఞాపించెను. నాప్రాణములు నిలువవు కానఁ ద్వరగఁ దీయుఁడని ప్రతివానితోఁ జెప్పసాగెను. వీరనరసింహరాజు తొలుతఁ బ్రయత్నించి యది వ్రేలిని నొక్కియున్నందునఁ దీయ సాధ్యముకాదని పలికెను. రెండవతడవ ఓబమ్మకుమారుఁడగు నచ్యుతరాయఁడు ప్రయత్నించి విఫలమనోరథుఁడయ్యెను. రెండవభార్యయగు నాగలాంబికాతనయుఁడగు కృష్ణదేవరాయఁడు కఱకుఁ గత్తిచే నావ్రేలును ఖండించి యుంగరమును దీసియిచ్చెను. సమయోచితమగు నాతనిప్రశాపోన్నతిని యుక్తిని బరికించి రాజు నీవే రాజ్యమును బాలింప నధికారివని చెప్పెను. ఆకారణముననే కొలఁదికాలమునకుఁ దనయన్న మృతినొందఁగా నతనికుమారునకు రాజ్యమీయక తానే రాజయ్యెను" అని ఈకథకుఁ దగినప్రమాణము లేవియని ప్రశ్నింపరాదు. ఇందు సత్యమేమాత్రము లేకయున్న నీకథ కల్పింపఁబడుట కవకాశమే లేదు. కావున సత్యమిం దేలేశమో యుండును. ఇది కృష్ణదేవరాయలప్రతాపమును దెలుపుటకుఁ గల్పింపఁబడి యుండవచ్చు. కృష్ణరాయలతల్లి యగు నాగలాంబ (నాగమ్మ) నరసరాజు వివాహవిధిగాఁ బరిగ్రహించినభార్య కాదనియు. ఆమెసౌందర్యమును గాంచి మోహించి యామెను భోగకాంతనుగా రాజు పరిగ్రహించి యంతఃపురమున నునిచెననియు, నామెకుఁబుత్త్రుఁడు కలిగినఁ బూర్వము దుష్యంతమహారాజు శకుంతలకు వాగ్దానమొసఁగినట్లే రాజుం జేసెదనని వాగ్దానమొసఁగెననియు,

నామెకుఁ బురాకృతపుణ్యవశమునఁ దనయుఁడు కలుగఁగా నావాగ్దానమును మది నునుచుకొని ధనుర్వేదమును శ్రద్ధగాఁ జెప్పించి తక్కినపుత్త్రులకంటెఁ మిన్నగా నొనర్చెననియు నొకప్రవాదముగలదు గావున దాని కుపబలముగా నంత్యకాలమునఁ దక్కిన తనయులకుఁ దెలియవలయునని యీపరీక్ష చేసెననియు నందు వారు తెలివితక్కువను జూపఁగా నీతనికి రాజ్యమిచ్చెననియు లోకులు నమ్ముటకైనను బైకథ కల్పింపఁబడియుండవచ్చు. అంతియగాని యించుకయైనను సత్యమిందు లేదనరాదు. చరిత్రకారకు లెందఱో యితరాధారములు దొరకనపుడు దొరకినవి పరస్పరవిరుద్ధములుగా నున్నయపుడు కింవదంతుల గ్రహించిరి. కావున నీకథలో నించుక సత్యముండునని మన మూహింపవలయును. కృష్ణదేవరాయలు దాసీపుత్త్రుఁ డన్నవిషయమందఱు విన్నదేగాని క్రొత్తది కాదు రాజులకు భోగకాంతలుండుట పూర్వమాచారముగదా యన్నఁ గాదనరాదు. ఎవరు చూచిరన్నప్రశ్నమునకు బదులుచెప్ప వీలుండదు. లేరని మీరు చూపఁగలరా యన్న నందులకు బదులు రా వీలు లేదు. రాజులకుఁ బెక్కుమంది భార్యలుండుట ప్రాచీనకాలాచారమని రామాయణమును మహమ్మదీయప్రభువులచరిత్రములు దెలుపును. వివాహవిధిగాఁ బ్రతిగ్రహించినభార్యలలోఁ గొందఱను భోగకాంతలని పేరుగలదు. ఏలయనఁగా దత్సంతానమునకు రాజ్యాధికారము లేదు. కావున భోగార్థము వరించినకన్యక యని యర్థము చెప్పుదురు.

ఘనతచెందినపురుషులవిషయమున నిట్టి యపవాదములఁ బుట్టింతురన్నమాట యంతయుక్తియుక్తముగాదు.ఘనతనొందిన

వారికళంకములే యందఱకుఁ దెలియును. అల్పులయందుఁ గల దోషముల నెమకువారే లేరు. కావున ఘనతగల కుటుంబముల వారివిషయమే బట్టబయలగు చుండును. కృష్ణరాయలు దాసీపుత్త్రుఁడన్న ప్రవాదమున నామహారాజునకు వచ్చినలోపము నాయెఱింగినంతవఱకుఁ గానరాలేదు. విద్వద్వరిష్ఠుఁడని, మహాకవియని, పరాక్రమసమగ్రుఁడని యామహాపురుషుని వేనోళ్ల నందఱు కొనియాడుచున్నవారు. చంద్రునకుఁ గళంకము భూషణమయినట్లే యాప్రవాద మాయన కొకసదమలాలంకారము వంటిదయ్యె ననవలయు. మహాపురుషులవృత్తము ప్రధానము గాని వారిపుట్టుక యెట్టిదని నెచుకుట యజ్ఞానమూల మన్న మాటకుఁ దలయొగ్గక తప్పదు.

శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషిక్తుఁ డగుట.

నరసరాజుతనయులలో రెండవవాఁడగు శ్రీకృష్ణదేవరాయలు తనయన్నయగు వీరనరసింహరాయలయనంతరము ప్రభువయ్యెను. క్రీ. శ. ౧౫౦౯ సం. మున ఫిబ్రవరి నాల్గవ తేదీన శ్రీకృష్ణరాయలకుఁ బట్టాభిషేకోత్సవము జరగెనని చెప్పుదురు. ఈకాలమునకు సరియగు శాలివాహనశకము ౧౪౩౦ అని శుక్ల నామసం॥ మాఘ శుక్ల చతుర్దశి యనియుఁ జెప్పుదురు. ఈవిషయము హంపిలోఁ బంపాపతీశ్వర దేవాలయములోఁ గనఁబడు నొకశాసనము తెల్పుచున్నది. చతుర్దశి రిక్తతిథిగావున నాఁడు పట్టాభిషేకమహోత్సవ మట్టిమహారాజునకు సాగియుండునా యను నొకసంశయము పుట్టకమానదు. ఆకాలమున నున్న రాజ్యవిషయక విషమావస్థలలో నిట్టి స్వల్పవిషయములు చూడఁబడునా యని సమాధానముకూడ సరిగనే తోఁచును.

ఇట్టి శంకాసమాధానములు విమర్శింపఁ దగినవి కావని కొందఱి మతము. శ్రీకృష్ణదేవరాయలు దాసీపుత్త్రుఁడనువిషయ మింతకంటె నసంగతమనందగదా? దానినేల వ్రాయవలయునని మఱికొందఱియాశయము. ఏదియెట్లున్నను శ్రీకృష్ణదేవరాయ యశోనిర్మలతమామృతాంశుబింబము సర్వదా సర్వథా దిశలవిదిశల వెలయింపఁ జేయుచుండుననుట నిర్వివాదాంశము.

నరసరాజు బ్రదికియుండఁగనే పెద్దకుమారుఁడగు వీరనృసింహరాయనికంటెఁ గృష్ణదేవరాయనినే మిక్కిలి ప్రేమించుచుండెననియు, నావిషయ మెట్లో యెఱింగి సవతితల్లియగు తిప్పమ్మ కృష్ణరాయనిం జంపింపఁ బ్రయత్నించెననియు, రాజగృహరహస్యములు బట్టబయలగుట యాచారమే గావున నాఘోరకార్యము మంత్రిసత్తముఁడగు తిమ్మరుసు శ్రుతికెక్కెననియు, నతఁడాయాపదనుండి కృష్ణదేవరాయని గాపాడెననియు నిట్టి మహోపకారము తనకవ్యాజప్రేమమున నొనర్చినందులకుఁ గృతజ్ఞుఁడై యామంత్రిని శ్రీకృష్ణదేవరాయలు తనయావజ్జీవితము మన్నించుచుండెననియు నొకప్రవాదము పర్వస్థలముల వ్యాపించినది. వీరనృసింహరాయలు మృతినొందునప్పటికిఁ దిమ్మరాజను కుమారుఁ డెనిమిదివత్సరముల ప్రాయముగలవాఁ డతనికిం గలఁడు. తనయనంతరమాకుమారునకు రాజ్యము చెందనీయక సోదరుఁడగు కృష్ణరాయలే రాజగునని యనుమానించి తనకు మంత్రిగనుండి నీతిశాస్త్రవేత్తయగు తిమ్మరుసును రహస్యముగాఁ బిలువంబంచి కృష్ణరాయనివలన నాకుమారునకుఁ దప్పక కీడుమూడును గావున నీతని నెట్లైన రాజ్యార్హుని గానీయరాదు కనుక నేత్రవిహీనునిగా నొనర్చిన మేల

నియు నెక్కిన నీతని రెండుకన్నులు తీయించి నాకుఁ జూపుమా యని యాజ్ఞాపించెననియు, ఆమాటకడ్డమాడ రాదు గాన నొక యుపాయము పన్నవలయునని తలంచి యట్లే యొనర్చెదనని చెప్పి యామంత్రివర్యుఁడు కృష్ణరాయలను దాఁచిపెట్టి మేఁక కన్నులు తీసికొనిపోయి రాజునకుఁ జూపెననియు నొక కింవదంతి గలదు. ఇది ప్రొద్దుపోక యెవరో మందమతులు కల్పించిరనవచ్చును. మేఁకకన్నులు మనుష్యనేత్రములని నమ్మునంత వెఱ్ఱివాఁడు వీరనృసింహ రాయలని యీకథ తెల్పుచున్నది. అట్టి యవివేకుఁడే యైనచో జంతుహింసచేయకయే యేయాకులో కన్నులవలె నొనరించి చేసియుండఁగూడదా. ఇట్టివి చరిత్రకారకులే తఱచుగాఁ గల్పించి పెద్దపాత్రము జేయుదురని యొక కొంద ఱందురు.

వీరనృసింహరాయలు మృతినొందిన పిదప నవార్యశౌర్యమున విరాజిల్లు శ్రీకృష్ణదేవరాయలు తన సోదరులను సోదరపుత్త్రుఁడగు తిమ్మరాజును జంద్రగిరి దుర్గమునకుఁ బంపివైచి తా రాజ్యము నేలెను. మాఘశుక్ల చతుర్దశి తెలుఁగు వారికిని గర్నాటకులకును శుభదినమని భావింపవలయును. విచ్చలవిడి పరాక్రమించి దేశములఁ గొల్లఁగొట్టుచు నుల్లాసమున స్త్రీలను బురుషులను బాధించుచుఁ గరుణాలేశములేక కరవాలములే పురుషార్థముల నొసంగునని నమ్మియున్న మహమ్మదీయశూరుల నాపఁ గంకణము కట్టుకొన్న మహాశూరశిఖామణి, పరిపోషిత భాషావధూమణి, సత్కవికులగ్రామణి, దానవిజిత చింతామణి, తేజోవిజితదినమణి యనఁ బ్రసిద్ధుఁడగు శ్రీకృష్ణరాయలు పట్టాభిషిక్తుఁడగు శుభదినమునకంటె శుభము లొసంగుదినమేది ? ఆదినమును మహోత్సవములచేఁ గొనియాడుట భారతపుత్త్రులకు ధర్మము కదా.

ఆమహాపురుషుని పట్టాభిషేకోత్సవము వర్ణనాతీతమనుట యతిశయోక్తి కాదు. ఈవిషయము ముందుముందు దూరదేశవాసు లరుదెంచి యతనిసామ్రాజ్యమును విద్యానగరమును జూచినప్పుడు వర్ణించి వ్రాసిన విషయములంబట్టి తేలఁగలదు. ఇపు డావిషయము నెక్కుడుగ వ్రాయను. "స్పష్టమగ్రే భవిష్యతి"యని యున్నదికదా. ఈపట్టాభిషేకమునుగూర్చి కుమారధూర్జటి శ్రీకృష్ణరాయవిజయములోఁ బేరుకొన్న పద్యముల వ్రాసినఁ జాలునని వాని నిం దుదహరించుచున్నాఁడను.

సీ. "ప్రణుతింప నతఁడు తోరణగట్టుపరసీమ
లనురీతినూత్నతోరణము లెసఁగ
రిపులఖండించి సత్కృపఁ దత్సుతులనిల్పు
నట్లు ద్వారములందు లనఁటు లమర
విలిఖించు నతఁడు దిక్కులజయస్తంభాలి
ననుమాడ్కిఁ జిత్తరువ్వ హర్మ్యాలలర
వెలయు నిట్లితనికీర్తులు దిక్తటులనన్న
సరణి ముత్తెఁపుమ్రుగ్గు జగ్గు లమర

తే. నభినవాలంకృతిస్ఫూర్తి నతిశయించెఁ
నప్పురీరత్న మపుడు మహాద్భుతముగఁ
బ్రకటమహిముల శ్రీకృష్ణరాయనృపతి
శ్రీకరంబైన పట్టాభిషేకవేళ.

మ. సరగం దెచ్చిరి భూసురోత్తములు కృష్ణాగౌతమీజాహ్నవీ
వరణాసూర్యసుతా కవేరతనయా వారాశిముఖ్యాంబు

వుల్, గరిమం గాంచనరత్నకుంభతతులన్ గారుణ్యవి
శ్వాసత, త్వరులై యెంతయుఁ గృష్ణరాయవిలసద్రాజ్యా
భిషేకార్థమై.

తే. శంఖకాహళభేరీప్రచండవాద్య
తతరవంబులు భూనభోంతరము నిండ
బ్రాహ్మణుల్ కృష్ణరాయధరావరునకుఁ
జెలఁగి పట్టాభిషేకంబుఁ జేసి రెలమి."

ఈమహాత్ముని పట్టాభిషేకమహోత్సవము మహావైభవముతో జరిగెననియు నెందఱో శూరాగ్రేసరు లాతరుణమున నుండిరనియు నీక్రింది కుమారధూర్జటిపద్యము తెల్పుచున్నది.

సీ. "చక్కెరవిలుకాని చక్కఁదనముగల్గి
చొక్కమౌ నార్వీటి బుక్కరాజు
సాకల్యముగఁ గీర్తిసర్వదిక్తటులందుఁ
బ్రాకటస్థితినిల్పు నాకువారు
కంటకరాజన్యగర్వంబు లడఁగించి
లీలచే మించునం జేలవారు
ధాటీనిరాఘాటఘోటీహతవిరోధి
కోటులై వెల్గువేల్గోటివారు

తే. చండతరశౌర్యులగుకురాసానివారు
బూదహాలివారు మొదలైన భూమిపతులు
కొలువఁ బట్టాభిషిక్తుఁడై చెలువుమీఱె
రమ్యగుణపాలి శ్రీకృష్ణరాయమౌళి."

శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకము వర్ణనాతీతముగా జరగఁగా నవ్వల నితని రాజ్యపరిపాలనమును వర్ణించుచు ముక్కు తిమ్మన్నగారు పారిజాతాపహరణమున నిట్లు వ్రాసినాఁడు.

సీ. "యాదవత్వమున సింహాసనస్థుఁడు గామి
సింహాసనస్థుఁడై చెన్ను మెఱయ
గొల్లయిల్లాండ్రతో గోడిగించుటఁ జేసి
పరకామినీసహోదరతఁ జూప
మఱిజరాసుతునకై మధురడించుటఁ జేసి
పరవర్గదుర్గముల్ బలిమిఁ గొనఁగఁ
బారిజాతము నాసవడి పట్టి తెచ్చుట
నౌదార్యమున దాని నడుగుపఱుపఁ

తే. గోరి తొలుమేనఁ దనకైన కొదువ లెల్ల
మాన్పుకొనవచ్చి భువనైకమాన్యలీల
నవతరించిన కృష్ణుఁడౌ ననఁగ మించె
నరసవిభుకృష్ణరాయభూనాయకుండు.

సీ. చక్రవర్తి మహాప్రశస్తినాఁడును నేఁడుఁ
జెలఁగి ధర్మక్రమస్థితి ఘటించె
భూభృదుద్ధరణవిస్ఫూర్తినాఁడును నేఁడు
గోరక్షణఖ్యాతిఁ గుదురుపఱిచె
సాధుబృందావనసరణినాఁడును నేఁడు
వంశానురాగంబు వదలఁడయ్యె
సత్యభామాభోగసక్తినాఁడును నేఁడు
నాకల్ప మవల నింపార నిలిపె

తే. నాఁడు నేఁడును యాదవాన్వయమునందు
జననమందెను వసుదేవమనుజవిభుని
కృష్ణుఁ డనుపేర నరసేంద్రుఁ గృష్ణదేవ
రాయఁ డనుపేర నాదినారాయణుండు."

దీనింబట్టిచూడఁగా శ్రీకృష్ణదేవరాయలపట్టాభిషేకోత్సవము సామంతరాజులకు సమ్మతముగను బ్రజలకామోదకమునుగ సాగిన ట్లేర్పడునుగదా. రాయలు తనయన్నకుమారునకు రాజ్యమీయక యన్యాయమూని తా రాజ్యముగొనియే యుండిన నట్టి సంధిగ్ధావస్థయందు సామంతరాజులు, వీరనరసింహరాయలపక్షమున నున్నవారెల్లఁ జెలరేఁగియుందురు. నిస్సహాయుఁడగు కృష్ణదేవరాయ లవు డేపనిచేయను శక్తుఁడుగాకయుండు. అట్టి వేమియు సాగినట్లు కింవదంతులుగూడఁ గానరావు. కావున శ్రీకృష్ణరాయలను సర్వసామంతరాజులు ప్రజలు మంత్రులును గోరి పట్టాభిషిక్తుని జేసిరని మన మంగీకరింపక తప్పదు. ఇఁక విజయనగరమునుగుఱించి యించుక వ్రాయందగును.

మూఁడవ ప్రకరణము.

విజయనగరము.

విజయనగరము మొదటిప్రభువులైన హరిహరబుక్కరాజులచే నిర్మింపఁబడినది. క్రీ. శ. ౧౧౧౭—౫౬ సం॥లలో రాజ్యముచేసిన విజయధ్వజుఁడే తుంగభద్రానదీతీరమున విజయముగలుగఁగోరి శుభముహూర్తమునఁ దనపేరిట నీనగరమును గట్టించెనని కింవదంతి గలదు. ఆకాలమునఁ గట్టినది చిన్నపట్టణముగా నుండినదనియు ౧౩౩౬—౪౦ సం॥లలో మాధవవిద్యారణ్యుల ప్రోత్సాహమునఁ గ్రొత్తపద్ధతిగా మరల నిది నిర్మింపఁబడినదనియుఁ జెప్పుమాట యసంగతముకాదు. హరిహరబుక్కరాయలకాలమున విద్యారణ్యులను బిరుదనామముగల మాధవాచార్యులు మంత్రిగ నుండెను. విశేషించి రాజు వీరిని గురువుగా భావించువాఁడని జనశ్రుతి వీతెంచెడు. వసిష్ఠుఁడు దశరథునొద్దమంత్రియుఁ బురోహితుఁడుగా నుండెనుగదా. ధర్మసంశయములు వచ్చినపుడు వసిష్ఠు నడుగుచుండిరని మన మూహించుట సాహసము కాదు. విజయనగరమునకు విద్యానగరమన్న పేరు మాధవాచార్యుల పాండిత్యబలముచేఁ గలిగినవిఖ్యాతనామ మని పెద్దలందురు. సత్యముగ నిది యుండవచ్చును.

హరిహరబుక్కరాయలు రాజ్యమును బాలించుచు నొక్కనాఁడు మృగయాక్రీడసలుపఁ దుంగభద్రానదీదక్షిణ

భూభాగమునకుం బోయెనంట. వేఁటరు లెందఱో రాజువెంటఁ దగినసాధనములుతీసికొని పోయిరంట. అరణ్యానిఁ బ్రవేశించి నంతనే యేయేతీఁగజొంపములచాటున నేయేజంతువులుండునో తెలిసికొన నామృగయులు విహారశునకముల మెడత్రాళ్లవిప్పి రంట. అహమహమికగాఁ బరుగువాఱు నాకుక్కలు కొలది క్షణముల కాపొదలనుండి వెనుకకు మరలెనంట. ఇదేమి యాగడమని మృగయులు నెమకఁగా వీనిని శశకశాబకములు పాఱఁద్రోలుచున్న జాడఁ గానవచ్చెనంట. అనుమానమున మరల వేఁపుల నుసికొల్పిరంట. అవి మరల గుల్మములను దరుషండ ములం జొచ్చి భీతిచే మరలెనంట. అందలి శశకశాబకములు వేఁటకుక్కలం దోలుచుండెనంట. కన్నులారఁ గాంచి యవ్వా ర్తను రాజువెంట వేడుకకై వచ్చియున్న శ్రీవిద్యారణ్యమాధ వరాయలకుం దెల్పిరంట. వారు నావిషయమును గన్నులారఁ దిలకించి యాచోటు పౌరుషస్థానమనియు, నందు నిర్మించినపట్ట ణము రాజునకు విజయము నొసంగుననియు హరిహరబుక్క రాయలకుం దెల్పిరంట. ఇదిజనశ్రుతివలనఁ దెలియువిషయము.

ఆనగరము కిష్కింధానగరమునందుఁ దుంగభద్రానదికి దక్షిణదిక్కున నదీపరిసరధరణియందు వాస్తుశాస్త్రము ననుస రించి కట్టఁబడినది. ఋశ్యమూకము మాల్యవంతము మహేం ద్రాదిపర్వతము లందుఁ గలవు. వానిని దన కల్లోలమాలికల స్పృశించుచుఁ దుంగభద్రానది ప్రవహించుచుండును. ఆచోటు చూడఁజూడ వేడుకగా నుండును. ఈకాలమున నీభూభాగ మును హంపివిరూపాక్షమని పిలుతురు. ఈవిజయనగరమునకుఁ దూర్పుపడమరలయందు నీలపాషాణములఁజూడ నందముగా

నుండుపర్వతముల పంక్తులుగలవు. దక్షిణభాగమున రామదుర్గ ములను చిన్నకొండలపిండు గలదు. ఉత్తరమునఁ జాలుగాఁ బర్వతములును వాని నంటియున్నతుంగభద్రానదియుఁ గలవు. ఇట్లు నలుప్రక్కలఁ జక్కనిసంరక్షణస్థలములు గలవు. దానిం జూడఁగా స్వభావదుర్గములుగల పట్టణమనుతలంపు గలుగు. దీనింబట్టియే శత్రుదుర్భేదముగ నదియుండును. ఈదుర్గములు గాక నగరముచుట్టును బ్రాకారసప్తక మమరియుండు. ఒక్కొ క్కప్రాకారము చట్రాలచే నిర్మింపఁబడుటచేఁ జేరరానిదని పగ వారికిఁ దోఁపఁజేయుచునుండు. తుంగభద్రానదీతటమున నవి నిర్మింపఁబడుటఁ దత్పార్శ్వమునుండి యభియాతిప్రతతి భేదిం పవచ్చి సిద్ధసంకల్పులు గాఁజాలరు. దక్షిణభాగమునుండి దక్షిణ పశ్చిమాంతర్భాగమునుండియుఁ బరిపంథులు రా నవకాశము కలదు. దాని నాలోచించి యామూలలో నొకభూరితరతటా కము నిర్మింపఁబడియె. ఆతటాకమునకుఁ గట్టినకట్టను జూడఁగా నది యొకదుర్భేదప్రాకారకుడ్యమా యని తోఁచును ఆతటాక మాకాలమీకాల మనకుండ నేనుఁగీతలోతునీటితో నుండును.

దక్షిణపుదిక్కున నొకకోటనుగట్టి దానికి భూధరములతోఁ బొందిక కల్పించిరి. దానియందుఁ బెక్కుబురుజు లమరింపఁబడియె. వాని నప్రమత్తులై రక్షకవీరభటులు సదా కాపాడుచుందురు. ఏడవదుర్గమునఁగల విశాలభూభాగమునఁగర్షకులు వ్యవసాయ మొనర్చి ధాన్యముపండింతురు తటాకమున జలసమృద్ధికలదుగాన నాపంటల కేనాఁడును విఘాతము కల్గకుండెను. యుద్ధరంగము సాగుచుండినను బరగ్రామమునుండి ధాన్యము రాకయున్నఁ గలుగుకొఱంత యానగరమునకు రాకుండ నిట్టికట్టడి చేయఁబడి

నది. అందే కర్షకులుండి విశేషపశుధనమును గాపాడుచుందురు. కానఁ బాఁడిపంటల కిసుమంతయు లోపము రాకుండెను. ఒక్కొక్కప్రాకారమునం దొక్కప్రాసాదము. సేనాధీశనివాసహర్మ్యము నాణెములసిద్ధముజేయుమందిరము కట్టఁబడియెను. అవన్నియుఁ బర్వతముమీఁదనే నిర్మింపఁబడియెను. ఇట్లు ప్రాకారసప్తకము నిర్మింపఁబడియె.

కావుననే యీనగరము తనవైభవమున నద్వితీయ మనఁబడుచుండెను. ఈనగరము సార్ధయోజనపరిమితమగు విశాలత్వముగలది. దానిమహోన్నతదశావిశేషమున నందుండు జనుల సంఖ్య ముప్పదిలక్షలకన్న మీఱియుండెనని కొందఱు వ్రాసిరి. ఇది వీరభటనికాయపరిశోభితంబై వైరివారదుర్భేదంబయి యలరుట విజయనగరమయ్యెను. వేదశాస్త్రవిద్వద్వరిష్ఠసాధుజనపరిసేవ్యమానమగుట విద్యానగరమయ్యెను. సాటిలేనివిఖ్యాతిం గాంచి శుక్లపక్షక్షపాకరునిచందమున దినదినాభివృద్ధినొందుటం గాంచి భామినీరాజ్యపాలకు లగుమహమ్మదీయులుభయంపడుచు, నసూయాపరవశులై యొక్కొత్తుగ దాని నపహరింపవలయునని తలంచుచుండిరిగాని వారి కించుకయే నవకాశము దొరకకుండఁ దత్పాలకులు సకలపరికరసంభృతవీరభటుల నిలిపిరి. దాని నొక్కసారి చూచినవారుమరల జీవితకాలమున మఱచిపోఁజాలరనుట నిశ్చితము.

ఈమహానగరమును బరదేశస్థులు దర్శించినపు డేలాగు వర్ణించిరో వ్రాసినచోఁ బైవిషయము లసత్యములుగావని తోఁచును. పరదేశీయులకుఁ బక్షపాత మిట్టివిషయముల నుండదు కదా. వారేయేసంవత్సరముల దర్శించినను గాలమించుక భేదముగానున్నను బ్రకృతకథ కది బాధకముగాదని నాభావము. ఒక్కొక్కవిషయము పలుతావుల వ్రాయుటకంటె నొక్కచో నుండిన మేలను నియమము ననుసరించుచున్నాఁడను.

*విజయనగర మారాజ్యమునకు రాజధానియై యున్నది. రాజెపు డీనగరమునందే యుండును నగరమునకు మూఁడు క్రోశముల (6 మైళ్లు) కీవలనే ప్రవేశింపవీలులేకయుండఁ గొండలపిండుగలదు. దానినుండియే మార్గముకలదు. పెక్కుమార్గములమర్పఁబడినవి. ఆద్వారము లభేద్యములుగాఁ గట్టఁబడినవి. ఆద్వారములనుండి తప్ప వేఱుత్రోవల నగరమునుజార వలనుపడదు. ఆకొండలపిండు ముప్పదాఱుక్రోశములఁ (72 మైళ్లు) పొడవుగలిగి యామహానగరము నావరించియున్నది. ఈకొండలపిండునకుఁ జేరువ నిట్టివరుసలుకలవు. వీనినడుమ సమభూప్రదేశమున నందెల్ల శత్రుదుర్భేద్యముగఁ గోట కట్టఁబడియే యున్నది. కావున నీకొండలన్నియు మూయఁబడినట్లే కనఁబడును. నగరమును జొచ్చు మార్గముల దగ్గఱఁ జిన్నగుహాలుండును. అందు జల్లగానుండును. ఆగుహాలలోఁగూరుచుండి రక్షకభటులు నగరమును గాపాడుదురు. ఈకోటలకునడుమ వరిపొలములు మాత్రమేగాక ఫలవృక్షము లనేకములుండును. భూములు మిగుల సారవంతములు. ఈకొండలకునడుమ తటాకములు బావులు సరస్సులు పెక్కులు గలవు. వానియం దక్షయోదక

* ఈవిషయము క్రీ. శ. ౧౫౨౦ సం॥ న పోర్చుగల్లను దేశమునుండివచ్చి నగరమునుజూచిన ఫిగరిడో యనువారితోడనుండిన పెయిస్ అనునతఁడు వ్రాసినవిషయసారమని తెలియందగును.

ముండును. కావునఁ దదాధారమున భూములు సకలఫలముల నిచ్చుచుండును.

గోవానగరమునుండి వచ్చిన మార్గమొక్కటి ప్రథమ పర్వతపంక్తిఁగల ద్వారములలో నొకదానిగుండ నగరములోఁ బ్రవేశించును. పడమటిప్రక్క నిదియే ప్రధానమగు ద్వారమగుటచే బురుజులచే సురక్షితమగు పట్టణ మొక్కటి నాగలాపుర మనునది కట్టింపఁబడినది. ఈ ప్రథమప్రాకార కవాట ద్వార గోపురములు బురుజులు శత్రుదుర్భేద్యములుగ నుండును. తక్కిన గోడలవలెఁగాక యీపంక్తిలోనిగోడలు పాలగచ్చుచేయఁబడి యనుపమానములై యుండును. నాగలాపురమునుండి విజయనగరమున కొకవీథిపోవును. ఆవీథికిరుపక్షముల సౌధములు వరుసలుగాఁ దీర్చి కట్టఁబడియుండును. చాలుగా వృక్షములుండుటవలన నాశీతలచ్ఛాయలఁ బథికులు తమబడలికలఁ దీర్చుకొందురు. అందే అంగళ్లుండును. సకలవస్తువు లందు దొరకును. ఈవీథియందే ప్రభువరేణ్యుఁడు సుందరతమమగు ననంతశయన దేవాలయముఁ గట్టించెను. ఈనగరము నెల్లయెడల నొకరాతిగోడ కలదు. అందు సురక్షితములగు దుర్గములు గలవు. ఈనాగలాపురమునకు విజయనగరమునకు నడుమ విశాలభూభాగము గలదుకావున నందుఁ గేదారక్షేత్రములు, ఫలవృక్షములతోఁటలు, నీటికాలువలు విశేషించి కలవు. నీటిపట్టులు సదా జలపూర్ణములై యుండునుగాని యొకప్పుడైన జలమునకు లోటులేదు. అందందు విశాలభవనము లమరియుండును. నగర ప్రథమద్వారమునకుఁ బోవలయునన్న లోఁతులగ నీటికాల్వను దాఁటియే పోవలయును. ఆద్వారముదాఁటి

లోపలఁ బ్రవేశింపఁగనే రెండుదేవాలయములు నేత్రపర్వమొనర్చుచుండు. అవి చిన్నవైనను సుందరముగ నుండును. ఆనగరమున నెన్నియోవీథులుగలవు. అవియన్నియు విశాలములై చక్కని మార్గములుగలిగి చూడ నందముగానుండును. అంగళ్లు విశేషించియుండును. సకలవస్తువు లందు దొరకును. బహుమూల్యముగాక యవి దొరకుటవిచిత్రముగాఁదోఁచును. నవరత్నములు విక్రయింపఁబడుటచే నా మహాపురమున నన్నిజాతులవారు గలరు. ఈనగరపరిమాణము నిర్ణయింప వలనుపడదు. ఏలనఁగా, నగరమంతయు నొక్కస్థలమున లేదు. నడుమనడుమ భూధర పంక్తులున్నవి. ఒక్కకొండనెక్కిన నొక్కభాగమగపడును. దాని ప్రక్కనఁ బర్వతపంక్తు లగపడును. శృంగార పురవరములలో నిది ప్రఖ్యాతిఁగాంచిన దనవలయు. ఇంతటి నీటివసతి, యిన్ని ఫలవృక్షములు, గలనగరము వెదకినను భూమండలమునఁ గానరాదు.

రాజాంతఃపురమునకుఁ జేరువగా నత్యద్భుతములగు తోఁటలు గలవు. విశేషించి ఫలవృక్షములుగల యుద్యానము లెక్కువగాఁగలవు. వానినడుమ నాయంతఃపురపంక్తులు నేత్రానంద హృదయానందముల నొసంగుచుండును. జనసంఖ్యవచింప నశక్యమని యెల్లరకుఁ దోఁచును. ఆనగరమునకు నుత్తరభాగమునఁ బ్రాకారమునకు వెలుపల మూఁడు దేవాలయములు గలవు. అవి చాలగొప్పవి. సుందరతమములు. అందొకటి విఠలస్వామి యాలయము. అది ఆనెగొందినగరమున కెదురుగాఁ గట్టఁబడినది. రెండవది హంపిదేవాలయము. అందు విరూపాక్షస్వామి వేంచేసియుండును. పెక్కుమంది యాత్రికులు సదా రాకపోకలు చేయుచు దీనిమహిమమును గొనియాడుచుందురు.

దీనికెదురుగా సుందరములగుమందిరపంక్తులు చాలుతప్పక కట్టఁబడియుండును. ఆవీథి చూచువారి కత్యంతామోదము నొనఁగూర్చుచుండును.

ప్రధానపర్వదినమునఁ గృష్ణరాయలు నాగలాపురమునుండి విజయనగరమునకు వచ్చి యది తనరాజ్యమునకెల్ల రాజధానిగావున నచటఁగొలువుచేసి యెల్లరతోఁగలిసి మాటలాడుచు నాచారపద్ధతులఁ బరిశీలించుచు వినోదముగఁ గొన్ని దినములు గడపు నాచారముగలదు. నృత్తము గానము వాద్యచమత్కృతు లాదినములలో సాగును. సేనాధీశులందఱు వత్తురు. రాజ్యసీమల నుండువారుమాత్రము రారు. శరన్నవరాత్ర మహోత్సవము మిక్కిలి యక్కఱతో నడుపఁబడు. అత్తఱి రాజభవనము చక్కఁగా నలంకృతమై శృంగారస్థానమనఁ జెప్పఁదగియుండును. జను లా మహోత్సవమును జూచువేడుకమై నసంఖ్యాకులు వత్తురు. అన్నదాన మాకాలమున విశేషించి చేయఁబడును. దేవాలయములందుఁ బూజలు సాగును. ప్రతిమల నూరేగింతురు. అత్తరుణమున జనులచేఁ గ్రిక్కిరిసి వీథులిసుకచల్లినఁ గ్రిందఁబడకుండునట్లుండును. రాజభటులు మనుష్యులఁ బొందుపొందని నిలువనీయక పాఱఁదోలుచు జాగరూకులై కాపాడుచుందురు. వివిధవస్తువులను విక్రయించుపద్ధతి చిత్రముగనుండును. భద్రగజము లలంకరింపఁబడి ముందుగాఁబోవుచుండ దద్ఘంటికానాదమున విత్రస్తులై జనులు దేవతోత్సవముల మార్గమిచ్చుచుందురు. ఈనగరవిషయమున వ్రాయఁదగిన విషయము లెన్నియో కలవు. గ్రంథవిస్తరభీతి వదలి ప్రకృతము ననుసరించెదను.

నాల్గవప్రకరణము.

శ్రీకృష్ణదేవరాయలవిద్యావైశద్యము.

పట్టాభిషేకమహోత్సవము జరగినపిదపఁ గొలఁదిదినము లారాజశేఖరుఁడు విజయనగరముననే యుండి సేనాసన్నాహముల నొనరించుచు, సేనాధిపతుల సేకరించుచు, నాయుధముల నాయత్తపఱచుచుఁ, దదుచితప్రయత్నముల నెన్నింటినో యొనరించుచు నుండెను. తనరాజ్యము నిష్కంటకముగ జేయునూహ శ్రీకృష్ణరాయల కనుదినము పెరుగుచుండెను. దానిని వెలిపుచ్చక యతండు

"ఫలానుమేయాః ప్రారంభాస్సంస్కారాః ప్రాక్తనా ఇవ."

అన్నసూక్తి కుదాహరణముగ నొనర్చుచుండెను. రాజనీతియందు రాయలు నిష్ణాతులనునది యతిశయోక్తియే కాదు. ఏకార్య మెందుల కెప్పుడు చేయునో యెవ్వ రెఱుంగరు. అందఱు చెప్పినపని చేయుచుందురే కాని యాపనినిట్లు చేయఁదగునని యుపదేశింప వలనుపడనందునఁ దదాజ్ఞాదృఢరశ్మిబద్ధులై యుండిరి. ఇట్లొకప్రక్క యుద్ధప్రయత్నముల నొనరించుచు విద్యాగోష్ఠిఁ గాలము గడపుచుండెను. శ్రీకృష్ణరాయలకు సంస్కృతమునందును, దెలుఁగుభాషయందును సమాన పాండిత్యము గలదు. కవిత్వమునం దెక్కుడు మక్కువగలవాఁడు కావునఁ దన్నుదర్శింప నరుదెంచు విద్వత్కవులను యోగ్య

తానుసారము సత్కరించుచు వారిగోష్ఠిందవిలి యుండెను. ప్రభుశిరోమణియు రసికుఁడునగు రాయలను దర్శింప నెందఱో కవివర్యులు వచ్చుచుండిరి. కొందఱా మహాప్రభువును దర్శించుచునుండినఁ జాలునని యందే యుండిరి. ఆమహనీయుఁడు వారికే కొఱంతయుఁగలుగకయుండ ధనమిచ్చుటయే గాక మిత్రులంబోలె భావించుచు గురువులంబోలె సభాముఖమున గౌరవించుచు వారి ననుదిన మానందసాగరమున ముంచుచుండెను. విద్వద్గోష్ఠియం దధికానురాగము రాయలకుం గలదను విషయము విద్వత్కవుల యాదరణమే చెప్పక చెప్పుచున్నది. భాషను రక్షించుట పురుషార్థములలో నొక్కటియని రాయల తాత్పర్యమైనట్టు కనుపట్టు. కావుననే తెలుఁగుభాషను జక్కఁగాఁ బోషించెను. దాన నిష్కళంకయశోనీహారరశ్మిని శాశ్వతముగా నిలుపఁజాలెను. ఆపుడమిఱేఁడు విద్వత్కవి ప్రియుండగుటెగాక విద్వత్కవియునయ్యెను. ప్రబంధరాజమను విఖ్యాతింగాంచిన "ఆముక్తమాల్యద" యను పేరుగల విష్ణుచిత్తీయము నతండు రచించెను. ఇందలి వర్ణనము లపూర్వములు. అచ్చెరువుఁగల్పింపఁజాలునవి. శైలి సరళముగాదని కొందఱందురు. సంస్కృతసమాస భూయిష్ఠమై యపరూపములగు తెలుఁగు పదములు వెలయ నీమహాకావ్యము సత్కవిశిరోధార్యమై యున్నదనుట నిర్వివాదాంశము. ఒక్క యాముక్తమాల్యదను జక్కఁబఠించిన సంస్కృతాంధ్రములయందు నిస్సమాన పాండిత్యము గలుగునని నాభావము. రాయలకుంగల్గు సనాతనాధునాతన భాషాపాండిత్యమును సహస్రముఖముల నీగ్రంథరాజమే తెల్పుచున్నది. కొన్ని సంస్కృతకావ్యములు రచిం

చినట్లు తెలియవచ్చెడింగాని యవి యేకారణముననో లభింపకున్నవి. అసంపూర్ణములై నామమాత్రముగ నున్నవో అసూయగల పరరాజులాక్రమించి దేశమును బాధించునపు డివి కాల్పఁబడియెనో తెలియఁజాలను. వీరి యాస్థానమునఁ గర్ణాటక భాషాకవులుకూడ నుండిరను ప్రతీతికలదు. వారురచించిన గ్రంథములఁగూర్చియు, వారింగూర్చియుఁ జర్చించుట యిప్పటికిఁ దగినదికాదు. తెలుఁగుబాసను మిగుల గౌరవించి పోషించిన మహారాజితఁడే యనవచ్చును. "దేశభాషలందుఁ దెలుఁగులెస్స." అని పొగడిన రసికమహారాజ విద్వత్కవి శ్రీకృష్ణదేవరాయలే యనవలయు. మాతృభాషాగౌరవము శ్రీరాయల కాలమున నున్నంత మఱెప్పుడును లేదని మనమూహించుట యనాలోచితము కానేరదు.

ఆస్థానకవిశేఖరులు.

ఈ విద్వత్ప్రభువు నాస్థానమునఁ బెక్కుమంది కవులు కలరనుట సుప్రసిద్ధవిషయము. అందెనమండ్రకు మిగుల ఖ్యాతి గలదు. వారికే అష్టదిగ్గజము లనిపేరు. అల్లసాని పెద్దన్న, ముక్కుతిమ్మన్న, (నందితిమ్మన్న) అయ్యలరాజు రామభద్రుఁడు, కవిధూర్జటి, మాదయగారి మల్లన్న, పింగళి సూరన్న, రామరాజభూషణుఁడు, తెనాలి రామకృష్ణుఁడు. అను వీరే యష్టదిగ్గజములని పిలువఁబడువారు. తెనాలి రామకృష్ణునకు రామలింగఁడను పేరుగలదు. ఈపేరే జనులు విశేషించి వాడుదురు. ఒక్కప్పు డెవ్వఁడో రాయల చెంతకువచ్చి తానటనుండనితఱిఁ దన్నునాక్షేపింపఁగా విని మఱుదినము సభలో నందఱుండఁగా నిలిచి నిర్భయముగా

"ఉ. లింగనిషిద్ధుఁ గల్వలచెలింగని మేచకకంధరుం డ్రిశూ
లింగని సంగతాళిలవలింగని కర్దమదూషితేభ మృణా
ళింగని కృష్ణచేలుని హలింగని నీలకచేభ విధాత్రునా
లింగని రామలింగకవిలింగనికీర్తి హసించు దిక్కులన్."

ఈపద్యముం జదువఁగా నిందలి పదచమత్కృతి కలరి యందున్న వారెల్ల జయజయశబ్దము లొనరింప నాక్రొత్తకవి వినీతుఁడై తనయపరాధమును సైపుమనెనని కింవదంతి కలదు.

పింగళిసూరన్న, రామరాజభూషణుఁడు, తెనాలిరామలింగన్న వీరుముగ్వురు శ్రీకృష్ణరాయల కాలమున లేరనియు, నట్లుండినచో వీరు రచించిన కావ్యము నితరుల కంకితముచేయుట యసంగతమగుననియుఁ గొందఱూహింతురు. ఈయొక్క కారణముచేతనే వీరా రాయలకాలమున లేరనుట మిగుల సాహసము. శ్రీకృష్ణదేవరాయల యల్లుఁడగు రామరాజు కాలమునఁ బింగళిసూరన్న రామరాజభూషణుఁడు నున్నట్లు వారి గ్రంథములనుండియే స్పష్టముగాఁ దెలియుచున్నందున రాయల కాలమున నుండుట పొసంగఁదనియు, నీకింవదంతి యసంగతమనియుఁ గొందఱు ప్రసంగింతురు. మాదయగారి మల్లన్న తానొనర్చిన రాజశేఖరచరిత్రమను కావ్యమును శ్రీరాయల మంత్రియగు తిమ్మరుసుగారి యల్లుఁడగు నాదిండ్ల యప్పామాత్యున కంకితముచేసెను. అట్టిమాదయగారి మల్లన్న శ్రీకృష్ణరాయల యాస్థానకవియని స్పష్టపడియెడిని. ఇట్లుండఁగా రాయలయల్లుఁడగు రామరాజు సభలోనున్న పింగళిసూరన్న రామరాజభూషణులు శ్రీకృష్ణదేవరాయల కాలముననుండుట యసంభవమని, ఉన్నట్లు నిర్ణయించుట యసంగతమని యుద్ఘోషించుటకుంగల

కారణము తెలియఁ జాలకున్నాఁడను. శాస్త్రమర్యాద ననుసరించి మానవుని యాయుస్సు నూటయిరువది వత్సరములు. ఈకాలమునఁగూడ నూటయిరువది సంవత్సరములు జీవించువారందందుఁ గానవచ్చుచున్నవారు. నేఁటికి నాలుగు వందలసంవత్సరములకుఁ బూర్వము పూర్ణాయుర్దాయము గలవారు పెక్కుమంది యుందురని యూహించుట పొరపాటుగా నుండదు. ఎనుబదివత్సరముల వయస్సుగలవార లిప్పటికాలపు వయస్సుఫరితులకంటె నెక్కుడు పాటుపడువా రప్పుడున్నట్లు స్పష్టమయ్యెడిని. ఇట్లుండఁగా శ్రీకృష్ణరాయలకాలమున నిండుజవ్వనంబున నుండి వారియల్లునికాలమున నించుక వయస్సుమీఱు తరుణము గలవారుగ సూరన్న రామరాజభూషణు లుండిరన్నమాట యసంగతము కానేరదు. వీరు రాయలకాలమున గ్రంథరచనకుఁ బూనియుండవచ్చు. రాయల మరణానంతర మాగ్రంథములఁ బూర్తిచేసియుండవచ్చు. తెనాలి రామలింగకవి రాయలకాలమున నూనూగు మీసాలుగల నూత్నయౌవనమునుండి చమత్కారముగాఁ గవిత్వము చెప్పుచుఁ బరిహాసముగా మాటలాడుచునుండి యాభూపాలచూడామణి మరణింప నవ్వలఁ దత్పరితాపమునఁ గొంతకాల మూరకుండి తరువాత గ్రంథమును రచియించి యప్పటివారిలో గుణగణ్యుల కంకితమిచ్చి పూర్ణాయుర్దాయమీ భూలోకమునఁ గడపి మరణించి సురపురి నలంకరించియుండవచ్చు. ఇందునుగూడ నసంభవమునఁ దగినంత విచారకరమగు వృత్తాంతము లేదు. ఈకాలపువారి యాయుస్సును బట్టి ముందుఁగూడ నిట్లేయుండునని యూహించి దాని ననుసరించి సిద్ధాంతములు మార్చుకొనుట మాత్రమే యసంగతము

ఈవిషయము నింకను బెంచివ్రాయుట కిది యదనుగాదు. రాయలరసజ్ఞతను దెల్పుటకే యించుక వ్రాసితిని. తరువాతి విషయము నింకఁ దడవెద.

ఇట్టిమహాకవు లాస్థానమండపము నలంకరించుచుండఁ దాను విద్వత్కవిశేఖరుఁడై శ్రీకృష్ణదేవరాయలు విద్యాగోష్ఠి కాలముగడపుటొక యాశ్చర్యమా. ప్రతిదిన మొక్కతరుణము విద్వద్గోష్ఠికని నియమింపఁబడి యప్పు డందఱు నందుఁ జేరఁగా, భాషాభివృద్ధిని, అందుఁ గ్రొత్తగాఁ గావ్యరచనయు నగుపద్ధతు లాలోచింపఁ బడునందురు. ఔరా! ఎట్టిసత్కాలమది! ఇంక నట్టి శుభతమసమయ మొదవునని యూహింప నవకాశము కలదా. అట్టి విద్వత్కవి ప్రభుశిరోమణిని స్మరించుటయే మహోత్తమకార్యములలో నొక్కటియని తలంతము.

ఇట్లు విద్వద్గోష్ఠిచేఁగాలమును బుచ్చుచుఁ దన యమేయ ప్రతాపమున నిస్సపత్నముగా రాజ్య మేలుచున్నందున జనుల కీతిబాధలు లేమిని రాజన్వంతంబగువిషయంబున నున్నవార మను నూహ కలిగి క్రమక్రమముగా నది దృఢపడియెను. పాఁడి యుఁబంటలును జక్కఁగా నమరియుండుటం జేసి యామహారాజపరిపాలితరత్నగర్భాంశము నవనవాభరణభూషితమై యున్నట్లుండెను. ఈవిషయము మనుచరిత్రములోని యీపద్యము వలనఁ దెలియవచ్చెడిని.

“సీ. తొలఁగెను ధూమకేతుక్షోభ జనులకు
నతివృష్టిదోషభయంబు వాసెఁ
గంటకాగమభీతిఁ గడచె నుద్ధతభూమి
భృత్కటకం బెల్ల నెత్తువడియె

మాసె నఘస్ఫూర్తి మరుభూములందును
నెలమూఁడువానలు నిండఁ గురిసె
నాబాలగోపాల మఖిలసద్ద్విజమును
నానందమున సమన్వితి నతిశయిల్లెఁ
తే. ప్రజలకెల్లను గడు రామరాజ్యమయ్యెఁ
జారుసత్త్వాఢ్యుఁ డీశ్వర నారసింహ
భూవిభుని కృష్ణరాయఁ డభ్యుదయ మొంది
పెంపుమీఱఁగ ధాత్రిఁ బాలింపుచుండ.

ఇం దతిశయోక్తికి నుదాహరణం బించుక యుండ వచ్చును. కాని సామాన్యదృష్టిఁ బరిశీలింప సత్యమెక్కుడుగా నుండవచ్చునని యూహించుటే సరసము. విజయనగరరాజ్యమే యాకాలమున నందును శ్రీకృష్ణదేవరాయలప్రభుత్వము లేక యుండినఁ బర్వకాలసముత్థితసాగరజలంబుభంగి పొంగి యొక్కుత్తుగ భారతభూమి నప్పళింపఁ బాఱుతెంచు మహమ్మదీయ శూరవాహిని నాపఁగల దేదియుండును? కావున నాఁటినుండి నేఁటివఱకు జనప్రవాద మారాజ్యవిషయమున నేకరీతి నుండుటంబట్టి పైనాయూహ సత్యమనియే తోఁచెడిని.

కొలఁదికాల మిట్లు గడచెను. సేనాసన్నాహము చక్కఁగా నమరియుండెను. శ్రీకృష్ణరాయలమదిలోఁ దాగియున్న రాజ్యకాంక్ష క్రమక్రమముగా బయలుపడుతరుణము వచ్చెను. రాయలకు మంత్రిప్రవరుఁ డొకఁడు గలఁడు. ఆయనపేరు తిమ్మరుసు. ఈమంత్రినే యెల్లవారు నప్పాజీ యని వాడుచున్నారు. ఈమంత్రిశేఖరుఁ డాఱువేలనాఁడునకుఁ జేరినవాఁడు. సాళువవారను నింటిపేరు వీరికింగలదు. రాచయ్య యీతని

జనకుఁడు. తల్లిపేరు లక్ష్మమ్మ. చిన్నతనమున నీతిమ్మరుసు బీదవాఁడనియుఁ బెక్కుతావులఁ దిరిగి మాధుకరవృత్తిచే నన్నము సంపాదించుకొని చదువుకొని బుద్ధిమంతుఁ డయ్యెననియుఁ గొందఱు చెప్పుదురు. మొత్తముమీఁద నీతిమ్మరుసు మిగుల బుద్ధిమంతుఁడు. శాస్త్రవేత్త. రాజ్యతంత్రజ్ఞుఁడు. ఈయన బాల్యమునఁ దుళువ నరసరాజు నాస్థానమున మంత్రియై పిదప వీరనరసింహరాజుకడ సచివుఁడై యుండి యామీఁద శ్రీకృష్ణదేవరాయల కనుంగుమంత్రియై యుండెను. పెక్కుమంత్రులున్నను దిమ్మరుసు ప్రధానమంత్రి యగుటయేగాక రాజ్యధూర్వహుఁడై రాజగౌరవమునకుఁ బాత్రుఁడగుటయేగాక ప్రజలసమాదరణమునకును బాత్రుఁ డయ్యెను. రాయలీమంత్రియాలోచనము ప్రకారమే ప్రవర్తించుచు మిగులఁ బ్రఖ్యాతింగాంచె ననుటకు సంశయలేశమే లేదు. కృష్ణరాయలీమంత్రిసత్తముని ప్రీతితో నప్పాజీ యని పిలుచువారట. కన్నడభాషయం దప్పా యనునది పూజ్యవాచకము. ఆర్యశబ్దార్థము కలది. కొందఱు తండ్రిని అప్పా యని పిలుచుటయుఁ గలదు. కానఁ దండ్రీయని పిలుచువాఁడని కొందఱు కల్పింతురు. విశేషించి మిత్రునివలె భావించువాఁడనుటయే సమంజసమనక తప్పదు. శతమఖునకు బృహస్పతివలె నీమంత్రి రాయలకు సర్వకాలము చక్కనియాలోచనములఁ జెప్పుచుఁ దదభివృద్ధియే ప్రధానకృత్యముగఁ దా భావించుచుండువాఁడు.

రాయలు రాజ్యమును సంపాదించుట.

అభేద్యప్రాకారపంక్తివలయిత మహానగరము, చతురంగబలములు, తగినంతద్రవ్యము, యోగ్యులగుమంత్రులు, పరా

క్రమన్యాయధనులగు సేనాధిపతులు సమకూడఁగనే శ్రీకృష్ణదేవరాయలు తనప్రతాపమార్తాండుని వ్యాపింపఁజేయ నూహించెను.

"అసంతుష్టా ద్విజా నష్టా సంతుష్టా ఇవ పార్థివాః"

అన్న సూక్తి సముచితమని యాత్మ నిశ్చయించుకొనియెను. ఆకొలఁది కాలమునకే రాయలకు సర్వప్రజానుమోదసంపాదనము చేకూరెను. తనపూన్కికిఁ జక్కనియుపదేశము చేయుచుఁ దనయోగక్షేమముల నరయుచుఁ దనమేలే తమమేలుగా భావించు పరిజనులు మంత్రులు సేనాధీశులు విద్వత్కవులగు నాశ్రితులు దొరకిరి. సర్వసంభారములు సిద్ధములయ్యెను. పరాధీనపరాక్రముఁడుగాక రాయలు పరాక్రమశాలియునగును. కావున నిఁకఁ గాలము వృథచేయరాదని నిశ్చయించుకొనియె. రెండుసంవత్సరములు విజయనగరమునందే విద్వద్గోష్ఠులం బుచ్చెను. ఈకాలముననే రాజ్యమును స్వస్థమనస్కుఁడై పాలించెను. ప్రజలకుఁ బాఁడిపంటలకుఁ గొఱంత కాకయుండఁ గట్టుపాట్లు జేసెను. జలాశయములఁ ద్రవ్వించెను. తటాకములను నిర్మించెను. నీటికాలువలఁ ద్రవ్వించెను. పరరాజులెంతకాలము తనరాజ్యముచుట్టు ముట్టడించియున్నను బాఁడిపంటలకు హానిలేకుండుటయుఁ, బ్రజలు కష్టములపాలు గాకుండుటయు ననువీనికిఁ గొఱంత గల్గకుండఁ జేసెను. ఇఁకఁ దాఁజేయఁదగున దేదని యోజించెను.

బీజపురము గోలకొండ యనురాజ్యములఁ బాలించు మహమ్మదీయప్రభువులు తనరాజ్యము నొక్కొత్తుగ గుటుక్కున మ్రింగఁ బొంగుచున్నవారని రాయ లెఱుంగును. కాని వారిం

తటిలోఁ దనరాజ్యముపైకి రాఁజాలరని తెలిసికొనియెను. తొలుదొల్తఁ దనపరాక్రమసూచకవిజయము నార్జించి తదాకర్ణనమున మహామ్మదీయులు ససాధ్వసస్వాంతులుకాఁగా నాపిదప వారిని జయింపవలయునని నిశ్చయించుకొనియెను. మంత్రిపుంగవుఁడగు తిమ్మరుసుగూడ నిట్టియుపదేశమునే చేసెను. దాన రాజు తనప్రయత్నమునఁ గట్టిపట్టుదలఁబూనెను. కొందఱు సామంతరాజులు విజయనగరసింహాసనమునందు మర్యాద వదలిరి. కప్పమీయకయున్న నీప్రభువు లేమిచేయుదురో చూతమని యూరకుండిరి. ఈవార్త శ్రీకృష్ణదేవరాయలశ్రుతివివరములఁ జొచ్చెను. దాన రాయలు క్రోధఘూర్ణమానమానసుండయ్యెను.

కర్ణాటకదేశమునఁ గావేరీతీరమున శివసముద్రము గలదు. అందు శత్రుజనదుర్నిరీక్ష్యమగు సాలముగలదు. తత్పరిపాలకులు విజయనగరసామ్రాజ్యమునకు లోఁబడినవారు. కప్పమిచ్చుచు యుద్ధము పొసఁగినపుడు తోడ్పడుచు సామంతరాజు లనఁబడుచు నుండువారు. ఆరాజులలో శ్రీకృష్ణరాయల కాలమున శివసముద్రమును గంగరాజు పాలించుచు బలవంతుఁడ ననుగర్వమున నలంకృతుఁడై యుండెను. ఆరాజు విజయనగరసామ్రాజ్యముపైఁగల యభిమానమును మాని కప్పమీయక యుండెను. రాయల జైత్రయాత్రకుఁ బ్రథమకబళ మాతఁ డయ్యెను. వీరనరసింహరాయలకాలముననే యీయుద్ధము జరగియున్నది. అప్పటికిఁ గృష్ణరాయలు సింహాసనారూఢుఁడుగాక యన్నపక్షమున విజయముం గొనెను.

క్రీ. శ. పదునైదువందలపండ్రెండవసంవత్సరమున నొక శుభముహూర్తమున శ్రీకృష్ణదేవరాయల రణభేరీధ్వానము దిక్కులఁ జెవుడ్పడఁజేసెను. తొలుదొల్త శివసముద్రమును జయింప రాయలయూహ ప్రసరించెను. ప్రబలసైన్యము సన్నద్ధమై పయనము సాగించెను. వారిపయనము పెండ్లిప్రయాణమునే పోలియుండెను. ఆయుధములు మిగులఁ గ్రొత్తవి. సేనాపతుల యుత్సాహమతివేలము. కొలఁదిదినములకు శ్రీరాయలు సేనాసాగరము వైరిదీవులముంప నుప్పొంగుచు వెంటరాఁగా శ్రీరంగపట్టణము దాపునుజేరెను. శ్రీరంగపట్టణాధీశ్వరుఁడగు చిక్కరాయనికిని శివసముద్రాధీశుఁడగు గంగరాజునకు సహజవిరోధము. కావునఁ జిక్కరాయఁడు శ్రీకృష్ణదేవరాయల కెదురువచ్చి గౌరవించి తాఁ దోడ్పడ సిద్ధముగనున్నాఁడనని తెల్పెను. రాయల కపరిమితానంద ముదయించి యాతని గారవించి తదుక్తప్రకారంబున సేనల నడపింప దొరకు నాజ్ఞనిడి చిక్కరాయనిసేనలు తమవాహినులం గలిసి తిలతండులన్యాయము ననుసరింపక క్షీరనీరన్యాయము ననుకరింపఁ దద్బలాధీశులు త్రోవఁ జూపుచు ముందునడువఁ బర్వతసమాసన్నమార్గములఁ బోయి పోయి శివసముద్రదుర్గమును ముట్టడించెను.

గంగరా జావలికుఁ బ్రమత్తుఁడై యుండువాఁడు. చిక్కరాయని లెక్కచేయువాఁడుకాఁడు. ఆతఁడు తన్నెదిరింపఁజాలని భీరువనియు, బలాన్వితుఁడుకాఁడనియు నాతనియాశయము. చిక్కరాయఁడు గంగరాజనుకొనినంత పిఱికిపంద గాఁడు. కాని గంగరాజు నెదిరించిన నాతనికి విజయనగరరాజులు సామంతరాజుపైఁ గలయభిమానమునఁ దోడ్పడుదురుగాన విజయము

చేకూరదనియు వ్యర్థప్రయత్నముచే లాభమే లేకపోఁగాఁ బ్రజానాశము, ద్రవ్యహానియు, నపకీర్తిలాభము కలుగునని యూరకుండెను. ఇపుడు సమయము దొరకినదిగానఁ దనపగ దీర్చుకొనఁబోయెను. గంగరాజు కోటలో నపుడుండినసేనలతో దనశౌర్యసార మేపారఁ బోరాడెను. శ్రీకృష్ణదేవరాయశతఘ్నికానిస్వనములు దుర్గమదుర్గభేదనకృత్యమునఁ గృతకృత్యములగుటయేగాక, తన్నివాసి జనహృదయపుటభేదనచణములుగూడ నయ్యెను. కొన్నిదినము లిట్లు ఘోరాహవక్రీడసాగెను. పరిమితసేనలు కోటయందుండుట, యపరిమితసేనలు వెలుపల నుండుట, ఆహారపదార్థము లంతటనుండివచ్చుజాడ లేకుండుట గంగరాజుసేన లుత్సాహమునువిడువఁజొచ్చెను. మరణించినవా రూర్ధ్వలోకమునకేగి జంభారియాస్థానమున శ్రీకృష్ణరాయల యశఃకీర్తుల వర్ణింప వియచ్చరులాలకించున ట్లూహింప నవకాశము గలుగుచుండెను.

కొలఁదిదినములకు రాయలప్రతాపదావాగ్ని దుర్గధ్వంసనమునఁ గృతకృత్యతం గాంచెను. కోట రాయలవశమున నుండఁ దనయంగీకారమును దెలిపి ద్వారములఁ దెఱచెనో యనఁ బెక్కుద్వారము లగపడియెను; కాని వానికిఁ గవాటములుమాత్రము లేవు. గంగరాజు తనప్రయత్నము ఫలింపదని యెఱింగి పరవశతం గాంచుటకన్నఁ గావేరీజలవశతం గాంచుట మేలన్నవిశ్వాసమునఁ బుణ్యతరంగిణీవతంసవిఖ్యాతిం గాంచి తరంగమాలికాడోలికల జలపత్త్రిశాబకముల నూఁచుచు భృంగఝంకారముల జోలపాటలు పాడుచుఁ దన్నాశ్రయించువారిని లోఁగొని వెలికింబుచ్చని స్వభావముగల కావేరీమహా

నదిలో నొకనాఁ డితరులకుంజెప్పిన నామహాసత్కార్యమున నంశమును గైకొందురేమో యనుసంశయమున నొక్కండచని తల్లీ! నన్నుఁ గాపాడుమా. శత్రువులపాపహస్తములకుం జిక్కనీయకుమా యని ప్రార్థించుచుఁ దల్లిగర్భమునఁ గలిసిపోయెను. శివసముద్రము రాయలకుఁ జిక్కెను. అందలిప్రజ లాభూపలలామునిం గాంచిరి. అతఁడు వారిఁ దనప్రజలంబోలె నాదరించి శత్రుభయము లింకఁ గలుగవు. భీతిల్లకుఁడని వారి కభయదాన మొసంగెను.

కొలఁదిదినము లాశివసముద్రముననుండి తనవిజయయాత్రకుఁ దత్సమీపముననున్న రాజు లచ్చెరువంది తన్నుఁ గొనియాడ నందున్న కొన్నికోటలను వశపఱచుకొని వరుసగాఁ జిక్కరాయఁడు తనకుఁబానే సామంతరాజు కాసమ్మతింప నించుక కప్పమాతని కీఁదగునని కట్టడిచేసెను. కర్ణాటకరాజ్యం బెల్లఁ దనకు లోఁబడఁగా దుష్పరిపాలనమునకుఁ జిక్కి తపించు కర్ణాటకరాజ్యలక్ష్మి నుద్ధరించి జీర్ణకర్ణాటకాధీశ్వరుఁడన్న యపూర్వభవ్యవిఖ్యాతిని బడసెను. తాను వశపఱచుకొనిన కర్ణాటకదేశంబునకు శ్రీరంగపట్టణము రాజధానిగా నుండఁదగునని యానతియిచ్చి యందు శ్రీకృష్ణరాయవిజయధ్వజమను నొకధ్వజము నెత్తించి యానగరమునఁ జిక్కరాయనిఁ దనకుఁ బ్రతినిధిగా నియమించెను. దానికిఁ జేరువనుండు చిన్నచిన్నరాజ్యముల నోడించి కాంబగౌడ వీరప్పగౌడులవశమున నాచిన్నరాజ్యము లుండదగునని శాసించెను.

కర్ణాటకరాజ్యలక్ష్మీలాభమున రాయలకు మన స్తృప్తి కలుగలేదు. సుముహూర్తమునఁ గదలి మళయాళముపైకిఁ

పోయెను. కాని వారు శరణాగతులై సామంతరాజులముగ నుండుమని ప్రార్థించిరి. సంవత్సరమున కీదగుకప్పము నిర్ణయింపుఁడని వేఁడిరి. రాయలు వారివేఁడికోలు నంగీకరించి సంవత్సరమున కింతమాత్రము కరప్రదానముచేయుచు సుఖంబుండుఁడని యాజ్ఞాపించెను. ద్రావిడదేశములఁ బాండ్యాదుల జయింపఁబూని తానేగు టనవసరమని తోఁచినందున విజయప్పనాయకుఁడు వేంకటప్పనాయకుఁడు నను నిర్వురసేనాధీశులను బంపఁదలంచి లక్షసైన్యమును వారియధీనమున నుండ నియమించెను. వారును రాజాజ్ఞ మౌళిందాల్చి తదుక్తప్రకారము విజయమును సంపాదించిరి. విజయప్పనాయకుఁడు వేలూరు ముఖ్యస్థానముగఁ జేసికొని యాప్రాంతములనెల్ల జయించికప్పమును రాఁబట్టుచుండెను. మఱియు జింజీలోఁ గాపుర మేర్పఱచుకొని యాప్రాంతమున నున్నదేశముల జయించి కరగ్రహణము చేయుచుండెను. తంజావూరు, త్రిశిరఃపురము, (తిరుచినాపల్లి) మధురానగరము, శ్రీనగరము (తిరునగరు) లరాజులు విజయప్పనాయనిదాడికి నోడి వశులై రాయలసామంతులుగా నుండ నంగీకరించి కప్పముల నిచ్చెదమని యొప్పుకొనిరి. ఇట్లాపూర్వకర్ణాటకముద్రవిడాదిదేశములు రాయలకు లోఁబడి సంవత్సరమునకు మూఁడుకోట్లసువర్ణముద్రికల నీయ నంగీకరించెను.

శ్రీకృష్ణదేవరాయ లీదక్షిణదేశమంతయు మూఁడుభాగములుగా విభజించెను. కృష్ణప్పనాయకుఁడు నెల్లూరు మొదలు కొల్లడము నదివఱకుఁ గలదేశముపై నధికారముగలిగి జింజీలో నుండునట్లును, విజయరాఘవనాయకుఁడు కావేరీనది ప్రవహింపఁగా సారవంతముగ నుండుదేశముమీఁద నధికారముగలిగి

తంజావూరులో నుండునట్లును, వెంకప్పనాయకుఁడు తిరునల్వేలి ప్రాంతముల కధికారము గలిగియుండునట్లు నుత్తరువు పాలించెను. వారట్లే యాయాయిచోటుల కధికారులై యుండరి. ఇట్టు లాదండయాత్ర విజయపరంపరలతో నిండెను. ఆయాత్ర ముగించి విజయనగరమును జేరెను. ఆరాయలవిజయపరంపరలు కర్ణాకర్ణికగా నాకర్ణించి యవనవీరులు తమకుఁగల యుత్సాహప్రవాహమింకిపోవఁగా వెలవెల్లనగుచుండిరి. విజయనగరదుర్గమ దుర్గధ్వంసన మొనర్చుట యీరాయలకాలమునఁ గలలోని వార్తయే యనుకొని యూరకుండిరి. కాని వారిమదిలో నీర్ష్య విశేషించి వ్యాపించియుండినందున రహస్యప్రయత్నము లొనరించుచు నదను వేచియుండిరి. లోలోనఁ దమలోఁ దమకుఁగల కలహముల విసర్జించుకొనుచు వానిం దీర్చుకొనుచు నందఱేకీభవించియైన విజయనగరాక్రమణమునఁ బద్ధకంకణులగుటయే సముచితమని యూహించుచుండిరి. సేనాసన్నాహమునందు బద్ధాదరుఁడై యుండెను. కొలఁదిమాసము లిట్లే విజయనగరమునఁ బుచ్చెను.

ఐదవప్రకరణము.

ఉదయగిరిముట్టడి.

నెల్లూరుమండలమున నుదయగిరి యనుదుర్గము కలదు.
దానిచెంతనే తన్నామమున నలరుపురము కలదు. ఆపర్వతము
నుండియే పురమున కాపేరు కలిగినది. "ప్రథమసంధ్యారాగభా
లభాగంబునఁ జెలువారు సిందూరతిలక మనఁగ" అని శ్రీనాథ
మహాకవి వర్ణించినట్లు ప్రభాకరుఁ డుదయించునపుడు తనమృ
దుతరారుణకిరణములఁ బ్రసరింపఁజేయ వానికిం దావొసంగుచు
నవ్వానికిఁ దనయందలి గండోపలములు వింతరీతిఁ బ్రకాశించు
చుండ నాయద్రి యుదయాద్రియను తనపేరు సార్థకముచేసి
కొనుచుండును. ఆమండలమున నుండుకొండలలోనెల్ల నిదియే
యున్నతస్థితి నొందియుంట సరసిజబాంధవునికిరణములు తొలు
దొలుత నీభూధరాగ్రముననే వ్యాపించును. తద్గండశిలలవ్వా
నిని నలుదెసలకుఁ దెలుపు. రవియుదయించెనని ప్రప్రథమమున
నాగిరియే యెఱిఁగించుఁగాన నుదయగిరి యనునామము వచ్చె
నినయుఁ గొంద ఱందురు. జ్యోతిర్లతలిట విశేషించియుండుట
ద్రోణాద్రి యనవచ్చును. ఒరులు తమ్మెఱుంగకుండ నద్రిగుహా
గృహముల నిరంతరతపశ్చరణచణులగు మునిద్రుహిణులుం
డుటఁ బుణ్యమహీధరం బనఁదగు. మృగగణభయంకరధ్వాన
లను, బహువిధశకుంతసంతానకలనాదంబులను బ్రతిధ్వనితది

గ్వలయం బగుటఁ గోలాహలసానుమంతం బనఁజను. పీతారు
ణచ్ఛాయలవెలయు శిలలుగలిగి యత్యున్నతశిఖరవంతంబున
గుట హేమకూట మననొప్పు. శీతలవాతపోతంబులను స్రవ
జ్జలబిందుశిలల నుల్లసిల్లుటఁ దుహినమహీధరం బని చెప్ప నను
వగు. గ్రీష్మభానుభానుసహస్రములఁ బరితప్తులగు మానవుల
మానసముల కుల్లాసంబు చల్లఁదనము గల్పించుట మలయాహా
ర్యవర్యమను విఖ్యాతింగాంచు.

మఱియు నాశైలేంద్రము * నరనారాయణాయతనంబు
గావున బదరికాశ్రమం బనందగు. శ్రీసమృద్ధంబుగా నుండుట
క్షీరసాగరంబని యెన్నవచ్చు. శివపార్వతీనికేతంబు గనుకఁ
గైలాసమనువర్ణనమున కర్హంబగు. వేయేల? ఈపర్వతమున కీప
ర్వతమే సాటియని యాలంకారికు లనన్వయాలంకారమున
కుదాహరణముగాఁ జెప్పుదురు. ఇట్టిమహోన్నతక్షితిధరమీప్రాం
తమున లేదను టతిశయోక్తి కాదు. ఇది యుత్తరమునుండి
దక్షిణమునకు వ్యాపించినట్లగపడు దీనికిం బశ్చిమదిక్కున నొక
భూధరపంక్తి గలదు. దానినుండి తూర్పుగా నొకపాదము
సాగి యించుకదూరమున నంతరముగలిగి; యది మొదలు దక్షిణ
మునకు సాగి కొలఁది క్రోశములుపోయి యం దుత్తుంగశీర్షము
గలిగి పెరిగి యవ్వలఁ జూపట్టకయుండు. దానింజూడఁగా దక్షిణ
శిరస్సుగా శయనించి యనంతఫణిపతి తనఫణమును బైకెత్తి
యట్లే నిలిపినట్లు తోఁచును. కావున నాభూధర మెత్తుగా
నాభాగముననే కనంబడు. ఆభాగమునకే యుదయగిరి యను.

* నరము = రామకర్పూరవృక్షము, నారాయణము = జామచెట్టు,
శ్రీ=మారేడుచెట్టు, శివ=ఉసిరికచెట్టు, పార్వతీ=అందుగుచెట్టు.

పేరు గలదు. ప్రాగ్దక్షిణపశ్చిమ భాగములయందు దానికిననుబంధములగు పర్వతశకలములును లేవు. ఉత్తరమున మున్ను చెప్పినట్లు పొడవుగాఁ గొన్నిక్రోశములవఱకుఁ జిన్నపర్వతము (దీనిశాఖ) వ్యాపించియుండును.

ఉదయగిరివరమూర్ధము మిగుల నెత్తుగా వేయిబాహువుల (3079) అడుగులు యెత్తుగా నుండుటంబట్టి, దాని శిరోభాగము మిక్కిలి విశాలమై యుండుటంబట్టియు, నా భూధరము సర్వభాగములు తరువరనిబిడములు లతాపరివేష్టితములుగ నుంటఁబట్టియుఁ, బైభాగమున నివసించినచోఁ దూర్పుసంద్రము చల్లగాలి సుఖకరమగుచు వీచుటంబట్టియు, నింకను బెక్కుగుణములు గనుపట్టుటంబట్టి యా పైభాగమున నొకకోట నిర్మింపఁబడియె. దానినెక్క నొక్కమార్గమే కానవచ్చెడిని గాని తక్కినభాగములనుండి యెట్టిగట్టిప్రయత్నములుచేసినను సాధ్యము కాదు. తూర్పుభాగమున మార్గము కలదు. ఉత్తరభాగమునుండి యేల పైకెక్కరాఁగూడదను శంక కొందఱకుం గలుగవచ్చును. ఉత్తరమునుండివచ్చిన యాపర్వతభాగ ముదయగిరి యనుపేరఁబరఁగు నీభాగమునకు జాలనిమ్నముగానున్నది. ఒక్కమాఱుగాఁ దలయెత్తి నలుదెసలు పరికించినట్లుండును. ఉత్తరమునుండి యీకోట యుండుచోటికి రాఁబ్రయత్నించిన నాభాగమున గండ శిలలు లెక్కనుమించి యావరించియుండును. వానిక్రింద నెందఱేని మనుష్యులు తలఁదాచుకొనవచ్చును. ఎంతవర్షము కురిసినను వారిపై నొక్కచుక్కయైనను బడదు. ఆగండోపలము లుత్తరపుదిక్కుననున్న ధ్రువమండలమునో, హిమాలయమునో

చూడఁగోరినట్లు చక్కఁగా సాగియుండుటంబట్టి వానినెక్క ననువుగాదు. మూఁడుప్రక్కల నిట్లేయుండును. శత్రువు లుపాయమూని యెక్కరాఁ బ్రయత్నించినచో నందొక్కవిలుకాఁడు నిలువంబడి వారి నాపఁగలఁడు. అత్యున్నత భాగమునుండి బలహీనుఁడైనను గ్రిందనెన్నియో బాహువులదూరమున నున్నవాని నాపుట సులభమని యెవ్వారికేఁ దోఁచువిషయమే గాని యెవ్వరికో కొందఱకుం దోఁచునదికాదు కదా. ప్రయత్నపూర్వకముగా నమరించిరనుమాట పొడకట్టకపోదు. కాఁబట్టియే యుదయగిరి పరబలదోర్బలప్రశాంతిప్రదమని సదమల యశంబు నందినది. ఏ రాజు లామహీధరమును బరికించియచ్చోటున దుర్గము నిర్మించిన శత్రుదుర్గమముగ నుండునని యూహించిరో చెప్ప శక్యముకాదనియే యందఱు నిర్ణయించిరి. కొందఱుమాత్రము వ్రేళులఁద్రిప్పి యీరాజుకాలమున నుండవచ్చునని నిశ్చయింపఁజూచిరికాని యాసిద్ధాంతము బౌద్ధసిద్ధాంతమువలె క్షణికవాదమై రూపుచెడియె. "అసతి కుడ్యే చిత్రకల్పనా" యన్నన్యాయము స్వరజనవేద్యముకదా. దుర్గము శత్రుజనదుర్గమ మగుటయేగాక స్వబలవర్గసమగ్రవివర్ధనమని పూర్వరాజుల యాశయము. ఆకాలమునఁగల యాయుధవిశేషములకాపద్ధతి యనుకూలముగనే యుండుననక తప్పదు.

ఉదయగిరికోటను నిర్మించినపద్ధతి దురూహముగానుండును. అంతటిపై భాగమున సమృద్ధజలాశయములు గలవు. అప్పుడు కాదిప్పటికిని దజ్జలమే క్రిందికిఁ దేఁబడినఁగాని యుదయగిరినగరమునఁ గాపురముండుప్రజలకుఁ బశువులకు జలము లేదు. ఎంతటిభీషణగ్రీష్మకాలమునను దజ్జలము ప్రవహించి యారివా

రికి నీరులేదన్న కొఱంతను మాన్పుచుండును. ఇంకఁ బైభాగమున జల మలఁతి యనఁదగునా. అత్యున్నతపర్వతభాగమున సమృద్ధశీతలపావనజలాశయము లుండుటయుఁ, గ్రిందిభూభాగమున జలశూన్యవాపీకూపాదు లుండుటయుఁ బరికింపఁ బ్రకృతి యమేయశక్తి గలదనుట స్పష్టపడును. జలాశయములు, శీతలసాగరవాతపోతములు, నత్యున్నతపావనభూరుహములు, సాంద్రప్రతానసీగేహములు, తన్మహామహీధర మఖండసంపత్సౌఖ్యములఁ గలిగి యుండుటను దెలుపుచుండు. అట్టిమహోన్నతసుఖాకరంబగు నాపర్వతమును బరికించి ప్రాచీనక్షితిపాలకులెవ్వరోయిందుఁ గోటను గట్టించిన నరిజనదుర్గమమగునని యూహించి తదుచితభంగి నిర్మించిరి. యంత్రసహాయము లేని యా కాలమున నంతయెత్తు గలకొండ పైభాగమున సుధాలిప్తములగు ప్రాకారముల దృఢతమపాషాణవ్రాతముల నేరికే నభేద్యమగునట్లుగట్టించిరో తెలిసికొన నశక్యము. బుద్ధిబలము గల వారికి యంత్రబల మక్కఱ లేదనుట కిదియొక యుదాహరణము కావచ్చును. ఏకాలమున నాకోట నిర్మింపఁబడియెనో యే మహీజాని దాని నిర్మింపఁబూనెనో యెఱుంగుట కింక నవకాశము చాలకున్నది. పదునైదవశతాబ్దియం దీదుర్గము సుప్రసిద్ధమై యుండె ననుట కేశంకలు లేవు. అంతకుముందే పెక్కుమంది రాజు లాదుర్గమును బరాక్రమమున లోఁగొనఁ బ్రయత్నించి విఫలమనోరథులైనట్లు శ్రీకృష్ణదేవరాయల యుద్ధయాత్రయే తెలుపుచున్నది. దానిపొంకము గాంచినచో నిదిమనదిగానున్న నెట్టిమనస్సంతోష మనుభవించు నవకాశముగలుగునో కదా యని యువ్విళ్లూరనిరాజు లేదని చెప్పక తప్పదు. అది యెవరి

యధీనమున నుండునో యాతని యధికారమున సింహపుర (నెల్లూరుమండలము) మండల ముండునన్నమాట యందఱెఱుంగుదురు. ఆకాలమున నామండలాధికారము గలభూపాలుఁడే విక్రమాతిశయుఁ డనఁబడుననియు స్పష్టమే కాదా !

ఈపర్వతరాజముంగూర్చినకథలు కొన్ని గలవు. అందొక్కదాని నిట వ్రాయుచున్నాఁడను. పర్వతము నలుఁగడల దట్టమగు నడవికలదని చెప్పియుంటిని. ఆయడవియం దనన్యదృశములగు మూలికలుగలవు. ఆ మూలికలివ్వియని చాలమందికిఁ దెలియవు. కొన్ని యాటవికులకు దృగ్గోచరములైనను లభింపవు. మూలికాప్రభావ మతిచిత్రమనుట నిస్సందేహము. వాడు కనుబట్టి యిట్టి దీమూలికయనియూహించి దానింగాంచఁ బ్రయత్నించినచో నదియగపడకుండుటో; కనఁబడినను లభింపకయుండుటో జరగును. ఇది మూలికాప్రభావ మెఱుంగనివారు నమ్మరు. కానియది వారిదోషము కాదు. వారిచదువట్టిది. వారేమి చేయుదురు. వారిజోలి యటుండనిండు. ఓషధీశుఁడు చంద్రుఁడు చంద్రకిరణములు సోఁకినఁగాని యోషధులు వృద్ధినొందవు. చంపను బ్రదికింపనుగూడ వానికి శక్తిగలదు. ఈయుదయగిరియందు జ్యోతిర్లతలు గలవను ప్రసిద్ధిగలదు. చీకటిరాత్రులఁ గొన్ని పొదలనడుమ మండినట్లుండును. దూరమునుండి కనుఁగొను వారి కాజ్వాలలు విద్యుల్లతికలవలెఁ దోఁచును. సాహసించి యాచోటికిం బోవ నందుండి యవ్వాల నంతదూరమునఁ గనఁబడును. ఎందఱో ప్రయత్నించి సఫలమనోరథులు గాఁజాలకపోయిరి. నామిత్రుఁడొకఁ డీయూహగలిగి చాలవవత్సరములు తత్ప్రయత్నమున నితరకార్యముల మాని ఫలసిద్ధిఁ గాంచనేరక యున్నవాఁడు.

ఒక్కమహమ్మదీయుఁడు తత్పర్వతమునఁ గల యోషధులం దెచ్చి వైద్యుల కిచ్చువాఁడుండెను. వాని కదియే జీవనము. వా రిచ్చుద్రవ్యముతప్ప మఱొకజీవనాధారము వానికి లేదు. ఒక్కనాఁడు వాఁ డడవికింబోవుచుఁ గొండకుఁ బడమఱ తట్టున నీగుఱుతు గలచోటున నుందును; భోజనమునకుఁ దగిన వస్తువులదెమ్మని భార్యతోఁజెప్పి కుఠారప్రముఖసాధనములం గైకొనిపోయెను. ఆతరుణి వాడుకచొప్పన నన్నము దీసికొని యెండినచేఁపలమ్మఁగా వానింగొని యొకవిధముగాఁ బక్వముచేసి పలుచగానున్న యాపదార్థమును నొకకుండలోనునిచి యాగంప నెత్తినఁ బెట్టుకొని భర్త సంకేతించినచోటికిం బోయి చత్రాతిపైఁ గూరుచుండి యుండెను. పొటపొటచినుకులు పడసాఁగెను. మేఘగర్జనములు పొలసెను. ఇంద్రచాపము కనఁబడియెను. తళతళమని విద్యుత్ప్రతానములు కన్నులకు విభ్రమము పుట్టించుచుండెను. ఆయువతి యాటవికవధూమణియైనను వేళకుభర్తరామి, వర్షబాధ భరింపశక్యముగామి, గృహమునకుఁ దాఁబోయిన భర్తయన్నములేక యింటికిరాఁజాలమి నూహించి తా నటనుండులేమేలని యచ్చేరువనున్న యొకపొదమాటునఁ దలఁదాఁచుకొనియెను. ఆహారవస్తువులు గలకుండల నాపొదలో నొకచోట నుంచెను.

భగవంతు ననుగ్రహమున వర్షము క్రమక్రమముగ శాంతించెను. ఇంచుకతడవున కాయాటవికుఁడు పొలముపని ముగియుటయు నచ్చటి కరుదెంచెను. భార్య పొదలో నొక చోటఁ గుండలున్నవని తెలిపెను. ఆఁకలిబాధచేఁ ద్వరగా నతఁడరిగి పైకుండఁ జూడఁగాఁ దానిలోఁ జేఁపలు కదలుచున్నట్లు

గనఁబడఁగాఁ బరికింప నది నిశ్చయమే యయ్యెను. బ్రదికియున్న చేఁపల నేలతెచ్చితివని భర్త గద్దించియడుగ నాపెవడంకుచు వండి పులుసులోఁగలిపి తెచ్చితినని పలికెను. భార్య యనుకూలవతియని యాతఁడెఱుంగును. ఇరువురును బరీక్షించిరి. చేపలు తిరుగుచుండెను. కుండనిండ వర్షోదకముండెను. దానికి వాఁడచ్చెరువంది యాపొదను బరీక్షించిచూడఁగా నం దొక్కతీఁగెయైనను గనఁబడలేదు. అదిమొదలాతఁడు దాని నన్వేషించుపొంటె దన జీవితశేషమును గడపెను; కాని సిద్ధసంకల్పుఁడు గాఁడయ్యెను. ఇట్టివి యుదాహరణము లెన్నియో యుండుటంబట్టి జ్యోతిర్లతలు తత్పర్వతమునఁగలవని యందలివారు నమ్ముచున్నవారు. నమ్మనివా రుందురన్న నుండకపోరు. కాని లతావిశేషమాహాత్మ్యమును వా రెఱుంగరనుట నిక్కువము. లతాతతిం గూర్చిన నౌషధమగు. అదెట్టి యామయముల నిర్మూలించునో యంద ఱెఱుంగుదురు. ఔషధములయందుఁ బ్రాయికముగా నుపయోగించునవి సాధారణములు. జీవాతువులగునవి లభింపవు. ఆయువుముగియఁగా నవిఫలించునా యనికొందఱు ప్రశ్నింతురు. అట్టితఱి నవి లభింపవను నదియే సమాధానము. అపమృత్యువువాఁతంబడి మరలబ్రదుకు భాగ్యముగలవారికేయవిలభించును. అట్టివారుకలరా యన్నఁ బ్రాయికముగా లేరనవలయు. లేనేలేరని చెప్ప సాహసింపరాదు. మహాకవి కాళిదాసు,

"శ్లో. వనేచరాణాం వనితాసఖానాం
దరీగృహోత్సంగనిషక్తభాసః,
భవంతి యత్రౌషధయో రజన్యా
మతైలపూరాస్సురతప్రదీపాః."

అని వర్ణించెను. మహాత్ములకుఁ దత్ప్రభావ మెఱుంగ శక్యముగాని యందఱ కెఱుంగఁదరమా. అట్టిప్రభావ మాపర్వతమునకుం గలదు. కావుననే నేఁటిదనుక నాటవికులు వివిధౌషధులకై నెమకుచుందురు. అదృశ్యముగ నుండఁజేయఁగల తీఁగె లందుఁ గలవు. పాదుకాసిద్ధిని గల్గించులతావిశేషము లందుఁ గలవు. అవి దూరదేశమునకుం గొంపోవును. ఘుటికాసిద్ధి, అంజనసిద్ధి, పాదుకాసిద్ధిలోనగుసిద్ధులు, ప్రాచీనగ్రంథములందుఁ జూపట్టెడిని.

తే. అనుచుఁ గ్రమ్మఱు వేళ నీహారవారిఁ
బెరసి తత్పాదలేపంబు గరఁగిపోయెఁ
గరఁగిపోవుట యెఱుఁగఁ డద్ధరణిసురుఁడు
దైవయోగంబుకిల నసాధ్యంబుగలదె. 13

చ. అతఁ డట్లౌషధహీనుఁడై నిజపురీయాత్రామిళత్కౌతుకో
ద్ధతిఁ బోవన్ సపదిస్ఫుటార్తిఁ జరణద్వంద్వంబు రాకుండినన్
స్మృతిఁ జింతించుచు నవ్విధం బెఱిఁగి హా సన్నిట్లు దైవంబ తె
చ్చితె యీ ఘోరవనప్రదేశమునకున్ సిద్ధాపదేశంబునన్.
(౨ ఆ. ౧౪.)

అని స్వారోచిషమనుసంభవమునం దల్లసాని పెద్దన్నగారిచేఁ జెప్పఁబడినది. లేనివస్తువునకు నామకల్పన మసంగతము. మనకుఁ గనఁబడనివి, తెలియఁబడనివి ప్రపంచమున నెన్నియో గలవు. వాని నెల్ల దూషింపవచ్చునా. అది తెలివిని సూచించునా. తదభావమును దెల్పునా. నిర్ణయించుభారము సజ్జనులకే వదలెదను. ఎన్నియో కారణముల నవన్నియు నిపుడు నామమాత్రావశిష్టములై యున్నవి. దీర్ఘాయుర్దాయ మిపు డుండకుండుటకు లతావిశేషముల నౌషధములయం దుపయోగింపకుండుటయు,

వాని భక్తిమీఱఁ బూజింపకుండుటయుఁ గారణములని నా విశ్వాసము. మన మెఱుఁగని పదార్థములభక్షించుట యొకపొరపాటు. ఓషధులఁ బర్వకాలములఁ బూజించి తెచ్చి యిండ్లనుంచుకొనకుండు టింకొక్కపొరపాటు. ఈ రెండును జక్కఁగాఁ గొనసాగినచో మనఖండమున నమితాయుర్దాయము పూర్వమువలె మనుజుల కేలగలుగదు ? మనోదార్ఢ్య మేలకలుగదు ? చిరకాలవయస్సు మనుజుల కేల యొదవదు ? పురాణముల భక్తిమై బఠింపక తదర్థమును జక్కఁగ నాలోచింపక పెద్దలుచెప్పినను సావధానముగా నాలకింపక యుండుటచే నిట్టి పడరానిపాట్లు మన దేశమునకుఁ గలుగుచున్నవి.

ఇట్టి లతావిశేషము లనంతము లందుండును. కావున నాయుదయగిరి సర్వర్తుఫలభారవినమ్రతరునికరమని ప్రఖ్యాతిం గాంచినది. కాఁబట్టియే సకల సుఖాకరమనఁబడియె. కనుక నే యందు బ్రచ్ఛన్నరూపమున మహర్షులుందు రన్నప్రతీతి కలిగినది. అందువలననే యాక్ష్మాధరము పవిత్రతమమని యెన్నికంగాంచినది. అట్టి మహోన్నతోత్తమశిఖరిమూర్ధమున బుద్ధిబలము వినియోగించి భూజాని కోటను గట్టించెను. దివ్యసౌధము లందు నిర్మింపఁబడినవి. శత్రువు లెంతకాలముముట్టడించినను వస్తుసమృద్ధికిఁ గొఱంతరానిపద్ధతులచే నాకోట నిర్మింపఁబడినది. ఆకాలపు వస్తువులు బెల్లము లోనగునవి నేఁటికి మృత్సమానములై కనఁబడుచున్నవి. వాని నౌషధములకొఱకు వెజ్జులు కొనిపోవుచుందురు.

ఆయుదయగిరిదుర్గమున నరపతు లనుతెగకుఁ జేరిన రాజులు పాలించుచుండిరనియు, వా రుత్తమవంశ్యు లనఁబడు

వారనియు, వారింట నొకకన్యకామణియుండెననియు, ఆసవ్వడి యెట్లో వినఁబడినందున నశ్వపతియనఁబడు తెగకు సంబంధించిన శ్రీకృష్ణదేవరాయలు వివాహేచ్ఛంబూని యచటికరిగి వార్తను బంపఁగా హీనజాతివారికి మాకన్యక నీయమని వారుత్తరమంపిరనియు, నాక్రోధమున నతఁడందే నిలిచి కోటను ముట్టడించి వారి నోడించి యాకన్యకం గైవసముచేసికొనియెననియు, నామె రాయల నంగీకరింపక పోఁగాఁ దన ప్రయత్నము నెఱవేఱమికి ఖిన్నుఁడై యామెకుఁ గొంత ద్రవ్యమిచ్చి పంపెననియు, నామె పుట్టినింటివారికడకుం బోవ లజ్జించి కంభముదగ్గర నొక భూరి తటాకమును నిర్మించి యందే మరణించె ననియు నొక ప్రతీతి చిరకాలముగా నెల్లయెడలఁ బ్రాఁకుచున్నది.। దీనికిఁ దగిన యాధారములు కనఁబడకయున్నవి. అంతియగాక దీనికి విరుద్ధ వార్తలు కొన్ని లక్ష్యము లగుచున్నవి. వానికాధారములు కనఁబడుచున్నవి దీనింబట్టి పరిశీలింపఁగా నింతకుముందుఁ గనఁబఱచినవార్త కేవలకల్పితమని పొడకట్టక తప్పదు. కాని యందును గొంతసత్య మున్నదని గ్రహింపక వదల నయితి గాదు. గజపతులు, నశ్వపతులు. నను తెగలరాజులు గలరు. నరపతులను తెగవా రుండకుండు రాయని కల్పించియుందు రనుకొన్నను బాపము రాఁబోదు. నరపతులనువారుండి యాతెగయే నామావశిష్టమైపోయె ననుకొన్నను బాధలేదు. ఎన్నియోవంశములు నామమాత్రశిష్టములగుట యందతెఱుంగని విషయముకాదు కదా. ఇంకను బ్రాగుక్తవార్తయందుఁ గలసత్యమును ముందు వివరించెదను. మనకుఁ దెలియవచ్చిన యాధారములంబట్టి రాయలుదయగిరిని బాలించుటకు ముందెవ్వరు దానిని బాలించిరో

యించుక పరిశీలించుట యసంగతము కాదు. కాని యీ యీ కాలములయం దీ యీభూజాను లీదుర్గమున నిలిచి రాజ్యము నింతదనుకఁ బాలించిరి. వారి రాజ్య మింతదనుక సాగినది; వా రొనరించిన మహాకార్యము లివి; అని నిర్ణయించుటకుంగూడఁ దగినన్ని యాధారములు స్పష్టముగాఁ గనఁబడకున్నవి. "స్థితస్య గతిశ్చింతనీయా" యన్నవానుడినే యాశ్రయింపవలసి వచ్చినది. కావున నీవ్రాతయందును గొంతసత్యమా కాదా యన్నశంకకవకాశ మిచ్చువిషయము కలదనుట స్పష్టము. "తాఁబట్టిన కుందేటికి మూఁడేకాళ్లు"నునట్లు మొండిపట్టుదలచే వాదింపఁబూనుట బుద్ధిమంతుల లక్షణము కాదు కదా. ఎన్నియో శాసనముల నాధారముచేసికొని వ్రాసిన వ్రాఁతలయం దెంతయో యసత్యశంకకవకాశము గనఁబడుచుండ నింకఁ గింవదంతులలో నదియుండదనుట యెట్లు? కింవదంతులే ప్రమాణములుగాఁ గైకొనఁబడదగదని వాదించుటెట్లు? కావున నన్నింటిని సమరసము చేసి చూచినఁగాని యొకవిషయము సిద్ధాంతముచేయ వీలుండదనుట నిక్కువము. అందును గొంతకాలమునకు మార్పునొందు విషయముండును. కావున శాశ్వతసిద్ధాంతమగు విషయము చరిత్రమునఁ బ్రాయశః లేదనవచ్చును. కాని యట్లని తృప్తినొంది యుండఁ దగునా యన్న నా నన వీలుండదు. ఎట్లో మనస్సున కించుకసమాధానము చేసికొనవలయును గాన నున్న యాధారములనుబట్టి కింవదంతులను బ్రత్యక్షమార్గమున నించుక వెనుకకునెట్టుచు సిద్ధాంతముచేయక తప్పదనుట నిర్వివాదాంశము.

ఆఱవ ప్రకరణము.

ఉదయగిరి పాలకులు.

పదునొకండవ శతాబ్దియందు నాంధ్ర చాళుక్యుల రాజ్యము దక్షిణభాగము నాక్రమించి యుండెను. ఈవిషయమును బోధించు శిలాక్షరములు విశ్వాసపాత్రము లగుచో నిప్పటియుదయగిరి యాంధ్రచాళుక్యరాజ్యమున నంతర్భూతమైయున్నట్లూహింపవలయు. కాని యీయూహకు విరుద్ధముగ నుదయగిరి యంతికమున నున్న పాండురంగ గ్రామమున రెండుశాసనములు దృగ్గోచరము లగుచున్నవి. అవి చోళచాళుక్యరాజ్యముల కేకచక్రవర్తియై ప్రతాపనిధియని పేరుగాంచిన కులోత్తుంగ చోళదేవునిచే ద్రవిడభాషలో నిర్మింపఁబడినవి. వానింబరిశీలింపఁగాఁ బండ్రెండవ శతాబ్దియం దీయుదయగిరి ప్రాంతమంతయు రాజేంద్రచోళుని పరిపాలనమునకు లోనైయుండెనని తేటపడును.

పండ్రెండవ శతాబ్దియందు నెల్లూరుమండలము చోళచాళుక్య చక్రవర్తుల యధీనమునఁ బేరునకుమాత్రమే యుండెను. కాని వారిసామంతులగు వెలనాటి చోళులును, తెలుఁగు పల్లవులును, మఱియుఁ గొందఱును దమతమ భూభాగమును స్వతంత్రులై పాలించిరనుటలో నసత్యము లేదనఁ దగు. తెలుఁగు పల్లవులకు మహామండలేశ్వరబిరుదము కలదు. వారిలో నొకఁ

డగు నందివర్మ మహామండలేశ్వరుఁడు పండ్రెండవ శతాబ్దియం దాదిభాగమునఁ గడపమండలాంతర్భూతమగు ప్రొద్దుటూరు ముఖ్యస్థానముగా నుండఁగా నుదయగిరి మొదలగు భూభాగములఁ దనయధికారమును వెలయించి పాలించెనని స్పష్టమయ్యెడు. ఆశతాబ్ది మధ్యభాగమునఁ దెలుఁగుచోళుఁడును, జోళచక్రవర్తియు నగువీరరాజేంద్రుని సామంతుఁడగు తిరుకాళదేవుఁ డుదయగిరిప్రాంతభూమిని గైవసముచేసికొని పాలించుచుండువాఁడు. ఆనాఁటినుండియు నెల్లూరుమండలోత్తర భాగము కాకతీయరాజ్యములలోఁ జేరియుండెను.

పదుమూఁడవ శతాబ్దినడుమ కాకతీయగణపతి దేవుఁడు కాంచీపురముదనుకఁ దనరాజ్యమును విస్తృతినొందించెను. అంతకుమున్ను క్షీణదశయందున్న పాండ్యులు దక్షిణదేశమున మరల విజయమును గాంచి ప్రబలులై కాకతీయగణపతిదేవుని సాగనంపి నెల్లూరుమండలమును లోఁబఱచుకొనిరి. ఆకాలమునఁ బాండ్యవంశమున జటావర్మ సుందరపాండ్యుఁడు విజయాభిషేక మహోత్సవమును గాంచెను. ఓడిపోయిన కాకతీయగణపతి దేవుఁడు రుద్రమప్రతాప రుద్రులతోఁగలిసి నెల్లూరు మండలమున నుత్తరభాగమును మాత్రము వదలక యుండెనని యూహించుటన్యాయము. త్రిపురాంతకశాసనమునందుఁ బేర్కొనఁబడిన విజయగండగోపాలుఁడు కాకతీయగణపతిదేవుని సామంతుఁడయ్యు నాత్మకూరుప్రాంతమును బాలించుచుండెననియు రుద్రమదేవి కాలమున గణపతిదేవునకు సామంతుఁడగు మఱియొక రాజు నాగదేవుఁడు విక్రమసింహపురమండల సౌమ్యభాగమును బాలించినట్లు కొన్నిశాసనములు విశదీకరించుచున్నవి.

ఇవన్నియుఁ బైయూహకుఁ దార్కాణములని యెన్నవలయును.
ఇవితార్కాణములై యీయూహలే నిశ్చితములగుచో వారి
రాజ్యమునకు సమీపమందున్న యుదయగిరిభాగముకూడ
వీరందఱు పాలింపఁగా వీరియేలుబడికి లోఁబడియే యుండ
వచ్చును. ఇంతియకాక రుద్రమదేవియొద్ద సేనాధిపతియైయున్న
ముప్పిడేంద్రుఁడను వీరుఁడు పైరాజ్యభాగములలోని శాసన
ములఁ గొన్నింటియందుఁ జేర్కొనఁబడి యుండుటంబట్టి యా
లోచించినను బైయూహకుఁ జేయూఁత కలుగుచున్న దనక
తప్పదు. మఱియు నీసేనాధిపతి రుద్రమదేవికాలమునఁ గాక,
ప్రతాపరుద్రునికాలమునఁ గాంచీనగరముంగూడ ముట్టడించి
తనవశము చేసికొని, యంతదనుకనున్న రాజ్యమునంతయు
నాక్రమించెనని స్పష్టమయ్యెడిని. ప్రతాపరుద్రుని రాజ్యము
త్రిశిరఃపురము (తిరుచనాపల్లి) వఱకు వ్యాపించియుండినందున
విక్రమసింహపుర మండలమంతయుఁ గాకతీయుల యేలుబడికి
లోనైనదని యే యని చెప్పవలయునుగదా.

ఆకాకతీయభూపాలకులరాజ్యము మహమ్మదీయ మహా
వాహినీసమావేశమున నడంగ వారిపాలనము గూడఁ జిరకా
లము సుస్థితింగాంచకపోఁగా రెడ్డిప్రభువులు తూర్పుభాగ
మునను్న తెనుఁగుదేశమునందు స్వతంత్ర రాజ్యముల నేర్ప
ఱచుకొని పాలించుచుండిరి. ఈసమయమునందే యనఁగా క్రీ.
శ. ౧౩౨౦ సం॥ల హోయిసాల మహారాజ్యముకూడ విచ్ఛిన్న
మయ్యెను. అట్టి మహాపత్సమయమున విజయనగరసామ్రా
జ్యము తలయెత్త నారంభించెను. ఇట్టి యనేక కారణములంబట్టి
పదునాల్గవ శతాబ్దియందు నుదయగిరి విజయనగరపరిపాలకుల

క్రిందికి వచ్చెనని యూహించుట నీయూహ సూతఁగాఁగొని
సిద్ధాంతము చేయుటయుఁ బొరపాటుగాదు.

ఉదయగిరిని బాలించినపూర్వప్రభువులు.

మనకు లభించిన హేతువులంబట్టి యుదయగిరిని సంగమ
వంశమున నుద్భవించిన కంపన్న పాలించెను. ఈకంపన సోదరులు
నల్వురు. వీరికిఁ బంచపాండవులని ప్రఖ్యాతి గల్గెను. వీరెల్ల
నన్యోన్యప్రీతిగలిగి మహాపరాక్రమశాలులై యనన్యసామాన్య
వైభవమునఁ దులదూఁగు చుండెడివారు. వీరిలో హరిహరరా
యలు విజయనగరసామ్రాజ్యమున మొదటిప్రభు వనఁబరఁగెను.
ఆకాలమునఁ గృష్ణా కావేరీ మహానదులనడుమ నున్నభూ
భాగమంతయు హరిహరరాయల స్వాధీనమున నుండెను.
ఆతనిసోదరు లాప్రదేశమున నొక్కొక్క భాగమున నొక్కఁ
డొక్కఁడుగా స్థానికప్రభువు లనఁబడుచు నధికారమును
వహించి పాలించుచుండిరి. ఆసోదరులలో నొక్కఁడగు కంపన
భూపతి యుదయగిరి పాలింప నియమితుఁడయ్యెను. ఈతని
కాలమున నెల్లూరుమండలమునఁ జాలభాగ ముదయగిరి రాజ్య
మునఁ జేర్పఁబడియెను. ఈస్థానికప్రభువులకు మహామండలే
శ్వరు లనుపేరు గలదు. విజయనగరసామ్రాజ్యమున నుదయ
గిరిమహామండలము ముఖ్యస్థానము నాక్రమించి యుండెను
గాన రాజబంధువులు అందును రాజకుమారులు నుదయగిరి
యందు మహామండలేశ్వరులుగ నియమింపఁబడు చుండువారు.

కంపన్న తనకాలమున నుదయగిరిప్రాంతప్రదేశముల
నత్యున్నత సుఖస్థితికిం దెచ్చుటయేగాక సమృద్ధసస్యములుగ

నొనరించెను. చాలకాల మీతనిరాజ్యపాలనము జనులకు సుఖస్థితిం గూర్పఁజాలెను. కంపన్న కాలధర్మము నొందఁగ నాతని యాత్మజులగు సంగమవీర శ్రీసావన్న లనునిద్దఱు, నుదయవీరుఁడు ననునీమువ్వురు నుదయగిరి మహామండలేశ్వరులుగ నుండి పాలించిరి వీరికాలమున నీయుదయగిరిమండలము దక్షిణమునఁ జాలభాగమువఱకు వ్యాపించియుండెను. వీరు సామంతరాజు లనఁబడక ప్రతినిధులనిపిల్వఁబడుచు రాజమర్యాదలం గాంచుచుఁ బ్రజాహితమునే ప్రధానముగాఁ గోరుచు రాజ్యమునేలుచు విజయనగరసామ్రాజ్యమునకు నిష్కళంకఖ్యాతిని దెచ్చుచుండిరి. ఆకాలముననే యీ యుదయగిరి మహామండల మనుప్రసిద్ధిం గాంచి మించెను.

హరిహరరాయలవెనుక విజయనగరరాజ్యమును బూజ్యభంగినేలుచుండిన మొదటి బుక్కరాయలకాలమున రాజకుమారుఁడగు భాస్కరరాయ లుదయగిరికి రాజప్రతినిధిగా నియమింపఁబడియెను. ఈభాస్కరరాయలే కడపమండలమున నీశాన్యభాగముననుండు పోరుమామిళ్లకుఁదూర్పుగా నొకభూరితర తటాకమునుగట్టించి ప్రభువుల పూర్వులపేర దానశాసనమును లిఖించి కట్టకుదగ్గరనుండు కొండపై నొకదేవాలయమును గట్టించి యందుఁ బొందుపఱచెను. కడపమండలమంతయు నాకాలమున నుదయగిరిరాజ్యమునకు లోఁబడియుండె ననుకొనవచ్చును. ఈవిషయమును పైశాసనమే తెలుపుచున్నది. భాస్కరరాయల రాజభక్తి పరోపకారపరత్వము ననునీరెండింటిని బైతటాకనిర్మాణమే వేనోళ్లఁ గొనియాడుచున్నది.

బుక్కరాయఁడు కాలధర్మము నొంద నతని పెద్దకుమారుఁడగు రెండవ హరిహరరాయలు సింహాసము నధిష్ఠించెను. ఆయనకాలమునఁ దత్పుత్త్రుఁడగు దేవరాయ లుదయగిరికి రాజప్రతినిధిగాఁ బంపఁబడియెను. ఇతనికిముం దీ దేవరాయలయన్న విరూపాక్షుఁ డుదయగిరి నేలుచుండెనని జనప్రవాదముగలదు. దానిమన్నింప నవకాశముగలదు. ఉదయగిరి విరూపన్నయనుపేరతనికున్నయట్లు కనఁబడియెడిని. దేవరాయలు కొంతకాలమునకుసింహాసనమెక్కఁగా వానియగ్రతనయుఁడగు వీరవిజయరాయలు స్వల్పకాల ముదయగిరిదుర్గమున కధిపతిగ నొనరింపఁబడి యచ్చటనుండి ములవాయసీమకు మార్పఁబడినట్లు తెలియవచ్చెడిని. ప్రస్తుతమీములవాయసీమ మహిసూరు రాజ్యమునఁ గొంతభాగముగనున్నది. సామ్రాజ్యమునందు నొకమండలమునుండి వేఱొకమండలమునకు మండలాధీశునిబంపుట సామాన్యాచారమేగాని క్రొత్తదిగాదుకదా. విజయరాయలు ములువాయమండలాధిపతిగా నుండినకాలమున వానియనుజుఁడగు రామచంద్రవుడయరు ఉదయగిరి మండలాధిపతిగా నియమింపఁబడియె ననియు, నీరామచంద్రుఁడే క్రీ. శ. ౧౪౧౬-౧౭. సం॥ లలో మహమ్మదీయులతోఁ బోరాడి వారిని దఱుమఁగొట్టి రాజ్యమును నెమ్మదిగానుండఁజేసెనని శాసనమొక్కండు తెలుపుచున్నది.

వీరవిజయునికుమారుఁడు రెండవదేవరాయలు కొంతకాలమునకుఁ జక్రవర్తియాయెను. అత్తఱిఁగందుకూరు, కొండవీడు రెడ్లపాలనముక్రింద నుండినవి. విజయనగర సామ్రాజ్యమునకుఁ లోఁబడియుండ వా రంగీకరింపరైరి. సామాద్యుపా

యము లప్పట్టునఁ బనిచేయఁజాలవయ్యెను. సంగరక్రీడ జరప వలసివచ్చెను. అప్పుడు విజయనగరరాజేంద్రసేనలు కందుకూరును గొండవీటిని ముట్టడించి వాని నాక్రమించి యాభాగము లుదయగిరిరాజ్యమునకు లోఁబడియుండునట్లు కట్టడిచేసెను. ఆకాలముననే నెల్లూరుమండలమునందలి పాకనాటిసీమ, కడప కందనూరుమండలముల సంబంధముగల గండికోటసీమయు, గుంటూరుమండలాంతర్భూతమగు కొండవీటిసీమయు నుదయగిరిరాజ్యమునకుఁ జేర్పఁబడియుండఁ దదధిపతిగాఁ జక్రవర్తి కుమారుఁడు విరూపాక్షుఁడు నియమింపఁబడియెననుట సజ్జనాదృతింగాంచువిషయము.

విరూపాక్షమహామండలేశ్వరునికడఁ గార్యకర్తగానున్న విదయంచమిజంగమయ్య పాకనాటిసీమలోని సంగము గ్రామమున వేంచేసియున్న జగదీశ్వరస్వామికిఁ గొన్నిగ్రామములఁ గైంకర్యమునకై యొసంగినట్లు తెలియవచ్చెడిని. విరూపాక్షమహామండలేశ్వరునిపిదప సుమారేఁబదియుఱువది వత్సరములు విజయనగరరాజ్యపాలకులచరిత్రము కనుఁగొన శక్యముగా లేదు. సువ్యవస్థగలదిగా లేదనుటకంటెఁ జెప్పఁదగినవిషయము లేదు.

రాజ్యము సువ్యవస్థనొందనితఱి రిపులుపైకొనుట లోకస్వభావము. విజయనగరసామ్రాజ్యమును నించుకకాలము కొన్ని యంతఃకలహములవలనఁ జిక్కుపడియెను. ఈవార్త యెట్లో నలుదెసలఁ బ్రాఁకెను.

"అసంతుష్టా ద్విజా నష్టాస్సంతుష్టా ఇవ పార్థివాః."

అన్నసూక్తి క్రొత్తది గాదుకదా. సేనాసన్నాహములు తక్కువయగుట, యుద్యోగస్థులందఱైకమత్యము లేకయుండుట మొదలగునవియే యంతఃకలహము లనఁబడును. ఇవి పొసఁగినపుడు పైవారికిఁ దెలియకుండ వీనినణఁప వలనుపడదు. కావున విజయనగరసామ్రాజ్యము సువ్యవస్థగలది గాదన్నవార్త కరివీరులు పరమానందభరితులైరి.

కపిలేశ్వరగజపతి గంగవంశసంభూతుఁడు. ఇపుడు 'ఒరిస్సా' యని పిలువఁబడుదేశ ముత్కలమని సంస్కృతభాషయందును, ఓఢ్రమని యెట్లోయాంధ్రమునందును వాడఁబడును. పండ్రెండవశతాబ్దిని 'జోరగంగు' అనుభూపతి దానియందుఁ దనయధికారమును స్థాపించెను. ఆతనివంశము గంగవంశ మనుప్రఖ్యాతి నందెను. ఈవంశమునందుజన్మించిన లాంగూలగజపతి పదుమూఁడవశతాబ్దిని బ్రసిద్ధికెక్కి వీరాగ్రేసరుఁడై తనరాజ్యమును బెంపునొందించెను. కపిలేశర్వరగజపతి పదునైదవశతాబ్దిమధ్యభాగమున నుత్కలరాజ్యమును విస్తరింపఁజేయఁగోరెను. తనపూర్వులకంటెఁ దా నెక్కుడైయుండఁగోరుట మంచిదనవలయునేగాని వేఱొకమాటయన వలనుపడదు. కావునఁ గపిలేశ్వరగజపతి బహుళసేనాసమేతుఁడై గౌతమీకృష్ణవేణీనదుల చెంతనున్నరాజుల నోడించెను. అంతతోనతనికి రణకేళియందు సంతృప్తి గలుగలేదు.

ఆతనిరాజధానికి నుదయగిరి గడుంగడు దూరమున నున్నది. ఐనను విజయపరంపరలు గలుగుచున్నందున నాయుత్సాహమే తన్నుఁ బ్రోత్సహింపఁ జతురంగబలములంగూడి యుదయగిరిపై దాడివెడలి యందున్న యవక్రపరాక్రమసమ

గ్రుని రాజు నోడించి దానిం దన వశము చేసికొనెను. కొలఁది కాలమందుండి యచ్చటిపరిస్థితులం గనుంగొని తనధాటి కాగఁజాలువారు లేరన్నగరువమున నింకను దక్షిణభాగమునకు దాడివెడలి ద్రవిడదేశమునకు నుత్తరమున నలంకారముగా నున్న కాంచీ నగరముదనుక విజయ ధ్వజమును నడుపఁ గల్గెను. ఉదయగిరి యీరీతిఁగాఁ దనతొంటిగౌరవమును బోఁగొట్టుకొని యుత్కల రాజ్యమునఁ గలిసిపోయెను. ఈవిజయవృత్తాంతము నాధారము చేసికొని యీ యుదయగిరిదుర్గము సుప్రసిద్ధుఁడగు లాంగూలగజపతిచే నిర్మింపఁబడినదనియు, నడుమ విజయనగర రాజు లాక్రమించిరనియు, మరల గంగవంశమునజనించిన కపిలేశ్వరగజపతి దండెత్తివచ్చి తమకోటను సాధించెననియుఁ గొందఱు పల్కుదురు. ఇంతియగాక యీలాంగూలగజపతివిఖ్యాతి కొండవీఁడు మొదలగు కోటలుగల భాగములందు విఖ్యాతమైనది. ఇట్టివి కట్టుకథ లన వచ్చును. అసత్యమేయన వలనుపడదుగాని యుదయగిరిదుర్గ నిర్మాత లుత్కలదేశపాలకులుమాత్రము కారని చెప్పుటకు జంకనక్కఱలేదు. శత్రువు లిట్లు తమ రాజ్యభాగముల నాక్రమింపఁగా నాకాలమున విజయనగరసామ్రాజ్య మల్పరూపత నొందుటేగాక రాజధానికింగూడ ముప్పు తప్పదన్నంతదుస్థితికి వచ్చెను. అట్టియవస్థయందు సాళువవంశజుఁడై సామ్రాజ్య ప్రధానమంత్రిగ నుండిన నరసింహుఁడు క్రీ. శ. ౧౪౮౪ సం॥ మున గజపతిసేనలఁ బాఱఁదోలి ప్రజలమన్ననలకుం బాత్రుఁడయ్యెను. ఈవిషయము నింకను బెంచివ్రాయక ప్రకృతకథకు మరలఁ దలంచెద.

కొంతకాలమీరీతి నుదయగిరిదుర్గము పుట్టచెండువలె రాజులచేతులలో మాఱుచుండెను. విజయనగరమునఁ దుళువ వంశము స్థాపింపఁబడిన తరువాతికథ ప్రస్తుతము పేర్కొనందగినది. వీరనరసింహుఁడు బలపరాక్రమములఁ బొగడ్తఁగాంచినవాఁడు కాఁడు. కావుననాతనిప్రభుత్వకాలమున సామ్రాజ్యమునం దంతఃకలహములు మెండయ్యెను. ప్రజలసంతృప్తి యెందో పోయి దాఁగెను. కావున రాజ్యము సువ్యవస్థనుండి తప్పెను. ఆకాలముననే యుత్కలదేశాధీశుఁడును, గపిలేశ్వర గజపతి కుమారుఁడునగు పురుషోత్తమగజపతి తండ్రిభంగిఁ దిరిగి తూర్పుభాగముననున్న తెలుఁగురాజ్యశకలముల నాక్రమించుకొనుటేగాక తనసోదరుఁడగు తిరుమలకాంతరాయఁడను మహాపాత్రుని నుదయగిరిరాజ్యమునకుఁ బాలకునిగా దనపక్షము నుద్దీపింపఁజేయ నియోగించెను. ఈ తిరుమలకాంతరాయనికి రాంతరాయఁడనియు, రాఘవరాయఁడనియు మాఱు పేరులు గలవని శాసనములనుండి తెలియవచ్చెడిని. పురుషోత్తమునితరువాత నతనికుమారుఁడగు ప్రతాపరుద్రగజపతి కూడఁ దండ్రివలెనే తెలుఁగుదేశమందలి చిన్నిమండలముల నాక్రమించి యుదయగిరిదుర్గము మున్ను పేర్కొన్న రాంతరాయనియధీనముననే కొంతకాల మునిచెను.

ఇట్లుదయగిరి రాంతరాయని యేలుబడినుండునపుడు విజయనగరస్థితి యెట్లున్నదో యని యించుక విచారింతము. తుళువ వీరనరసింహచక్రవర్తి పంచత్వమందెను. ఆయనతమ్ముఁడు శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్యమునకు వచ్చెను. అతఁడు తన రాజ్యము హీనదశయందున్నదని యెఱింగెను. దాని నత్యున్నత

స్థితికిఁ దేఁదలంచెను. దక్షిణ దిగ్విజయయాత్రలఁ జేసి విజయ
మును సంపాదించెను. అప్పటిసాధనములం బట్టి తన్ను మాఱొక్క
న్న రాజు గెలువఁజాలఁడన్న విశ్వాస మారాయలకుం గలిగెను.
దక్షిణ దేశదండయాత్రలముగించి కొలఁదికాల మారాజచూ
డామణి విజయనగరమునందే హాయిగాఁ గాలముఁ గడపెను.
విజయనగరరాజ్యమున కాగర్భశత్రువులగు మహమ్మదీయ
సుల్తాను గళింగరాజు లోనగువారి నుద్దండభండనంబునఁ బ్రచం
డవిక్రమంబు చూపి గడగడ వడఁకింపఁ బూనెను. పదునైదవ
శతాబ్దియందుఁ బదుమూఁడు పదునాల్గవసంవత్సరములయందుఁ
దనపూన్కి కనువగుసన్నాహముల నొనర్ప మంత్రివర్యున కాజ్ఞా
పించెను మంత్రిశేఖరుఁ డగుతిమ్మరుసు (అప్పాజీ) రాజాజ్ఞ నను
సరించి సేనలం జేకూర్చెను. ఒకానొకతరుణమున నేకాంతంబ
రాయలతో నిట్లు హెచ్చరించెను. మహారాజా! యుద్ధమున కిది
యదనుగాదు. వర్షములుగలకాలమున జైత్రయాత్ర మంచిది
గాదని పెద్దలందురు. సేనలరాకపోకలకు సులువగుకాల మిది
గాదు. నదులు జలపూర్ణములై యుండును. వానిని దాఁటి
పోవలయునన్న మిగుల గష్టము. అత్తఱి శత్రువులు పొంచి
యుండి మనలఁ బొడువ నుంకింతురు. వారి కది మంచితరు
ణము. వారి నాపుటయు మనలఁ గాపాడుకొనుటయు నను
నీరెండుపనులు మనకు మహత్తరకష్టదాయకములై యుండు.
కావున నామాటలఁ బాటించి యిప్పటి కీదండయాత్ర నాపి
యుక్తకాలము రాఁగాఁ బౌరుషమున నరి వీరులం బొడిచి గెలు
తము. మనయుద్దేశమునకుఁ దగినతావుల నదు లెక్కువగ
నున్నవి. అనియొత్తి చెప్పిన నామాటలనారసికుఁ డంగీకరించెను.

మఱియు నొకపరి తిమ్మరుసు, కొండయరుసు, అయ్యప్పరుసు,
బాబరుసు మొదలగువారిట్లే విన్నవించిరి. తనమేలుగోరి దేశ
కాలగతులనారసి యనుకూలవార్తల నెఱింగించిరని శ్రీరా
యలు వారిని గొనియాడెను. మఱియుఁ బైవారందఱు గుమి
గూడి మనరాజ్యమునఁ గొంతభాగ మాక్రమించియున్న కళింగ
రాజగు గజపతియధికారము నిప్పు డడఁపవలయుననియు, నీవృ
ష్టికాలమున మెట్టభాగముగానున్న యుదయగిరిని, కందుకూరును
వినుకొండను, గొండవీటిని ముందు వశపఱచుకొనుట యుచిత
మనియు, విన్నవింప నారాజశశాంకుఁ డూహించి యీయదనున
నీకార్య మొనరించుటయే యుత్తమమని నిశ్చయించి మీయభి
ప్రాయమున నేకీభవించితిమని యంగీకారమును దెలిపి వారిని
బహూకరించెను.

ఏడవప్రకరణము.

ప్రాగ్దండయాత్ర.

శ్రీకృష్ణదేవరాయలవిజయధ్వజము తూర్పుభాగమునకు దండయాత్ర సలువవలయునని యుద్దేశించెనని యందఱెఱింగిరి. వర్షాకాలమైనను నదులబాధలు విశేషించి లేనిమార్గమున నుదయగిరి ముట్టడింపవచ్చునను నూహ పొసంగియే యుండెను. సేన లుత్సాహపూరితములై యుండెను. సకలపరికరములు సిద్ధముచేయఁబడియె. మహాయోధులు తమతమబలపరాక్రములఁజూప సాహసించిరి. ఆయాత్రయందు విజయము నిశ్శంకముగాఁ గలుగునన్న వార్తలం దెలుపు శుభనిమిత్తము లనేకములు గోచరములయ్యెను. ఉపశ్రుతి విస్పష్టముగా విజయవార్త నెఱింగించెను. సేనాధిపతులయుత్సాహమునకుఁ బారము లేకుండెను. సుముహూర్తము నిర్ణయింపఁబడియెను. విజయయాత్రాకాలము చాటింపఁబడియెను. పురజనులెల్ల నీయాత్ర విజయలాభమును బొందుఁగాక యని కోరుచుండిరి.

ప్రధానమంత్రి తిమ్మరుసు తా నీయాత్రలో రాయలతోఁ బాల్గొన నిశ్చయించి నగరరక్షణమునకుఁ దగువారి నియోగించి యెట్టి యిక్కట్టులే నెదుర్కొనకయుండఁ గట్టుబాటుల నొనరించి ప్రయాణము చేసెను. శ్రీకృష్ణదేవరాయలు మహానందాంబుధి మునుంగుచు విజయాశీఃపురస్సరముగాఁ బ్రయాణము సాగించెను. వారింగూడి మహాకవులు పెద్దన్న ముక్కుతిమ్మన్న లోనగు

వారును విద్వాంసులును నటగాయకపరిహాసకులును ప్రయాణము చేసిరి. ఆయాత్ర వివాహయాత్రగాఁ జూచువారికిం దోఁచెను. నిశ్చయముగా నది వివాహయాత్రయు నగునవచ్చును.

ఉత్కలరాజునకు నొకకుమారిక కలదు. ఆయమపేరు తిక్కమాంబయని. ఈపేరు ప్రఖ్యాతి నొందదయ్యెను. ఆయమ సుందరాంగి. ఆమెసౌందర్యము నున్నదున్నట్లు వర్ణించుట యశక్యమన నిఁక నతిశయముగ వర్ణించు టెట్లు? స్వభావోక్తి యను నలంకారము తత్సౌందర్యవర్ణనమున నతిశయోక్తిని దృణీకరించి యద్భుతాతిశయోక్తి యనుదానిని మించియుండును. కావునఁ బండితమ్మన్యులుగానివారు జగన్మోహిని యని పేరిడిరి. ఆబిరుదనామమే యంతట నల్లుకొనియె. ఆమెసద్గుణములు, సుశీలతయు, సౌందర్యము, విద్యాప్రవీణత, సంగీతాదికళానైపుణ్యము వర్ణనాతీతమనువార్త నలుదెసల వ్యాపించెను. క్రమముగా విజయనగరమున సౌధవీథులఁ జెలరేఁగెను. ప్రాసాదాంతరముల నలంకరించెను. సౌధాళుల కెగఁబ్రాఁకెను. సౌధావతంసమున మాఱుమ్రోసెను. అందు నాబాలగోపాల మన్నట్లు వెలసెను. రాజచంద్రునిహృదయదర్పణమునఁ బ్రతిఫలించెను శ్రవణరంధ్రముల నిండెను నయనోత్సవము చేయక తప్పదనునూహ యారాజలలామునిబుద్ధి సిద్ధాంతమొనర్చెను. వెంటనే యాతనియంతరాత్మ మనస్సును బురికొలిపెను. ఎట్టులైన నచిరకాలమున నాభువనమోహినీరూపమును గన్నులారఁ దిలకించి మనసారఁ బెండ్లియాడవలయునని రాజశశాంకుఁడు నిశ్చయించుకొనెను.

రణభేరి విజయనగరవీథుల నరిమనస్సులు పగులమ్రోసెను.

ఆశబ్దము భూనభోవివరములనిండి దిగ్దంతిదదంతములఁ గదలించి వానిశ్రవణపుటముల నల్లల్ల నాడించి యెందో వ్యాపింపఁ బోయెను. ఆనినదము చెవిఁబడఁగానది యే శుభముహూర్తమని చతురంగబలయుతులై దండనాయకులు బయలువెడలిరి. వారి వెంట మంత్రిశేఖరులు, వారివెంబడి రాజానుచరులు, వారి పిఱుంద మహాకవిపండితులు, వారివెనుక నర్మసచివులు, వారి ననుసరించి పరిచారకులును వెడలిరి. పెండ్లికింబోవునట్లు యాత్ర యొప్పారెను. అంత రాజచంద్రుఁడు మదకుంభినెక్కి వీరభటులు ముందువెనుకలఁ బ్రక్కల బలసి కొలువ "సకల రాజాధిరాజవీరప్రతాపరాజపరమేశ" ప్రముఖబిరుదముల వందిమాగధవైతాళికులు కైవారము చేయుచు వినుతింప, జగన్మోహినీపరిణయవాంఛయుఁ, బూర్వరాజసమార్జితపరరాజహస్తగత స్వీయరాజ్యభాగమగు నుదయగిరి ముట్టడించి పట్టుకొనుకాంక్షయు నహమహమికగాఁ ద్రోపులాడఁ బ్రయాణముసాగించెను. పురంధ్రీమణులు "విజయోఽస్తు" అనుచు నాశీర్వాదపూర్వకముగా నేసలుచల్లి యారాజలలాము నుత్సాహపూరితాంతరంగు నొనర్చిరి. కవులు పండితులు హృదయపూర్వకముగ నాశీర్వదించిరి. రాజహిమాంశుఁడు వారి నుచితరీతి గారవించి నిలువ నియమించి సంస్థానమును దర్శింప నరుదెంచిన పండితకవుల యథావిధి గారవించుచు, ద్రవ్యమొసంగుచు, సామ్రాజ్య గౌరవమును గాపాడుచుండుఁడీ యని వారిని హెచ్చరించి యాయాయిపనుల నొనర్ప నర్హుల నియమించి మంత్రులపై రాజ్యభారమును మోపి నగరము నతిక్రమించెను.

శ్రీకృష్ణదేవరాయలరాణువ గుత్తిదుర్గము దాఁటి గండి

కోటను గబళించి యామార్గముననే తూర్పుదిశకుఁ జనుచు నాయాయి తావుల నిలిచి మార్గపరిశ్రాంతిని దొలఁగించుకొనుచుఁ బదార్థముల నందందు సేకరించుకొని వణిజులు కతిపయప్రయాణముల నుదయగిరిప్రాంతముచేరి తమరాకకై కాచియుండఁగాఁ గొలఁదిదినములకు నుదయగిరిని సమీపింపఁజాలెను. వర్షకాలము గావున జలసమృద్ధికిఁ గొఱంత లేకయుండెను. మార్గపరిశ్రాంతి నపనయించుతోఁటలు మెండుగా నుండెను. కావున నాప్రయాణము పెండ్లిపయనమే యయ్యెను. నిలిచినతావుల నారాజచూడామణిని గవితల్లజు లానందింపఁ జేయుచుండిరి. నగరముననుండిన బాగుండునన్న యూహ యారాజశేఖరునకుఁ దోఁపకుండఁ జేయుచుండిరి. ముందుగనే పటకుటీరములు నిర్మింపఁబడుచుండును. నిలుచుతావు చేరునప్పటి కుపచారములు చేయ నాయాయిపరిచారకులు సిద్ధముగ నుందురు. ఇట్లు కొఱంతలేని ప్రయత్నములతో సుసమయమునకు మహారాజాధిరాజసేన లుదయగిరిసమీపభాగమును జేరెను. దక్షిణపశ్చిమభాగముల దట్టమగునడవి యుండెను. ఉత్తరభాగమున నాపర్వతమే వ్యాపించి యుండెను. తూర్పుభాగమునఁ జిట్టడవియు నించుకదూరమున గ్రామము లుండెను.

ఉదయగిరి యనుపేరుగల గ్రామమునకు నించుక యీశాన్యమునుండి పడమరగా శైలము నొరసికొని యొకతటాకముండెను. దానికి గండిపాళెపుఁ దటాకమని పేరు. దాన కట్ట దూరముగానుండినను జలము తరంగసంభృతమై యింతదనుక వ్యాపించియుండునట్లే కట్టఁబడినది. నెలకు మూఁడువానలుగల యాకాలమున దాని యడుగుభాగమును గాంచినవారే లేరను

కింవదంతి గలదు. అది సత్యమే. ఈకాలపువారు దానితత్త్వ
మెఱుంగకున్నను బాధ లేదు. నిరంతరజలసంభృతమగు నా తటా
కము రెండవ సముద్రమా యనుశంక నంకురింపఁ జేయుచుం
డెను. దానిని బరిఖగా భావించి యాభాగమునుండి శత్రువులు
రా వెఱతురఁట. అట్టి యుదయగిరిప్రాంతభూమి రాజపరమేశ్వర
దృక్పాత్ర మయ్యెను.

ఆభూభాగము రాణ్మహేంద్రునకు స్వాగతమొసంగిన
దయ్యెను. కలరవములఁ బక్షిగుంపులు "రమ్ము. రమ్ము. రాజాధి
రాజా! రమ్ము మీయేలుఁబడి నీభూదేవి యాశించుచున్నది.
ఇదె నీకు స్వాగత మొసంగుచున్నది. మీపరిపాలనమున నీభూ
సతీతిలక మపారానందసంభరితాంతరంగ యగుంగాక." అని
భాషించినట్లుండెను. రా జందుఁ జేరఁగనే మలయానిలడింభ
కుఁడు, తేనిం దనకౌఁగిటం జేర్చుకొని యామోదమును వెలిఁ
బుచ్చెను. అట్టి యనేకశుభనిమిత్తములు కనఁబడఁగా రాయలు
విజయశ్రీలు తప్పక లభించునని నమ్మెను. తిమ్మరుసు మంత్రిశేఖ
రుఁడు దండనాథులం బిలువంబంచి ప్రాగ్దక్షిణ పశ్చిమభాగముల
ముట్టడింప సేనల నాజ్ఞాపింపుఁడనియు, నుత్తరభాగమున మూఁ
డుక్రోశముల దూరమునఁ దగుభటుల నిలిపి వస్తువ్రాతము
కోటకు రాకయుండునట్లు; కోటనుండి యెవరు పోవకయుండు
నట్లు జాగరూకులై యుండ నాజ్ఞాపింపఁ దగుననియు హెచ్చ
రించెను. వారెల్లఁ దమతమరాణువల కాజ్ఞచేసిరి. కొలఁది
ముహూర్తములకే పర్వతచతుర్భాగములనెల్ల వీరభటులు
నిండిరి. రెండుదినములకే లోపలివారు వెలుపలకు రాఁగూడదని
యు, వెలుపలివారు లోనికి కరుగరాదనియు నెల్లరకుఁ దెలియ

వచ్చెను. దుర్గవాసులు తద్వార్తాశ్రవణమున వితాకునొందిరి.
కాని యేసమయమున యుద్ధము పొసంగినను బాధలేకుండునట్లు
సకలపదార్థముల సేకరించియుంచుట యలవాటుగావునఁ బరరా
జులువచ్చి ముట్టడించి కొలఁదిదినములుండి విఫలప్రయత్నులై
పోవుచుండుట వాడుకగాన వీరు నట్లే మనయడవులను గాపాడి
పోవుదురని దుర్గపాలకులు తలంచి స్వరక్షణమునకు వలయు
యుద్ధసాధనముల జాగ్రత్తగాఁ జూచుకొనుఁడని వీరుల కాజ్ఞా
పించిరి. దుర్గరక్షణమున కేశంకయు వలదని వీరభటులు దండ
నాయకులు పాలకులకుం దెల్పి కోటకొమ్ముల నెక్కి యరిబలము
లను గాంచుచు హాసములఁ బ్రొద్దుపుచ్చుచుండిరి.

ఆతరుణమున నుదయగిరి దుర్గమునఁ బదివేవురు యోధు
లును (నన్నూర్గురు) రౌతులు నుండినట్లు నూనెజ్ అనుపోర్చు
గీసు దేశమునుండి వచ్చినబాటసారి రాయలతో యుద్ధమును
జూడఁబోయి వ్రాసెను. ఆవ్రాఁతయందించుక హెచ్చుతగ్గు
లుండవచ్చును. ఏలయన నీతఁడు దుర్గమునకుఁ బోవ వీలులేని
వాఁడు. యుద్ధానంతర మెందఱు చచ్చిరో యెందఱు పాఱి
పోయిరో చెప్పువా రెవ్వరు ? రాయలు సేనలతో వచ్చు
చున్నాఁడని ముందే వారికిఁ దెలియక తప్పదుకదా. తమరాజ్య
భాగములనుండి యప్పటికిం దగువారి నెందఱిఁ బిలిపించుకొనిరో
నిర్ణయించు టెట్లు? కావున రమారమి యన్న ట్లూహాలు ఫలిం
చును. ఆబాటసారి యూహప్రకారము శ్రీకృష్ణదేవరాయల
దండులో ముప్పదినాలుగువేల పదాతులు, శతాష్టకము మత్త
దంతావళు లుండెను. ఇదియుఁ బైయట్టిదే. యుద్ధసమయమున
సాయముగాఁ దగినసేనలు కొన్ని కొంతదూరమునసాయత్తము

చేయఁబడి యుండును. వానినెల్ల నొక్కసారి లెక్కింప శ్రమమే కావున నూనెజ్ గారివ్రాఁత యించుమించుగా ననుపదముతోఁ గూడఁ దగినదనవచ్చును. ముట్టడించు కార్యమునందే కొలఁది దినములు గడచెను. విద్వత్కవులం గూడి రాజపరమేశ్వరుఁడు తిమ్మరుసు మంత్రిశేఖరుఁడు వెంటనుండఁ దూర్పునకు నుత్తరమునకుఁ బ్రచారము సల్పుచు నాగ్రామములయందు శిబిరముల నిర్మింప నందుండెను. కొలఁదివారము లిట్లే గడచెను.

దుర్గముచేరు మార్గములు కానరావు. దుర్గమున నుండువారు హాయిగా నుండిరి. ఏవిధముగాఁ జూచినను వారికిఁ గష్టములు గలుగుటలేదు. ఆఘోరారణ్యము త్రోవల నేసమయమున నెవరుకోటలోనికి వలసినవస్తువులఁ జేర్తురో యెవ రెఱుంగఁ జాలరు. మార్గముచేసికొని కొండనెక్కఁబోయిన శతఘ్నుల వ్రేటు లెటనుండివచ్చునో తెలియ నవకాశములేదు. కాని శిరస్సులు దొరలుట మాత్రము కానఁబడుచుండెను. కొండనెక్కుదమని యెన్నిమాఱులు ప్రయత్నించినను విఫలమగు చుండెను. గాని యించుకయు ఫలించునన్నయాశ కలుగలేదు మహత్తర సేనలు నలుప్రక్కలఁ గాచియున్నవి. కాని సాంద్రారణ్యముగా నాభాగముండుటం జేసి శత్రువులు కుట్రలుకనుఁగొన నవకాశము లేకుండెను. అరణ్యములభేదింప సాధ్యమా. ఆపనికింబూనిన నలువురు నవ్వకుందురా. ఇంక దుర్గమును సాధించుటెట్లు ? అన్న ప్రశ్నమే రాయలకేకాక దండనాథులు మొదలు భటులదనుక దోఁచెను. కాని గుసగుసలు లాభింపవనియుఁ, దగిన ప్రయత్నము చేసినఁగాని విజయముగాంచఁ జాలమనియుఁ బ్రభుశిఖామణికిం దోఁచెను. కాలము చక్కఁగాఁ బుచ్చుటకుఁ గవిగాయక పరిషా

సకులున్నవారు. మంత్రులుగలరు. ఎవ్వరున్న నేమి. రాయలమది చంచలించు చుండెను. దక్షిణజైత్రయాత్ర సాగినది. అట్లే యిదియు సాగునని వచ్చితిమి. ఇది దుస్తరముగా నున్నది. ఎట్లు సాధింపఁగలము. అనుశంకయే రాజున కహర్నిశములు కలుగ సాగెను. దానిచే నించుక విసుగు జనించెను. ముఖచ్ఛాయ కొఱంత గాంచెను. సరసాలాపములు విరళము లయ్యెను. మందహాస మెటకో పోయెను. విద్వద్గోష్ఠియన్న నిపుడేల యన్నంత యూహ జనించెను.

ఒక్కనాఁడు రాజేకాంతమునఁ గూరుచుండి తిమ్మరుసు రాఁగా నిట్లు మందలించెను. అప్పాజీ! దూరము విచారింపక విజయాభిలాష మదినెలకొనఁ బయనము సాగించితిమి. సుఖముగా వచ్చి చేరితిమి. ముట్టడించితిమి. మూఁడునెలలు కావచ్చెను. ఏదారియుఁ దోఁపదు శత్రువులు లోఁబడుదు రన్నయాశ యించుకంతయులేదు. ఎంతకాలము మన మీముట్టడి సాగించినను గార్యము సఫలతఁగాంచు నన్నయాశ నామదిఁ గలుగ లేదు. గ్రామములనుండి వచ్చినగూఢచారులు తెల్పుమాటలనాలకించిన నాకు విచారము గలుగుచున్నది. కూరగాయలుతప్పఁ దక్కంగల పదార్థములు పండ్రెండు వత్సరములకు వలసినన్ని సేకరింపఁబడి యుండునఁట! గోసమృద్ధి గలిగియుంట పాఁడికిఁ గొఱంతలేదఁట. జలాశయములు పెక్కులున్నవఁట. ఎందువర్షింపకున్న నీపుణ్యగిరిపై మేఘుండు వర్షించునఁట. కావున వారేవిధమునను మనకుఁ జిక్కుదురన్నయాశ గలుగ నవకాశమే లేదు. మార్గమొక్కటియే కనఁబడుచున్నది. సాహసించి దానివెంటఁ బోవుదమన్న గండశిలలు పెక్కు లమర్పఁబడియున్నవి. ఒక్కొ

క్కటిరయే యెండలనో చంపఁగలదు. ఇంతియగాక యేచోట నుండివచ్చునో శతఘ్నులఘుటికలు వీరభటులశిరముల నిల వ్రాలఁజేయుచున్నవి. ఇఁక నీమార్గమునఁ గోటదరిఁ జేరుట దుర్ఘటమే యనవచ్చును. మేనిలోఁ బ్రాణములుండ దీనిని వదలిపోవ రాదుగదా. నీయభిప్రాయమేమి? ఈకీర్త్యపకీర్తులకు నీవుగూడ భాగస్వామివే యగుదువు. మఱియుఁ బితృసఖుఁడవు. మంత్రులెల్లనొక్కరీతి వచింపఁగా నీదండయాత్ర సాగించితిని. నామాట యెట వినకపోతిరి. మహమ్మదీయదండయాత్ర నాయూహ కనుగుణమైయుండెను. వర్షదినము లగుట నది కూడదంటిరి. మీమాట విని నేను దీనికిం గడంగితిని. ఇంతదనుక నిరంకుశముగాఁ గల్గినవిఖ్యాతి కీదండయాత్ర మచ్చునుగ్రుచ్చునేమో యెఱుంగఁజాలకున్నాఁడను. దీర్ఘముఁగ నాలోచించి పని సాధింపఁగల ప్రగ్గడవు నీవని నేనెఱుంగుదును. కావున నన్నియు నెఱింగించితిని. కార్యభార మిఁక నీతలపై నిలిచియున్నది. ఏమియూహింతువో. కార్యమును సాధించి యెట్లు కీర్తి గల్గించి విజయనగర సామ్రాజ్యము నేరీతి వృద్ధినొందఁ జేయుదువో యోజించుకొమ్ము. ఇపుడు నా కేయాలోచనయుఁ దోఁపకున్నది. అని పలికి క్రిందు చూచుచు నూరకుండెను.

రాజేంద్రుని కార్యనిర్వాహణశక్తికి మంత్రిశేఖరుఁడు మెచ్చుకొనెను. తనశక్తిని బరీక్షింపఁ బూనియే యిట్లు వేదపల్కులు పల్కుఁదొడంగెనని యూహించి శిరఃకంపము చేసెను. శుభనిమిత్తము లన్నింటిని దలపోసెను. విజయము చేకూరును. ధ్రువము. సంశయింపవలదని తెలుపునట్టి తనదక్షిణాక్షికరపాదసంస్ఫోటముల కెంతయు సంతసించెను. రాజచంద్రునింగాంచి

వినయ ముట్టిపడ నిట్లు పలికెను. ధీరాగ్రగణ్యా! తమనోటినుండి యిట్టినుడులు వెడలునని నేఁ దలంపలేదు. ఏలజాలిగలుగ నిట్లు పలికితిరో యెఱుంగఁజాలకున్నాఁడను. దైవము తోడునీడఁగాఁ గలిగిన మీకేల విజయశంక గలుగవలయునో తెలియక కలవరపడుచున్నాఁడను. విజయలక్ష్మి మిమ్ము వరింప నాశించుచున్నది. సమయ మనుకూలమై కానఁబడుచున్నది. నిమిత్తములు విజయమును సూచించుచున్నవి. భూదేవి నీదక్షిణహస్తాగ్రమున నిలిచి సుఖింపఁ జేయి చాపుచున్నది. ప్రజలెల్ల దమపాలనమున నెప్పుడు సుఖింతుమా యని యువ్విళ్లూరుచున్నవారు. ఇట్టులుండఁ దమ రిట్టి యధైర్యపుఁబలుకులు వచియింప నేమికారణమో. యెఱుంగఁజాలకున్నాఁడను. నాయూహ యెట్టిదో పరిక్షింపఁగోరి పల్కితిరో తెలిసికొనఁజాలను. పరీక్షకేయైన నేలినవారిదగ్గర నాశక్తిని జూప నీసేవకుఁడు సంసిద్ధముగనే యున్నవాఁడు అని పలికి యూరకుండెను.

శ్రీకృష్ణదేవరాయ లామంత్రిమణి వాక్కుల నాలించి ధైర్యము హెచ్చగా నిట్లు నుడివెను. అప్పాజీ! నీబుద్ధివిశేషమే చతురంగబలములకన్న మిన్నయని నెమ్మది నమ్మి వచ్చితిని. కాని దుర్గముదుర్గముగానే కనఁబడుచున్నది. ఎచ్చటినుండియుఁ బైకెక్కుద మన్నను శక్యముగాకున్నది. కావున శంక మది నుదయించెను. ఈవిషయమున నింతదనుక నీవేమి యాలోచించితివో సమాధానముచెప్పుము. దానిని విని మది హాయిగానుండ గుండెపైఁ జేయివైచుకొనియుండెద. అనిన నింకఁ బ్రభువునకు స్వప్రవృత్తిని దెల్పకుండుట పాడిగాదని యెంచి మంత్రి యిట్లు చెప్పెను.

రాజేంద్రా! ఏలినవారికడ దాఁపఁదగినవిషయ ముండునే. ముట్టడించినముందుదినమే యిది దుస్సాధ్యమని యెఱింగితిని. కమలాకాంతరాయని వేషాంతరమునఁబోయి కనుఁగొని రమ్మని పంపితిని. రెండుమాసములు కావచ్చెను. ఆతనిజాడ కానరాలేదు. ఆతఁడు రాజభక్తులలో మేటి. విశ్వాసపాత్రుఁడు. కపటనాటకసూత్రధారుఁడు. కావుననే యాతనిం దోడుకొనివచ్చితిని. మాఱువేషమునఁబోయి దుర్గమునఁ గుట్టలనెల్లఁ బరికించి రమ్మని పంపినాఁడ. రెండుమూఁడుదినములలో రావచ్చు. అతని ప్రవృత్తిని విని మనము చేయందగుకార్య మిది యని విన్నవింతు. ఆమీఁద నేలినవారే ప్రమాణము. అనిపలుక మంత్రియాలోచనము సముచితముగాఁ దోఁచుటఁ దనలో మెచ్చుకొనుచు విచారమును మాని కమలాకాంతరాయనిరాకకై నిరీక్షింత మని తానభ్యంతరమున కేగెను.

ఈవిషయ మిట్లుంచి కమలాకాంతరాయఁ డేమిచేసెనో యించుక విచారింతము. కమలాకాంతరాయని మిత్రులందఱు కాంతరాయా యని పిలుతురు. కావున మనము నీరెండు పేరుల నుదాహరింతము. కాంతరాయఁడు తల్లిదండ్రుల కేకపుత్త్రుఁడు. ముద్దుగాఁ బెంచి వారు పెద్దవానిం జేసిరి. చిన్నతనమున హాస్యము చెప్పువారితో సావాసముకుదిరెను. కాన నాపలుకులు శరీరకంపనాదులు నలవడియుండెను. విధాత యాతనిఁ దదనుకూలమగురూపము గలవానిగనే సృజించెను కాంతరాయుఁ డందగాఁడు కాఁడని యెవ్వరనఁజాలరు. ముఖము పొడవుగాక పొట్టిగ నుండక పాటిగా నుండుటంజేసి యేవేషమునకైన ననుకూలముగా నుండును. ఆకారణమున విజయనగరమునఁ బ్రసిద్ధ

నాటకసంఘమువా రీతినిఁ జేరఁదీసికొనిరి. చదువుచెప్పింతుమని కొలఁదికాలము కళలు నేర్పింతుమని కొన్నినెలలు విచిత్రవిద్యలు క్రొత్తగా గొన్ని వెలువడినవిగాన వాని నేర్పింతుమని కొన్నినెలలు వృథగాఁ బుచ్చి విద్యాభ్యాసకాలము నించుక దాఁటించిరి. ఈకాలమునఁ గాంతరాయనికి నిల్లిల్లుదిరుగుటయలవడియెను. ఒక్కతట్టునఁ గాలూని నిలువఁజాలనంత దురభ్యాసము పట్టుపడియెను. అది యలవడు టెఱింగి వారింక నీతఁడు విద్యాభ్యాసము చేయఁజాలఁడని మనము చెప్పినట్లు వినుచుండునని తలంచి సంతోషించి కంఠనాదము సురుచిరముగుటం జేసి గాలిపాట పాడుచుండుట విన్నవారు కావున మెల్ల మెల్లన నాటకరంగమునకు నీడ్వఁగల్గిరి. మంచిభోజనము, ఫలాహారములు, నడుమనడుమఁ జిఱుతిండి దొరకుటంజేసి యాతఁడు తానేమో గొప్పవాఁడ ననుకొనుచు నాటకములందు వేషధారియయ్యెను. అందు మిగుల విఖ్యాతి గడింప నెంచి తదుచితవేషభాషలయం దాఱితేఱి యందఱ మెప్పింపవలయు నన్నయూహలు పైకొనఁగా మఱింతపట్టుదలతో నటనము నేర్చుకొని యాపాటియాపాటిసభలలో మెప్పుపొందుటయేగాక బిరుదముల సంపాదించెను. దానివలన నతనికి గొప్పలాభములేమియుఁ జేకూరలేదుగాని చంచలచిత్తత మాత్రము పట్టుపడియెను. ఒక్కతావుననైనఁ బదిదినములునిలిచి యేదే నొకకార్యము చేయఁజాలనంత యసమర్థత మదిఁ గుదిరెను. కాని సమయోచిత వేషభాషలు మాత్ర మలవడియెను.

కొలఁది వత్సరములనుండి తిమ్మరుసా కాంతరాయని యోగ్యత నెఱింగి చేరఁదీయసాగెను. మంత్రి యేల తన్ను రమ్మని

మాటలాడునో యతఁడు తెలిసికొనఁజాలకయుండెను. మీఁదు మిక్కిలి మంత్రి మరియాదచేయుచున్నాఁడని గర్వమున విఱ్ఱవీఁగసాగెను. ఉదయగిరివృత్తాంత మెఱుంగ శక్యముకాదని మంత్రిసత్తముఁ డీయుద్ధమునకు ముందే గూఢచారులవలన నెఱింగి దండయాత్రసలుప నిశ్చయించినది మొదలు కాంతరాయని మఱింత చేరఁదీయుచు నతని నెయ్యునిగా భావించుచుండెను. ప్రయాణముచేయుతఱి నాతని దనచెంతనుంచుకొని తోడ్కొనిపోయెను. ముట్టడిసలుపఁ బూనినపుడే వేషాంతరమున నతనిం బంపెను. ఆతఁడు బైరాగివేషమూని చుట్టుపట్టునంగల పల్లియలలోఁ గొలఁదిదినములు కాలముంగడపి మంత్రి చెప్పినపనులన్నియు నెఱవేర్చి వేళకురాక యనేకకారణములచేఁ దడవుచేసివచ్చెను. రాయలతో మంత్రి మాటలాడిన కొలఁదిదినములకుఁ గాంతరాయఁడు వచ్చెను.

ఒక్కనాఁడు సాయంకాలము రాజమంత్రులు రహస్యముగ మాటలాడుచుండిరి. ఆపటకుటీరముదరి కెవ్వరును బోవఁగూడదను నియమముకలదు. అందుఁ గూరుచుండుట రహస్యాలోచనార్థమయియే యని సేవకు లెఱుంగుదురు. కావున నెవ్వరేని దెలియక యచ్చటికింబోయినను దూరమున నున్నరక్షకభటుఁ డర్ధచంద్రప్రయోగమునఁ దుద కాతనిసాగనంపుట రాజాజ్ఞననుసరించియే సాగు నాచారము. ఆనాఁడు కడుజాగరూకుఁడై భటుఁడు కావలికాచుచుండెను. రామచంద్రదాసను క్రొత్తనామమున బైరాగివలెనున్న కాంతరాయఁ డచ్చటచ్చట రాజువృత్తాంత మెఱింగి యామందిరముకడకే పోయెను. ఆశిబరముచుట్టు దట్టముగుకంచె వేయఁబడియుండెను. ఎనిమిది

దిక్కుల నొక్కొక్కతావున నిర్వ్యరప్రకారము పదునాలుగురు వీరభటులు కరవాలకరాళహస్తులై జాగరూకులై కాచుచుండిరి. ప్రమాదంపడువాఁ డం దొక్కరుఁడైనను లేకుండెను. వారివేషము లెప్పు డేసంగరము పొసంగిన సరి వీరులం బొడువ సంసిద్ధములుగ నుండెను. ఆయోనాళము లనుపేరఁబరఁగు నాయుధములు భుజములపైఁ గనఁబడుచుండెను. వేఱొక్క చేతియందుఁ దళతళమెఱయు ఖడ్గము చూడ్కుల మిఱుమిట్లు గొలుపుచుండెను. మొలలో నతిభయముగల్గించుచుఁ బాదాగ్రము వఱకు వ్రేలాడు నిడుదకత్తి యొకఁడుండెను. మఱియు నాయాయిసమయముల నాయాయిరీతులఁ బొడువఁదగు సాధనము లందందుండెను. ఎవరేఁ గ్రొత్తవారు తటాలున వారినిం బొడఁగాంచిన యమదూతలే యని తలంతురనుట పరిహాసోక్తి కాదు. మఱియు స్వభావోక్తియేయగు.

ఇట్లు వీరభటులు కాచుచుండఁగా నించుకదూరమున సేనానాయకులు వేచియుండఁగా వారి కించుకదూరమునఁ గొన్నిదళము లేమఱుపాటులేక నాయకులయానతిమైఁ బ్రాణముల నర్పింప సంసిద్ధముగనుండఁగా రామచంద్రదాసు పటకుటీరము సమీపముసకుంబోయెను. బైరాగివేషము ధరించినట్లుండక యతఁడు నిక్కముగా నితఁడు సంసారమును ద్యజించిన జ్ఞాని యని తోఁపఁజేయుచుండెను. లలాటమునిండ నూర్ధ్వపుండ్రములు మూఁడు ముచ్చటగా నుండెను. వానిక్రిందఁ బాదచిహ్నము కానరాకుండుటంబట్టి వేదోక్తకర్మప్రధానుఁడగు వైష్ణవుఁడని తెలిసికొనఁదగియుండెను. నూనూగుమీసములు నూత్నయౌవనమును వెల్లడించుచుండెను. కంఠమున

మూలికాహారములు విరాజిల్లుచుండెను, మొలకొకముప్పురిత్రాడు కట్టఁబడియుండెను. అదియేవనస్పతిమృదుత్వఙ్నిర్మితమో తెలియఁబడదు. కాని దానియందందందుఁ దాయెతులు కట్టఁబడియుండెను. కరమునఁ గుటిలదండ మొకటి చూపట్టుచుండెను. దానియగ్రమున నొకకరాళవక్త్రచిహ్న మమర్పఁబడియుండెను. దానికనుయుగంబునందు నేమో రక్తవర్ణఫలబీజములు చెక్కఁబడియుండెను. దానిదంతములు నిక్కముగానున్నవే కాని పెట్టినవి కావనునూహను గల్పించుచుండెను. చూచువారెల్ల నాదండమును స్పృశించినఁ బిశాచబాధలు తొలఁగునని నమ్ముదురు. సవ్యకరమున సొరకాయతోఁ జేయఁబడినజలపాత్ర మొక్కఁడును, దక్షిణకరమునఁ బూర్వోక్త దండము నుండెను. కన్నులచివరభాగములందు నెఱ్ఱనికాటుక పెట్టఁబడియుండెను. అది యదృశ్యవస్తువులం గనఁబడం జేయునని యూహింపఁదగియుండెను. మొలత్రాటినంటి యొకబరణి యుండెను. దానియందేదో యౌషధ ముండవచ్చునని యందఱూహించుచుండిరి. కౌపీనము మహాపురుషులకు నుండఁదగు వైరాగ్యమును దెలుపుచుండెను.

"అహర్నిశం బ్రహ్మణి యే రమంతః
కౌపీనవంతః ఖలు భాగ్యవంతః."

అన్న శ్రీశంకరభగవత్పాదోక్తి కొండఱకు స్మృతిగోచర మగుచుండెను. సంవ్యానము, కంబళము, అదియుఁ గడుఁ బ్రాఁతది నిస్పృహతను దెలుపుచుండెను. ఆతనిచూపులు కృత్రిమములని యెవ్వరు కనుఁగొనఁజాలరు. శాంత మాతని ముఖమున విశేషించి నేత్రములయందుఁ దాండవముచేయు

చుండెను. ఆతనిముఖస్థితి నాలోచింప సర్వదా మహత్తరఫలమునుగోరి కృషి చేయుచున్న జాడ కనఁబడుచుండెను.

ఇట్టులారామచంద్రదాసు శిబిరప్రాంతమునకు రాఁగా దూరముగాఁ బొమ్ము. ఇది నీవు ప్రవేశింప నర్హమగుచోటు కాదని యొకభటుఁ డతిభయంకరస్వరముగఁ బలికెను. బైరాగి చిఱునవ్వునవ్వుచు నాయనా! మాబోంట్లకుఁ జొరరానిచోటు లున్నవా. సంసారులకు దుష్ప్రవేశస్థలములు కలవు. అనఁగా నాభటుఁడు బుద్ధి నీకుఁజాలదు. దూరముగాఁబొమ్ము. జాగ్రత్త అనెను. మఱి నాలుగడుగులు ముందునడచి రామచంద్రదాసు నాయనా! నాకు బుద్ధిచాలదని నీవు పలుకుట నాకు మర్యాద నిచ్చెడిని. బుద్ధియే లేదనుము. అది లేకుండుటం జేసియే యీలోకమున నివేషము వేయవలసివచ్చినది. ఈరూపములవంటివాని నింక నెన్నింటి నెత్తవలయునో. జగదీశుకరుణ నాపై నెన్నిదినములకుఁ గలుగునో యనుచు నిలువక వచ్చుచునే యుండెను. భటుఁడు నాలుగడుగులు రానిచ్చి సన్న్యాసీ! నిన్నేమనుటకు నోరాడకున్నది. రాజుగారు మంత్రియు నిందుఁగూరుచుండి రహస్యాలోచనములు చేయుచున్నారు. ఎవ్వరిని బ్రవేశపెట్టఁగూడదని రాజాజ్ఞ. మే మాయానతి శిరసావహించుచున్నాము. కావున నించుకయు మాటాడక వెడలిపొమ్ము.

ఆమాటలు విని బైరాగి భటోత్తమా! నీనుడులు యథార్థములు. ఎట్టి యుత్తరువులు సంసారమున మునిఁగి తేలుచుండువారికింగాని మావంటి విరాగులకుఁగావు. నాపై నించుక విశ్వాసమునిచి మంత్రితో బైరాగి వచ్చియున్నాఁడని విన్నవింపుము. మీరెట్లు రాజాజ్ఞను శిరసావహించుచున్నారో

నేనును బరోపకారమునకే యీవేషముఁబూని తిరుగుచున్నాఁడను. సంసారమును వదలితిని. ఇపుడు సన్న్యాసిమతమును స్వీకరించితిని. మంత్రిశేఖరులు సకలవిషయముల నెఱుంగుదురు. వారియానతి నేను నంగీకరించెదను. ఈపాటియుపకారము చేయుము. నేఁబూనిన జగత్పతికార్యము నెఱవేఱును. సామాన్యులనుఁజూచియు నాశ్రయించియు లాభములేదని బ్రతిమాలెను. భటుఁడామాటలకుం గనలి సీత్కారపూర్వకముగా నిట్లు పలికెను. సన్న్యాసీ! నీకు బుద్ధితక్కువ. చెప్పినమాటలను గ్రహింపఁజాలవు. మొండిపట్టున మాటలాడెదవు. నిన్నింతసేపు మాటాడనిచ్చుటయే నాతప్పు. ఇంక నొక్కమాటయైన నిటమాటలాడితివా నీగతియేమగునో తెలియఁగలదు. పాపము బైరాగిగదా యని యింతగా మంచిమాట చెప్పినఁ జెవిఁబెట్టుకొనవు. నీమాటయే నీది. నోరుమూసికొనిపో. ఇంక మాటాడకుము. అని గద్దించి పలికెను. బైరాగి యింకఁ గార్యములేదు. వీఁడు పరమమూర్ఖుఁడు. శాంతవాక్యములు పనికిరావు. గట్టిగాఁ జెప్పినఁ బ్రాణముమీఁదికి వచ్చును. ఏమిచేయుదును ? అని యాలోచించుచుండునంతలో దైవికముగా మంత్రి గవాక్షమునుండి తొంగిచూచి సన్న్యాసింగాంచి ఆయోగిని మర్యాదగాఁ బిలుచుకొనిరమ్మని సేవకునిబంచెను. చిత్తము. అని పోయి రాజాజ్ఞ నెఱింగింప భటుఁడచ్చెరువంది దండముపెట్టి నాపైఁ గినియకుము. సేవకుఁడనుగాన నాధర్మము నాచరించితినని బ్రతిమాలుకొనెను. బైరాగియు నీకు నుచితమగుకార్యము నొనర్చితివి. ఇందేమాత్రము నీయపరాధములేదు. భయపడకుము. నీకు బహుమాన మిప్పింతునని ధైర్యముచెప్పి కంచుకివెంట లోని

కరిగెను. మంత్రియు రాజును వాని నుచితరీతి గారవించిరి. యథానిర్దిష్టాసనమున నతఁడు కూరుచుండెను. మంత్రి కార్యము పండించుకొనివచ్చితివికదా యని సస్మితాననుఁడై ప్రశ్నించెను. తమయానతియే కార్యము సఫలముచేయుచుండఁగా నాశక్తియం దేమిగలదని బైరాగి బదులుచెప్పెను. రాయలు తద్వాక్యశ్రవణమున హర్షించి వృత్తాంతమంతయు నెఱింగింపుమనఁగాఁ గాంతరాయఁ డిట్లు విన్నవించెను. ఆమాటలు కలనాదమునఁ బొదలుచుండెను.

మహారాజా! మంత్రిసత్తమునియుత్తరువుచొప్పున నేలినవారియాజ్ఞనుత్తమాంగమునఁ దాల్చి యెచ్చోటికైనఁ బోవ ననువగు నీవేషమును ధరించితిని. బయలువెడలునప్పుడే తగిన వస్త్రవ్రాతములఁ దెచ్చికొంటినిగాన నం దీవేషమునకు వలయు వానిని మాత్రమే గ్రహించి తక్కుంగలవాని నిందే యునిచి నాచేయఁబూనినపని నాలోచించి తదుచితపర్యటనము పల్లెలయందుఁ దొలుతఁ జేయందగునని నిశ్చయించితిని. నామిత్రులకిర్వురకు నాప్రవృత్తిం గనుఁగొనఁదగుజాడలందెల్పి వారిని బిచ్చమునకుఁగాఁ బర్యటనముచేయంబంచి తూర్పుదిశకుంబోయితిని. బలిజపల్లియం దొలుదొలుతఁ బ్రవేశించితి. బావిగట్టున నశ్వత్థవృక్షముక్రిందఁ గూరుచుండి యొరు లెఱుంగకుండ సంచిలోని భక్ష్యములం దిని ప్రాంతకంబళమును బఱచుకొని మూటతలక్రిందనునుచుకొని యినుపదండమునకు శిరసునుజేర్చి శయనించితి. నీరుగొనిపోవవచ్చువారెల్ల నన్నుఁ జూడసాగిరి. కొంతతడవున కొకముదుసలివనితవచ్చి నన్నేమో ప్రశ్నించెను. భాష తెలియదని వచ్చియురానిమాటలతోఁ దెలిపితిని. ఆమె మఱి

రెండుగడియలకుఁ బదిమందిని బిలుచుకొనివచ్చెను. వారికి హిందీ కొంచెమువచ్చినట్లుండెను. వారు నావృత్తాంతమరయఁ బ్రశ్నించిరి. నేనిట్లు బదులు పల్కితిని. "హిమాలయమునుండి వచ్చితిని. ఉదయగిరిమీఁదఁ గొన్నిమూలికలు గలవు. వానిం దెమ్మని నాగురువు శాసించెను. నడచివచ్చినందున జబ్బుచేసినది. కొండ నెక్కఁజాలక యిచ్చటికి వచ్చినాఁడను. రెండుమూఁడు దినములిందుండి బడలికలుడుగఁ బోయెదను" అని నావృత్తాంతమును ముగించితిని.

మంత్రి.—ఆమీఁద నీచరిత్ర మెట్లు సాగెను? పల్లియకుంబోవ నీయూహయేమి ?

కాంతరా.—మంత్రిశేఖరా! చిత్తగింపుము. పల్లియలకుంబోయి నాశక్తిని గొంత కనఁబఱచి కొన్నిరోగములంగుదిర్చి గ్రహబాధలఁ దొలఁగించి వారిద్వారా నేను బైరాగిననియు, మూలికలకొఱకుఁ బర్వతమునకుఁ బోవుననియు నీవార్తను వ్యాపింపఁజేసి వారిపలుకులద్వారా కోటవృత్తాంతమును దెలిసికొనవలయునని యూహించితిని. విశేషించి పల్లియలనుండి చాటుమార్గములఁ బదార్థములు కోటకుంబోవునని నావిశ్వాసము. వెడవెడ వినుచుండిన నన్ని విషయంబులు గ్రామంబులయందే తెలిసికొన నవకాశము తప్పక కలుగుననియు నా నమ్మకము.

మంత్రి.—ఆమీఁద నీప్రవర్తన మేలాగు సాగెను.

కాంతరా.—నామాటలయగ్ధ మెఱింగి వారందఱు తమకుంగల బాధలను దెల్పి వాని నివారింపుమా యని ప్రార్థించిరి. నేనందుల కీయకొని గ్రహములుండినవారికి యంత్రములు

కట్టుచు రోగములుగలవారికి మందులిచ్చుచు మూఁడు నాలుగుదినములుండితి. నాచికిత్సలచే వారివారిబాధలు నివారింపఁబడియె. పదంపడి వారు ధనమీయవచ్చిరి. ద్రవ్యమును ముట్టఁబూననినియమము గలదంటిని. పాపము! వారామాటలనమ్మి చిక్కనిపాలు శర్కరయు నాకుం దెచ్చియీయ సాగిరి. కడుపారఁ బాలుత్రావుచు నాకడనున్న యుపహారముల మెసవుచుంటిని. నాలుగుదినములకు వేలకు వేలుగ జనులు రాసాగిరి. వారిమాటల నెఱుంగనట్లు వినుచుం గాలముపుచ్చుచు యంత్రములఁగట్టుచు మందులకుగా మూలికల నిచ్చుచు మంత్రించుచు భస్మములనుజేయుచు ననేకరోగములఁ బాఱఁద్రోలితి.

మంత్రి.—నీకాదినములలో మనకుఁ గావలసినవిషయమున నేమి తెలియవచ్చెనో తెల్పుము.

కాంతరా.—చిత్తగింపుఁడు. ఒక్కనాఁటిరేయి నేనేమోభస్మములు పుటమువేయువానివలెఁ బిడకలంటించి చూచుచుంటిని. కూరుచున్నవారిలో వారే సంభాషించుకొనుచుండిరి. ఒక్కఁడందు నీబైరాగి కొండపై కెట్లుపోవును? రాజుగారి యాజ్ఞ లేదే.మనకు మందు లెట్లిచ్చును? అని యొకరినడిగెను. పోవుటశక్యముగాదని వాఁడనెను.కొంతదనుక నిట్లే ప్రశ్నోత్తరములు సాగుచుండెను. నేను నాధ్యానమున నున్నట్లే యుండి చెవులనాపనియందే నిల్పితిని. ఒక్కయాఁడుది వారితో నింతయాలోచనమేల ? పాయవెంటఁబోయినఁ గోటను జేరవచ్చునుగదా. అని చెప్పెను. అందఱు నిజమే. రేపు కూరగాయలు తీసికొనిపోవు మహాలక్ష్మి మొదలగు

వారివెంట నీయోగిం బంపుదము. అని వారివాదమును ముగించి మఱేమో మాటలాడుచుండిరి. వారికి మందులిచ్చిపంపి మఱుదినము వారందఱు మందులనిడిమ్మనిరాఁగా మూలికలులేవు. నాయొద్దనున్నవి చెల్లెను. ఇంక నేఁజేయఁదగినపనిలేదు. మరల నొకప్పుడు వత్తును. ఈరోగము చాల బలవత్తరము. కావున నెందేని ద్వరగా నివారింపఁజేసికొనుఁడని పల్కితిని. వారందులకు విచారించి నేఁడుసాయంకాలము రహస్యమార్గమునఁ గొండపై కరుగవచ్చును. పంపెదమనిపల్కి యతిరహస్యముగా మీరిందుండు టెఱింగి యంతఃపురకాంతలు మిమ్ముఁ జూడఁగోరిరఁట. కోటలోనికిం బోయి వారికింగల వ్యాధుల నివారించి పుణ్యము గట్టుకొమ్మని పల్కిరి. రహస్యమార్గమునఁ బోవునపుడు శత్రువులు కనిపెట్టి చంపుదురేమో యంటిని. ఆమార్గము నెవరెఱుంగరు. శత్రువులకుఁ దెలిసియున్న నిన్నిమాసము లూరకుందురాయని సమాధానముచెప్పి సిద్ధముగా నుండుమనియుఁ దెల్పిపోయిరి.

మంత్రి.—కాంతారాయా! నీవంటియుపకారిని సంపాదించుటయే నాకుం గొప్పయప్పా. యనియె.

కాంతరా.—చిత్తము. ఇదియంతయు యుష్మత్పాదసేవాసమాపాదితప్రభావవిశేషమే.

మంత్రి.—తరువాతివృత్తాంతమంతయు వివరించి చెప్పుము.

కాంతరా.—తెల్లవాఱుజాము ప్రవేశించెను. ఇంచుక యంధకారముగనేయుండెను. ఇద్దఱుస్త్రీలు మూటలెత్తుకొనివచ్చిరి. వారితోడ నొకపురుషుఁడు మోయఁజాలని బరువెత్తుకొని

యుండెను. స్వామీ లెండులెండు పోవుదమనిరి. వారింగాంచి యీరాత్రివేళ నెవరైనఁ జూచిన నేమి ముప్పువచ్చునో యంటిని. వారు భయములేదు. రండు. అని పట్టుదలగాఁ బల్కిరి. వారింగాంచి యెపుడెపు డేగఁగలనా యని యువ్విళ్లూరుచుఁ గాలమునకు వేచియున్న నేను. దటాలున బయలువెడలితిని. ప్రాంతగుడ్డల నందుఁ బడవైచితిని. వడివడి వారు పోవుచుండ వారివెంటనంటి కొంతదూర మరిగితిని. మోకాటిబంటి నీరుగలయేటిదరిఁ బయనము సాగించుజాడ నాకుం గన్పట్టెను. అందందుఁ జిన్నిప్రాంతవస్త్రచ్ఛిద్రములఁ గొమ్మలకుఁ దగిలించుచుఁ బోయితిని. కొంతదూరముపోఁగా నీటిలో దిగవలసివచ్చెను. అది యొకకొండవంక. దానియధోభాగమున గుండ్రముగానుండు పాషాణములేగాని సైకతము కానరాకుండెను. చాలదూరము దానిమార్గముననే పోవుచుండ నింతవెడలుపుగల నదియా యిది. యని ప్రశ్నించితి. వారిలోఁ బురుషుఁడు వెనుకకు మరలి మాటలాడకరండు. వేఁగులవా రెందైన నుందురేమో. అనఁగా మఱింతసన్ననియెలుంగున స్నానము చేయుదునా యని యడిగితి. కొండపై జలముగలదు. తెల్లవాఱకముందే కొండనెక్కవలయునని వారుపోవసాగిరి. అంధకారమునకుఁ దోడుగాఁ జెట్లు క్రిక్కిరిసియున్నందున నాయంధకారము బంధురమై యేమియుఁ దెలియనీయక యుండెను. కర్ణకఠోరనినాద మొక్కఁ డెడతెగక వినఁబడుచుండెను. సీత్తనునఱరమాధ్వనివలన నాహృదయమునకుఁ జేరుచుండెను. వీని నీప్రాంతములవారు ఱిల్లపురుగు లందురు

పిట్ట కొంచెము కూఁత ఘన మనునానుడి యీపురువులకు సరిపడునని నేఁదలంచితి. క్షణ మూరకుండి క్షణము రీతిగా "గూఁ గూఁ," అనుభీతిజనక నిస్స్వన మొక్కఁ డెచ్చట నుండియో వినవచ్చుచుండెను. నాముందు నడచువాఁడు పురుషుఁడే కావున వానివీఁపును జేతగోకి యిదేమని యడిగితిని. శకునములపక్షి యఱచుచున్నది. మాటాడక రండని వడివడి నడచుచుండెను. విధిలేక నేను వారివెంటఁ బరువెత్తుచుంటిని. వారిగమనము జింకలవేగమును మించియుండెను. నోట నురుగువచ్చుచుండ నేనెట్లో యేలినవారిపాదభక్తిమెయిఁ బోవసాగితి. అర్ధక్రోశము నీటినుండియేపోఁగా నొకపాదనడుమ వంగి వారు గట్టెక్కిరి నేనచ్చట రక్తాంశుకచ్ఛిద్రము నొకకొమ్మకుఁ గట్టుచుండ వారు చిటికవేసి రమ్మనిరి. నే నెట్లో వంగి యాయిరుకుదారిని గట్టెక్కితిని. ఆపొదలోఁ దూఱియే కొంతదూర మరిగితిమి. ఆత్రోవ కొండక్రింద మమ్ముఁ జేర్చెను. పంచముఖాశ్మవ్రాతముల నడుమ నొకచిన్నదారి యుండెను. కాని గడ్డి మార్గమునావరించి యుండెను. ఇరుప్రక్కల భూరిభూరుహనివహములు స్వేచ్ఛగ మింటివంకఁ జూచుచు నెదిగియుండెను. అవియు విరళములుగాక సాంద్రముగానుండెను. ఇరుప్రక్కలనున్న యాతరుశాఖలంగూర్చుటకు లతాలలనలు ప్రేమరసనిబిడ పక్ష్ములఁ దగిల్చెనో యన నవి చేరియుండుటంబట్టి వితానిక యలవరింపనున్న చందమున నుండెను. మొదటనే గాఢాంధకారము. ఆపైని భూరుహశాఖల కల్లుకొని తీఁగెలు సందులేకుండ నున్నవి. ఇంకఁ జెప్పవలసినదేమి? వీనికిందోడుగా

నాలుగైదుగడియలరాత్రియున్నది. శశాంకుఁ డాకాశరంగమునుండి వెడలి యెందో పోయెను. మార్గమా పంచవక్త్రదుస్తరప్రస్తరప్రశస్తిఁ గాంచినది. కొండగడ్డిగంటలుగా సందులేక యావరించి యీదారి మనుజులరుగుటకు నిర్మింపఁబడినదికాదు. రావలదని చాటుచుండును. మంత్రిశేఖరా! ఆదారి నేమని వర్ణింపఁగలను! హరిణతరుణులవలె నావనితలిరువురు వానిం దాఁటుచుఁ బోవుచు నాకై యించుక నిలుచుచు నుందురు చక్కఁగాఁ బైకెక్కవలయును. నిశ్వాసవాయువు లవకాశమీయక వెడలుచుండ నోటినుండి డిండీరఖండములంబోలి నురుగు పరుగిడుచుండ నాస్థితి వర్ణనాతీతమై జాలిగొల్పుచుండెను. నా కించుకంతయు ధైర్యము కలుగలేదు. ఆపురుషుఁ డపుడప్పు డంతబరువెత్తుకొని రురుశాబకముభంగిఁ బరుఁగువాఱుచు నన్నుఁ జేసాఁచి పైకెక్కించుచుంట స్మరింపఁదగినవిషయము. అట్లెక్కియెక్కి యించుక ప్రభాతలక్షణములు కన్పట్టుచుండ విశాలభాగము చేరితిమి. క్రిందఁజూడ నించుకించుక యారామములు నీలాంశుకము గప్పిన భూభాగముచందమునఁగన్పట్టసాగెను. ఇంతదూర మేవిధమున నెక్కివచ్చితినా యని నాకే యాశ్చర్యము గలుగుచుండెను. ఊరువులు ముందున కొకయడుగైనఁ బెట్టనీయమని పట్టుపట్టెను. పైవారియానతి దాఁటమని పదములు కదలకయుండెను. మనస్సు నీనికి సంధికుదుర్పఁ బ్రయత్నించుచుండెను. కాని ముహూర్తకాలము సంధికవకాశమే లేకుండెను. మనస్సు బ్రతిమాలుటంబట్టియో మఱేమి కారణమో నేను జెప్పఁజాలనుగాని యించుక

యడుగిడునవకాశ మేర్పడియెను. ఎట్లో వారివెంటఁ బోవుచు మరల నాతనివీఁపును గరనఖమున స్పృశించితిని. ఆతఁడు తిరిగిచూచి మహానుభావా! కోటదరికి వచ్చితిమి. ఇంక మాటలాడవచ్చు. ఈమార్గమునఁ గ్రొత్తవారు రాఁజాలరు. మార్గము వారికి గోచరముకాదు. ఎవ్వరైనఁ జెప్పినచొప్పుం బట్టి వచ్చినచో నందందుఁ గావలియున్నభటులు పాషాణములు దొరలించి రూపుమాపుదురు. ఆభటు లెందుండునది యితరులకుఁ దెలియదు. మనమువచ్చుదారి కిరుప్రక్కల నెత్తుగా నున్నభాగములపై వారున్నవారు. ఈల యను ధ్వనిని నేను జేయుచుంట మీరు వినియుందురు. దానికిఁ బ్రతిధ్వనియు వచ్చుచుండెను. అదియే మారాకయు మేమెవరమో తెలియఁజేయును. ఇచ్చటికిఁ గోట యర్ధక్రోశదూరమునఁ గలదు. మన మీమార్గమునఁ బోవుచుండుట క్రింద నున్నవారి కెట్లును దెలియ సాధ్యముగాదు. సార్ధక్రోశదూరమున శత్రుసేనలుండు నరణ్యాని కలదు. ఇంకను బాగుగాఁ దెల్లవాఱఁగా వారు మనకు గోచరింతురు. మెల్లగా నడువవచ్చును. మనజాడ నెఱుంగ నితరులకు శక్యముకాదు. కావున మనకు భయములేదు. అనఁగా నేనును నలుప్రక్కలఁజూచుచు దానిరామణీయకమును బొగడుచుఁ బోవసాగితిని. సూర్యోదయమగువఱకుఁ గోట దరిఁ జేరితిమి. కోటకుఁ బాదక్రోశదూరమున నున్నతపర్వత భాగము గలదు. మేము దానిం జూడవలయునన్న శిరములఁ బైకెత్తవలసినదే. దానిపైభాగమునుండి విశాలపాషాణము లుత్తరదిశకుఁ బయనముచేయ నుంకించునట్లు దూరముసాగి

యుండును. ఒక్కొక్కబండక్రిందఁ దక్కువగాఁ జెప్పినను వేయిమంది వసియింపవచ్చును. వర్షాతపము లాక్రిందనున్న వారిని బాధింపఁజాలవు. ఈభాగము నెక్కవలయునా యంటిని. ఔనని వాఁడనియె. నాగుండెలు తటతట కొట్టుకొనసాగెను. ఈగండ మేవిధమునఁ గడచును భగవంతుఁడా యనుసంశయము హృదయమునఁ బాదుకొనియె. అడుగిడఁ జాలక కూలఁబడితిని. ఆపురుషుఁడు తిరిగిచూచి నన్ను లేవ నెత్తి నెత్తిమూటను గ్రిందనునిచి కాళ్లుపిసికి నాకించుక శక్తిని గల్గించెను. ఆయాఁడువారే ముహూర్తమునఁబుట్టిరో కాని యించుక యుస్సనియైన నన్నయట్టిజాడ కానరాలేదు. నిశ్చింతముగా నిరాయాసముగా నిలువఁబడిరి. కూరుచుండుఁ డమ్మలారా యంటినిగాని వారు సుస్మితముమోముఁ దమ్ములఁ జిందులాడ నీపాటికష్టమునకేనా యనిరి. మంత్రిపుంగవా! వారిమాటలు నాకు గాటమగు నచ్చెరువును గల్గింపఁజాలెను. నగరనివాసమునకన్న గ్రామనివాసము మిగుల నారోగ్యభాగ్యప్రదమని నాకుం గోచరించెను. నిర్దుష్టపదార్థములం దిననోచి మంచివాయువును సేవింపఁ గల్గిన పల్లీనివాస ముత్తమోత్తమమనుట చెల్లదా. వేసవి కాలమున నూట నీరుత్రాగుటకంటె నారోగ్యముగల్గ వేఱు మార్గమేది? దుష్పదార్థసమ్మిశ్రముగాని ఘృతము, తాత్కాలికతక్రము. ఘాసము మొసవి పడియనీరు త్రావి యడవుల సంచరించివచ్చు ధేనువులపాలు శాశ్వతారోగ్యప్రదాయకములు గావని యెవ్వఁ డనఁగలఁడు? ఒక్కొక్కజామును దెలుపుచున్న తామ్రచూడనినాదములు ఘటికాయంత్ర

ములకన్న మిన్నలుకావనవచ్చునా? వనవాయు పోతములు పొలయుట జీవితమువృద్ధికిఁ గారణమనుట బొంకనుట తగవగునా. ఇట్టియూహ లెన్నియో నామదిఁ బొదలెను.

అంత నెట్లో లేనిశక్తిని దెచ్చుకొని వారినిజూచుచు నీగండముగడచిన నూఱు టెంకాయలుకొట్టి యానీట నీకభిషేకముసేయుదును విరూపాక్షా! కృపాకరా! యని ప్రార్థించుచు స్త్రీలంగాంచిరైన నడువకున్న నవ్వుదురనుకొనుచు నెట్లో యడుగొక యామడగా దానినెక్కితిని. వాఁడు చేయూఁతయొసఁగకున్న నేనెక్కఁజాలను. దానిపైభాగమును జేరినంతనే యుదయభానుఁడు దృగ్గోచరుఁ డయ్యెను. తద్బాలభాను భానుచ్ఛటలుదయగిరిగండోపలములపయి నెత్తములమీఁద, వృక్షాగ్రములయందు వ్యాపించినపుడు తద్రామణీయకము వర్ణనాతీతముగా నుండెను. సముద్రవాయువులు నాయవయవార్తిని దొలఁగించి సంతోషమును గల్పించెను. సుఖవాయుస్పర్శ మెట్టిఫలము నొసఁగునో నేఁడెఱింగితినని తలంచితిని. సకలరోగములను నిర్మలవాయువు లడంచుననుట నిక్కమయ్యెను. కష్టానుభవానంతరముగాని సుఖస్వరూప మెఱుకపడదనిపల్కు ప్రాచీనుల పలుకులు సత్యములనియు నెఱింగితిని. హాయిగాఁదిని కూరుచుండినతఱిఁ జల్లనిగాలి వీచినను దత్సుఖ మిట్టిదని తెలియరాదు. దేహమెల్ల స్వేదబిందుసందోహసంభృతము కాఁగా నపుడు పిల్లవాయువులు పొలసినచోఁ దత్సుఖము చక్కఁగా నపుడే తెలియఁగలదు. ఇట్టి యద్భుతానుభవములు నా కెన్నియోకలిగెను.

మంత్రి—నీవచ్చటనుండి చూచునపుడు మనవాహినీసన్నాహము లేవియైనఁ దెలియవచ్చెనా?

కాంతరా—సచివవరేణ్యా! అత్యున్నతశిఖరాగ్రమునుండి నేను జూచునపుడు మనవీరభటు లెఱ్ఱచీమలచాలువలెఁ గనఁబడిరి. చీమల సంరంభము లెంతఫలించునో మనవీరభటుల ప్రయత్నము లంతే ఫలించునని తలంచితి. చాలసేపు నిలుచుండిచూచిన వారేమి యనుమాన పడుదురో యని కపటనాటక మభినయించుచు హాయిగానున్న చందముఁ గనఁబఱచుచుఁ గొలఁదియడుగులు పెట్టి వారితో నేనింక రాఁజాలను ఇందె నిలిచి వనమూలికల నెమకుచుండెద. అవకాశమున్న నాకుఁ గొంచెముగ నావుపాలం దెచ్చియిండు. అని యొకచోటు కనఁబఱచి యందుండువాఁడ. మధ్యాహ్నము తఱిరండు. మాటలాడెదనని ధ్యాన మభినయించుచు భాస్కరబింబమునడుమ దృష్టినునిచితిని. వారు నన్నుం దోడ్కొనిపోవ నెంచువారుగావునఁ బలుభంగులఁ బ్రతిమాలి యంతఃపురమునకుఁ బిలుచుకొని పొమ్మని మాయధికారులయాజ్ఞ. కావున రమ్మని పట్టుపట్టి తోడ్కొనిపోయిరి. కోట చెంతకుం బోఁగా నతిభయంకరముగాఁగన్పట్టెను. బురుజులపై నయోగోళములు తైలసంభృతములై సిద్ధపఱుపఁబడి యుండెను. నళికాయంత్రములు నిర్గమనద్వారములకడ సమర్పఁబడియుండెను. వీరభటులు ముప్పదిరెండాయుధములను దాల్చి యేమఱుపాటు కలలోనైన నెఱుంగని తెఱంగునఁ గాచుచుండిరి. ఎవ్వరుగాని క్రొత్తవారు లోపలికరుగఁగూడదను నిర్బంధము కలదు. నన్నుఁ జూడఁగనే హస్తసంజ్ఞచే దూరమునుండి ద్వారముకడ కరుగుపురుషు నదలించెను. ఆసంజ్ఞయే రూక్షతమముగా నుండెను. ఆపురుషుఁడు మాత్ర మా

తనిచెంతకుంబోయి చెవిలో నేమో చెప్పెను. వాఁడు మఱియొకనిం బంపెను. వాఁడు రెండుగడియలకుఁగాని రాఁడాయెను. అపుడు నన్నుఁదోడ్కొనిపోవ నతఁడు సమ్మతించెను. ద్వారమునఁ దూఱితిని. ఇరుప్రక్కల వేలకుమించిన యాయుధము లమర్పఁబడియుండెను. అవి చూడంజూడ నాకునసున వణఁకు జనించెను. ఒడలంతయు స్వేదబిందుబృందముల నలంకృతమయ్యెను. దృష్టిమందత ననుకరించెను. ఎట్లో నాలోపములఁ గనఁబడనీయక వారివెంటఁ బోవసాగితి. ప్రథమద్వారమునుండి నిర్గమించి ద్వితీయద్వారముకడఁ జేరఁగల్గితిమి. ఆయంతరమునఁ బెక్కుమంది యోధు లాయుధములను సిద్ధము చేయుచుండిరి. యుద్ధముచేయునపుడు చూపఁదగు పన్నాగములఁ గొందఱలవఱచుకొనుచుండిరి. గురిచూచు పద్ధతి కొందఱకు నేర్పఁబడుచుండెను. అత్యున్నతభూరుహములకొమ్మల కాయుధములు తళతళలాడునట్లు వ్రేలాడఁజేయఁబడియుండెను. నళికాయంత్రములు (తుపాకులు) క్రొత్తక్రొత్తపద్ధతులఁ జేయఁబడుచుండెను. ఆభాగము చల్లగా నుండెను. రెండవద్వారమున భటుఁ డదల్చెనుగాని ప్రథమ ద్వారరక్షకభటకృతహస్తచిహ్నముననూరకుండెను. ఆద్వారమునకు రెండుప్రక్కలను భటులు కొందఱు కూరుచుండి గుసగుస లాడుచుండిరి. వారిముఖలావణ్యము లానందసాగరమున నోలలాడులక్షణములఁ గనఁబఱచుచుండెను. శత్రువులు ముట్టడించినపు డెట్లు వారిం బాఱఁదోలవలయునను నాలోచనములు చేయుచున్నట్లూహించితి. ద్వారము దాఁటితి. దానికిని దరువాతిద్వారమునకు నడుమ విశాల

భాగము గలదు. అందు మనోహర పుష్పవాటిక గలదు. పొదరిండ్లందుఁ గానంబడు. కుసుమవిసరముపయిం బొలసి యందుఁ బొరలాడి యనిలబాలకుఁ డందందు మందమందగమనంబున నాడుచుండు. అందుఁ జలువరాతిన్నియలు దృగ్గోచరంబులగు. వానిపై నెప్పుడేని భూపాలకుఁడు కూరుచుండి శీతభానుని వేడుకమెయిం జూచుట వాడుకయఁట. ఆతిన్నెలఁ గూరుచున్నపుడు వృక్షములు కోటగోడలు నెత్తుగానుండుట సాగరానిలుఁడు వ్యాపింప నవకాశము లేకుండునేమో యనుసంశయ మంకురింప నవకాశమే లేదు. సదా శీతలవాతపోతము లందుఁ జరియించుచు నెల్లవారి మానసములఁ జల్లఁజేయుచుండు. మూఁడవ నాల్గవద్వారముల కంతర్భాగము మిగుల విశాలము. అందు భక్షణపదార్థములు సేకరించి యుంచినతావులు గలవు. పండ్రెండు వత్సరముల దనుక నేకొఱంతలేక యందున్నవారెల్ల హాయిగా నుండఁ గలరు. కూరగాయలుతప్పఁ దక్కినవన్నియు నందుఁగలవు. తమలపాకులు, కొన్నివిధముల కూరగాయలు మాత్రము క్రిందినుండి రావలసియుండు. ఇట్లే మఱికొన్ని ద్వారముల దాఁటి యొకదారిమాని వేఱొకదారి నంతఃపురమునకుం గొంపోయిరి. అందొక్క దేవాలయము గలదు. అంతఃపుర పురంధ్రీమణు లావేణుగోపాల బాలవిగ్రహమును బూజించువారఁట. అది చిన్నదేయైనను క్షీరోపలములచేఁ గట్టఁబడి మనోజ్ఞతమముగా నుండెను. అద్దానిముందొక మండపము గలదు. దాని స్తంభములు స్నిగ్ధతమములు. నల్లచీమలుకూడ వానిఁ బ్రాకఁజాలవన నిఁక దాని స్నిగ్ధతయెట్టిదో వచింప

నక్కఱ యుండదు. దానికి నలుప్రక్కల మాలతీలతా మండపములు గలవు. నిరంతరపుష్పవంతములని నాకుం దోఁచెను. శీతలతరువ్రాతము లందు దట్టముగా నుండును. అందు విడిది నాకు నేర్పఱుపఁ బడియె.

నాకుఁ బరిపక్వఫలములు క్షీరములు శర్కరాదిపదార్థములు పంపఁబడియె. సాయంకాలము దనుక నేనా దేవాలయవైభవమును జూచుచుంటిని. సూర్యుఁ డస్తమించుటకుముందొకముహూర్తము కలదనఁగా నొక ర్తుక పరిచారికవచ్చి రాణిగారు రాఁదలంచి యున్నవారు. సమయమేకదా యని ప్రశ్నించెను. సుసమయమే. అని శాంతరసముట్టిపడ బల్కితిని. కొలఁది విఘటికలకు మంజీరమృదునాదములు శ్రుతిపేయము లయ్యెను. ధ్యాననిమీలితలోచనుఁడనై యుండఁ గతిపయసఖీవృతరాజ్ఞీ దర్శన మబ్బెను. మేలిముసుంగుఁ దిగిచి రాజ్ఞ వనితోచితవిధి నమస్కరించి సఖీసంస్థాపితమృదుతమకంబళాసనమునఁ గూరుచుండెను. కుశలప్రశ్నానంతర మామె పెక్కుప్రశ్నములఁ జేసెను. తగినచందమున ధ్యాననిష్ఠఁ గనఁబఱచికొన్నింటికి, జ్యోతిశ్శాస్త్రము నాశ్రయించి కొన్నింటికి బదులుచెప్పితిని. వారిప్రశ్నసారము జయమా అపజయమా యనియే. ఆదానిని వెలిఁబుచ్చక చమత్కారముగా వారు ప్రశ్నించిరి. అతికష్టముగాఁ దోఁచి పిదప సంతోషము గలుగును. ఇదంతయుఁ బురుషుల మూలమునఁ గాదు. స్త్రీలవంక నెఱవేఱును. ఆపత్తుగాఁ దొలుతఁ దోఁచునుగాని పిదప సంతోషముగాఁ గార్యము ముగియును. అని యంటీయంటనట్లు పలికితిని. ఒకయాపదగలిగి తల్లడంపడు ప్రాణికి సుఖముకలుగుట కేమేని సాయము చేయుదురాయని

మరలఁ బ్రశ్నించిరి. సెలవైనచో సత్యద్భుతముగ మూలికాప్రభావమును గనఁబఱచెద. యంత్రము వేసెద. మంత్రము జపించెద. నాశక్తికొలఁది సహాయము చేసెద. అని నచ్చఁజెప్పితి. వారాత్రంపడుచుఁ దుదకుఁ దమకోటకుఁ బాటిల్లిన యాపద్వృత్తాంతము వెల్లడించిరి. వారిభయము తొలంగునట్లు పౌరుషములు పలికి నమ్మించితి. అందులకు వలయు పరికరములఁ దెల్పిన బంపుదుమనిరి. కాని నేను నవ్వి తల్లీ! వస్తువులతోను, ద్రవ్యముతోను మావంటి పరమేశ్వరుదూతలకుఁ బనియేమి ? ప్రాణము లుండువఱకు శక్తివంచనము సేయక మమ్ము నమ్మినవారికిఁ దోడ్పడుటయే మాపని. మా యీ తపస్సంతయుఁ దదర్థమే. మీవలన మాకు ధనమువలదు. దాఁపక మీకష్టము లెఱింగించితిరి. ఈవిధముగా సాయముచేయుదుమని దాఁపక మేము వచింపరాదు. మంత్రతంత్రములు రహస్యములు గదా. కార్యాంతమునఁ దత్ఫలమెఱుక పడవలయును. అట్టి విశ్వాసము మీకుఁ గల్గిన నోపినంత బ్రయత్నింతుము. మఱొక్కమాట. మాచేయు మంత్రతంత్రములు శ్మశానప్రాంతమునఁ జేయఁదగినవి. కావున మేమే వేళలఁ దిరుగుచున్న నెవ్వరు పలుకరింపరాదు. కార్యభంగము చేయరాదు. అట్టిగట్టిమాట మీరొసంగిన నిప్పుడ కార్యమునకుం గడంగెద.

అనఁగా రాజ్ఞీ ప్రభృతు లానందపరవశులై యట్టికట్టడి చేయింతుమని సమ్మతిం దెలిపి నాకువలయు నాహారముల సమకూర్పను, బూజాద్రవ్యముల నేకరింపను, దగువారి నియోగించి యంతిపురమునకుఁ బోయిరి. ఆమఱుదినమునుండి యిరుప్రొద్దులఁ బరమోభత్స్యములం గొనుచుఁ జల్లనిగాలికిఁ దిరుగుచు శ్మశాన

ప్రాంతముల రాత్రి కొంతసేపటిచేత బ్రాణము లుంచుకొని యెట్లో యుండుచు హోమము చేసినట్లు నటించుచు నడురేయిఁ గోటచెంత మసలుచు నేరీతినో సార్థమాసమాత్రము గడపితిని. ఆటవికులతో నాకెక్కువ స్నేహము కుదిరినది. వారిని గష్టముగా రాజునం దభిమానము గనఁబఱచి నమ్మించితిని. రాణువయెంతయున్నదనియు నడిగితిని. వారిసేనయంతయు నస్మదీయసేనలయందు నాల్గవపాలున్నది. దిట్టమగు కోటసాయము తప్ప వేఱొండు సహాయము వారికి లేదనుట నిశ్చయము. రెండుమూఁడు సారులు నేఁబోయిన మార్గముననే క్రిందికివచ్చి చక్కఁగా గుఱుతించితిని. మార్గమిపుడు స్పష్టముగాఁ జూపఁగలనని ధైర్యము కలదు. అందందుఁ జెట్లకు గండోపలములకు గుఱుతుగాఁ గొన్ని వస్తువులఁ గట్టితిని. వాని నెవరు గుఱుతింపఁజాలరు. ఇతరుల కవ్వానిం బరీక్షింప నవసరములేదు. కావున నే మార్గదర్శకుఁడ నయ్యెదను. ఆమార్గముతప్ప వేఱుమార్గ మీఁగిరి నెక్కఁగానరాదు. సాధారణముగా నందఱు వచ్చు మార్గమునంబోయిన నొక్కగండోపలము దొరలించినఁ బెక్కువేలమంది చూర్ణమగుదురు. అట్టి వెన్నియో సాధనములాత్రోవయం దమర్పఁబడియున్నవి. ఇవియే నేనటఁ బరీక్షించివచ్చిన విషయములు. ఇఁకమీఁద నేలినవారి చిత్తము. అని కాంతరాయఁ డూరకుండెను.

మంత్రి.—ప్రభుశిరోమణింజూచి మహాప్రభూ! కాంతరాయని సాయము మనకార్యము సఫలముచేయఁగలదు ఇఁక నిశ్చింతగా నుండుఁడు. సమయముఁ బ్రతీక్షించి కోట లగ్గలుపట్టఁజేసి యాప్రకారము విన్నవించెద.

ప్రభు.—అప్పా! కాంతరాయఁ డామార్గమునఁ బోవునపుడందందు వీరభటులు హెచ్చరికఁగల్గి యుండిరనియు, నీతనిం దోడ్కొని పోవునతఁ డీలతో వారికిం దమరాకఁ దెలిపెననియుఁ దెలిసెఁగదా. సేనాసముదయము పోవుచుండ వారు హెచ్చరిక లేకుందురా. కొండయెక్కునపుడు మనవీరులు సాహసముఁ జూపఁజాలుదురా. వీరభటవర్యులను బర్వతమున కాహుతిగా నీవలసియుండునుగదా. అయినను సంగరరంగమునవిజయము సంశయముగదా. ఇందులకేమి యూహించితివో తెల్పుమని విన్నదనముతోఁ బ్రశ్నించెను. మంత్రియు మహారాజువిచారమును దీర్పనెంచి: కాంతరాయని కనుజ్ఞనొసంగి నీకృత్యము సఫలమౌనుగాక యని నవ్వుచుఁ బలికి సాగనంపి; యేకాంతమున రాయలతో మనము నాలుగయిదుదినము లూరకుండి బ్రాహ్మణసంతర్పణ మొకదానిం జేయుదము. దాన మనకెంత యుపకారము కల్గునో యేలినవారికే విశదము కాఁగలదు. నాప్రార్థన మాలకించి నిశ్చింతగ నుండుఁడని విన్నవింప రాజశశాంకుఁ డామాటలకూఱడిల్లి తనశిబిరమునకుం బోయెను. మంత్రియుఁ దన విడిదికింబోయి కార్యాలోచనము చేయుచుండెను. కాంతరాయఁడు సచివాగ్రణి సెలవుఁగైకొని తననివాసమున కేగి తనపని యెట్లు ఫలించునో యని యువ్విళ్లూరుచుండెను.

ఇచ్చటిస్థితి యిట్లుండఁగా నిఁకఁ గోటస్థితి యెట్లున్నదని విచారింపవలయును. బైరాగి పట్టుమని నెలదినములు దుర్గప్రాంతములఁ దిరిగి యేవేవో కుతంత్రములుపన్ని శ్మశానమున రవంతసేపు గూరుచుండి దిట్టముగాఁ బాలుత్రాగి ఫలాహారములఁ

బొట్టఁ బెంచుకొని చెప్పకపోయె నన్నవార్త దుర్గము నలుప్రక్కల వ్యాపించెను. ఎల్ల రాశ్చర్యచకితు లైరి. పల్లెటూరువారి పొరపాటున నిట్లు జరగినదని యెల్లరు నిశ్చయించిరి. ప్రభువు మంత్రియు దండనాయకులు నొకచోఁగూడి కృత్యమిదమిత్థమని యాలోచించిరి. అంతఃపురమునకు నిట్టివారి నెవరినిగాని పిలుచుకొనివచ్చిన వారికి శిరశ్ఛేదము శిక్షగా నాజ్ఞాపించిరి. ద్వారపాలకుల కీవిషయము తెలుపఁబడియె. ఎవ్వరినిగాని రానీయఁగూడదను గట్టియుత్తరు వీయఁబడియె. పర్వతము నలుప్రక్కలు కాపాడఁబడునట్లు చేయఁబడియె. యుద్ధమాసన్నమగుననియు, శత్రువులు దుర్గము నాక్రమింప రాఁ బ్రయత్నింతురుగానఁ, బర్వతముదగ్గరకు రాకయుండఁ జేయవలయునన్నయూహ దండనాయకులకుం దోఁచెను. మార్గములెట్టివికాని చక్కఁగా రక్షింప భటుల నేర్పఱచిరి. ఆయుధములు సంసిద్ధము చేయించిరి. సర్వవిధప్రయత్నములు తృప్తికరముగాఁజేసి యుద్ధసన్నద్ధు లైయుండిరి. ఎట్టివేషధారులుగాని పర్వత మెక్కరాదని కట్టుదిట్టములఁజేసి యెల్లరకుం దెల్పిరి. ద్వారప్రదేశముల రేయింబవళ్లు వీరభటులు నిలిచి యేమఱుపాటులేక కాపాడవలసినట్లును, దానిని బరీక్షించుచుండుటకును గొందఱును నియమింపఁబడిరి. ఎట్టిదిట్టగాని దుర్గమును గన్నెత్తియైనఁ జూడఁజాలఁడన్న విశ్వాసము నెల్లవారికిం గల్గించి దండనాథులు తమకృత్యమును సఫలము గావించిరి. ఈవార్తలెట్లో పర్వతము క్రిందిభాగమునకుం బ్రాఁకి యెల్లెడల నల్లుకొనియెను. ఆబైరాగి కనంబడినఁ గట్టి కొట్టి కైకొనిపోయి దుర్గమునఁ గారాబద్ధుని జేయవలయునని పల్లెలలోనివారుం

గూడ నిశ్చయించుకొనిరి. క్రమక్రమముగాఁ గ్రిందినుండి పదార్థములు పైకిఁ గొనిపోవుటకుంగూడ రాయలసేనలమూలమున నాటంకము గలుగసాఁగెను కావున సేకరించిన యాహారవస్తువులచేతనే యీదినములు గడుపవలయునన్న యూహాలు దుర్గమునసుండువారలకుం గల్గెను. కాని యెన్నియోవత్సరములు మన మితరాపేక్షలేక హాయిగా జీవింపఁగలమన్న ధైర్యము వారికింగలదు. అది హేతువుగా వారు నిశ్చింతముగా నుండిరి. దుర్గప్రధానుల కిట్టిధైర్యము గలుగుట స్వభావమేకదా! ఐనను బుద్ధిమంతులు దైవగతి బలవత్తరమనియు, నది యనుకూలముగ నున్నప్పుడే దుర్గములు దుర్గమములుగాని యది ప్రతికూలమైనపుడు దుర్గములు శత్రుసుగమములగునని యూహింపవలయును.

అట్టితఱిఁ బర్వతరక్షకులలో నొకవీరభటుఁడు బిచ్చగాని నొకనిం బట్టి చేతులకు శృంఖలములఁ దగిలించి తెచ్చి సేనాధ్యక్షున కప్పగించెను. ఆతఁ డతని నందే యుండ నియమించి వీరావేశము నటించుచు నాభటుని మెచ్చుకొని తగినపసదనం బిచ్చి పంపివైచి యేకాంతగృహమునకు నాతనిం గొనిపోవ నియమించి యచ్చటికృత్యములం దీర్చి తా నాగేహమునకుంబోయి యాతనిపాటుల కనుతాపముం జూపుచు శృంఖలాదులం దానే తీసివైచి యింటికింబోయి భుజించిరమ్మని పంపి యతని రాకకై వేచియుండెను. రామరావు తనగృహమున కరిగి యథాపూర్వవేషమున నందఱకుఁ గనఁబడి యభ్యంగనాదులఁ దన బడలిక లడఁగ భుజించి నిర్దిష్టసమయమునకు సేనాధిపతి దర్శనము

చేయఁబోయెను. ఉచితమర్యాదల నాతఁడు దనిపిన హృష్టుఁడై వృత్తాంతమును జెప్ప నారంభించెను.

దుర్గపాలకులయానతి యాఁదలందాల్చి యావేషమునఁ బల్లెలందిరుగుచు శ్వాసాధిక్యము నటించుచు నెన్నియో మందులం బుచ్చుకొనుచు, నోషధుల సేకరించి చెంతనునిచికొని యప్పుడప్పు డెల్లరుం జూచునపుడు భక్తిపూర్వకముగ సేవించుచు, రోగశాంతింగోరి కనఁబడిన సాధువులనెల్ల నౌషధము గలదా యని ప్రశ్నించుచు, వా రుపదేశించునట్టి పద్ధతుల వ్రాసికొనుచుఁ బడమటిభాగమునఁ గొండక్రిందనుండు శత్రుశిబిరప్రాంతములకుం బోయితిని. అందు మనయాటవికుల గుడిసెలు గలవు. అందలి వారలశత్రువులు బందీకృతులంజేసియుండిరి. ఆవార్త కర్ణాకర్ణికగా నాకుఁ దెలిసెను. ఆయిండ్లకడకుంబోయి వారిగృహములం గాపాడుచుండిన కావలివారలం బ్రశ్నించి వారియనుమతినొంది లోనఁ జొచ్చితిని. ఆగుడిసె లుండుతావునకు గూడెమని పేరు. అందలివారెల్ల బోయ లనఁబడుదురు. వ్యాధవంశము వారిదని ప్రసిద్ధము. వారికడ కేలపోవ వలయునని నన్నుం బ్రశ్నించు శత్రుభటులతో వినయముగా నోషధులకొఱకని విన్నవించి రోగినని వారు నమ్మినందున వారికరుణకుం బాత్రుఁడనై యెట్లో గూడెములోఁ దూఱితిని. ఆడువా రందు నన్ను నాదరించి తమకుంగల్గిన విపత్తుం దెలిపిరి. నాలుగైదు పేరులడిగి యామోషధులు మాకుఁ దెలియవని వారు పలుక నందు రెండు మూఁడు దినములు నివసించితిని. నాకడనున్న యాహారవస్తువులు యల్కించి దవశిష్టములుగా ముగిసెను. సైనికులనడిగియే సంగ్రహింపవలయు ననుకొంటిని. నారోగబాధ నపుడపుడు వారు

చూచువారు గావున నన్నుఁ గనికరముతోఁ జూచుచు నాహారము నిచ్చుచుండిరి. వారెల్ల బలపరాక్రమముల మనవారికిఁ దగ్గిపోవువారు కారు. సంఖ్యంబట్టి పరికింప మనసేనకన్న నాల్గు మడుంగు లధికులుగ నున్నవారు. సాధనము లపారముగాఁ గలవు. మార్గమునందందందు సహాయసైనికుల నునిచినట్లు వారిమాటంబట్టియే కనుఁగొంటిని. వారి యుత్సాహమునకు మితియనునదియే లేదు. దండనాయకులయాటోప మపారము. మంత్రులతోడ్పాటు వర్ణనాతీతము. ప్రభువునాదరణము వర్ణింప నలవికానిది. వీనినన్నింటిని బరీక్షింపఁగా వారికి విజయముగల్గునన్న నమ్మకము సంపూర్ణముగాఁ గలదని తోఁచెడిని. రక్షకభటులెల్లఁ గడునిపుణులు. ఏమఱుపాటు సుంతయు వారియందుఁ గానఁబడదు. ఏక్షణమున లగ్గలుపట్టి కోట నాక్రమింతుమా యని వారు ముహూర్తముల లెక్కించుచున్నవారు. విజయశ్రీ తమతేనిఁ దప్పక వరించునన్న దృఢవిశ్వాసము వారికింగలదు. రాకొమరితను బెండ్లియాడ వారిప్రభువు గోరి యీముట్టడి సల్పుచున్నాఁడట. ఇది వారివాక్పరిపాటింబట్టికాక స్పష్టముగ వారిమాటలంబట్టియే తెలిసికొంటిని. ఇన్నియుత్సాహములు వారికున్నను దుర్గాక్రమణమార్గము తెలియంబడమి దానిం దెలిసికొన వేచియున్నవారు. నాపరీక్షించిన విషయము లివ్వియని రామరావు వచించి తనస్థానము నాక్రమించెను.

ఆమాటలు వినఁబడఁగనే దుర్గపాలకుఁడు మండిపడి రేపకడఁ బ్రభునాస్థానమున రహస్యగోష్ఠి సాగునుగానఁ దప్పక రమ్మని యాజ్ఞాపించి తా వెడలి పోయెను. మఱునినము, రేపకడ

రహస్యగోష్ఠి నందఱు చేరిరి. రామరాయఁ డుచితరీతి నందుఁ గూరుచుండెను. దుర్గపాలకుఁడు లేచి యిట్లు విన్నవించెను. ప్రభువతంసమా! మంత్రివరులారా! కొలఁదిమాసములనుండి శత్రువులు మనదుర్గమును ముట్టడించియుండుట విశదమే కదా. ఓపినంతవఱకుఁ బోరాడ నిశ్చయించితిమి. తదనురూపప్రయత్నములు సిద్ధముచేసి యుద్ధసన్నద్ధులమై మేనఁ బ్రాణములుండుదాఁకఁ బౌరుషము చూప నిశ్చయించితిమి. కొలఁదిదినముల క్రిందట రామరాయని భిక్షువేషమున శత్రువుల యాలోచనముల తెఱంగెఱుంగఁగోరి పంపితిని. నిన్ననే వచ్చి యతఁడు తనయుద్యమఫలమంతయుఁ జెప్పెను. రాజ్యము నాక్రమించు కోరిక రాజులకుఁ బొడముట నైజమే కాని యందేమియు విపరీతము కానరాదు. ఐనను రాజులకు దురూహ లుండరాదు. మర్యాద యనున దండఱకు సమానమే. శత్రుకుటుంబము తనచేతఁ జిక్కినను క్షత్రియకులజనితుఁడు తత్కుటుంబము మర్యాదమెయి రక్షింపవలయునే కాని మానహానియగునట్లు ప్రవర్తింపరాదు. ఇది సనాతనమగు నాచారము కాని వేఱుగాదు. ప్రకృతస్థితి ననుసరించి నాలుగుమాటలు విన్నవించెదను. కృష్ణరాయలు మనప్రభువతంసమునకుఁ బుత్త్రికారత్నము కలదని, యామె నెట్లైనఁ బెండ్లియాడవలయునని, తన్నిమిత్తమే యీ దండయాత్ర సలుపఁ బ్రయత్నించెనని రామరాయఁ డెఱింగి వచ్చి నాకుఁ దెలిపెను. ఆమాట శ్రుతులఁ బడినప్పటినుండి నామనం బుడుకుచున్నయది. కావునఁ దెగించి కులమర్యాదను గాపాడునిమిత్తమై మనము ప్రాణము లర్పింపవలసియుండును. బలవంతముగాఁ బెండ్లియాడుట యనఁగా నర్థమేమి? అడిగిన

నామె నీయరను ననుమానముననేకదా. పరమపావనవంశమున జనించిన కన్యారత్నమును గులహీనున కీయఁజెల్లునా? ఇంతకంటె గౌరవహీనమగుపని ఫేఱొకటి కలదా. ఈవిషయమంతయు నాలోచించి యెట్లు మనము ప్రవర్తింపనగునో యోచింపుఁడు. కార్యము నిర్ణయింపుఁడు. అనిపలికి దుర్గపాలకుఁ డూరకుండెను. వెంటనే సచివోత్తముఁడగు గోపాలరాయఁడు లేచి కన్నులనుండి నిప్పుకణములు వెడలుచుండఁగా నిట్లు పలికెను.

గోపాలరాయఁడు.—వీరాగ్రేసరులారా! వింటిరికదా. క్షత్రియవంశమునకుఁ బ్రధానాలంకారము మర్యాదయే. దానిని వీటఁబుచ్చుట వంశనాశనమున కంగీకరించినట్లే కదా. పూర్వకాలమునుండి గజపతివంశము క్షత్రియకులావతంసమని ప్రఖ్యాతిం గాంచినది. ఈవంశమును గాంచి మర్యాద నందఱు రాజులు నేర్చుకొనుచుండిరి. అనన్వయాలంకారమున కుదాహరణ మీవంశమనుట నిర్వివాదాంశము. పాలవంటి యీ వంశమునకుఁ గళంక మించుకంతయుఁ గల్గినదియే లేదు. తన కళంకము నెఱింగియే రాయలీపన్నాగమును బన్నెను. ఏవో నాల్గుదుర్గములను వశపఱచుకొంటినన్న దుర్వారగర్వమున విఱ్ఱవీఁగి యుదయగిరి దుర్గమట్లే సాధ్యమగునని భావించి దండెత్తి వచ్చినవాఁడు. ఈదుర్గ మరిజనసుదుర్గమని యెఱుంగఁడు కాఁబోలు. ఎందఱో యీవఱకే తద్దుర్గాక్రమణకుతూహలమున వచ్చి నామమాత్రావశిష్టులైరి. ఈ రాజునకు నాగతి పట్టవలసిన పంతమున్నదేమో. ఈకులహీనుఁడు మర్యాదావిభూషితమగు గజపతివంశమునఁ బుట్టిన కన్యకారత్నమును గ్రహింపనెంచి దండెత్తివచ్చుట వెఱ్ఱితనముగాక మఱేమి?

కావున రాజాజ్ఞ ననుసరించి మనము పోరాడి విజయలక్ష్మిని గాంచుటొండె, దైవము విపరీతమగుచో మానరక్షణార్థము ప్రాణముల నర్పించి సురపురవరమును జూఱఁగొనుటొండె మనము చేయఁదగు కృత్యమని నాకుఁ దోఁచెడిని. ఇంతదనుకఁ జేసినప్రయత్నము లత్యల్పములు. ఇఁకఁదగినప్రయత్నములు చేయవలయును. శత్రువులు పర్వతముక్రింద నున్నవారు. పదార్థములలోపము మనకు లేదుగాని దాన లాభమేమి? మనరాజ్యమును వా రాక్రమించి పాలింతురు. మన ప్రజలకు మనపైఁగల యనురాగము కృశించు. పన్నులు వారే కైకొందురు. పదార్థములకై మన ప్రజల బలుబాములం బెట్టుదురు. అప్పుడు మనముండి ప్రజలకు లాభమేమి? ఇన్నినెలలైనను రహస్యమార్గమున మనప్రజలు మనలఁ జూడవచ్చుచున్నవారు. మన యుద్యోగులు వెళ్లుచు వచ్చుచున్నారు. కాఁబట్టి యింతదనుకఁ బ్రజలకు మనపైఁగల యనురాగమునకు లోటులేకున్నది. మనల సరిరాజులు లొంగఁదీయఁజాలరన్న విశ్వాసమున కించుకంతయు లోపములేక యున్నదని మనము నమ్మవచ్చును. కావుననే యనుదినము ప్రజ లెన్నికష్టములపాలైనను వచ్చుచుం బోవుచుఁ, బరుల కించుకంతయు మర్మములఁ దెలియనీయక ద్రవ్యమును బంపుచుఁ, బదార్థముల సేకరించి రహస్యమార్గములఁ గోటకు వానిం జేర్చుచు, సైనికులకు వలయుసాధనములం గూర్చుచు నున్నవారు. ఇంతకంటెఁ బ్రజానురాగ మేమి కావలయును? వారిలోపముగాని మన లోపముగాని లేదు. దైవము ప్రతిపక్షులయెడఁ బక్షపాతమూనెనని దూఱ నవకాశము లేదు. ఇఁక మీఁద నెట్లుండునో

వచింపఁజాలను. చేయఁదగు కార్యముల నాకుం దోఁచినంతదనుక వచించితిని. ఇంకను విశేషించి మీకుఁ దోఁచినమార్గముల వెల్లడింపుఁడు. మర్యాదనుగాపాడఁ బ్రయత్నింపుఁడు. దేహము క్షణభంగురమని యెల్లరకుం దెల్లమే కదా. యశః, కీర్తులు కల్పాంతస్థితిం గాంచునట్టిది. ఈతుచ్ఛతమమగు శరీరమును నమ్మి వానిం బోఁగొట్టుకొనుట పురుషవ్యాపారము కాదు. అందును క్షత్రియజాతికి ముఖ్యముగా నార్జింపఁదగిన యమూల్యద్రవ్యరాశి మర్యాదయే యనక తప్పదు. నాచెప్పినవియు మీరు చెప్పఁగలవియును జేరి కార్యమును సాధింప దక్షములగుఁగాక. భగవంతుఁడు మనకుఁ దోడునీడయై యుండుఁగాక. జయలక్ష్మి మనపైఁ గటాక్షదృష్టిం బ్రసరింపఁజేయుఁగాక. ప్రతిపక్షులయెడ నాదేవి యీసుపూనుంగాక. న్యాయము వర్ధిల్లుఁగాక. ధర్మపక్షము జయించుంగాక. అనిపలికి మఱియు మాటలాడఁబూని క్రోధావేశమున నోటమాటవెడలమి నూరకుండెను. కాని యాతనిముఖాగ్నికుండమునుండి విస్ఫులింగములు నిరంతరాయముగా వెడలుచు నందున్నవారి శాంతరసము నింకించుచుఁ బౌరుషమును వృద్ధిచేయఁ జాలియుండెను. ఒకముహూర్తకాల మాసభాభవనము నిస్తరంగసాగరమువలె నిశ్శబ్దముగా నుండెను.

అంతఁ దదుపన్యాసావసానంబున సభ్యులపక్షమున నొక వీరుఁడు లేచి యిట్లు మాటలాడెను. అతఁడే గూఢచారుఁడుగాఁ బోయి శత్రువుల జాడ లెఱింగివచ్చిన రామరాయఁడని పాఠకు లెఱుంగుదురుగాక. అతని కంఠస్వరము మేఘగంభీరనిస్స్వానమును మించియుండెను. ఎల్లరు నాతనిం జూచుచు నేయేయ

రము లాతనిముఖమునుండి వెడలునో యని వేచియుండిరి. ఆసంభాషణ మిదియే. వీరులారా! మనుష్యునకు జాతియం దభిమాన ముండక తప్పదు. అది లేనినాఁడు వాఁడు మర్యాద నందఁజాలఁడు. జాతియనునది మానవుల కపూర్వస్నేహమును గల్గించునది. ఆస్నేహము దైవశక్తిచే మది నిమిడియుండి పరస్పర సందర్శనమున గాక జాతిస్మరణమువలనఁ బైకుబికి యొండొరుల బంధించును. ఇతరకారణములచేఁ గల్గినబంధ మింతదృఢమైనది కాదని నమ్మవలయును. ప్రపంచమంతయుఁ దదాకర్షణశక్తిచే నిలిచియున్నది. అన్యోన్యసాహాయ్యమునఁ గూడ నది పనికివచ్చినట్లు వేఱొకటి పనికిరాదు. దైవికమన నదియే యని నమ్మవలయును. కావుననే ప్రతిమనుజుఁడు జాతిమర్యాదకై ప్రాణముల విడువ సిద్ధపడియుండును. అది లేకయున్న లోకవ్యవహారము సాగదు. అందును క్షత్రియుల కదియే పరమపురుషార్థమువంటిది. దానికొఱకే రాజాధిరాజులు తమప్రాణములనైన లెక్కింపక యుద్ధరంగమునఁ గ్రీడింపఁ బూనుదురు. వారు ప్రాణములనైనఁ బాయుదురుగాని జాతిమర్యాదను బోఁగొట్టుకొనఁ బూనరు. ఇది సనాతనాచారముగాని మన యీనాఁడు వచ్చిన యాచారము కాదు.

క. "అరయ వివృతస్వర్గ
ద్వారము రాజులకు నాహవం బందు మహో
దారులు తొల్లియు నరిగిరి
మీ రీమార్గమున నడవన్ మేకొనవలయున్."

అని భీష్ముఁడు సైనికులకు బోధించెను.

క. "పలుకులఁ బని లే దీరే
తలపెట్టకపోవువా రుదగ్రత నేనుం
జలము మెఱయఁ బాంచాలురఁ
బొలియింపక కత్తళంబున్ బుచ్చ నరేంద్రా."

అని ద్రోణాచార్యుఁడును బోధించెను. యుద్ధమన్న నెంతవారికిఁ గ్రీడఁగా నుండెనో యట్టిక్రీడకుం గడంగ వారికిం గల కారణమేదియో యించుక పరికింపుఁడు. మర్యాదను గాపాడుట యను నియమముతప్ప వేఱెద్దికలదు? దానికై యెందఱువీరభటుల బలియిచ్చిరి. ఇంతటిపట్టుదలకుఁ గారణమేమి? జాతిధర్మమును గాపాడుట యనునది పరమపురుషార్థమన్న విశ్వాసముండుటయే యనుటకంటె వేఱెద్ది చెప్పవచ్చును. కొందఱు ధనాశయే యిందులకుం గారణమందురు. కొందఱి కదియు నుండవచ్చును. దానికంటె నెక్కుడుగాఁ బరిగణింపఁ దగినది జాతిధర్మరక్షణము. కాఁబట్టి ప్రకృతపరిస్థితుల నాలోచింపుఁడు. శత్రుబలాబలముల నిర్ణయించుకొని తదుత్సాహము నడంపఁజాలునంత ప్రయత్నము చేయవలయును. మనము దుర్గాశ్రయులమని శత్రువు లీదుర్గము నాక్రమింపఁజాలరని, యెంత కాలమున్నను మనదరిఁ జేరనశక్తులని యూహించి మిన్నకుంట మిగులఁ బొరపాటు. పరవీరమారణమున వారెంతయు నుత్సాహమునను న్నవారనుట నిక్కము. పరికరము లనంతములు. దేశాక్రమణము వారికతిసులభము. జనుల వశ్యులనుగాఁ జేసికొనుట కిది వారికిఁ దగినయదను. ఆలసించుట మనకపార నష్టము. మనము తొందఱపడవలసిన యవసరము రానున్నది. ఇంతదనుక వారూరకుండుట మన యదృష్టముచేతనే. మనుజుల

నిఁకవారు బాధింపక మానరు. ఆబాధలకుఁ దాళఁజాలక వారు లొంగక మానరు. మనల నెంతకాలము వారాశ్రయింతురు ? మనము వారిఁబాలింపఁగలమన్నంతటనుకనే. అదియించుక సంశయమున కవకాశ మొసఁగునేని వారొరులఁ జేపట్టుదురు. మనకపుడు పరరాజపాదసమాశ్రయణముతప్ప గత్యంతరము లేదనుట రూఢము. ఇపుడు మనము చేయఁదగిన కార్యమేమని మీరు నన్నుఁ బ్రశ్నింతురు కాఁబోలు. నాయాశయము దెల్పెద. చిత్తగింపుఁడు.

మనకు రాజప్రతినిధిగానున్న కాంతరాయపాత్రోగారు సర్వవిధములచేతను దగినవారనుట నిస్సందేహము. కాని వారి భావమునఁగూడఁ బ్రతాపరుద్రగజపతిగా రుండిన బాగుండునని యున్నట్లు కనుపట్టుచున్నది. అది ధైర్యలోపమున నూహించువిషయము గాదనియుఁ గృతజ్ఞతకు లక్ష్యమనియు వీరులంద ఱెఱుంగఁజాలుదురు. కావున మహారాజుగారగు ప్రతాపరుద్రగజపతిని వేవేగ పిలుపింపవలయును. వారు వచ్చులోపల మన గూఢచారులు జనపదములఁ దిరిగి వీరభటులు కాఁదగిన ప్రౌఢవయస్కులఁ దోడ్కొని రావలయును. ప్రతిపక్షభయంకరరణశిక్ష యనుక్షణము వారికి నేర్పఁబడవలయును యుద్ధసాధనముల నింకను సేకరింపవలయును. మనకడ నిపుడున్న శతఘ్నులు చాలవని నాభావము. నళికాయుధములు చాలును. శతఘ్నుల సిద్ధపఱుపవలయును. ఈటెలు నిస్త్రింశికలు మొదలగు సాధనములు ఇపు డున్నవానికంటెఁ బదింతలు సంగ్రహించుట మంచిది. కొండను లగ్గలుపట్టునట్టితఱుణము సంభవించునుగాన నాయాయితావుల సమర్థులనిలిపి తైలమునింపిన యయఃపాత్ర

ములఁ బెక్కింటి నాయత్తపఱుపవలయును. ఒక్కొక్క తైలపాత్రమునఁ దక్కువపక్షము నూఱుగురు వీరులు నిలుకావలయును. ఏమరుపాటులేక శత్రువులు కొండనెక్కఁ బ్రయత్నించుటెఱింగి తైలము కాచుచుండఁ గట్టుదిట్టములు చేయవలయు. గండోపలములఁ దొరలింప నలవాటుపడిన శూరులు సిద్ధముగా నుండునట్లు చేయవలయును. తొలిప్రయత్నముననే శత్రువులు తత్తఱిల్లి ప్రయాణము చేయవలయును. పర్వతమున నాయాయితావుల నీపద్ధతుల నమర్పవలయును. గూఢచారు లందందుఁ దిరుగుచు శత్రువుల మర్మము లెఱింగి యోషధులకని పల్కుచుఁ గొండయందు రహస్యముగా నుండు మనచారులకుఁ దెలుపుచు నటవి నిర్మూలింపఁ బ్రయత్నించునెడలఁ దద్వార్తలను బ్రతిక్షణము తెల్పుచుండఁ దగునట్లు కట్టుపాటుచేయఁదగు. మన శత్రువులు గూఢచారులఁ బంపుదురు గావున మనవారిని గుఱుతింప ననువగునట్లు భ్రూవికారాది చిహ్నములు నేర్పవలయు. వానింబట్టి సులభముగా మనచారుఁడని గుఱుతింపవచ్చును. మనయుద్యోగులు కొందఱు జనపదములకుంబోయి మనప్రజలకు శత్రుభీతి యించుకయు గలుగకుండునట్లు బోధింపవలయు. అందు రాజభక్తి పెంపొందించు నభిప్రాయము లిమిడియుండఁ దగు. సూటిగ బాణములనాటి పోటుమగలనైన నుక్కడంచు ధానుష్కుల కొండయం దెల్లయెడలఁ దిరుగుచు గుల్మాంతరములనుండి యనుకూల ముండునంతవఱకుఁ బరభటులఁ గూల్చుచుండవలయు. ఆబాణము లేపొదలనుండి వెలువడుచున్నవో రొుగులకుఁ దెలియనీయరాదు. ‘ఈపద్ధతుల నవలంబించిన శత్రువులు మనప్రయత్నములకు వెఱఁగంది జయాశమాని

తమదారి వెళ్లుదురని తోఁచెడిని. ఆవల దైవము గలఁడు. ఆమ
హాత్ముని యుద్దేశము మనమెఱుంగఁజాలముకదా. కానున్నది
కాకమానదు. అటులని మనుష్యప్రయత్నము చేయకయున్న
దైవంబు ప్రతికూలంబె యగునని పెద్దలు పలుకుదురు. నాకుం
దోఁచిన యూహాలం దెల్పితిని. ఇంకను మీకుఁదోఁచిన యూహాల
వీనికి సావాసముచేసి యన్నింటింగలిపి తదనురూపముగాఁ
బ్రవర్తింతము. అని పలికి రామరాయఁడు తనస్థానమును వశ
పఱచుకొనియెను.

రామరాయని యభిప్రాయముల కందఱు సంతోషించిరి.
అట్లు ప్రవర్తింప సమ్మతించిరి. ఈయుపాయములలో నొక్కఁ
డైన బనికిరానిదని పలుక నవకాశము లేదనిరి. చక్కఁగా
యోజించి మర్యాదను నిలువఁబెట్టఁదగి శూరులకర్హములునై
యున్నవనిరి. సభ్యుల యామోదమున కా రామరాయని
యాశయములు పాత్రములౌట యెఱింగి ప్రతాపరుద్రగజపతి
ప్రతినిధిగా రాజ్యమును బాలించుచుఁ బ్రధానసేనాధిపతియై
పెక్కురాజ్యముల జయించి రాజునకు మహోపకార మొనర్చి
దక్షిణభుజమనఁదగి యలరారు కాంతరాయపాత్రో లేచి యంద
ఱువిన నిట్లు మాటలాడెను. ఆతఁడు లేచినంతన సభ నిస్తరంగ
సాగరము ననుకరించెను. వీరవరులారా! రామరాయని యభి
ప్రాయము లొక్కొక్కటియుఁ బెక్కులక్షలవిలువ గలవనుట
కావంతయు సందియముండదు. కాని యందుఁ గొన్నిప్రయ
త్నము లీవఱకే చేసియున్నాఁడను. నావిధి నేనెంతదనుక నెఱ
వేర్చితినో తెలిపెదను. మహారాజుగారి నతివేగమ రమ్మని నెలకుఁ
బూర్వమే జగన్నాథరాయపాత్రో నంపితిని. ఆతఁడు రణశూరుఁ

డు. సర్వకార్యదక్షుఁడు. నేఁడో రేపో రాఁగలఁడని యెదురు
చూచుచున్నాఁడను. జనపదములకు నుద్యోగులు ముప్పదిమంది
పోయియున్నవారు. ప్రజలకుఁ గల్గఁగలభీతిని మాన్పుటకు
శత్రువులకు లోఁబడకుండుటకుఁ దగునుపన్యాసము లిచ్చుచుం
దురు. వారలు వేషములూనియే పోయిరి. ఏలన శత్రుచారులు
తిరుగుచుందురుగదా. ధానుష్కులగు నాటవికులైదువేలమంది
పర్వతము సమస్తభాగములందు గుల్మాంతరితమూర్తులైయుండు
నట్లు కట్టడిచేసితిని. క్రొత్తమార్గములు కల్పింపకయుండ జాగ
రూకులై కనిపెట్ట నెఱుకువాండ్రు వేయిమంది తిరుగుచున్న
వారు. వలయునన్ని శస్త్రముల సేకరించితిని. ఇంకను సేకరింపఁ
బ్రయత్నించుచున్నాఁడను. శతఘ్ను లీదుర్గమునందే ప్రథమ
ద్వితీయ కక్ష్యాంతరమున నవి చేయఁబడుచున్నవి. కాని యవి శత
ఘ్నులని యితరులకుఁ దెలియకుండుటకై తదంగముల నొక్కొ
క్కచోటఁ జేయునట్లు వేఱొక్కతావున నవి కూర్పవలసినట్లు
నేర్పాటు చేసితిని. జనపదములకుఁ బోయిన యుద్యోగులే
మూఁడువేలమందిని భటశిక్షకొఱకుఁ బంపిరి. వారీపర్వతము
నందే దుర్గమునకు నుత్తరభాగమున రణశిక్ష నేర్చుకొనుచున్న
వారు పదార్థములు సేకరించి ప్రతిదినము పంపఁబడుచునే
యున్నవి. ఇంకను జేయఁదగుప్రయత్నముల నొనరించెదను.
మహారాజాగమనమునకై వేచియున్నాఁడను. ప్రాణముల
దాఁపక పోరాడుదము. ఆవల దైవంబ పంచినగతి యయ్యెడు.
అని పలుక నెల్లరు సంతసించి జయాశలు వృద్ధినొందఁ దమతమ
యిరవుల కరిగిరి. దుర్గపాలకులు కడుంగడు జాగరూకులై
మెలఁగుచుండిరి.

ఎనిమిదవప్రకరణము.

పాఠకులారా! పర్వతముక్రింద రాయలసేనలును, దుర్గమున గజపతిసేనలును జయాశలూని తమతమప్రయత్నముల నుండఁగాఁ గొన్ని నెలలు గడచెను. దాదాపు పండ్రెండునెలలు గడచెనని కొందఱు పలుకుదురు. ఇంతదనుకఁ గృష్ణదేవరాయలకు దుర్గము స్వాధీనమగునన్న యాశ మంత్రిశేఖరునితో మాటలాడినపుడు తప్పఁ దానొంటరిగాఁ గూరుచుండి యాలోచించినపుడు కలుగకుండెననుట సత్యము. దినములు గడచుచుండఁగా నాతనిమోముదమ్మి వాడుచున్నట్లగపడుచుండెను. అంతకుముందే యుద్ధమునఁగాని యావీరాగ్రేసరునిముఖపద్మము మ్లానమైనజాడఁ గనిపెట్టినవా రెవ్వరును లేరు. అప్పాజీ మాత్రము శుక్లపక్షక్షపాకరుకరణి దినదినప్రవర్ధమానముఖతేజస్సున వెలయుచుండెను. ఏక్షణమునఁగాని యామహానీయుని ముఖచంద్రునియందుఁ గందుఁ గానరాకుండెను. ఇట్టి యుత్సాహమునకుఁ గారణమేమి యుండునాయని దండిమానసు లపుడపు డాలోచించుచుండిరి. మొండిధైర్యముగాని ఫలము కలుగఁ జాలదని కొందఱును, రాయలను సంతోషపఱుపలేనిధైర్యమును దెచ్చుకొని యున్నవాఁడని యింకఁ గొందఱును, ఏమో తెలియదు కాని నిష్కారణముగా నిట్లు నటించునా యని మఱికొందఱును దోఁచినట్లెల్ల నాలోచించుచు గుసగుసలు పోవుచుండిరిగాని యొక్కనికైన నిక్కము తెలియ

దయ్యెను. వారు వీ రననేల? కృష్ణదేవరాయలకే యాతనియుత్సాహ మచ్చెరువును గల్గించుచుండెను. ఏకాంతమునఁ గూరుచుండి యాలోచించుచు, రేపు కారణమడుగుదమని రాయలనుకొనునుగాని మఱుదినము మంత్రిసమావేశసమయమున నడిగిన నేమనునో యని యడుగక తాను నుత్సాహమును గనఁబఱచుచుఁ బోవుచుండువాఁడు. మొదటఁ బ్రభువనకే యిట్లుండ నింకఁ దక్కినవా రెవ్వ రామంత్రిశేఖరునిదాపునఁ గూరుచుండి యేమయ్యా! నీముఖమున సంతోష మూఁగుచున్నదే కారణము తెలుపుమా యనియడుగువా రుందురు? "ఎవరికివారే యమునాతీరే" యన్నట్లు మాటాడుకొనుచు నూరకుండుట యందఱు కలవాటుగా నయ్యెను. ఇట్లును గొలఁదివారములు గడచెను. యుద్ధముగాని, యుద్ధప్రయత్నముగాని, తదాలోచనగాని, మగిడిపోవుటగాని లేక కాలము మార్పులేక యొక్కరీతిగా జరగుచుండెను. వచ్చెడుపదార్థములకుఁ దేఁబోవుమనుష్యులకు సందులేకుండెను. ఇంతమంది సైనికులకు దధిపతులకుఁ దన్నాయకునకు, వీరియందఱ పరిజనులకు, నింకను దిండిపోతులకు, వేడుకకాండ్రకు, వేషధారులకుఁ, గవులకుఁ, బరిహాసకులకు, రాజనీతిజ్ఞులకు ఇంక నెందఱకో లోప మించుకంతయేని కలుగకుండ షడ్రసోపేతముగా భోజనము సాగవలయుఁగదా. తగు శిబిరములు శత్రువులబాధలు గలుగకుండుపద్ధతులు జరగుచుండవలయుఁగదా. ఇన్నింటిని సమకూర్చువా రెంద ఱుండవలయును. ధన మెంత ప్రతిదినము వెదచల్లవలయును. వీని కన్నింటి కేమిగాని పాలు, పెరుగు, నెయ్యి, తాంబూలము ననువీని సమకూర్చు టెట్లు? ఏవిషయమున లోపమున్నను యుద్ధకృత్య

మునకుఁ గీడు కలుగక మానదు. ఎల్ల రుల్లాసముల నలరుచుఁ బ్రాణము లర్పింప సిద్ధముగా నుండవలయుఁ గదా. అందందు వీరభటుల కాహ్లాదము గలిగించుకొఱకు వేశ్యానర్తనములు సాగుచునే యుండెను. గాన సభలకుఁ గొదువ లేకుండెను. పరిహాసకులు తమప్రభావమును జూపి యెల్లర నానందసాగరమున నోలలాడించుచునే యుండిరి. కవులు చిత్రగతులఁ బద్యము లల్లుచుండిరి. వాద్యములు మ్రోయుచునే యుండెను. "ఇంటికంటె గుడిపదిల"మనుసామెత యత్తరుణమునఁ జక్కఁగ ననుభవమున నుండెను. కాని యింతమంది యిన్నివిధముల సుఖపడుచుండ నిందఱిలో సదా చింతానిమగ్నమానసుఁ డెవ్వఁడా యని యించుక యాలోచింపుఁడు. ఈసంగరరంగమున సూత్రధారుఁ డెవ్వఁడు? నూతనోత్సాహభాండనిర్మాణమునఁ గులాలుఁ డెవ్వఁడు? ఈవిజయావహకార్యసృష్టికి మూలకర్త యెవ్వఁడు? తిమ్మరుసని మీరు నిశ్చయింతురని నేనెఱుంగుదును. మహాశయులారా! సుంత మది నాతనిప్రక్కకు మరలింపుఁడు. ఆతని సర్వాంగములయందు మనస్సెట్టి కార్యము చేయుచున్నది? ఆతని యంతరాత్మ యేలత్యమున సమాధ్యవస్థ గలదై యున్నది? ఏమహాఫలమును సాధింప నాదివ్యపూరుషునిబుద్ధి యాశించుచున్నది? ఎట్టికృతజ్ఞతం బ్రభువువిషయమునఁ జూప నాతని చిత్తము తత్తఱపడుచున్నది?

శా. "పాదద్వంద్వము నేల మోపి పవనున్ ౹ బంధించి పంచేం
ద్రియో, న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ ౹ మాఱాకు
హత్తించి ని, ష్ఖేదబ్రహ్మపదావలంబనగతిన్ ౹ గ్రీడించు యో
గీంద్రుమ, ర్యాదన్..."

అను భాగవతపద్యమునకుఁ దిమ్మరుసుప్రవృత్తి సరిపోయిన దనిచెప్పినఁ బాపమువచ్చునా? ఎల్లరకుం జూడ నానంద మనుభవించుచున్నట్టు లామహాపురుషుఁడు తోఁచుచున్నవాఁడు కాని యామంత్రిమనస్సు విచారసాగరమున మునిఁగి యిటు నటు దరిగానక తికమకపడుచున్నది. ఏక్షణమున కాక్షణము క్రొత్తయూహ లాతని మనశ్శాంతి నడంచుచున్నవి. ఏనిమేషమున శత్రువుల శస్త్రఘాతధ్వనులు చెవులబ్రద్దలించునో యను చింత యాతని ధైర్యమును గదలించుచున్నది. ఏక్షణమున రాజచంద్రుఁ డీయుద్ధమున నసూయపూనునో యనుశంక యాతని సర్వాంగములఁ బీడించుచున్నది. ఏత్రుటిని దండనాయకులు నిరుత్సాహమును జూపుదురో, తనయాలస్యము కార్యభంగమునకుఁ గారణమాయెనందురో యనుతలంపు లామహాత్మునిసత్వము నాడించుచున్నవి. ఏరాత్రి, ఏపగలు, ఏసంధ్యాకాలము చారులమూలమున దుర్వార్తలఁ దెచ్చునో యనునూహ యావీరశేఖరుని యుత్సాహబీజము నుడికించుచున్నది. ఏరెప్పపాటునఁ గ్రొత్తరాజు లాదుర్గపాలకునకు సాయపడఁ జతురంగములం గొనివచ్చి తమ్ము ముట్టడింతురో యనువిచార మాతని యంతఃకరణమును గలంచుచున్నది. ఎట్టిపర్వతము నెక్కుట, ఎట్టిదుర్గమును భేదించుట, ఎట్టిరాజును వశపఱచుకొనుట, ఎట్టిరాజపుత్త్రికను నాయేలికకుఁ గట్టిపెట్టుట, ఎట్టివిజయమూలమున విజయనగరసామ్రాజ్యమును సర్వోన్నతత్వము నొందించుట యను నీమొదలగు నాలోచనలు పరంపరలుగా సాగరభూరితరంగములపోల్కి, మెఱపుఁదీఁగెలచందమున నాతని మదిఁ దోఁచుచుండెను. తానొక్కఁడు నిరుత్సాహము చూపిన

పంతయునడంగు నన్నవిశ్వాసముగల యా సచివమణికి సంతోష
మెక్కడిది ? సుఖపడు నవకాశ మెక్కడిది ? వినోదకరములగు
నుత్సవములఁ జూచుసమయ మెక్కడిది ? తుదకుఁ గడుపార
భుజించి కంటినిండ నిద్రించుక్షణము దొరకునని యూహింప నవ
కాశము మీకుఁ గలదా. సత్యముపై దృష్టినునిచి యూహిం
పుఁడు. లేదని మీరుపలుకుదురని నేను ముందే యెఱుంగు
దును. రేయింబవళ్ళు తిమ్మరుసుచిత్తమున శాంతిలేక విచారము
ననే చివుకుచుండెను. సంతోషము తెచ్చిపెట్టుకొన్నదే గాని
నైజముకాదని యెఱుంగఁదగును. ఆయనప్రయత్నము లితరు
లకు దుర్జ్ఞేయములు. ఎవరెవరి నేయేకార్యము లొనర్పఁ బంపె
నో వారెందఱో వారికే దెలియదు. ఇఁక నితరులమాట యిటఁ
జెప్పనేటికి ? సేనల నేయేభాగముల నెందెంద ఉండవలయు
నని యామాన్యుఁడు కట్టడిచేసెనో ప్రధానసేనానికిఁదప్ప నితర
సేనాధిపతులకుంగూడఁదెలియదు. ఒక్కొక్క సేనాధిపతి కొక్క
విషయమే తెలిసియుండును. ఏదిన మేదిక్కున వాఁ డుండవల
యునో యెంతసేన యాతని సేవింపఁబోవునో యది యాదినముద
యముననే కార్యనిర్ణయ కాలనిర్ణయముగల లేఖ యతనికం
దును. అంతకుముందెఱుంగుడమన్న సాధ్యముకానిపని. ప్రధా
నసేనాధిపతికిమాత్ర మాతనిసన్నాహము లాలోచనము చేయు
నపు డెఱుకపడును. అట్లుకాదిట్లని చెప్పుట సేనాధీశున కలవాటు
లేదు. ఒక్కవిషయమైన నతనికిఁదెలియని దుండినఁగదా యుప
దేశము పనికివచ్చును. సేనాధిపతులలోఁ దిమ్మరుసుమేటి. ప్రధా
నులలోఁ జాణక్యుఁడు. కావున నింక నతనికాలోచనము మంచి
దిది యనిచెప్పువాఁ డెవ్వఁడు ? అందఱు తద్ధితముల నాలకించు

చుండవలసినదే. ఇప్పట్టున నామంత్రిబృహస్పతిదినచర్య తెలు
పుట వృథా కాలక్షేపమువంటిది కాదని నమ్మెదను. పాఠకులు
నీవిషయ మెఱుంగుదురని విశ్వసించుచున్నాఁడను.

ఉషఃకాలమున నిదురలేచి గురువును దలంచి పరమేశ్వ
రుని హృదయపీఠగతునిగా దర్శించి తదనుజ్ఞంగోరి సాంసారిక
యాత్రఁ బ్రవర్తింతును. నీ యనుమతినొందియే చేయువాఁడ.
ఇందు నాకేమియు నధికారములేదు. నీ వాడింప నీప్రతిమ తిరు
గును. 'కరుణింపుము పరాత్పరా యని ప్రార్థించును. పిదప శయ్య
దిగి కాల్యములందీర్చి స్నానము శీతాంభస్సులనే యొనరించి
గాయత్రి నుపాసించి యితరావశ్యకమంత్రరాజముల జపించి
లేచి గోష్ఠీమందిరమునఁ జేరి కూరుచుండి నేఁడు చేయఁదగినపని
యేమని తొలిరేయి నిద్రించుకాలమున నాలోచించినవానిని
స్మరించి యాయాయి కార్యముల నొనర్పఁదగువారికి శాసన
మునుబంపి తాఁ జేయఁదగు పనిని జేయును. తానొనర్పఁదగు కా
ర్యము నితరులకుం జెప్పిచేయించు టతని యాయుష్కాలమున
నొకప్పుడేని సాగినదికాదు. ఆవల నించుక దేహపరిశ్రమముచే
యును. పిదపఁ దానియోగించిన కార్యములను జేయువా రప్ర
మత్తులా ప్రమత్తులాయని పరికింపఁబోవును. సేనలఁ బరీక్షించుట
యాతనికి సంధ్యావందనము వంటిది. ఇంటికి జనుదెంచువేళ
బొక్కసమును దానే పరీక్షించును. దానివెనుక ధాన్యగృహము
నుదిలకించి మధ్యాహ్నకాలమున నింటికివచ్చును. మాధ్యాహ్ని
కానుష్ఠానములఁదీర్చి దేవతోపాసనముచేసి యర్హతములంగూడి
భుజించును. కొలఁదినిముసములింటియందే యటునిటుతిరుగును.
పిదపఁ దాంబూలచర్వణ మొనరించును. ఇష్టకథాలాపముల కా

జ్యపాలనమునగల మంచిచెడుగులనెఱుంగును. ఒక్కముహూర్తము శయనించును. కాని యపుడు నిదురింపఁడు. యోజించుచునే యుండును. వెంటనే లేచి మంత్రిపనిచేయఁదగుచక్కటికిం బోవును. సాయంసమయముదనుక నన్నియుఁ గొఱంతలేక యుండఁజేయును. ఆమీఁద రాజదర్శనమునకుంబోయి దినకృత్యములనెల్లం దెల్పి యించుక వాయువు సేవింపఁ దిరుగును. సేనావ్యూహాభ్యాసపద్ధతులం బరికించి యిల్లుచేరును. కాల్యకృత్యములం దీర్చి భుజించును. అష్టపదులం బాడుచు రాధామాధవుల విచిత్రక్రీడలఁ దలంచుచు నానందపరవశుఁడగును. పిదప రేపటిపను లేవని హితులతో నాలోచించును. ప్రొద్దు చాల వ్యర్థముగాఁ బుచ్చక శయనించును. ఉపద్రవకాలముల నిందు మార్పులుకూడఁ గలుగునఁట. ఇది ప్రాయికముగా నాతని దినకృత్యము. ఇట్టి కార్యదక్షునకు స్వసుఖమునుగోరి పాటుపడుట సంభవించునా. పరోపకృతియే స్వోపకృతియని భావించువారేగదా జగన్మాన్యు లగుదురు.

తిమ్మరు సిట్టివాఁడని శ్రీకృష్ణదేవరాయఁ డెఱుంగును. అంతియకాక కృతజ్ఞులలో నీతఁడే యత్యుత్తముఁడని యారాజునకు విశ్వాసము. దీర్ఘదర్శిత్వము సమయోచితజ్ఞతయు నీతనికుగ్గుతోఁ బెట్టినవని యాక్ష్మాపాలచూడామణి కెఱుక. కావునఁ దనదర్శనమున కెన్నిదినములు రాకున్నను, ఏయాలోచనము చెప్పకున్నను, ఎందెందుఁ దిరుగుచున్నను, అదియెల్లఁ దనమేలుకొఱకే యని నమ్మి యూరకుండియుండి పట్టరానితమకమున నామంత్రియింటికింబోయి అప్పా! కుశలముగా నున్నాఁడవా యని యడుగువాఁడఁట. ఔరా! ఎంతటి విశ్వాసము! ఎంతటి

మైత్రి! ఎంతకరుణ! ఎంతభక్తి! ఎంతనేర్పరితనము! ఆరాజమంత్రు లిట్టియత్యుత్తమగుణసంపన్నులుగావుననే యారాజ్యము రామరాజ్యమును బోలియుండెనని సత్కవులు వర్ణించిరి. దాని నతిశయోక్తి యనువారిజన్మము వ్యర్థమనక తప్పునా! ఇట్టు లఖిలకార్యముల సాధించునలవాటు గలవాఁడు కాఁబట్టియే కృష్ణరాయ లన్నినెల లేకార్యము సాగకున్న నూరకుండెను. ఏకార్యమునఁగాని నీవిట్లుచేయుమా యని శాసింపఁ బూనకుండెను. తనకు జయముచేకూర్ప నేడియో యోజించుచున్నవాఁ డన్ననమ్మిక యాతనినెమ్మది పాదుకొని యుండెను గాని బాహ్యప్రపంచము దృగ్గోచరము కాఁగా నాయూహ యించుక చెదరుచుండెను. ఐనను మంత్రిచేయుచుండు కార్యమునందు దాఁ బ్రవేశించు టపాయమని తోఁచినందున నూరకుండెను.

ఈరీతిఁ గొన్నినెలలు సాగెను. ఏఁడాదిదాఁటెను. రెండవయేటను గొలఁదివారములు గడచెను. ఇట్లనుకొనుచుండ నొకటిరెండు మూఁడునెలలు గడచెను. సేనలకుఁ దదధినాయకులకు నిస్పృహత మదిఁ దోఁచెను. పదునైదునెలలు గడచెను. ఇంక నేమిసాధింపఁగల మనునూహయే రేయింబగళ్లా సేనయందు నర్తనము చేయుచుండెను. ఈవిషయము మంత్రిశేఖరుఁ డెఱుంగక పోలేదు. ఆతనియూహ లనుక్షణము త్వరపడుచునే యుండెను. ఒక్కనాఁడు శ్రీకృష్ణరాయ లుదయమున నొంటరిగాఁ గూరుచుండి నేఁ డప్పాజి వచ్చినపుడు స్పష్టముగా నడిగి యుద్ధమొనరించుటయో, కాలికి బుద్ధిచెప్పుటయో చేయవలయునని యాలోచించుచుండెను. ఆకాలమునందే ప్రధానసేనాధిపతి

యుఁ దక్కుంగల దొరలంగూర్చుకొని యీవిషయమే యోజించుచుండెను. లక్ష్మీపతియనుదళవాయి మాత్ర మా సంఘమున లేకుండెను. ఏలరాలేదని ప్రశ్నించు సేనాధిపతితోఁ దిమ్మరుసుగారు పిలిపించిరని యొకదళవాయి యుత్తరము చెప్పుచుండెను. వేఱొక దళవాయి లేచి యతనిరాణువను దిమ్మరుసుగారి రక్షణార్థ మేలినవారిశాసనముపై నుంచితిమి. కొలఁదిదినములనుండి యారాణువ కాన ఈకున్నది. మూఁడుదినములనుండి యాదళవాయియు మాకుం గనఁబడలేదని పల్కెను. రాయలవారిరక్షణార్థ మింక విశేషించి కట్టుపాట్లు చేయవలయునని మంత్రిగారు చెప్పుచుండఁగా విన్నాఁడను. కాన నందుల కీదళవాయియుఁ రాణువయు నియోగింపఁబడియుండునని తలంచెదనని మఱొకఁడనియె. ఇట్లు ప్రశ్నోత్తరములు సాగుచుండెను. వారి పల్కులవైఖరిం బట్టిచూడఁగా నిఁక జయము దుర్లభము. ప్రయత్నము బాగుగాలేదు. వచ్చినకీర్తి యడుగంటుకాలము వచ్చినది: ఇంతకాలము వ్యర్థముగాఁ గడచెను. వెనుకకుఁ బోవుటకంటె నిందె మరణించుటయే మేలు. అనుపలుకులు సేనాధిపతుల వదనములనుండి నిస్పృహతఁ దెల్పుచు దైన్యమును బయలుపఱచుచు వెడలుచుండెను.

మ. జలధుల్ ఘూర్ణిలె దిక్కరుల్బెదరెఁ జాంచల్యంబు నొందెన్ ధ
రా, స్థలి ధాత్రీధరసంఘముల్ గదలెఁ బాతాళంబు స్వర్లో
కముల్, గలఁగెన్ శత్రుభయంకర ప్రకటదోర్గర్వస్ఫుర
త్కృష్ణ రాయలసద్భేరిధణంధణస్వనము లాశాంతంబులం
బర్వఁగన్

అని కుమారధూర్జటి వ్రాసినట్లు హఠాత్తుగా నుత్తరభాగమునుండి భయంకరముగా రణభేరీధ్వనులు వినవచ్చెను. తలయెత్తి యంద ఉలికిపడి యాదిక్కునకుఁ జూడ్కులం బ్రసరింపఁజేసిరి. చూచునప్పటి కాధ్వనులు తటాలునఁ బర్వుటనో, పరరాజుల కపజయమును దెలుపుటకో తెలియరాదుగాని వృక్షశాఖలు తునిఁగి క్రిందఁబడియెను. శిఖరమునుండి పాషాణములు తటాలున మహాధ్వను లొనరించుచుఁ గ్రిందికి దొరలసాగెను. ఆశిలాఘాతముల కోర్వఁజాలక మృగములు వానిపొందు విడువఁజాలని యట్లు దొరలిదొరలి క్రిందఁబడుచుఁ దమ యవయవములు మిమ్ముంగూడిరానేల యనుమాడ్కి విడిచిపోగా మద్దెలలంబోలి మొండెములు క్రిందికిరాఁగాఁ జూచువారలకు భీతిని గొలుపుచుండెను. శకుంతసంతానములు వృక్షశాఖల హాయిగాఁ దమసంతానములనిడి యెరకై యెటకోపోయియుండి సేకరించినయెరఁ దముచంచుపుటముల నిడికొనివచ్చి బిడ్డలనోటం బెట్టుచు నింతలో నుప్పతిల్లిన యాయకాండప్రళయంబునకుఁ దమయావాసములు ధరఁబడుచుండఁగా స్థానాభిమాన మూను చందమునఁ దమరును బడుచుఁ బక్షములు తెగఁ బిల్లలు వాపోవుచుండ వానింగూడి యసువులంబాసెను. అట్టిజాలిగొలుపు దృష్టాంతము లెన్నియో గనఁబడియెను. ఇదియేమి యాశ్చర్యమని సేనాధిపతులెల్ల రుల్లములు చలింప నాలోచింపసాగిరి. అంతలో శతఘ్నుల కాఘోరధ్వనులు చెలరేఁగెను. వానినుండి వెడలు ధూమధ్వజములు నారదున కాయుద్ధవార్తం దెలుప సురపురి కరుగుచున్నట్లుండెను. వీరభటులసింహనాదములు స్పష్టముగా వినఁబడకయున్నను నవ్యక్త ధ్వనియొకటి వర్ధిల్లె

ప్రతిధ్వనులమూలమున ఘోరారావము సాగుచున్నజాడఁ దెలిపెను. శత్రువు లదె వచ్చుచున్నవారని కొంద ఱార్వ సాగిరి. అదె సైనికులకత్తులు తళతళ లాడుచున్నవని కొందఱు చూడసాగిరి. సమీపించుచున్నవారు లెండు. లెండు. ఆయుధములఁ దాల్పుఁడు. పరుగెత్తుఁడు. గుఱ్ఱము లెక్కుఁడు. కొట్టుఁడు. కొట్టుఁడు. నలుప్రక్కల ముట్టడింపుఁడు అని కొందఱు దిక్కుదోఁచమిఁ బరుగిడసాగిరి. సేనాధిపతులు కదలక నిలుచుండి యాదిక్కు నిక్కినిక్కి చూడ సాగిరి. ఇచ్చటి వృత్తాంత మిట్టు లుండెను.

అత్తరుణమునఁ బ్రభుశేఖరునివృత్తాంత మించుక పరిశీలింపవలయుఁగదా. మంత్రితో గట్టిగా మాటలాడవలయు నేఁడని యూహించుచుండ నాయూహ ముగియకముందే భేరికాదారుణనిర్ఘోషములు శ్రుతివివరముల జొరఁబడెను. పాపమా విచారమేమూలదాఁగెనో, యాయూహ యేయింద్రియమున నంతర్హితమయ్యెనో, చెప్పఁజాలనుగాని సింహాసనమునుండి క్రిందఁబడునంతటి కంపము రాజును లోఁబఱచుకొని యాడింప సాగెను. చూపులు విభ్రాంతములై యేవస్తువును గనఁబడనీయమని పట్టుపట్టెను. దిక్కు తెలియక ముహూర్తకాలము తానెందున్నవాఁడో తెలిసికొనఁజాలకయుండెను. ఎట్టిశూరాగ్రేసరుఁడైన యకాండదైవచేష్టల కులికిపడకుండఁగలఁడా. ఐనను ముహూర్తకాల మతిక్రమింపఁగా నించుకధైర్య మెం దుండియో వచ్చినట్లు కూరుచుండఁగలిగి హృదయావేదము తగ్గగా సేవకునింబిలిచి తిమ్మరుసును బిలుచుకొనిరమ్మని తడఁబడుచుఁ జెప్పెను. చెంతనున్న కరవాలముమాట స్మృతికిఁ దగులనికా

రణమునఁ గరవాలమును దెమ్మని పలుకఁబోయి గొణుగుకొనియెను. సేవకుఁ డంతకుముందే పడినవాఁడుగాన లేచి తుడుచుకొనుచు గజగజవణఁకుచుఁ జేసన్నఖడ్గమును జూపెను. అంతలో రాజకంఠీరవుఁడు ధైర్యమురాఁగా నేమి యీయుద్ధవాద్యఘోరరావము! అని యాలోచించుచుండునంతలోఁ దిమ్మరుసుగా రంపినసైనికులు రాజమందిరముచుట్టు నిలువఁబడిరి. తదధికారి లోనికింబోయి యుచితమర్యాదల నడపి ప్రభుశేఖరా! యీయాకస్మికయుద్ధ మేమని దేవరకుం దోఁచునేమో అది మనవిజయము పాటించును కావునఁ దమ రించుకంతయు శంక నొందఁ బనిలేదని విన్నవింపుమని మంత్రులు పంపిరి. కొలఁదిగడియలకుఁ దిమ్మరుసుమహామంత్రులే తమదర్శనము చేయుదురఁట. ఏలినవారియానతి శిరసావహించి సేవింపవచ్చినారము. అని విన్నవించి తమపనియం దప్రమత్తులై యుండిరి.

శ్రీకృష్ణదేవరాయల శోకసంతోషము మదిఁ బొడసూపెను. ఆనందసూచకస్వేదబిందువులతో దేహమంతయు నలంకృతమయ్యెను. ఈయుద్ధ మేస్థలమున నెవ్వరితోఁ జేయఁబడుచున్నది? సేనాధిపతులు నిన్ననాతో మాటలాడివెళ్లిరి. అప్పుడీ వార్తయే తెలుపలేదు ఇంతలో నింతప్రయత్నము చేయఁ గారణమేమి. తిమ్మరుసుకూడ నీవిషయమున మీరు నిశ్చింతగనుండుఁడని చెప్పుచుండునే కాని యీప్రయత్న మిట్లొనర్చితినని తెలుపఁడయ్యెను. ఎంతప్రయత్నము చేసినవాఁడో కోటముట్టడించు జాడ యిదికాదని తోఁచెడిని. ఉత్తరభాగమునుండి యీమహారావము వీతెంచెడిని. శత్రువులకు సాయముగా వచ్చురాజుల జాడ లెఱింగి వారిని నిలువరింప సేనలం బంపియుండునా. లేక

శత్రువులు కోట యింక మనకు దక్కదని పాఱిపోవుచుండ రాకొమరిక వారివెంటనుండునని వారిని బోవకుండ నరికట్టి యుండునా. ఏమియు నాకిపుడుతోఁపకున్నది. తిమ్మరుసునూహ కనుఁగొనఁజాలువా రెవ్వరు ? అన్నియు ముందు స్పష్టమగును. మనశిబిరముల కేమిభయములేదని మంత్రిపంపినవార్తవలన స్పష్టమయ్యెడిని. శుభచిహ్నముగా దీనిని భావించెద. అని. యూహించి యత్యుత్సాహమున స్వకార్యములయందుండెను. కాని యావృత్తాంతతత్త్వము తెలియునుక నాప్రభుచిత్తము శాంతమైయుండు ననుకొన మన కవకాశము లేదు.

తొమ్మిదవ ప్రకరణము.

ప్రతాపరుద్రగజపతి యుదయగిరిం జేరుట.

కాంతరాయపాత్రో పంపినవార్త గోదావరి ప్రాంతముల నున్న ప్రతాపరుద్రగజపతి కందెను. సాయంసమయమున గోదావరీతీరమున శీతలతరంగసంగతవాయుకిశోరములు తన్ను సేవింపఁ జల్లగాఁ గూరుచుండిన రాజాధిరాజున కీవార్త మది నుద్వేగము గలదిగాఁ జేసెను. లేఖార్థము లెల్లఁ దెలియఁగాఁ బట్టిరాని యాగ్రహముదయించెను. వీరభద్రునియాకృతిగా నాతనిదేహము మార్పునొందెను. ఔడుకఱచి యారా! దాసీపుత్త్రుఁడు నాకొమరితం బెండ్లియాడఁదలంచుటయే కాక యుదయగిరి ముట్టడించి బలముమీఱఁ బరిణయమాడఁ దలంచెనా! ఏమి కాలమహిమము! కుందేలు సింహముపైఁబడఁ దలంచును గాఁబోలు! కొండను దగరు డీకొని పగులఁ గ్రుమ్ముఁగాఁబోలు! తామరపత్రము పిడుగును రెండుముక్కలుగా నొనర్చునేమో! ఏమి కండకావరము! ఏమి గర్వాంధకారము! ఏమి యా ధనమదము ? ఏమి యాశౌర్యభ్రాంతి! కన్నుమిన్నుఁగానక యీ నీచుఁడు నాకన్నియం బెండ్లియాడఁ గోరుటయా. తనకులమర్యాద యెంతయో యతఁ డెఱుంగఁడేమో. సెబాసు! కృష్ణరాయా! సెబాసు! నీకును గాలము సమీపించినది. విజయనగర సామ్రాజ్యమా! నీయధీనమున నున్నదియా! ఉండుము లే. త్వరపడ

కుము. నానిశాతకరవాలమున కెరయగుదువులే. మూఁడుసంవ
త్సరముల నాఁడేపశ్చిమదండయాత్ర సలిపి విద్యానగరము నిర్మూ
లింపఁ బూనితినిగాని క్షుద్రులు వారి జయించినను జయింపకున్న
నొక్కటియేయని యూరకున్నందులకు ఫలము నాకిపుడే కలి
గెను. రాజులకు క్షమ పనికిరాదని పెద్దలు చెప్పుదురు. అది
నిశ్చయమేయని నాకీ యనుభవమునఁ దెల్లమయ్యెను. కానిమ్ము!
నీయుద్ధగర్వము పోవఁజేసి గజపతిప్రతాపాగ్ని యెట్టిదో యను
భవమునఁ దెలియఁజేసెద. త్వరపడకుము. ఇదె వచ్చెద. అని
తనలోఁ దాననుకొనుచు నారేయి నిద్రపట్టమి నెట్లో పుచ్చి
వేఁకువఁ బ్రయాణమై యపుడున్న సేనలతో గోదావరి నుత్త
రించి కొన్నివారములకు నుదయగిరిసమీపమునకు వచ్చెను.

కాంతరాయఁడు కటకమునకుఁ బంపిన చారునివృత్తాంత
ము నప్పుడే తిమ్మరుసు గూఢచారులవలన నెఱింగియు నాటం
గోలె తదాగమనమునకై వేచియుండి రెండు మూఁడుదినము
లలో వచ్చుచున్నవార్త తెలియరాఁగా నంతకుముందే తనచెంత
నునుచుకొనియున్న లక్ష్మీపతి యనుదళవాయిని దత్సైన్యమును
నిశాసమయమునందు నొరులకుఁ దెలియకుండ నుత్తరదిక్కునకుం
బంపి యందుఁ గావలియున్న సేనల నటనుండ ననవసరమని
ముందే పిలిపించియుండెను. ఉత్తరమున సేనలు లేవని దుర్గమున
నున్నవారు తలంచియుండిరి. కొలఁదిదినము లక్లేయుండి యొక
నాఁటినడురేయి యారాణువ నంపెను. లక్ష్మీపతి సేనాధిపతు
లలో నొక్కఁడు. కాని మేటివీరుఁడు. కృత్రిమోపాయముల
నన్నింటి నెఱుంగును. తనమర్మము దెలుపక పరులరహస్య
ముల నెఱుంగుటలో శంబరాసురుఁడే. ఆహవముఖమున

రెండవరుద్రుఁడే. కత్తిదూసి యరిబలముల దూఁకెనా మెడఁ
ద్రిప్పక యోజనమువఱకుఁ బరులకంఠముల భూదేవికి బలి
యిచ్చుచుం బోవునుగాని వెనుక నేమిసాగుచున్నదో చూచు
వాఁడు కాఁడు. పరుగెత్తుచున్న శత్రువులను వెనుకొనఁ దగుసమ
యమున నాతఁ డొక్కఁడ యొందఱనైనఁగూడఁ బాఱి పట్టు
కొనఁగలఁడు. కూటయుద్ధమును బగవారొనర్తురేని దాని
రహస్య మెఱింగి ప్రతియుద్ధముచేయు నేర్పాతనికిఁ గలదు.
ఆతని రాణువ యట్టిదే యనవలయుఁగాని వేఱొకమాట పలుకఁ
దరముకాదు. ఈవఱకే యేయుద్ధముల రాయలు విజయమం
దెనో యదెల్ల లక్ష్మీపతిసాహసప్రధానముగనే మంత్రిశేఖరుఁ
డెఱిఁగియుండెను. కావుననే ప్రతాపరుద్రగజపతి దుర్గముచేర
వచ్చునపుడు త్రోవలో నడ్డగించి యాతనిసేనలఁ జించి చెండాడి
యాతనిం బట్టుకొనవలయునని మంత్రి లక్ష్మీపతికి రహస్యముగాఁ
దెల్పెను. ఎల్లరకుం దెలిసిన గూఢచారులుండి శత్రువులకీ
మర్మము తెలుపుదురేమో యని యూహించి సేనాధిపతికిం
దెలుపక యీదళవాయిని రాణువను దనయధీనమున నుంచుకొని
రాజరక్షణార్థమని యందఱకుం దెలియఁజెప్పుచుండువాఁడు.
అంద ఱిది చేయఁదగుకార్యమనియే భావించిరి. తొలినాటి
రాత్రియే లక్ష్మీపతిని బిలిచి యీవృత్తాంతము నెఱిఁగించి నిశీథిని
యందే సాగనంపెను. కొన్నిక్రోశములదూరముననే పర్వతోత్త
రారణ్యము ముగియును గావున నారేయియే యందు రాణువం
గూడి చేరెను. ఆరాణువయుం దాళ్వీకులు మెండుగఁ గలరు.
ఆభాగమునఁ బడమరతట్టు కాననము సాంద్రద్రుమలతాకీర్ణము.
తూర్పుభాగమున సాధారణముగ నుండును. నడుమ మార్గము

కలదు. ఆమార్గము పర్వతమునకుఁ గ్రింద నడంగును. ఆవలఁ గొండనెక్కి కొంతదూరముపోయిన నుదయగిరి యనుపేరుగల మహోన్నతభాగ మగపడును. దాని నెక్కవలయు. కొంత దూరముపోఁగాఁ దుర్గము కానఁబడును. ఈమార్గములన్నియు నీవఱకే తెలిసికొనియున్నవాఁడు గావున నప్పాజీలక్ష్మీపతి కీపద్ధతులం దెల్పుటయేకాక పటము వ్రాసి యిచ్చెను. దానినిజూచి యాసేనాధీశుఁడు తదుక్తప్రకారము చేయ సంసిద్ధముగ నుండెను. మఱుదినము తనబలంబుల రెండుమూఁడుభాగములఁజేసి సాంద్రారణ్యభాగమునఁ బెక్కుమంది నునిచి తూర్పుభాగమునఁ బదాతులనుమాత్రము నిలిపి శత్రుసేనలు కొంత యడవిఁ జొచ్చినపిదప మార్కొని నిలువరించునట్లును, గొందఱాశ్వికులు వెనుకనుండి వారిని దఱుమవలసినట్లును, వలయునపుడు పడమర నున్న మూలబలము వారికిఁ దోడ్పడఁదగునట్లును గట్టుదిట్టములు చేసి పర్వతమునకు రెండుక్రోశములదూరమున సనఁగా నుత్తరమునుండి యడవిలో మూఁడుక్రోశములదూరముఁ వచ్చిన తర్వాత నడ్డగింపవలయుననియు, నంతదనుక బలము లందం దణఁగియుండవలయుననియు, వేఁగులవా రీలవేయఁగనే మార్గమునకు వచ్చి నిలువవలయుననియుఁ, గొంతసేపు రణము జరగునంతలో నాశ్వికులు పొడసూపవలయుననియు, వారెల్ల నొక్కపర్యాయము రాక యించుక విరామముకలుగునట్లు వచ్చుచుండవలయుననియు, దాన శత్రువుల కీయడవి మనబలమెంత యున్నదో తెలియ శక్యముగాకుండుననియు శాసింపుమని దలవాయికిం దెల్పెను. శతఘ్నులు తొలుదొలుత నలుప్రక్కలం నుండి ధ్వనింపఁజేయవలయుననియు దాన నరిసేనలు భయశీ

పడుదురనియు, వారు త్రోవనువచ్చువారు గావున శతఘ్నులు వారికడ మెండుగ నుండవనియుఁ దెల్పెను. లక్ష్మీపతి తిమ్మరుసు మాటయం దత్యంతవిశ్వాసముకలవాఁడు తదుక్తమార్గము జయావహమను నమ్మకముగలవాఁడు కావున "తుచలు" తప్పకుండ దదాజ్ఞను శిరసావహింపచేసి పెక్కుసంగరముల జయంబుఁ గాంచెను. అనుభవజన్యజ్ఞానము పుస్తకపఠనలభ్యజ్ఞానమునకన్న మిన్నయని మాన్యు లెన్నుదురు. ఇది నిక్కమనియే తోఁచెడిని. కేవలానుభవజన్యజ్ఞానము పుస్తకపఠనలబ్ధజ్ఞానము రెండును గలిసిన మిక్కిలి యక్కఱకు వచ్చుననుట సర్వసమ్మతము. ఈ రెండును లక్ష్మీపతికిఁ దిమ్మరుసుమంత్రి యుపదేశసహవాససల్లాపములవలనఁ గలిగినవి. పాండిత్యముకలదుగాని యనుభవము చాలదని లోకముననుట విదితమేకదా. ఈనానుడి వైద్యునింగూర్చియు దైవజ్ఞునింగూర్చియుఁ జెప్పుదురు. తక్కినశాస్త్రముల నెఱింగనవారింగూర్చియుఁ జెప్పవలయునని నాయాశయము.

ప్రతాపరుద్ర గజపతియుఁ జాల హెచ్చరిక కలవాఁడు. వేఁగులఁ బంపి పురోమార్గము లరయుచు వచ్చుచుండెను. పిఱుందఁ గొలఁదిక్రోశముల దూరమునఁ దగినంతదళము వచ్చునట్లేర్పాటుచేసెను. అది గుల్మమనియు మూల బలమనియుఁ జెప్పంబడును. గ్రామసమీపమున సేనలు చెదరిపోవునట్లును, దాని నతిక్రమింప మరల నవి కలిసికొనునట్లును గట్టుదిట్టము చేసెను. తనప్రధానసేనాధిపతి కటకమున నుండెను. బలరామపాత్రో తనవెంటనుండు రాణువకధిపతి. అతఁడు సామాన్యుఁడని తలంపఁజనదు. యుద్ధనిపుణుఁడు. ఉదయగిరిని దొలుతఁ బట్టుకొనునపు డీతఁడునుండెను. స్వయముగఁ గత్తిపట్టి యుద్ధము

చేయునాసక్తి గలవాఁడు. అంతియగాని యుద్ధమునకు నిరువది యోజనములదూరమువనుండియుత్రోవనపోవలయును. ఈకోట నింతకాలమునఁ బట్టుకొనవలయును. అని పత్రికలపైఁ బద్ధతులను వ్రాసిపంపునాతఁడు కాఁడు. కత్తి కెర దొరకదయ్యోఁగా యని తలంచువాఁడుకాని రణమన్న రోగము నభినయించు వాఁడు కాఁడని యందఱు నొప్పుకొందురు. కతిపయప్రయాణములకుముందే యాసేనాధిపతి ప్రతాపరుద్రగజపతి కొక భటుని వేషము వేసి వస్తువులందెచ్చు శకటములవెంట నశ్వము నెక్కి వచ్చునట్లు విన్నవించెను. రాజందుల కంగీకరించెను. వారు గోదావరినుండియతివేగంబ యుదయగిరి సమీపారణ్యమును జొచ్చిరి.

ఆసమయము వేఁకువజాముగా నుండెను. ఉషఃకాలమున కించుకపూర్వభాగమే యనవచ్చును. నిశ్శబ్దముగా సేనలు వచ్చుచున్నవి. పదఘట్టనములచప్పుడు మాత్రమే యించుక దూరమున నున్నవారికి వినఁబడుచుండెను. కారణమేమో తెలియరాదుగాని యాసేనాధిపతి యయ్యడవిం దనబలము ప్రవేశింపఁగనే రాజును గొలఁదిమందిపరాక్రమశాలురను విడఁదీసి తూర్పుభాగముననున్న యటవిలోఁ దమకుఁ దూర్పునఁ జాలదూరమునుండి రావలయుననియుఁ, దెల్లవాఱకమునువే యేకపది నాశ్రయించి కొండనెక్కవలయుననియుఁ దనమతమును దెలిపెను. గజపతి మాఱుమాటాడక యట్లే యంగీకరించి చీలిపోయెను. పాఠకులారా! యిప్పటిసేనాసన్నివేశము నించుక స్మరింపుఁడు. పెద్దత్రోవనుండి బలరామపాత్రో రాణువనడువఁ బంచెను. దానివెనుకఁ దద్ద్రితకులును వారివెనుకఁ గొంతబల

ముతోఁ దానును దనపిఱుందఁ గొంతదూరమున సహాయబలము వచ్చుచుండిరి. వీరికిఁ దూర్పునఁ జిట్టడవిలో నేదో యొక మార్గమునఁ బ్రతాపరుద్రగజపతియుఁ దద్ద్రితకవీరభటులును బోవుచుండిరి. ఈరెండుత్రోవలకునడుమ నటవియందు రాయలకాల్బలము వేచియున్నది. ఈసేనకుఁ దూర్పుగ నర్ధక్రోశపరిమితదూరముననే గజపతి యరుగుచుండుత్రోవ కలదు. పెద్దత్రోవకుఁ బడమటిదెస సాంద్రారణ్యముకలదని చదివితిరికదా; అందే లక్ష్మీపతి యనుసేనాధిపతియు నతని యాశ్వికదళమునఁ గొంతభాగము వేఁచియుండిన ట్లూహింపుఁడు. వారుండు తావునకు నుత్తరమున నించుకదూరమునఁ గొంద ఱాశ్వికులు వలయునెడ సాయపడ సంసిద్ధముగ నున్నవారు. యాశ్వికులకడను, గాల్బలములచెంతను శతఘ్నికలు గలవు. మందుగుండ్లు నందిచ్చుభటులు ఘోటకశకటములతో నెల్లెడల సంసిద్ధులుగనున్నవారు. ఇందెవరికి సులభముగాఁ గష్టములు గలుగవచ్చునో యించుక యోజింపుఁడు. దైవము బలవత్తరముగదా యనకుఁడు. అది యలసులమాట. పురుషప్రయత్నము చేయకున్న భగవదాజ్ఞ నుల్లంఘించినట్లగును. కావున దీనిం బ్రధానముగా భావించియే యిపు డూహింపుఁడు. పర్వత మీసేనాసముదయముండుచోటికి దక్షిణమున రెండుక్రోశముల మాత్రమున నున్నది. త్వరగాఁ బర్వతముఁ జేరవలయునని గజపతిసేనలు వచ్చుచున్నవి. ఇంతదనుక నేల రాయలసేనలు వారిని మార్కొన లేదని మీరడుగవచ్చును. ఈచోటు పల్లముగనున్నది. ఈరీతిగా నొకయర్ధకోశ మున్నది. ఈచోట బలముల నడ్డగించిన జయించుట సుకరమని రాయలదళవాయిభావము. గజపతిసేనలు

వచ్చుటకు వేఱుమార్గము లేదు. రాయలబలము లుండుచో
టున్నత మనవచ్చును. అంతియ కాక యామార్గ మచట విశా
లము. తూర్పుననున్న యడవి యటనత్యల్పము. కాన బయలు
గానున్నది. సంగరమున ముఖాముఖిగాఁ బోర నది మంచిదన
వలయును. కాఁబట్టియే యింతదనుక వారిని మార్కొనక యుం
డెను. ఇంక నయిదాఱుగడియలరాత్రియున్నది. అంధకారము
రాజ్యమేలుచున్నది. అట్టితరుణమున మార్కొన్నచో నటవి
యందు సంగరమొనరించుట దుర్భరము. బయలుగానున్నది.
ఎంతయంధకారమున్న నుషఃకాలము దాపుననున్నందున నంధ
కారము పలుచగనుండునని యెల్లరంగీకరింతురని నావాంఛ. ప్రతి
క్షణము ధ్వాంతము పలుచపడుచుండును. కావున నంతదనుక
నూరక సేనలఁ గాంచుచు నాబయలునఁ దలపడఁ బూనియుండిరి.

గజపతిబలము లాచోటఁ గాలుపెట్టఁజాలెను. తటాలునఁ
దూర్పుభాగమునుండి వీరభటులహుంకారములు, కత్తులతళ
తళలు, శతఘ్నుల ఘోరనాదములు నొక్కుమ్మడిగాఁ జెలరేఁగెను.
ఇంచుక యంధకారము తొలఁగుచున్నట్లుండెను. వచ్చుచున్న
సేనలు ముందడుగిడక యాయుధముల నందుకొనిరి. సేనలనడ
పించువారు తమకృత్యమును నెఱవేర్చిరి. వ్యూహము లుచిత
రీతిం దీర్పఁజాలిరి. అంతలోనే యిరుదళములందుఁ గొన్నిశిర
స్సులు ధరణిపయిఁ బొరలాడుచుండెను. బలరామపాత్రో సమ
యము తప్పివచ్చినదని యూహించి ధైర్యమువదలక రక్షకులకు
ననుజ్ఞ నిచ్చెను. ఇరుదట్లవారును బోరసాగిరి. అయోనాళముల
నుండి మందుగుండ్లు మహాధ్వనులఁజేయుచు నగ్నిగోళములు
నాఁ బరుగిడసాగెను. నిశాతఖడ్గధారలకుఁ గొందఱకంఠములు

బలియయ్యెను. ఇంతలో రాయలవారియాశ్వికులు పడమరదెస
నుండివచ్చి తమసేనలకు సాయపడిరి. ముఖముల గుఱుతింపఁజాల
కున్నను వ్యక్తిని గనుఁగొనునంత తేజస్సాయంధకారవివరముల
నుండి వచ్చుచున్నట్లుండెను. దక్షిణమున మార్గము నడ్డగించి
రాయలవారిదళములు నుత్తరమున గజపతిరాణువ నిలిచి పోర
సాగెను. ఆపక్షమున బలరామపాత్రో బలములకుఁ బ్రోత్సాహ
మొసఁగుచుండెను. ఈపక్షమున లక్ష్మీపతి తనబలముల కుత్సాహ
మును గల్గించుచుండెను. నానాభాగములనుండి రాయలవారి
యాశ్వికులు వచ్చుచుండుట గజపతిసేనాధిపతి గాంచి యిం
దెక్కుడుబలము నిలుపఁబడియున్నదనియుఁ, దన కీసంగరమున
జయముకలుగుట యరుదనియు నూహించి ముందు నడువఁ
బూనక వెనుదిరుగ నెంచక నిలిచి పోరునట్లు బలములకు సంజ్ఞచే
సెను. ఆశబ్దములను సంజ్ఞలను దెలిసికొని వారు ప్రాణముల
దాఁపక పోరుచుండిరి. ఇపుడు బలరామపాత్రో గజపతిగతి
యేమాయెనని యాలోచింపఁగలవాఁ డయ్యెఁగదా. సేనలఁ
బంపుదమన్న నయితిగాదు. అడుగుకదలించిన శత్రువులు మీఁదఁ
బడుదురు. నలువైపుల రాయలబలము లున్నట్లు లాతఁ డూహిం
చెను. కావున భగవంతునిపై భారమువైచి జగన్నాయకుల
పాదముల ధ్యానించుచు నితరాలోచనములమాని పోరాడుచుం
డెను. ఇంతలో వెనుకనుండిన గజపతిరక్షకబలములు పొడసూప
సాగెను. లక్ష్మీపతియు వానిరాకఁ గాంచెను. వీరికిని సహాయద
ళము లున్నవని యెంచి మఱింతయుత్సాహము గల్పింప భటులు
పౌరుషమును జూపసాగిరి. రాయలసేనలందు శతఘ్నులసంఖ్య
యధికము. కావున గజపతిబలములలోఁ బెక్కుమంది మృతులు

కాక తప్పించుకొనఁ జాలకపోయిరి. గజపతిభటులును వెనుదీయక యయోనాళములనుండి యగ్నిగోళములఁ గురియించుచు నరాతుల ధరారమణికి బలియిచ్చుకార్యమునఁ దీసిపోలేదు. రాత్రి చాల గడచెను. అరుణరశ్ములు ప్రాగ్దిగంగనాముఖమునఁ బొడకట్టసాగెను. ఈమహాహవము జయాశాపూరితాంతరంగులగు నుభయపక్షవీరుల కొక్కరీతి సాగుచుండెను దీని నిట్టులునిచి ప్రతాపరుద్రగజపతివృత్తాంతము నించుక యరయుదము.

హఠాత్తుగా శతఘ్నులనినాదములు వీరభటులహుంకారములు గలిసి యవ్యక్తధ్వనిగాఁ బరిణమించి శ్రుతివివరములఁ బడఁగా నదరిపడి గజపతి నలుదెసలుఁ బరికించి యంధకారమగుటఁ గనఁజాలక ధ్వనినిబట్టి పడమటిభాగమున యుద్ధముసాగుచున్నదని యూహించి బలరామపాత్రో చేసినయాలోచనమును మెచ్చుకొనుచు నాయేకపది నాశ్రయించి కొలఁదివీరభటులతో నఱచేతఁ బ్రాణములుంచుకొని జగన్నాథా! నిన్ను నమ్మినాఁడ. దుర్గమును జేర్పుమా యని ప్రార్థించుచు నలుప్రక్కలం గాంచుచుఁ జీమచిటుక్కుమన్న నులికిపడుచు నాయుధములఁ జక్కఁజేసికొనుచు హరిణగతి రెండుక్రోశము లెట్లో పోఁజాలెను. అందుఁ దరువులు గుల్మములు మెండుగనుండెను. గజపతివెంట దుర్గమార్గముల నెఱిఁగినయొకభటుఁడు గలఁడు. సేనాధిపతి యాతనిం బంపుచు రాజుతో సమయమున నీతఁడు చూపిన త్రోవనఁ బోవలయునని విన్నవించియుండెను. కావున నాభటుని గని త్వరపడి కొండనెక్కుదారిం జూపుమని రాజడిగెను. పదియడుగులునడచిన నొకరహస్యమార్గము కలదు. అందు శత్రువులు కాచియుందురేమో కనుఁగొనివత్తును. మీరీపాదపమా-

టున నుండుఁడని వారినినిలిపి వడివడింబోయి చూచివచ్చి దేవరా దయచేయుఁడని మెల్లనఁ బలికిన నంగీకరించి యాకంటకద్రుమములయంతరములంబడి పోయిపోయి కొండదండ నతఁడు చేరెను. ఆమార్గముననే తిమ్మరుసుపంపిన గూఢచారుఁడు దుర్గమునకుఁ బోయినదని యెఱుంగుఁడు. ఆమార్గమునఁ గొండనెక్కనారంభించునప్పటి కరుణకాంతులు తూర్పుదెస నించుక వ్యాపించుచుండెను. ఇఁకఁ బగవారిచేతులం బడకుండ బ్రదికితిమిరా బాబూ యని గజపతి నడువసాగెను. కొన్నిముహూర్తములకుఁ గొండనెక్కిరి. బల్లునఁ దెల్లవాఱెను. ఉత్తరపుదిక్కున సాగుచున్న మహాసంగరము దృగ్గోచరమగుచుండెను. అందుండి దానిం జూచునంత యవకాశము కలుగమి నారాజు భటులతో వడివడింబోయి యెట్లో దుర్గసమీపమును జేర నటనున్నవారు ముందుగఁ బరుగిడి యధిపులకుం దెలుప వారెదుర్కొని యుచితమర్యాదలం గొనిపోయి దుర్గమున రాజభవనమునఁ జేర్చిరి.

తెల్లవాఱుకొలఁదిని బరస్పరజిగీషల గజపతిరాయలబలములు పోరాడసాగెను. సహాయబలములు వచ్చుకొలఁదిని బీరములు హెచ్చుచుండఁ బెచ్చుపెరుగుమచ్చరముల నేయుచుం బొడుచుచు నగ్నిగోళములఁ బ్రయోగించుచు ఘోరముగాఁ బోరాడసాగిరి. లక్ష్మీపతి యుత్తుంగతురంగమునుండి దృష్టిసారించి చూచుచుండెను గజపతి లేఁడనుట తెలియవచ్చెను బలరామపాత్రో రాజవిషయమున శంకించుచుండియు ధైర్యమువదలకుండెను. ఇరుబలములయందును భటులుమడసిరి. గజపతిబలములు సామాన్యదృష్టింజూడ రెండువంతులు దెగియె ననవచ్చును. అశ్వపతిదళముల నొకవంతు మడిసె ననవచ్చును. అంతట స్వసం

రక్షణమున సేనాధిపతు లిద్దఱు బద్ధాదరులైరి. రెండుజాముల కాసంగరము శాంతమయ్యెను. కాని గజపతిబలములు హత శిష్టములు దుర్గమును జూచు నాశలమాని వెనుకకు నడువవల సిన వయ్యెను. లక్ష్మీపతి మరల నటనుండి యరిబలములు వచ్చు నేమో యనుశంక నందే యున్నతస్థానమున నొకదళమును నిలిపి యుత్తరభాగమునుండి యేసహాయము దుర్గమునకుఁ గలుగకుండఁ జేసెను. మూఁడుజాములకాయుద్ధము శోణితనదుల మూలమున శాంతినొందెను. అత్తఱి నాభూమి శోణితమాతృక యయ్యెను.

పదవ ప్రకరణము.

ప్రభాకరుఁడు తననామమును సార్థకముచేయఁ దలంచు కొనినట్లు తేజిచూడరానియ ట్లుండెను. మండలమును మండ లాంతర్వర్తియగు తదధిపతినిగాఁ జెప్పుట లోకులయలవాటు. సూర్యమండల మగ్నిగోళము. అదియే బ్రహ్మాండము లనఁబడు నక్షత్రములకుఁ జంద్రాదిజలమయగోళములకుఁ బ్రకాశము నిచ్చునది. కావుననే సూర్యుని గ్రహరాట్టందురు. రాట్టనఁగాఁ బ్రభువు. రక్షకుఁడనిభావము. కిరణప్రదానముచేతఁ బ్రకాశవంత ములుగా నితరగోళములను జేయునది యని భావము. గోళము లన్నియు లోకములు. చంద్రుఁడని మనమనుకొనుబింబము జల మయమగులోకము. అందును జీవరాసులుగలవు. జలమయమగు నాగోళముల నేభాగమున భాస్కరభానుప్రసారముకలుగునో యాభాగము ప్రకాశవంతమై మనకుఁ గనఁబడును. తక్కుంగల భాగము నీలవర్ణముగాఁ గనఁబడుచుండును. ఇది మనము కల్పించినదికాదు. కొందఱు దేవానాంప్రియు లీ విజ్ఞానము పాశ్చాత్యవిద్యాభ్యాసఫలమని యందురు. అది తెలివితక్కువ ప్రసంగము. సుమారెనిమిదివందలవత్సరములక్రిందటనున్న శ్రీ భాస్కరాచార్యులు సిద్ధాంతశిరోమణియందు నీవిషయము నిట్లు తెల్పిరి.

శ్లో. "తేజసాం గోళకస్సూర్యో గ్రహర్క్షాణ్యంబుగోళకాః.
సలిలమయే శశిని రవేర్దీధితయో మూర్ఛితాః."

పాఠకులారా! చూచితిరా. మనపూర్వు లెంతవిమర్శకులో. మనకుఁ దెలియనిమాత్రమున మనపూర్వుల కిట్టియల్పవిషయములు తెలియలేదనుట మన కగౌరవముకాదా. అట్టి తుచ్ఛాలాపముల నాలకింపకుఁడు. ప్రకృతవిషయమున కిఁక రండు. భానుభానువులు తీవ్రముగా వ్యాపించుచుండఁగాఁ గోమలశరీరులయవయవములు తమపరితాపమును స్వేదజలరూపమునఁ దెలుపుచుండెను. అత్తరుణమున నొకసేవకుఁడు పరుగుపరుగున వచ్చి తిమ్మరుసును దర్శించి జోహారుపొనర్చి దండనాయకునిలేఖ నిచ్చెను. దానింజదువుకొని తలయూచి మరలఁ బ్రయత్నింపవలయు నవసరము విధివశమునఁ గల్గెను. ఇందు దళవాయియపరాధము లేశమాత్రమైనను లేదనిపలికి దానికి నుత్తరముగా లేఖను వ్రాసియిచ్చి వానిందోడ్కొని రాయల దర్శింపఁబోయెను. శ్రీకృష్ణదేవరాయభూకాంతుఁడు భుజించి శయనించు సమయమేయైన నుదయమునుండి తనకుంగలవిచారమునఁ గూరుచుండి యాలోచించుచు మంత్రిచూడామణికి లేఖవ్రాయఁబూని కఠినింగైకొనుచుండెను. అత్తఱిఁ గంచుకివచ్చి జోహారుసలిపి మహామంత్రులుగారు దయచేసిరని విన్నవింపఁ ద్వరగాఁ బ్రవేశపెట్టుమనియాజ్ఞాపించి లేఖనసాధనమునుయథాస్థానమున నునిచి యతనిరాకకై కాచియుండెను మంత్రియు భటునితోఁ బ్రవేశించి యుచితమర్యాదలనడపి తదుపదిష్టాసనమునఁ గూరుచుండి లక్ష్మీపతి పంచినలేఖ నందిచ్చెను. రాయలాత్రముతో బుచ్చుకొని చదువుకొని మదిఁగలతొందరపాటు తొలంగినచిహ్నములు ముఖమునఁ దోఁపజేయుచు "నప్పాజీ! నేఁటియుదయమునుండి నామనస్సునఁ గలయాందోళము వచింప నలవిగానిది. నిన్నుం

జూడఁ గోరుచుంటిని. ఏప్రయత్నమున నుందువో దాని కభ్యంతరము కలుగునేమో యని యూహించి యూరకుంటిని. ఈలేఖ వలనఁ గార్యభంగి విదితమయ్యెను. దైవ మించుక ప్రతికూలమయ్యెను. కాని యెంతయో విజయము గలిగెను. "ఫలానుమేయాః ప్రారంభాః"అనుదానిని సార్థకముచేయువాఁడవని యెఱింగియే యిన్నినెలలు హాయిగా నున్నాఁడను. ఇదెట్లు కనుఁగొంటివో. ఒరులకుం దెలియకయుండ నింతసేన నెట్లు పంపితివో. దేవుఁడేయెఱుంగును. ఇట్టిమహోపకారమునకుఁ బ్రత్యుపకారము చేయఁజాలను జుమీ" యని యానందబాష్పములు కనుఁదమ్ముల నుండి సంతతధారలుగాఁ గురియుచుండ సింహాసనమునుండి లేచివచ్చి యప్పాజీ యని మఱిమాటరామి బిగ్గఁగౌఁగిలించుకొనియెను. తిమ్మరుసు నాతనిదుందుడుకుచెందిన మనస్సు నెఱింగి యుచితాలాపముల సందియమును దొలఁగించి "ప్రభుశేఖరా! యేలినవారిపాదసేవకులము మేమిటనుండ మీమనస్సు విచారమునొందుట మాయభాగ్యమనవలయు. నిశ్చింతగానుండుఁడు. యుద్ధమన్నమాట స్మరింపక కవిగాయకులతో సుఖముగాఁ గాలముపుచ్చుచుండుఁడు. గజపతి తమపాదమూలము నాశ్రయింపఁగలఁడు. సకలవాంఛలు ఫలించును. జయలక్ష్మితో విజయనగరమును జేరఁగలము. జయలక్ష్మి మిమ్ము వరింప రానున్నది. ఏవిషయమునఁగాని విచారము మదిఁజొన్పక సుఖముగాఁ గాలమును బుచ్చుఁడు." అని రహస్యగోష్ఠిని గాలమించుకపుచ్చి నెలవంది సువార్తఁదెల్పిన యాభటునకుఁ బసదనమిప్పించి తననెలవునకుంబోయి దండనాయకులతో నాలోచించి యుత్తరభాగమునుండి యేసహాయము దుర్గమునకుఁ గలుగక

యుండఁ గట్టుదిట్టము చేసెను. క్రొత్తదళ మాస్థలము నాక్రమించెను. విజయము సంపాదించి తనరాణువంగూడి లక్ష్మీపతి రెండవదినము సాయంకాలమున మంత్రుల దర్శించి తదనుమతి భూకాంతమాలిని దర్శించి వృత్తాంతమెల్ల నివేదించి తదనుజ్ఞచే వచ్చి తిమ్మరుసుకడనే యుండెను. అంతకుముందు రాయలసేనలకుఁ దదధినాథులకుం గల్గియున్న వ్యాకులము తద్వార్తాశ్రవణమాత్రమున శాంతించి యేక్షణమున దుర్గము నాక్రమింతుమా యని వారువ్విళ్లూరుచుండిరి. ఏక్షణమున మంత్రియూహ లెట్లు ఫలమునిచ్చునో యెవ్వరెఱుంగఁజాలకుండిరిగాని విజయవార్త వినఁబడుననిమాత్ర మాశించుచుండిరి. విచార మాశిబిరముల నుండి మెల్లమెల్లనఁ బర్వతమును బ్రాఁకి కోటనుదాఁటి రాజమందిరము నాశ్రయించి మరల నిష్టపడక యందే నివసించు తలంపున నుండెను.

సంగరకాల మతిక్రమించుతఱిఁ బ్రతాపరుద్రగజపతి వేషాంతరమునఁ గొలఁదిపరివారముతోఁ గోటం బ్రవేశించి నిజసౌధమును జేరి ప్రయాణశ్రమములం దీర్చుకొనుచుఁ బాదములనాటినముండ్లఁ దీయించుకొని యౌషధప్రయోగమున నించుక బాధలడంగ బలరామపాత్రో శత్రువులకుఁ జిక్కెనో, తప్పించుకొనిపోయెనో, లేకవీరస్వర్గము నలంకరించెనో తెలియఁజాలక చింతాసాగరనిమగ్నుఁడయ్యెను. మంత్రిభటనాయకులు లోనగువా రపుడపు డారాజుచింతలఁ బాపుచుఁ బౌరుషములు పలుకుచుండిరి. కొలఁదిదినములకు బడలిక లడఁగ యథాపూర్వముగా గజపతి కొలువుదీర్చి కూర్చుండెను. ఎల్లయుద్యోగస్థులందుఁ జేరిరి. ఒక్కభటుఁడు శ్రమంపడినజాడలఁ దెలుపు మోముతోవచ్చి యాస్థానమున జోహారుసలిపి యిట్లని విన్నవించెను.

మహాప్రభూ! ఆనాఁడు తెల్లవారుజామునఁ గొండక్రిందికి దళములురాఁగాఁ దటాలునఁ బరబలములు మార్కొని నిలువరించెను. మనదళములు వియచ్చరు లచ్చెరువందఁ బెచ్చుపెరుగు రోషములం బ్రాణముల డాఁపక పోరాడెను. తెల్లవాఱునప్పటికి నిరుబలములందును వేనవేలువీరభటులు కూలిరి. శత్రుబలముల నాశ్వికులు మెండు. శతఘ్నులు మిక్కిలియుఁ గలవు. వారుండుభాగ మున్నతప్రదేశము. కావున నించుక వారిలో మృతినొందినవారు మనబలముల మృతినొందినవారికంటెఁ దక్కువయని యూహించిరి. ఇఁక యుద్ధముచేసి లాభములేదని పాఱిపోవుట పాడిగాదని తలంచి స్వసంరక్షణమున ప్రమత్తులై పాత్రోగారు మెలఁకువమీఱఁ బోరుసల్పఁజేసిరి. శత్రువులును విసికి పోరుచాలించునట్టియూహల నుండిరి. ప్రళయవాతమొండు మనకును వారికి నంబరచుంబిగాఁ గోటను రజస్సునఁ గప్పెను. దాన నెవరిప్రక్కకు వా రొదిగిరి. వృక్షాంతరముల నాశ్రయించిరి. మిగిలినసేనలంగూర్చుకొని బలరామపాత్రో మరలి కొలఁదిదూరమున నిలిచి శత్రువులు పార్ష్ణిగ్రాహము సల్పుదురేమో యని యందందు నిలుపఁదగువారల నిలిపి సన్నుగ్రామములం బ్రవేశించి యుదయగిరిం జేరి ప్రభుపాదమూలమున నీవార్త విన్నవింపఁబంపెను. నేనును గండిపాళెము లోనగుపల్లియలఁ దిరిగితిరిగి యెట్లో యుదయగిరిపురమును జొరఁగల్గితిని. పర్వతమునకు మూఁడుదిక్కుల శత్రువులు నిలిచి యున్నారు. తూర్పుభాగమున నున్నవారుకాని యీశాన్యభాగమున నించుక రాకపోకల కవకాశము గలదు. ప్రతిగ్రామము

నందును వేషాంతరముల వారిగూఢచారు లున్నవారు. ఇఁక జేయవలసినపనియేమో యేలినవారియుత్తరువులకై పాత్రోగారు కాచియున్నవారు. కటకమ్మునుండి బలములఁ దెప్పింప సెలవైనట్లొనర్చెద. ఈభటునిమూలమున లేఖామూలమునఁగాక తెలుపవలయును. అని విన్నవింపుమనిరని మనవిచేసి యూరకుండెను. కాంతరాయఁడు లోనగువారితో నాలోచింపఁదలఁచి శ్రమాపనోదనార్థ మాతనిం బంపి మంత్రిప్రముఖులతో నాలోచింపఁబూనెను. గజపతి యిట్లు భాషించెను.

ఆప్తవరులారా! ఇట్టియిక్కట్టువచ్చునని కలయందైనఁ దలంపలేదు. దైవమునుద్దేశ మిట్టిదని తెలిసికొన శక్యము కాదు కదా. మొన్నటివిపత్తుతప్పుట గొప్పయదృష్టమనవలయును. వారు మనరాక నెఱుంగుట కడుఁజిత్రము. బలరామపాత్రో నన్నుఁ దోలఁగనంపుట మెచ్చఁదగినది. ఎట్లో దుర్గమును జేరితిని. దూరదేశములనుండి సైన్యములువచ్చుటకుఁ గొంతకాలముపట్టును. అదియు దుర్గముచేరునో చేరఁజాలవో నిర్ణయింపఁజాలము. రాయలమంత్రి మతివిశారదుఁడని తెలియఁబడియెడు. మార్గముననే నిలువరించుప్రయత్నముచేయునని తోఁచెడిని. ప్రకృత మాసహాయమును గోరుటమాని యిచ్చటిస్థితిని బరికింతము. దుర్గబలము మనకుఁగలదు. వారికెంతసైన్యమున్నను దుర్గము సమీపించునపుడు మనసాధనముల హతులుకావలసినదేకాని తప్పించుకొనఁజాలరు. నిన్నటిమంత్రిమాటలంబట్టి యాలోచింపఁగా నాహారవస్తువులు కొన్నిసంవత్సరములదనుకఁ గొఱంతవడకయున్నవని తెలియనయ్యెను. ఆయుధములలోటు కానరాదు. పాలు పెరుగు నెయ్యి మనపర్వతమున గోవులుంటఁ గొదువఁ

గాంచవు. ఇట్టిసహాయముగల మనము శత్రువులు బలవంతులని భీతిల్లుట పాడిగాదు. ఇంతియగాక కృష్ణదేవరాయఁడు తనయుత్పత్తిని మఱచి గజపతిపుత్త్రికఁ బరిణయమాడఁగోరె నన్నమాట విన్నప్పటినుండి నామనస్సు క్రోధఘూర్ణమాన మగుచున్నది. పాలవంటివంశమునకుఁ గళంకము వాటిల్లఁజేయుటకంటె జచ్చి వీరస్వర్గము నలంకరించుట మేలుకదా. కావున నొడలు ధరఁదొరఁగునంతదనుకఁ బోరాడ నెంచితిని. మీమీభావముల నిస్సంశయముగాఁ దెలుపఁజనును. అని పలికి యూరకుండెను.

ఎల్లవారామాటలకు బదులుచెప్పక యీపఱకే యీవిషయ మాలోచించి సిద్ధాంతముచేసికొంటిమనియు, దేవరయాశయము సమ్మతించినట్లు తెలియుట మఱింత మంచిదనియు, సంతసించుచున్నారమనియుఁ దెలిపిరి. ఒక్కరుగాని యాయాలగమున దాని కడ్డమాట చెప్పినవారుగాని, చెప్పఁబూనినవారుగాని, చెప్పఁదలంచినవారుగాని కానరారైరి. ఏకగ్రీవముగా రాయలసేనలను మార్కొని యమపురికిఁ బంపవలయుననియే యంగీకృతమయ్యెను. కాంతరాయఁడు తానీవఱకుఁ జేసినయుద్ధప్రయత్నములఁగూర్చి పలికి యింకను జేయఁదలంచుకొన్నవియుఁ జేయుచుండునవియు నగుప్రయత్నవిశేషములఁ దెలిపెను. బదులుచెప్పక యెల్లరు బాగుబాగనిరి. గజపతి యంగీకారసూచకమందహాసమొనరించెను. పర్వతము లగ్గలుపట్టుతావుల వీరభటుల నునిచి గూఢచారులంబంపవలయునను ప్రస్తావము చేసిరిగాని మంత్రియిచ్చినయుత్తరమును బట్టి యదియు నీవఱకే చేయఁబడియెననుట స్పష్టమయ్యెను. అంత సభ చాలించి మరల సమావేశమగుకాలమున కెదురుచూచుచు నందఱు తమతమ

యిరవుల కరిగిరి. గజపతియు నంతఃపురమున కరిగి శత్రుజయ ముంగూర్చియే యాలోచించుచుండెను. కొలఁదిదినములకు వచ్చినగూఢచారుని బిలువంబంచి, వచింపఁదగినవార్తలం దెల్పి బలరామపాత్రోకడకుఁ బంపి రాజు తనచేయఁదగుపని యం దప్రమత్తుఁడై యుండెను.

ఉదయగిరిరాజ్యమున రాయలసేన లుండుటంబట్టి యాహారపదార్థములు దొరకుట కఱవయ్యెను. ఆసంవత్సర మాప్రాంతములఁ బర్జన్యుఁడు విశేషాదృతిం జూపమి సస్యోపయోగివృష్టియేగాని యెక్కుడువృష్టి గురియదయ్యెను బీదల కన్నము దొరకుట యరుదయ్యెను. ఇది యిటులుండఁగా నాహారవస్తువుల నమ్మకయున్న దండింతుమని రాయలభటులు బెదరింపసాగిరి. తమయిక్కట్టిట్లున్నదని చెప్పుకొందమన్న వినువా రెవ్వరు కలరు? కొలఁదినెల లూరకుండి దండుగలు తెమ్మని రాజాజ్ఞయైనదని సాటింపఁబడెను. ఏనుంగులకుగా నశ్వత్థతరువులు నిహతములయ్యెను. జలాశయములు పంకిలములయ్యెను. పచ్చనిపైరు గనఁబడిన రాజసైనికులు పాడియావులం దోలుచుండిరి. వలదన్న మరణదండనమని పైఁగా పల్కులు వినఁబడుచుండెను. ఒక్కొక్కదినము వేయిమందిభటులు గ్రామములకుంబోవుచుఁ దమకాహారమునిమ్మని వారిం బెదరించుచు దొరకినవస్తువులఁ గొల్లఁగొట్టుచు వచ్చుచుండిరి. ఇట్లుచేసినఁగాని ప్రజలు ప్రభువిముఖులుగారని యుద్ధనిపుణులయాశయమఁట. రాజున కీయవలసినపన్ను మాయొద్దకే పంపవలయును. లేకున్న గ్రామాధికారు

లకు శిరశ్ఛేద మొనరింతుమని యాజ్ఞాపత్రికలు పంపఁబడుచుండెను ఎందేని పాఱిపోవుదమన్న దారిచిటి కావలెను. ఆదేశమునఁ బ్రవేశింతుమన్న ననుమతిపత్రముండితీఱవలయును. అదిచూపకయున్నఁ గఠినదండనము విధింపఁబడుచుండెను. గజపతిపంపిన యుద్యోగులు రహస్యముగా మాఱువేషముల మాటలాడవలయునే కాని కనఁబడిన బంధింపఁ బడుచుండిరి. ఇట్టి కష్టముల కోర్చి యమ్మనుజు లెన్నిదినములు కాపురములు సేయుదురు. మాకు లోఁబడిన మీకు గోపురము పెట్టుదుమని రాయలవారి భటులు వాగ్దానము చేయుచుండిరి. లోఁబడకయున్న దేశభ్రష్టులను చేయుదుమని వ్రాసినలేఖలు పంచిపెట్టుచుండిరి. వానిచేఁ బామరులఱిచేతఁ బ్రాణములుంచుకొని రాజభక్తిని విడనాడఁజాలక నిలువుకొని కష్టముల భరింపలేక యూఁగులాడుచుండిరి. కొందఱత్రోవను పాఱిపోవుదమా యని సమయము కనిపెట్టియుండిరి. పశువులు పచ్చికఁగానక యార్తములైయుండెను. ఈపశువులగోడు తగులకయుండునా యని పామరులు రాజభటుల శపించుచుండిరి. పిల్లిశాపములకు నుట్లు తెగునా యని భటు లుల్లసమాడుచుండిరి. దేశమంతయు హాహాకారములతో నిండియుండెను అన్నమో రామచంద్రా యని బీద లల్లాడుచుండిరి. ఈయల్లకల్లోలము శ్రీకృష్ణదేవరాయలు తిమ్మరుసు నెఱింగియు నీసమయమున దయచూపరాదని తలంచి ప్రజలను విశేషించి క్రియారూపమునఁ బీడింప వలదనియు, వాక్కులఁ బీడింపుఁడనియు, లోఁబడినచో విశేషించి దయచూ

పుడనియుఁ దమభటులకు నాయకులకు హెచ్చరికలు పంపుచుండిరి. ఇట్లు కొలఁదివారములు సాగెను. ప్రజలకుఁగల యీబాధల నాలకించుచు గజపతి తానేమియు నపుడు చేయలేక చేతులు పిసికికొనుచు నుద్యోగులను హెచ్చరించుచుఁ బ్రజలకుంగల యలజడి యెట్లు వాపుదునా యని యాలోచించు చుండెను.

పదునొకండవ ప్రకరణము.

జాముగడచి రెండవయామము రేయిం బ్రవేశించెను. జ్యోతిస్సు లాకసమునఁ దళతళలాడుచుఁ దమయపూర్వశాంతతను వెల్లడించుచుండెను. ఎల్లయెడలనిశ్శబ్దముగనుండెను. ఆహా! ఆకాలమహిమ మెట్టిదియో కాని చీమచిటుక్కుమన్న వినఁబడు చుండెను. శకుంతములుగాని తత్సంతానములు కాని మధురరుతములుచేయుట మాని హాయిగా నిద్రాసుఖము ననుభవించు చుండెను. శాంతరసాధిదేవత తనపరిజనులంగూడి యెల్లకడల వేడుకమై సంచరించుచుండెను. ఆమెప్రభావముననే కాఁబోలు లోకుల కానందము గలిగించు ప్రాణులన్నియుఁ బ్రాయికముగా నాలోచింపఁగా సుఖమనుభవించుచుఁ దమయవయవములకు విశ్రాంతి నొసంగుచు మరలఁ బ్రవృత్తికిఁ దగు సత్వము గలవానినిగాఁ జేయుచుండెను. కొంద ఱలసు లాయుః కాలమున సగము నిద్రతో సరిపోవునందురు. అనఁగా నది వ్యర్థముగాఁ గడచునని వారిభావము. ఆయూహ యించుకంతయు మంచిదికాదు. ఆనిద్రాసుఖమే కలుగకయున్న మనస్సు ఇంత మాత్రముగూడ స్వాధీనముననుండకుండుననుట నిక్కము. నిద్రయే సమాధ్యవస్థను దెలుపును. అట్టిసమాధిని సంపాదింపఁ బ్రయత్నింపుఁడని ప్రాణులకు హితబోధ మొసంగును. ఆహారముగ్గకంటె నిద్ర యెక్కుడుపకారముచేయుననుట మాఁటికి

ముమ్మాటికి నిశ్చయము. నిద్రను మానినచో మనయవయవములు లేపనిచేయను సమర్థములుగావు. అలసినవారికి విశ్రాంతి యెట్టిదో యంగములకు నిద్రయట్టిది. అట్టినిద్రను వ్యర్థకాలక్షేపములలోఁ బరిగణించుట చాలహ్రస్వదృష్టియని చెప్పక తప్పినది కాదు.

అట్టి నిశీథినియందుఁ దిమ్మరుసు భటుఁడొక్కఁడు వెంట రా రాయలు సుఖనిద్రచేయుచక్కటికిం బోయెను. చుట్టుకంచె యున్నది. ఎనిమిదిదిక్కులను గావలివారు జాగరూకులై సజ్జీకృతాయుధవిశేషములతోఁ దిరుగుచుండిరి. ద్వారముకడ నూఱుమందివీరభటులు వంతులప్రకారము నిలుచుండి నలుప్రక్కల దృష్టులఁ బ్రసరింపఁజేయుచుండిరి. వారలఁ దటాలునఁ జూచిన యమకింకరులని తలంపనివారుండరు. తిమ్మరుసు మెల్లన నాద్వారముకడకు రాఁగా దూరమునుండియే యొకఁ డదలించెను. మఱి యడుగిడక మెల్లగాఁ దనపేరుచెప్పెను. మర్యాదగా వాఁ డెదుర్కొని పిలుచుకొనిపోయి తనచోటుదాఁటు దనుక మంత్రి ననుసరించి సెలవంది యచట నిలిచెను. ఆవలివాఁడు తనపని తాఁ జేసెను. వరుసగా శయ్యాగారముదాపునకుఁ జేర్చిరి. పదములచప్పుడించుక చెవిసోఁకగనే మేల్కాంచి తీవ్రతరధారావిరాజమానభీతికరకరవాలమును జేఁబూని యెవరని హెచ్చరించెను. ప్రభువుజాగరూకతను మది మెచ్చుకొనుచు నేనని కంఠస్వరము వినఁబడఁజేసెను. తలుపుదీయఁబంచి లేచివచ్చి యుచితాసనమునఁ గూరుచుండి మంత్రిని గూరుచుండఁ బంచి "యేమి యప్పాజీ! త్వరగా వార్తం దెలుపుమా. ఇంతకాల మిందుండియును నిట్టియర్ధరాత్రసమయమున నెప్పుడును

వచ్చినది లేదు. విపరీతవార్తలు లేవుకదా?"యని ప్రశ్నించెను. మంత్రియు "మహారాజా! అన్నియు మనప్రయత్నములనుకూలములు. దైవము మనకు సుముఖమై యున్నది. విజయలక్ష్మి మిమ్ము వరింపఁ బయనమగుచున్నది. ఒక్కపని కావలసి వచ్చితినని దగ్గఱకుంబోయి కుడిచెవిలో నేమో చెప్పెను. మంచిదని రాజనెను. ఇరువురు నిష్క్రమించిరి. ఒక్కభటుఁడు మాత్రమే వారి ననుసరించెను. వారటనుండి యెందుఁబోయిరో యెవ్వరెఱుంగరు. తెల్లవాఱునప్పటికి రాజమంత్రులజాడ తెలియమి నెల్లరు గుసగుసలాడఁ జొచ్చిరి. ప్రధానసేనాధిపతికిఁ దక్క నితరులకు వారిజాడ యించుకంతయుఁ దెలియదు. శిబిరము వదలిపోవుచోఁ బ్రధానసేనాధిపతికిఁ దెలుపవలయుననియే రాజశాసనము కలదు. కావున నాతనికి మాత్రము తెలిపిరి. వారారాత్రి యెం దెట్లుగడపిరో తెలియఁ దరముకాదు. సేనాధీశ్వరుఁడు జాగరూకుఁడై యందందు భటుల నునిచెను. వారెల్ల వేషాంతరములుపూనినను ఖడ్గసహితులయియే యుండిరి.

తిమ్మరుసంతకుముందే యుదయగిరికి మూఁడుక్రోశముల దూరమున నొకసంతర్పణమహోత్సవము సాగునట్లు కట్టడిచేసెను. అందుఁ దటాకము కలదు. విశేషించి జలము లేదుగాని కొలఁదిగాఁ గలదు. అది విశాలజలభాగము కలతటాకము. దానికట్ట యెందున్నదో కనుఁగొనుట కష్టము. ఆకట్టకుసమీపమున గండిపాళెమనుగ్రామము కలదు తటాకమునకు నాకారణముననే కాఁబోలు గండిపాళెపుఁజెఱువను పేరు కల్గెను. ఆతటాకమున నొక్కభాగమునఁ బెద్దమామిడితోఁట కలదు. వృ

ములు పురాతనములు. ఫలముల నీఁజాలునో లేదో యెఱుంగుట కష్టముగాని ఛాయాప్రదానమున మేరుభూమిరుహములకుం దీసిపోవునవి కావు. ఆవృక్షములక్రింద బ్రాహ్మణభోజనము జరగునట్లు ఏర్పఱుపఁబడినది. ఆతోఁటకు నించుకసమీపమున నితరులకు భోజనము పెట్టునట్టి యేర్పాటుగలదు అందు జనబాహుళ్యము. ఈ రెండుస్థలములకు నడుమ నిర్వృక్షభాగము నూఱుబారలుండును. తటాకోదకము కాక ఈ రెండుతోఁటలయందు మంచినీరుగల బావులున్నవి. సోపానములు విశాలములుగా నమర్పఁబడియేయున్నవి. లోపలిభాగమున శ్వేతమృత్తిక కలదు. కాన జలము నిర్మలములుగ నుండును. అడుగుననున్న చిఱుచేఁపలుకూడ బాగుగఁ గనఁబడుచుండును. మధ్యాహ్నమునకు విప్రులకు భోజనసమయమని ఘంటానాదము తెలిపెను. నవనాగరకులు కానిహేతువునఁగాఁబోలు వారెల్ల 'ధౌతవస్త్రములం దాల్చి బ్రహ్మయజ్ఞము లోనగునిత్యకృత్యములందీర్చి సూర్యోపాసనము చేసి భుజింప సిద్ధపడిరి. బల్లారి ప్రాంతములనుండి సూపకారులు వచ్చిరి కాన మధురభక్ష్యములు పెక్కువిధములఁ బెక్కుపేరుల నమర్చిరి ఆదేశవాసులు వీని నెఱుంగరు. కావున దిట్టముగా భక్షించిరి. ఇట్టిసంతర్పణ మీజన్మమునఁ జూడలేదు పాపంభట్లూ యని కొండావధానులనెను. ఆహా! ఆమాటకు సంశయమటయ్యా యని యాయన బదులుచెప్పెను. మధ్యాహ్నకాలము దాఁటకమునుపే భోజనమెవరుపెట్టిరయ్యా యని మల్లావధానులనెను. పద్ధతులు బాగున్నవయ్యా యని పుండరీకాక్షదీక్షితుఁడు బదులుచెప్పెను. ఇట్లు మాటలాడుచుఁ దాంబూలముల నమలుచుఁ జల్లనిచెట్లనీడలఁ

బయిపంచెలపైఁ బరుండిరి. రాయలు మంత్రియు విప్రవేషముల నందందు సంచరించుచుండిరి. అపుడపుడు మంత్రి రాజుతో వినుమని సంజ్ఞచేయుచుండెను. కాని యాసంభాషణములనుండి యేమి వారెఱింగిరో మనకుం దెలిసికొన శక్యముకాదు. సాయంకాలమునకు రాజసచివు లిర్వురు తమతమశిబిరముల నలంకరించిరి. వారు పోయినజాడ యెట్లు తెలియ వలనుపడకయుండెనో వచ్చినజాడయు నట్లేయుండెను. యథాపూర్వముగఁ దమశిబిరములఁ గూరుచుండి తమకృత్యములను జేయుచుండిరి.

మఱుదిన ముదయమున మంత్రియుఁ బ్రధానసేనాధిపతియు రాజసముఖమునఁ గూరుచుండిరి. రహస్యాలోచనము చాలసేపుసాగెను. వారు లేచువఱకు మధ్యాహ్నము దాఁటు తరుణముగ నుండెను. భుజింప రాజు లేచెను. తక్కినవారిద్దఱు తమతమశిబిరములకుం బోయిరి. ఆదినశేషమునఁగాని, మఱి వారమువఱకుఁగాని క్రొత్తవార్త లేవియు వినఁబడలేదు. ఒక్కనాఁడు సేనాధిపతులు తమతమబలములకు హెచ్చరికలు చేయుచు సంజ్ఞలఁ బరీక్షించుచు నాయుధములఁ బరీక్షించుచుండిరి. కారణమేమో భటు లెఱుంగరు. నారియాలాపములవైఖరిఁ బరికింప సంగరరంగమున కరుగవలసిన యవసరము సమీపమున నున్నట్లు తోఁచుచుండెను. సేనాధిపతులమోముల నొకక్రొత్త వికాసము కనఁబడుచుండెను. వారిపలుకుల చమత్కృతియుఁ గ్రొత్తదిగానుండెను. అంతకుముందే వారెల్ల నొక్కచోఁ బెక్కుపర్యాయములు కూడుచు మాటలాడుచునుండిరి. వీరభటులకివియన్నియు యుద్ధమాసన్నమగునన్న యూహను గల్గించెను. వారు నెప్పుడెప్పుడాయని వేచియుండిరి. కావున నుత్సాహమునే

కనుఁబఱచుచుండిరి. కింకరులు మొదలందఱి మోములయందును యుద్ధోత్సాహము స్పష్టముగాఁ జూడఁదగియుండెను. పిఱికితనమేమూలనున్నదో యెఱుఁగఁబడదు. ఏక్షణమున ననుజ్ఞ నిత్తురా. కోటను గోటమీటుదమా యని భటులాటోపమున మాటలాడుచుండిరి. వలయు పరికరములు కూర్పఁబడుచుండెను. క్రొత్తయాయుధములు చేర్పఁబడుచుండెను. విజయనగరమునుండి కొందఱాశ్వికులు వచ్చిరి. వారెల్ల నేయేసేనాధిపతియాజ్ఞ మెలఁగఁదగునో యాపద్ధతిఁ బ్రధానసేనాధీశుఁడు తెల్పుచుండెను. ఇట్లు శిబిరభాగములన్నియు నీప్రయత్నములతో యుద్ధోత్సాహములతో నిండియుండెను. తిమ్మరుసు సుముహూర్తము నాలోచించుచు నెవరికొఱకో యెదురుచూచుచుండెను. లక్ష్మీకాంతరాయఁడు మాత్ర మచట లేకుండెను, వాఁడేవార్తనో తేవలయుఁ గాఁబోలునని యందఱాలోచించుచుండిరి.

పండ్రెండవ ప్రకరణము.

ప్రతాపరుద్రగజపతి దుర్గమునకుఁ జేరకముందే కాంతరాయఁడు తనచేతనైనంతదనుక యుద్ధప్రయత్నము చేయుచుఁ దమకు సహాయులుగా నార్వీటివారిని, ఓరుగంటివారిని, గొబ్బూరువారిని, ఇంకను గొందఱనుసామంతులను బిలిపించెను. వారెల్లఁ దమతమదళములతో వచ్చియుండిరి. వారు కోటఁ బ్రవేశించినంతదనుక నీమార్గమున నీనాఁడు వీరు వత్తురని యెవ్వరికిం దెలియదు. రాజూరలేదన్నకొఱంత కలుగకయుండఁ బ్రతినిధియనుపేరు సార్థకముగా రాజ్యమేలుచుఁ గాంతరాయఁడు శత్రువుల లొంగఁజేయునంత బలమును గూర్చెను. వలసినన్ని యేనుఁగులు లేవనుటే కాని దుర్గబలముగలవారికితరబలము లెన్నియుండవలయునో యన్నియు సిద్ధముగా నుండునట్లు చేసెను. గజపతియుఁ దత్ప్రయత్నముల కాశ్చర్యపడి జయముగలుగుట దైవాధీనమనియు, మనుష్యప్రయత్నమున లోపము లేవియు లేవనియుఁ దలఁచుటయేగాక సభలో నందఱు వినఁ జెప్ప సాహసించెను. గజపతియూహలో నీకోట జయింప శక్యము కాదనుభావము కలదు. దానినే నమ్మియుండెను. దుర్గరక్షణోపాయములు సమంజసములని తెలిసికొనియెను. కాఁబట్టి కాంతరాయని ప్రయత్నమున లోప మించుకంతయు లేదనియు, శత్రువులు దుర్గముదరికింగూడ రాఁజాలరనియు నాతనివిశ్వాసము. అంతకుముం దెప్పుడు గజపతి యోటమిరుచి యెఱింగిన

వాఁడు కాఁడు కావున జయము తనపక్షమునకే కలుగుననియు, విజయనగరసామ్రాజ్యమునొక్కత్తుగా దిగమ్రింగి సార్వభౌముఁ డననిపించుకొందుననియు గజపతి యూహాయని స్పష్టము కాక పోదు. కావుననే యాసమయమున దుర్గాంతర్గతదివ్యసౌధ మునఁ బ్రాక్సాగరతుంగరంగత్తరంగసంగతవాతపోతముల తాఁకున హాయిగా నిద్రపోవఁజాలెను. లేకున్న నిద్రింపఁ గలఁడా! తృప్తిగాఁ గుడిచి కూరుచుండఁ గలఁడా ?

రాయ లుదయగిరి నాక్రమించుట.

ఒక్కనాఁడుదయమున కాల్యకరణీయములు తీర్చి రాయలు సభచేసి మాటలాడుచుండఁగాఁ బరుగున సేవకుఁడు వచ్చి శత్రువులు పర్వతమునెక్కి వచ్చుచున్నవారు.ఏనుఁగు లసంఖ్యాకములు ముందు వచ్చుచున్నవన్న భయంకరవార్తను దెలిపెను. అంద ఱులికిపడిరి. కొంతరాయనికన్నులెఱ్ఱవాఱెను. గోపాలరాయఁడవుడు కఱచెను. రామరావు రయమున నట్టహాసము చేయుచు లేచి కత్తిని జళిపించెను. దుర్గపాలకుఁడు సేనలం బరికించెను. ప్రతాపరుద్రగజపతి యింక నాలస్యము చేయుకాలము దాఁటినది. త్వరపడుఁడని హెచ్చరించెను. సభ చాలించి కొంతరాయఁడు సేనల సంసిద్ధము చేయింపుమని దుర్గపాలకుని హెచ్చరించి కొండనెక్కుదారిని నిలిచి శత్రువులఁ బరిమార్ప సహాయసేనలం బంపెను. ముందే మార్గముల నిలిచియున్నవారు హెచ్చరికల మెలఁగుచు, నగ్నిగోళములఁ గురియించుచు గండోపలములఁ దొరలించుచు, దూరమున మఱుఁగుననుండి యమ్ముల వైచుచు, శిరసులఁ గూల్చుచు నేనుంగుల మృతినొందించుచు ఘోరముగాఁ బోరుచుండిరి.

కోటకుఁ గొంతదూరమున నొకమార్గముండెను. అది క్షామ బాధ విశేషించినపుడు పర్వతముపైకిఁ బశువులను దోలుకొనిపోవుట కేర్పడిన మార్గము. కాఁబట్టి యాత్రోవనడుమఁ జిన్నివృక్షములు నుండెను. క్రొత్తవారి కది మనుష్యులు బోవు మార్గముగాఁ దోఁపదు. దానినుండి పోయినఁ గోట చాలదూరముగ నున్నట్లగపడును. దానికొక ప్రక్కన సానుభాగమున్నది. అదియుఁ గడుంబెద్దది గాదు. దానిప్రక్కనే విశేషించి యత్యున్నత వృక్షములవరుసలు గలవు. మార్గమునఁ బోవునపుడు కొండ యెత్తుగాఁ గనఁబడక సమస్థలముగాఁ గానఁబడును. మెలికలుగా మార్గము పోవుటంబట్టి యట్లగపడునుగాని వేఱు కారణమునఁ గాదు. ఫలకమువలె మార్గమున్నట్లగపడును. కొన్ని మెలికలు దాఁటినపిమ్మటఁ జూచినఁ గ్రిందినుండి వచ్చువారు చాలనిమ్నభాగమున నున్నట్లగపడుదురు. ఆమార్గమున రక్షకభటులుండిరి. గండోలములు నిలుపఁబడి యుండెను. ధానుష్కు లున్నతభూరుహాగ్రములపైఁ గూరుచుండి సూటిగా నమ్ములఁ బఱపుచుండిరి. ఒక్కొక్క కత్తివాఁతియమ్మున నొక్కొక్కవీరునికంఠము తెగి ధరపైఁ బడుచుండెను. ఒక్కొక్కచట్రాయిదొరలింపఁ బడఁగఁ గొన్ని యేనుఁగులు వానితోడఁబడి దొరలి దొరలి యంగములు కొన్ని శేషింపఁగాఁ బ్రాణముల వదలుచుండెను. కాని యాసేన లవ్వానిని లక్ష్యపెట్టక లక్ష్మీపతి ప్రభృతులు దళవాయులు పురికొల్పుచుండ హుంకారము లొనరించుచు ముందునకుఁ బోవుచుఁ బడుచున్నవారిం జూడనైనఁ జూడక యెదురెక్కిపోవుచుండిరి. శతఘ్నులఁ బ్రయోగించుచు నయోమయాగ్నిగోళముల నాళికాయంత్రములనుండి వెడ

లించుచుఁ బ్రతిపక్షులఁ ద్రుంచుచుండిరి. కొంతసేన చెట్లచాటుగానుండి పరుగిడి కావలివారలఁ గత్తుల కెరచేయుచుండిరి. ఇట్లు మహాఘోరముగాఁ బోరాటము సాగుచుండెను.

దుర్గమునుండి పంపఁబడినబలములు చేరునప్పటికి కృష్ణదేవరాయలసేన లామార్గమునఁ గొన్ని మెలికలెక్కఁ జాలెను. ఆప్రయాణము రాత్రినుండియే సాగుచుండెను. గజపతిచారులందందుండిరిగాని వారెల్ల బందీకృతులుగాఁ జేయఁబడిరి. గావున నెప్పటివార్త యప్పుడే కోటఁ జేరఁజాలక పోయెను. అంతియగాక యేనుఁగులు ముందునడుచుచుండ శతఘ్నికలు వానివెనుకొని యరికంతముల వ్రక్కలించుచుండ నంతదూరము పోవఁజాలుట చిత్రముకాదు. ఆమార్గమునకే మోట్లదారి యందురు. ఆత్రోవనున్న చెట్లకొమ్మలు సాగి పెరుగఁజాలక పశువులు నమలుట లోనగు కార్యములచే మోట్లుగా నున్నందున నాపేరువచ్చెనని కొందఱు చెప్పుదురు. ఇదెంత నిజమో మనము నిర్ణయింపఁజాలము. రాయలసేన లుండుచోటి కింకను గోట చాలదూరమున నున్నది. సమీపముగాఁ గనఁబడునుగాని త్రోవ కుటిలముగా నున్నందున దూరమనక తప్పదు. ఒక్కొక్కయడుగు ముందున కరుగుట బ్రహ్మాండము కబళించినట్లుండెను. గజపతిసేనలకు సహాయసేనలు వచ్చెను. వారున్నతభాగమున నుండిరి. రాయలబలములు క్రిందిభాగమున నుండెను. గజము లెన్నియున్నను ముందున కరుగుట కష్టతరమని తోఁచెను. కానియాచోటున బలములు నిలుచునట్లును, సమయమునరసి ముందునకరుగవలసినట్లులక్ష్మీపతియుత్తరువు చేసెను. అపుడు రాయలసేన లుండుతావునఁ బశ్చిమభాగమున గోడుగువలె నొకకొండభాగ ముండెను. దానిక్రింద నుండిన శత్రువుల యాయుధములవ్రేటులు బాధింపవు. దానిక్రిందఁ బెక్కుమంది యుండవచ్చును. దానికి మూఁడుప్రక్కలయందును విశాలస్థలము కలదు. చెట్లు క్రిక్కిరిసియున్నవి. కావున నది యొకస్థానముగా నెంచి యందుండి స్వరక్షణమున జాగరూకులై యుండవలయునని రాజాజ్ఞయు నయ్యెను. వారిప్రయత్నముల నెఱింగి గజపతిసేనలు తమతావును బలపఱుచుకొనుచు శత్రువులు పొడసూపినఁ బొడువ సిద్ధముగా నుండిరి. కోటనుండి వచ్చుచుం బోవుచు నం దేమఱుపాటులేక యుండిరి. ఆనాఁటి కాయుద్ధము ముగింపఁబడియెను.

రాయలు భూదానములు చేయుట.

తిమ్మరుసు శ్రీకృష్ణదేవరాయలప్రభుత్వము నెల్లచోఁ జాటంబంచెను. నలుప్రక్కలఁ బ్రతిపల్లెయందును జాటిరి. అపుడపుడు బలములంగూడి రాయలు కొన్నిగ్రామములకుఁ బోవుచు నచ్చటివారల కభయమొసంగుచు, సేనలవలన నేమాత్రము మీ కలజడి కలుగదని హెచ్చరించుచు, మీకష్టసుఖములు మావిగా భావింపఁబడునని వాగ్దానముల నొసంగుచుఁ, బన్నుల వృద్ధిచేయుదు రేమో యన్నభయము విజయ సామ్రాజ్యమున నుండువారు పొందనక్కఱ యుండదని నొక్కిచెప్పుచుఁ, బరరాజభయముల మఱచిపొండని యుపదేశించుచు, మీకుఁ గల యిక్కట్టుల మాకుఁ దెల్పువిషయమున సందియ మొందకుఁడని వారికి నచ్చఁజెప్పుచు వచ్చుచుండెను. అపుడపుడు బీదల కన్నదానముజేయ ధనము వెచ్చింపఁబడు చుండెను. ఉద్యోగులందఱు బీదజనులు కనఁబడినను మర్యాదను వదలక మాటలాడుచు

నుండిరి. బ్రాహ్మణులను భక్తిమీఱ గౌరవించుచుండిరి. వారెల్లరతోఁ జల్లనిప్రభుత్వ మలవడినదని చెప్పుచుండిరి. వివాహమని కొందఱు, నుపనయనమని కొందఱు, దేవాలయము నుద్ధరింతుమని మఱికొందఱు, దేవతాపూజకై ద్రవ్యమిప్పింపుఁడనియు మాకేమియు వలదనియు మేము సర్వసంగపరిత్యాగులమనియు నింకనుం గొందఱును, గపటవేషములూని భగవన్నామ మహిమమును లోకులకుం దెలుపఁ బాటుపడుచున్న వారమని మఱికొందఱును శ్రీకృష్ణదేవరాయలను విప్రోత్తము లాశ్రయింపసాగిరి. తిమ్మరుసుబోధమున రాయలావిప్రుల కపటాచారము లెఱింగియు నది సమయము కావున దాని సేవించుపొంటె నపారద్రవ్యము లిచ్చుచుండెను. సమయమెఱుఁగక వచ్చి బ్రాహ్మణబ్రువులు యాచించినను రాజసముం జూపక కృష్ణరాయలు వారి మన్నించి ధనమొసంగుచుండిరి. రెండుమూఁడు పర్యాయము లుదయగిరినగరమునకు రాయలు వేంచేసిరి. ఆపురమునఁ బెక్కు దేవాలయములు విచిత్రశిల్పనైపుణ్యము గనఁబఱచుచుండెను. కొన్ని దేవాలయములు రాయలకుఁ గడుంజాలిఁ బుట్టించెను. అర్చకులు కడుంగడు భక్తులై బిచ్చమెత్తుకొనివచ్చి నైవేద్యదీపారాధనములచే భగవంతునిఁ దృప్తిపఱచుచుండిరి. వారి నియతికి మెచ్చి యాదేవాలయములకుఁ గొఱంతలేక యుత్సవాదులు సాగి ప్రఖ్యాతిగల్గునట్లు గ్రామముల నొసంగెను. ఆ సత్కార్యమున దిగంతవిశ్రాంతకీర్తి రాయలకుం గల్గెను. నిత్యోత్సవములు సాగుటయు వానిం జూడ జానపదు లరుదెంచుటయుఁ గారణములుగా శ్రీకృష్ణదేవరాయలు దేవతాభక్తి కలవాఁడనియు, దీనమానవకల్పవృక్షమనియుఁ, బండితుల సాద

రించువాఁడనియుఁ, బ్రతాపనిధియనియు విఖ్యాతికల్గెను. కొండపై సంగరము సాగుచుండెను పురమున మహోత్సవములు జరుగుచుండెను. గ్రామములను రాయలయుద్యోగులు పరిపాలింప గల్గిరి. దండుగలు తీయునాచారము లడంగెను. సుఖముగా మానవు లుండిరి. రాయలవా రుదయగిరిదుర్గమును బట్టుకొనుదురనియు, గజపతి బందీకృతుండగు ననియుఁ, దత్కుమారిక శ్రీకృష్ణరాయపత్ని యగు ననియు విశ్వాస మెల్లరకుం గల్గెను. జనపదములయందు గజపతిపాలనము నశించెను. వారియుద్యోగులు కనఁబడుటయే లేకుండెను. విజయనగరసామ్రాజ్యధ్వజపటము లెల్లయెడల నెత్తఁబడి యుండెను. ఈవార్త లెట్లో కోటలోనికిం జేరుచుండెను. ధైర్యము ప్రక్కన సంశయము నిలిచి గజపతి నార్తునిం జేయసాగెను. తనబలముల ముందునకు నడపుదమన్న ధైర్యమే వారికిఁ లేకుండెను. కాని తమకోటనుమాత్రము శత్రువులు చేరఁజాలరనునమ్మకముమాత్ర మెల్లవారికిం గల్గియుండెను. తిమ్మరుసు శాసించుచుండ రాయ లందులకు సమ్మతించుచుండ సేనాధిపతు లాశాసనములఁ బరిగ్రహించుచుండ భటు లారీతిఁ బ్రవర్తింప నుత్సాహపూరితు లగుచుండ జయమున కేమికొఱంత యుండును?

పర్వతమున యుద్ధము కొంతకాలము నిలుపఁబడెను గదా. ఒక్కనాఁడు శతఘ్నికాధ్వానములు మరల వినఁబడియెను. విడువనిపట్టుదలలఁ బోరాడుచు రాయలసేనలు ముందడుగు పెట్టుచుండెను. మొండిధైర్యములఁ బడుచున్నభటులను లెక్కింపక వెనుకనున్నవీరులు ముందంజ వేయుచునే యుండిరి.

క్రొత్తయాయుధములవ్రేటుల కోహటించి గజపతిసేనలు వెనుకంజవైచెను. దానఁ బరబలములు రెండవయునికిపట్టును జేరఁగల్గెను. అంతలో సహాయములు స్థామంత రాజులు తద్బలములు వచ్చి వీరిని నిలువరింపఁగల్గెను. కాని యీమార్గమునఁగాక దీనికంటె నించుకయెత్తుగానున్నపర్వతభాగమున వృక్షముల సందున నొకమార్గము రహస్యముగాఁ దిమ్మరుసు సిద్ధపఱపించెను. దాని నాక్రమించి కొంతరాణువ రాసాగెను. దానింజూచి యోర్వఁజాలక గజపతిబలములంగల మేటిమగలు వారిని వీరిని దలఁపడి నిలువరించుచుండిరి. ఈసంకులసమరము విరామము నెఱుంగక కొలఁదిమాసములు జరగెను. ముట్టడిదినము మొదలంతదనుకఁ బదాఱునెలలయ్యె నని కొందఱుపల్కుదురు. కాని దానిని సిద్ధాంతము చేయఁజాలుపద్ధతులు చాలవు. కాని యించుమించుగా నంతకాలముపట్టెనని యెల్లవా రంగీకరించిరి. దినములు జరగినకొలఁదిని పౌరుషము లెక్కుచునే యుండెను. ఈసంగరమున శ్రీకృష్ణదేవరాయలు తిమ్మరుసు నిలిచి పురికొల్పుచుండ సేన లుక్కుమిగిలి తలఁపడి వైరుల నిర్మూలించుచుండెను. ఈసంగర మిట్లు సాగెనని కుమారధూర్జటి కృష్ణరాయవిజయమునఁ జెప్పినపద్యముల నుదహరించెదను.

సీ. "ఏచాయఁ గనుఁగొన్న హేరాళమై తోఁచు
గంధాంధసింహళగజచయంబు
నేవంక నీక్షింప హేషారవోదీర్ణ
గాంధారకాంభోజకాండవితతి
యేదారిఁ జూచిన నాదారిన తుపాకి
బలువైన జబురుజంగులు ఫిరంగు

లేదండ గణుతింప వేదండకరచండ
కోదండధరభటకోటిపటలి
తే. యెచటఁ జూచిన బల్లెంబు లీఁటెగములు
గలుగు రాయలదళమెల్లఁ గలయ నెంచి
యుదయగిరిచెంత నుదయించె నొక్కవింత
యనుచు దుర్గములో మంది యళుకుచెంది.

క. అభిమానమునకుఁ గాన
యిభరాజుజనంబు, పోరె నెంతయు బాహా
విభవం బెలర్ప సేనా
రభసమ్మున కెదిరి కృష్ణరాయలతోడన్.

సీ. కోటలు దుర్గముల్ గొనుచు దోఃపటుబల
ధాటిచే మించు నారవీటివారు
కంటకాహితకంతలుంఠనోద్ధతలీల
దంటలై తగుతోరగంటివారు
నిబ్బరంబుగ శత్రునికరంబు నణఁగించి
ధీరులై మించు గొబ్బూరివారు
చాల దోర్బలలీల సముదారిసంఘంబుఁ
దూలించి వెలయు నందేలవార
తే. లాదిగాఁ గల్గురాజులు మేదురగతి
తుళువదొరలును బోయలు దురుసుగాఁగఁ
బ్రతిదినంబును ఘోరమౌ రణ మొనర్ప
నిలిచి పోరాడె గజపతిబలము లపుడు."

(3 ఆశ్వాసము)

ఇట్లు సంకులసమరము సాగుచుండ రాయలసేన యేనుఁగులయు శతఘ్నులయు సాయమున ముందునకు సాగుచుఁ, బ్రతిభటుల కళేబరములఁ ద్రొక్కుచు, మూర్ఛకొన్న వారి నుగ్గునూచమగునట్లు పొడుచుచు మాఱులేనివిహారమున దుర్గసమీపమును జేరఁగలిగిరి. ఇపుడు రాయలబలములకుఁ దగినస్థలము దొరకెను. కోట యొక్కటితప్పఁ దక్కినభాగములు వశమయ్యెను. పర్వతమున నలుప్రక్కలఁ గ్రిక్కిరిసి నిలిచినవి. ఒక్కసారి కోటను బగులఁగొట్టుదమా యని వీరభటు లాశించుచుండిరి. అలసటలు దీర్చుకొనఁదగునని కాఁబోలు తిమ్మరుసు లగ్గలుపట్టి శాసింపఁడయ్యెను. కోటనుండి నళికాయంత్రనిస్సృతాగ్నిగోళములు తమకుఁ దాఁకకయుండునంత దూరముననిలిచిరి. శతఘ్నులు దుర్గమున విశేషించి లేవని స్పష్టమయ్యెను. తమకడ నపారములుగా నవియున్నట్లు పరులెఱింగియే యుండురనుకొనుచు నాకోటను తుత్తుమురుసేయఁ బూనినట్లు వానినలు దట్ల నమర్చి యేనుఁగులను దలుపులకు డీకొలుప నెంచియుండిరి. ఇపుడు కోటలో మిగిలినబలము నాల్గవభాగమై యుండెను. వీరు లెందఱో భూమికి బలియైరి. ఆయుధబలము చాలదని వారే యెఱింగిరి. ఇఁకఁ జేయఁదగుకార్య మెద్దియని యాలోచింప నవసరము కల్గెను. కోటలోనివారు గుసగుసలాడసాగిరి. గజపతియుఁ గాంతరాయఁడు దైవము ప్రతికూలించెనని తలంచిరి. కాని పట్టువదలక పోరాడవలయుననియే నిశ్చయించిరి. దండనాయకులును రాజరాజప్రతినిధులవాంఛలు ఫలింపవలయుననియే భావించిరి. తగుప్రయత్నములు చేయుచు దుర్గరక్షణమున

నేమఱకయే వారుండిరి. బలములు తక్కువయను టొకటితప్ప నాహారవస్తువులకు లోపము లేకుండెను.

శ్రీకృష్ణదేవరాయలు మంత్రితో నాలోచించి పర్వతమునఁ గొలఁదిదినములు వీరులకు విశ్రాంతి నొసంగెను. వీరభటులుమాత్ర ముత్తరువిచ్చిన నేఁడే కోట నాక్రమింతుమని పట్టుదలలఁ జూపుచుండిరి. బడలికడఁగవలయునని విశ్రాంతి యీఁబడినది. ఇంచుక శాంతమూని యుండుఁడని దళవాయులు సమాధానము చెప్పుచుండిరి. వారముదినములు గడువఁగా నిఁకఁ దడవుచేయుట పాడిగాదని తలంపవలసివచ్చెను. విజయనగరమున రాజు చాలకాలము లేకుండుట చుట్టునున్న మహమ్మదీయుల కుత్సాహముగా నుండెనఁట. ఆవార్త విషాదపూర్వకముగా రాజధానినుండి తెలుపఁబడియెను. ఇంతకాల మీయొక్క యుద్ధమున వ్యయించితిమి. ఇఁకను ఆలసించుట మంచిదిగాదని రాజమంత్రులకుఁ దోఁచెను. కావున రణభేరులు వాయింప ననుమతి యీయఁబడియెను. తటాలున నాధ్వనులు పిక్కటిల్లగాఁ బర్వతమంతయుఁ బ్రతిధ్వనించెను. మృగములు పరుగువాఱసాగెను. కోటలోనివారు సాయుధులై బురుజులపైఁ బొడసూపిరి. శతఘ్ను లమర్పఁబడియేయుండెను. దూరమునుండియే శత్రువులు మరలవలయునని శతఘ్నులనుండి యయోగోళములను బఱపిరి. ప్రతిగోళములు కోటపైఁ బడుచుండెను. గెలుపోటములు నిర్ణయింప శక్యముగాక యాయాయోధన మెనిమిదిదినములు సాగెను. రాయలసేనలు ముందంజవేయఁజాలకుండిరి. లక్ష్యముతప్పక ప్రాసాదోపరిగతవివరములనుండి తివ్వన బాణములు వెడలి యొక్కొక్కమానిసిమస్తకమును

ద్రుంచి భూమిని బ్రవేశించుచుండెను. రాయలబలముల ధానుష్కులు కొలదిమంది యుండిరి. కావున దుర్గధానుష్కుల నేమియుఁ జేయఁజాలకయుండిరి.

ఉ. ఠీవిగ నౌకువారును గకడింది రహిన్ వెలుగోటివార లా
రావెలవారు గూడికొనిఁ రాత్రి పగల్ చతురంగసేనతో
సేవగఁ జూచిరన్ దెలియఁనెంతయు శక్యముగానిదుర్గమా
భూవరమౌళిఁ గాంచి యొకఁపూటనె దీసెదనంచు నుగ్రుఁడై.

ఉ. దిగ్గనలేచి సాహసముఁ తేటపడన్ మునుమున్న గాఁగఁ దా
నగ్గలికన్ జెలంగువిధఁముంతయుఁ గన్గొని రోషచిత్తులై
లగ్గల కెక్కిరందఱు బఁలంబు చలం బలరన్ రవంబులన్
దిగ్గజముల్ వడంక బలుఁతెంపున గుంపులు గూడియుద్ధతిన్.

అని కుమారధూర్జటి వర్ణించినట్లు శ్రీకృష్ణదేవరాయలు నిజాయుధముల ధరించి తిమ్మరుసు వీరభటవేషమునఁ దోడుసూప బలములకుఁ దాఁ గన్నాకై యురవడించెను. సేనాపతులందఱు ప్రభువునకంటె ముందు నడచిరి. వారింగాంచి భటు లావేశము వచ్చినట్లు ప్రాణములఁ డాపక పోరాడుచు ముందునకు నడువ సాగిరి. మత్తదంతావళములు బారులుగా నిలుపఁబడియె. శతఘ్నులు విరామము లేకుండ వాయింపఁబడుచుండెను. పడుతలల లెక్కింపక వీరావేశంబునఁ గోటదరిఁ జేరిరి. ఏనుంగులు తలుపులఁదగులసాగెను. ఒక్కొక్కతావున కొక్కొక్క ప్రక్కతలుపు పడిపోవసాగెను. ఏనుంగులపై నెక్కి తుపాకులను నళికాయంత్రములనుండి యగ్నిగోళములఁ బ్రయోగించి బురుజులపై నున్నవారిని బడఁగొట్టుచుండిరి. నలువైపుల నిట్లు చేయుచు నీశాన్యదిక్కునుండి రాయలసేనలు బురుజుల కెగఁ

బ్రాకిరి. తప్తతైలముల మ్రగ్గువారు మ్రగ్గుచుండ లెక్కింపక యిట్లొకొందఱు చేరఁగలిగిరి. అందలివారలం దోడనె యసిధారల కాహుతిచేసిరి. వెంటనే మఱికొందఱు చేరిరి. ఆబురుజు రాయలవశమయ్యెనని యెల్లరకుం దెల్లమయ్యెను ఏనుంగుల వరుసగా నిలిపి వానిపై నిశ్రేణికలుంచి సేన లొక్కుమ్మడిగా నెక్కిరి. అందు విజయనగరసామ్రాజ్యచిహ్నధ్వజపట మెత్తఁబడియె. సింహనాదములు శంఖకాహళాదివాద్యధ్వనులు శతఘ్నులఘోరారావంబులు దుర్గవాసుల ధైర్యసారమును బెకలించి బెగడుపడంజేసెను. రాయ లాత్రపడి బురుజుపై కెక్కఁబోవ మంత్రి వారించి శిబిరమునకుండ నీపాదముల చెంతకు గజపతి రాఁగలండని రహస్యముగాఁ దెలుప రాజేంద్రుఁడు మఱుమాటపలుకక శిబిరమునకరిగెను. ఈవిజయము శుక్రవారముదయమున జాములోపల గలిగెనఁట. ఆబురుజుపై రాయల వీరభటులు శతఘ్నులు నిండియుండెను. తక్కినబురుజులవారు చూచుచు నింక గతియేమి దైవమాయని చేతులు పిసికికొనుచుండిరి. సభాభవనమునఁ గొలువు చేయుచుండిన ప్రతాపరుద్రగజపతి మాటాడఁజాలకపోయెను. అపుడు గోపాలరాయఁడు లేచి హితము తెలిపెను.

మహారాజా! జయాపజయములు దైవాధీనములు రాజ్యలక్ష్మి యెవ్వరికడను స్థిరముగానిలువదు. మన మీదుర్గము నాక్రమించినపుడు మనవశమున నుండెను. ఇన్నిదినములుండినదే గొప్పయనిభావింపవలయు ఆలక్ష్మీదేవియిపుడుకృష్ణదేవరాయని నాశ్రయించినది. మన మేమిచేయఁగలము. ఓపినంతదనుకఁ బోరాడితిమి. మనకై యెన్నివేలమంది యోధవీరులు తమశిరముల భూమి

కర్పించి కృతకృత్యులైరి. హతశిష్టులు సర్పింపనున్నారుకాని లాభము గనఁబడదు. సామంతరాజు లెందఱో తమయవక్ర విక్రమముం జూపఁగల్గిరి. దైవ మనుకూలమైన నివియన్నియు ఫలించును. అది విపరీతంబైన మనమేమిచేయఁజాలుదుము. మన ప్రయత్నములన్నియు నిష్ఫలములైనవి. శత్రుప్రయత్నములు సఫలములైనవి ఇంకను గాఁగలవు. పర్వతమునుజుట్టి యరిబలములు నిలిచినందున రాజ్యపాలనమున మన మసమర్థుల మైతిమి. భూదానము లొనరించియు, వన్నవస్త్రముల నిచ్చియుఁ, బన్నులఁ దగ్గించియు, నింక నెన్నియోవిధముల జనుల కుపకారము లొనరింతుమని యాశఁగొల్పియుఁ బ్రతిపక్షులు జనపదములఁ గైవసము చేసికొనఁజాలిరి. మనయుద్యోగులు పోయి వారి మరల్పఁజాలువారయ్యు నవకాశము దొరకమి నూరకుండవలసివచ్చెను. ఇన్నియు నిట్లుకాఁగాఁ దుదకు నభేద్యమనఁబడు నీదుర్గమునకుఁ బతనకాల మాసన్నమయ్యెను. ఒక్కభాగము శత్రువులకుఁ జిక్కెను. ఇఁక దక్కినభాగములు లోఁబడినట్లే మన మూహింపవలయు. కొలఁదిముహూర్తములలో లోఁబడును. శేషించినసైనికులు బందీకృతు లగుదురు. కావున రాజనీతి ననుసరించి మనము సంధికిఁ బ్రయత్నించుట న్యాయము. పూర్వకాలపుఁజక్రవర్తులు కూడ సంధికిఁ బ్రయత్నము లొనరించి కృతార్థులైనట్లు పురాణములు ఘోషించెడిని. మహారాజా! ఇప్పటి కెట్లో యీయొడరుఁ దప్పించుకొని కొండవీడు దరికిఁబోయి తగినంతబలముల సమకూర్చుకొని దైవమనుకూలం బగునెడ మరలఁ బోరుదము. జయము మనశత్రువులనే యెల్లప్పుడాశ్రయించియుండదు కదా. మఱియు రాయలమంత్రి తిమ్మ

రుసు కడునీతిజ్ఞుఁడని విందుముకదా. నీతివేత్త సంధికంగీకరింపక మానఁడు. మానిన నీతిజ్ఞుఁ డనఁబడఁడు. అంతియకాక కృష్ణదేవరాయలు ప్రతాపశాలియగుట మాత్రముకాక రాజనీతివిశారదుఁడని మనచారులమూలమునఁగాక యీవఱకే యెందఱో చెప్పుకొనుచుండ వింటిని. ఉదారస్వభావుఁడనియు వింటిమి. దీర్ఘక్రోధి కాఁడనుట స్పష్టము. ధర్మాత్ముఁడని మున్నే మనయోలగమునఁ బండితులు కవులును విన్నవించిరికదా. విద్యాపక్షపాతి. ఇన్నియోగ్యతలుకలవాఁడు సంధికి విముఖుండగునని యెట్లు మన మనుమానింపఁగలము?

క. "తనభటులు గలఁగినప్పుడు
ధనమిచ్చి విరోధి నల్పకతరునైనను శాం
తుని జేయవలయు దానము
నన యధికుని దేర్చు టురవుగ నరపతి కెపుడున్."

అని మున్ను గాంగేయుఁడు యుధిష్ఠిరునకు నుపదేశించెను. కావున మనమిత్తఱి నీధర్మము నాశ్రయించిన రాజనీతి నాశ్రయించినవార మగుదుము. ఇప్పటి కీయొడరుఁదప్పించుకొని యింతతో నూరకుండుట మనయితరదుర్గముల బలపఱచుకొని సేనలంగూర్చుకొని ప్రతిపక్షులజయింతము. ఇంకను దడవుసేసిన మనలంగూడ బందీకృతులను జేయక మానరు. అప్పుడు సంధికిం గడంగుట నీతిశాస్త్రసమ్మతముకాదు. కాదేని కోటవెడలి పోరాడి ప్రాణముల విడుతము. అంతియకాని బందీకృతులము కారాదు. ఇదియ నాకుం దోఁచినయూహ. పిదప దేవరయానతిచొప్పునఁ బ్రవర్తింప సంసిద్ధుఁడనై యున్నాఁడను. అనిపలికి మోమున దీనభావంబుతోఁప నూరకుండెను.

ప్రతాపరుద్రగజపతి యించుకతడ వూరకుండి యించుక ధైర్యముం దెచ్చుకొని మంత్రిభావ మూహించి యింతకంటె సముచితమగుమార్గము దొరకదనిం దెలిసికొని మంత్రిప్రముఖులంజూచి మన మిపు డాలోచించిన లాభములేదు. త్వరపడవలసినకాల మాసన్నమయ్యెను. మీరు నిపు డేదియుచితమని తోఁచునో యట్లు కార్యము నడపుఁడు. నే నందుల కంగీకరించెద. మిమ్మందఱ నిపుడు రణభూమి కర్పింపఁజాలను. దైవము మనపక్షమునఁ బ్రతికూలముగాఁ గనఁబడుచున్నప్పుడు మనమేమిచేయఁగలము? పురుషకారము దైవముతోడ్పాటున ఫలించునని శాస్త్రములు నొక్కి పలుకుచున్నవి. కావున మనమిపుడు పెద్దలపల్కులచొప్పునఁ బ్రవర్తింతము. 'తడఁబడఁ డేనాఁటికొక్క దైవము లేఁడే' యన్నమాట విందుముకదా యని కరవాలము క్రిందవైచి యూరకుండెను. ఎల్లరు చింతాక్రాంతులైరి.

సంధి.

అంత గోపాలరాయఁడు కాంతరాయనితో నాలోచించి రాజునకుఁ దమభావము నెఱింగించి యంగీకారంబుఁబడసి రామరాయప్రభృతులమూలమున రాయబారమంప నిశ్చయించిరి. రామరాయఁ డభిమానధనుఁడు. కాలముదప్పినవు డేమిచేయఁదగునో యాపద్ధతుల నంగీకరించునంతటిరసికుఁడు. కావున నెట్టకేల కంగీకరించి బయలువెడలెను. తిమ్మరు సంతకుమున్నె యుద్ధము నిలిపివైచి యుండెను. రాయబారము జరవుదురని యతఁడు వేచియుండెను. రాయలకు రాఁగలరాయబారమును దెలిపియే యుండెను. అవకాశమిచ్చి వారు రారేని కోట నాక్రమింతమని యామంత్రిబృహస్పతియుద్దేశము. దండనాయ

కులు వీరభటుల నించుక శాంతచిత్తులనుగా నొనరించిరి. ఎల్లరు మంత్రియాజ్ఞకొఱకు వేచియుండిరి. చారులు కోటపైనుండి రాయబారమురాకఁ గనిపెట్టి యప్పుడే మంత్రికిం దెలిపిరి. మంత్రియు దండనాథుఁడు లోనగువారు శ్రీకృష్ణదేవరాయల శిబిరమునఁ జేరి కార్యాలోచనము చేయుచందము నభినయించుచుండిరి. వీరభటులు వేలసంఖ్యలుగాఁగూడి సకలాయుధముల నొప్పారి యుండిరి. అత్తఱి రామరాయప్రభృతు లుచితరీతి నచ్చటికింబోయి తమరాకఁ గంచుకిమూలమున నెఱింగించిరి. ప్రవేశింప ననుమతి యొసఁగఁబడియెను. అంభ్యతరమునఁ బ్రవేశించిరి. మంత్రియానతి వారి కుచితపీఠములు జూపఁబడియె. రాజునెడలఁ జూపఁదగుమరియాదలంజూపి తదనుమతి నాసీనులైరి. కొలఁదినిమేషములకు రాయబారపులేఖ రాజసన్నిధి నునుపఁబడియెను. మంత్రిపై రాజు దృష్టిఁ బ్రసరింపఁజేయ నాతఁ డద్దానిం గైకొని విప్పి చదువ నారంభించెను. అందిట్లు వ్రాయఁబడియుండెను.

“శ్రీమద్విజయనగరసామ్రాజ్యధురంధరులగు కృష్ణదేవరాయలసన్నిధికి, యుద్ధసమయసముచితరీతులఁ బ్రతాపరుద్రగజపతి సమ్మతింగొన వ్రాయఁబడులేఖార్థములు. పౌరుషప్రధానులగుక్షత్రియవంశజులకు యుద్ధము సనాతనాచారము. యుద్ధముచేయునపు డిరుదెగలవారును యథావిధిఁ బోరాడుటయు నీతిశాస్త్రసమ్మతము. ఆయాచారముల నతిక్రమింపక మీరును మేమును బోరాడితిమి. జయాపజయములు రెండు నొక్కప్రక్కనే యాశ్రయింపఁజాలవుగదా. ఈక్షణమునఁ బూర్వ మీచోటనే మమ్మాశ్రయించిన విజయలక్ష్మి మిమ్మాశ్రయించి

నది. పరుల నాశ్రయించిన రెండవలక్ష్మీ మాచెంతకు రాఁజూచు చున్నది. కావున రాజనీతిప్రకార మీతరుణమున మాకృత్యము మేము నెఱవేర్పఁబూనితిమి. రాజనీత్యాచారమర్యాదల నాఱితేఱినమీరును జేయఁదగుపద్ధతి నాశ్రయింతురని నమ్మెదము. మర్యాదారక్షణ మందఱకు నొక్కవిధమేకదా. విధివశమున మీరు మేము లోఁబడితిమని యంగీకరింతుము. ఇఁక మీరు చేయఁదగుదానిని న్యాయప్రకారము తెల్పుఁడు. కాల మెల్లరకు దుస్తరముకదా. సనాతనరాజమర్యాదల నాలోచించి దైవము నెదుట నునుచుకొని మీయాశయములఁ దెల్పుఁడు. ఇదియ మాభావము.

ఇట్లు విన్నవించు రాజధర్మనిరతులు,
ప్రతాపరుద్రగజపతులు.
శ్రీశ్రీశ్రీ."

అని చదివి మంత్రి యూరకుండెను. ఎల్లరు నాకసము వంకకు దృష్టుల నిగుడ్చిరి. తిమ్మరుసు రామరాయప్రభృతులం దిలకించి "యార్యులారా! సమయముదొరకినదని త్వరపడునాచార మీసామ్రాజ్యమున లేదు. కాఁబట్టి యోజించి యుత్తరమంపెదము. దుర్గమునుండి మీబలముల దిగునట్లు చేయుఁడు ఆయుధధారణమున కంగీకరింప రాజనీతి యడ్డుపడునుగాన నాయుధముల మాని యెల్లరు వెలుపల నుండవచ్చును. రాజకుటుంబము యథాపూర్వముగ నుండందగు. మర్యాదననుసరించి వర్తించుట మీకెట్లో మాకు నట్లేకదా. సత్వరంబ పద్ధతులం దెల్పుదుము. మీరు నిశ్చింతముగ నుండవచ్చును."అని మర్యాదలఁ గొఱంత

వారికిఁ దోఁపక యుండఁబల్క వారు ముఖముల నించుక తేటఁదనము కనఁబడ నుచితప్రకారము సెలవంది కోటలోనికిం బోయి ప్రభువున కవ్వార్తం దెల్పిరి. తదుక్తప్రకారము మంత్రిప్రభృతులు చేయించిరి దుర్గము రాయలవశమయ్యెను. ఎల్లబురుజులందు రాయలభటులు నిలిచిరి. ధ్వజపటములు తమవిజయమును దెల్పుచు నెగురుచుండెను. ఉత్సాహ మందఱకు సమానము కదా. రాయలభటులు గజపతిసైనికుల మర్యాదగాఁ జూచుచుండిరి. ఈశిక్షణ మరుదని వారును దలంచియుండిరి. ఉదయగిరిదుర్గమును గజపతి యాక్రమించినపుడు యుద్ధమునఁ బాల్గొన్నవీరుఁ డొకఁ డానాఁటిగజపతియాచారము నెఱుంగునుగాన రాయలబలముల యాచారము నిపుడు కన్నులారఁ గాంచుచున్న వాఁడౌట మిగుల నబ్బురపడి శ్రీకృష్ణదేవరాయలను వేభంగులఁ బొగడుచు విజయపరంపర లీప్రభుసార్వభౌమునకుఁ గలుగ వలయునని కోరెను. ఆసమయ మంతశాంతముగా నుండుట క్రొత్తపద్ధతియని యెల్లర రచ్చెరువంది కనుచుండిరి. ఆనాఁడు సాయంకాలము కోటలోని కొకలేఖ పంపఁబడియె. దానింగొని పోయినకమలాకాంతరావు గజపతితోఁ గొన్నిమాటలు చెప్పఁ దగినట్లుకూడ నేర్పాటు గావింపఁబడియె. గజపతి మంత్రిప్రభృతులం గూడి యాలేఖయందుగల విషయముల నాలకించెను. అది రహస్యమని వ్రాయఁబడినందున నితరులకుఁ దెలుపఁబడ దయ్యెను. లక్ష్మీకాంతరావు పలికినపలుకులు నట్టివే. అవియు నాసభలోనున్నవారికిం దప్ప నితరులకుం దెలియవు. బదులు

పంపుకొని మర్యాదగా రాయనిం బంపిరి. ఆరాత్రియంతయు రహస్యగోష్ఠులచేతనే గడచెను.

మఱుదినము తిమ్మరుసు రహస్యముగాఁ గోటలోని వార్తల నెఱింగి రాయుల కెఱిఁగించి మనమిఁకఁ గోటను స్వాధీనపఱచుకొను టొక్కటిదక్క వేఱుకార్యము సాధింప వలనుపడ దనిరి. ఏదినము ప్రతాపరుద్రగజపతి కోటఁ బ్రవేశించెనో యాదినముననే రహస్యమార్గమున రాణివాసమును దిరుమలకాంతరాయఁ డుత్కలదేశమునకుఁ బంపెను. ఆవార్త తెలిసినంతదనుకఁ దానుత్తరమునుండి సేనాధిపతియగు బలరామపాత్రో మరలిపోయెను. ఈవిషయము తెలియగనే రాయలయుత్సాహము తగ్గెను. తమరు తొలుత రాయబారమునకుఁ బంపిననియమమునకు విరుద్ధముగాఁ బ్రవర్తింపగూడదని మంత్రి చెప్పినమాటల కంగీకరించి గజపతి యిచ్చినకోశమును రాజ్యమును గ్రహించి యాతనిసపరివారముగా వదలిపెట్టెను. అత్తఱిఁ దిమ్మరుసు రాయలను నాజగన్మోహినిని నీకుంగూర్తునని ప్రతిజ్ఞచేసెను. అందుల కంగీకరించి శరణాగతుఁడగు ప్రతాపరుద్రుని వదలిపెట్టెను. మంత్రియు రాజప్రతినిధియు లోనగువారింగూడి ప్రతాపరుద్రగజపతి దీనుఁడై యుట్లో వెడలిపోయెను.

శుభముహూర్తమున శ్రీకృష్ణదేవరాయ లుదయగిరి దుర్గమును బ్రవేశించెను. దానిసౌందర్య మత్యద్భుతముగా నుండెను. అందలి హర్మ్యములు సుఖధామములుగా నుండెను.

అందు సేకరించియుంచినపదార్థములను, గోటనిర్మించినపద్ధతియు నచ్చెరువును గూర్చుచుండెను. కొలువుకూటము నేత్రపర్వమొనర్పఁజాలెను. ఎల్లరు నాకోటలో నుండిరి. సముద్రవాయువులు వారల కమితోల్లాసము నీయఁజాలెను. బడలిక లడఁగ నందుండిరి. కవులకు గాయకులు లోనగువారికి సమ్మానములు చేయఁబడియెను. అందు గుప్తంబగుకోశము నుచితరీతిఁ దమ పరివారమున కిప్పించి మంత్రి సర్వరంజకుఁ డయ్యెను. కొలఁది మాసము లందే సింహాసనాసీనుఁడై రాజ్యమును బాలించి శ్రీకృష్ణదేవరాయలు జానపదులకెల్ల నుత్సాహమును గలిగించుచు వారలకు దర్శనమిచ్చుచు నారాజ్యమును విజయసామ్రాజ్యమునంగలిపి దాని కనుకూలములగు కట్టుపాట్లుచేసి మరల వచ్చుచుంబోవుచుండుమని మాటయిచ్చి ముందుఁ దాఁజేసి యున్నభూదానముల దానపత్రప్రదానపూర్వముగా స్థిరపఱచి దేవాలయముల కిచ్చినదానములు శాశ్వతముగా సాగునట్టి కట్టడిచేసి గొల్లజనుల నానందసాగరమున నోలలాడించి పదంపడి యుదయగిరిని దిలకింపఁగోరి యాటవికులంగూడి కొలఁదిదినములు తిరిగిచూచి మహర్షినివాసస్థానమని తలంచి మ్రొక్కి వనమూలికామహత్త్వముం దెలుప స్వానుభవమునఁ గొన్నింటి నెఱింగి పర్వతము నవతరించి యుదయగిరిపురమునఁ గొన్నిదినములు నివసించెను. ఆరాజ్యమునకు నలుప్రక్కల శత్రుబాధ లేకుండునట్లు రక్షకుల నియమించెను. తనకుఁ బ్రతినిధిగ నారాజ్యమును బాలింప సుగుణఖనియగు కంపన్న యనువాని

నాదుర్గముననుండునట్లేర్పఱచి తగుసేనలనిచ్చి యనుదినము ప్రజలక్షేమము లారయుచుండునది యని సమ్మఁబలికి తన ప్రయాణవార్త విని జనులు గుంపులుగావచ్చి యిందే యుండుమని ప్రార్థింప వారివిశ్వాసమున కానందించుచు, మరల శీఘ్రకాలముననత్తుమని వాగ్దానముచేయుచు, నాదేశమున జలాశయములు గట్టింపుమనియు, మార్గములయందు బావులు త్రవ్వింపుమనియు, ఫలవృక్షముల వేయించి దేశము నారోగ్యభాగ్యవంతముగా నొనరింపుమనియు, నప్పుడప్పుడు పల్లెలకుంబోయి జానపదులకొఱంతల నాలకించి యుచితరీతి వానిం దొలఁగింపఁ బ్రయత్నింపుమనియుఁ గృషికర్మము వృద్ధినొందునట్లు గావించి దేశమును సుఖాస్పదముగ నొనరింపుమనియుఁ, బందువులనియు నుత్సవములనియుఁ బేరుపెట్టి దండుగులుతీయవలదనియు, నెల్లరు వినుచుండునట్లు కంపన్నకుఁ దెలియఁబలికి ప్రజారంజనమే తనజన్మమునకు ఫలమనియుఁ, బ్రజారక్షణమే తనకృత్యమనియుఁ, బ్రజాసుఖమే తనసుఖమనియు భావించి యందఱు యోజనమాత్రము వలదన్నను సాగనంపరాఁగా నందాదినము నిలిచివచ్చినవారలకెల్ల మృష్టాన్నములిడి యూఱడిల్లంజేసి యీబాట నిఁక దాఁటఁగూడదని ప్రార్థించి తాను సకలపరివారసమేతుఁడై పయనముసాగించెను. ఆచోటున నాసంతోషచిహ్నముగా జను లొకయూరుగట్టుకొని యందు నివసించిరి. ఆగ్రామమునకు బాట యనుపేరు ప్రఖ్యాతమై నేఁటివఱకున్నది. కతిపయప్రయాణముల విజయనగరమును

ప్రవేశించి యందమందానందమునఁ బ్రజల రంజిల్లఁజేయుచు విజయలక్ష్మి తనదండనుండ విద్వజ్జనుల సంభావించుచు సత్కవులకు వశుఁడై ప్రవర్తించుచు గాయకుల నాదరించుచు రామరాజ్యమో యనునట్లు ప్రజాపరిపాలనము చేయుచునుండెను.

సర్వే జనాస్సుఖినో భవంతు.

శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ శ్రీ. శ్రీ.

హైదరాబాద్-500 044

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1928.

కావ్యస్మృతితీర్థ:

శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారి గ్రంథములు.

ఆంధ్రశ్రీమద్రామాయణము, నిర్వచనము, వ్యాఖ్యానములలోని భావము కూడ విడువక తెనిఁగింపఁబడినది. ఏశ్లోకమున కేపద్యమో తెలిసికొనుటకై శ్లోకసంఖ్యకూడఁ దెలుపఁబడినది. విశేషార్థములుండుతావుల క్రింద వివరముగఁ వ్రాయఁబడినది. గొప్పపీఠిక గలదు.

3 సంపుటములుగల ప్రతి రూ. 12 0, 7 సంపుటముల ప్రతి 14 0

ఆంధ్రబ్రహ్మాండపురాణము	...	5	0
హాలాస్యమాహాత్మ్యము, స్కాందపురాణమునుండి తెనిఁగింపఁబడినది. మధురాపురిమాహాత్మ్యమును దెలుపును. మీనాక్షీసుందరేశ్వరుల విలాసచరిత్రములు డెబ్బదిరెండుకథ లిందుఁగలవు	...	1	0
ఆంధ్రలలితోపాఖ్యానము, భండాసురుని లలితాదేవి చంపుట మొదలగు గాథలనేకము లిందున్నవి	...	1	8
విచిత్రపాదుకాపట్టాభిషేకనాటకము	...	0	12
పాండవాజ్ఞాతవాసనాటకము	...	0	12
శ్రీరామవనవాసనాటకము	...	0	12
సంగ్రహరామాయణము, వచనము, సులభశైలి	...	0	10
సంగ్రహభారతము ,, ,,	...	1	0
సంగ్రహభాగవతము ,, ,,	...	1	0
హనుమద్విజయము, పద్యకావ్యము	...	0	8
కడపమండలచరిత్ర	...	0	8

శ్రీకృష్ణావతారతత్త్వము, ఇది యనేక పురాణములనుండి మనోహర గాథలు వచనరూపముగా వ్రాయఁబడినది.

ప్రథమసంపుటము	1	8	పంచమసంపుటము	1	8
ద్వితీయసంపుటము	1	8	షష్ఠసంపుటము	1	8
తృతీయసంపుటము	1	8	సప్తమసంపుటము	1	8
చతుర్థసంపుటము	1	8	అష్టమసంపుటము	1	8

కలివిలాసము (అచ్చగుచున్నది.)

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

END OF
TITLE